


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 343

బుధవారం 5-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అమెరికాపై టారిఫ్ యుద్ధం!

కెనడా, మెక్సికో ఉత్పత్తులపై 25% చొప్పున, చైనా ఉత్పత్తులపై అదనంగా 10% సుంకాలు విధిస్తున్నామన్న ట్రంప్ ప్రకటనతో ఆయా దేశాలు ప్రతీకార సుంకాలకు సై అంటున్నాయి.

- వివరాలు 6లో▶



ఉక్రెయిన్‌కు సాయం బంద్

ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించారు.

- వివరాలు 6లో▶

ఆస్ట్రేలియాను కొట్టేశారు...



చాంపియన్స్ ట్రోఫీ వేటలో భారత జట్టు ఆఖరి సమరానికి అర్హత సాధించింది. కంగారూల రూపంలో సెమీస్‌లో ఎదురైన అడ్డంకిని అధిగమించి ఈ టోర్నీలో వరుసగా మూడో సారి టీమిండియా ఫైనల్లోకి అడుగు పెట్టింది. మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ఆసీస్ 264 పరుగులకు ఆలౌట్ కాగా...భారత్ మరో 11 బంతులు మిగిలి ఉండగానే 267 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. విరాట్ కోహ్లి (84) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. నేడు లాహోర్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం దుబాయ్‌లో జరిగే ఫైనల్లో భారత్ తలపడుతుంది.


- వివరాలు 14లో

నిర్ణయం ఇంకెప్పుడు?

స్పీకర్ కార్యాలయం ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్ తరహాలో వ్యవహరించొద్దు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

- చట్టసభల గడువు ముగిసేవరకు నిర్ణయం తీసుకోకపోతే ఎలా?.... ఇలాగైతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంది?
- తగిన సమయం అంటే అసెంబ్లీ కాలం ముగిసేంత వరకా? అంటూ ప్రశ్నలు
- రాష్ట్ర ప్రభుత్వం, స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం, ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు
- తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ద్వారా నోటీసులు అందజేయాలని ఆదేశం
- ఈ నెల 22 లోగా వివరణ ఇవ్వాలని స్పష్టీకరణ.. విచారణ 25కు వాయిదా



స్పీకర్‌కు కోర్టు ఆదేశాలివ్వడానికి అవకాశం లేదు

సాక్షి, న్యూఢిల్లీ: 'ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ప్రతిసారీ ''స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటారు'' అంటున్నారు. తగినంత సమయం అంటే ఎంత? ఐదేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకా?. తగినంత సమయాన్ని కోర్టు ఫిక్స్ చేయాలా? వద్దా?. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. చట్ట సభల గడువు ముగిసే వరకు నిర్ణయం తీసుకోకపోతే ఎలా? ప్రజాస్వామ్యానికి అర్థం ఏం ఉంటుంది? ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్ అనే విధంగా వ్యవహరించడం ఎంతమాత్రం సరికాదు..' అంటూ సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఎమ్మెల్యేల వ్యవహారంలో స్పీకర్ కార్యాలయం ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి, స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులు హైకోర్టు రిజిస్ట్రార్ ద్వారా అందజేయాలని జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం ఆదేశించింది. ఈ నోటీసులపై వీరంతా ఈనెల 22లోపు వివరణ ఇవ్వాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి

మిగతా 2వ పేజీలో ▶

స్పీకర్ కార్యదర్శి తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదిస్తూ.. 'ఫిరాయింపులపై గతేడాది జూలై మొదటి వారంలో స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే 9వ తేదీ నాటికే కోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు ఫిరాయింపులపై ఫిర్యాదు అందగానే స్పీకర్ స్పందించారు.. నోటీసులు ఇచ్చారు. వారి నుంచి రిప్లై రాగానే నిర్ణయం తీసుకుంటారు. అసలు స్పీకర్ నిర్దిష్ట సమయంలో నిర్ణయం తీసుకోవాలని లేదు. రాజ్యాంగబద్ధంగా అత్యంత ఉన్నతమైన పదవుల్లో స్పీకర్ పదవి ఒకటి. ఈ పదవిలో ఉన్న స్పీకర్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేయడానికి అవకాశం లేదు..' అని చెప్పారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'స్పీకర్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేయడానికి అవకాశం లేదూ అంటే.. న్యాయమే డిసైడ్ చేస్తుంది ఆగండి..' అంటూ వ్యాఖ్యానించింది. నోటీసుల జారీకి ఆదేశాలిచ్చింది. ప్రతివాదుల తరఫు న్యాయవాదులు కూడా వీరికి నేరుగా నోటీసులు ఇవ్వొచ్చని తెలిపింది. ఈనెల 25న ఐటెం నంబర్-1గా కేసును విచారిస్తామని స్పష్టం చేసింది.

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్



రూ.1,891 కోట్ల బియ్యం బకాయిలివ్వండి

సీఎంఆర్ డెలివరీ గడువును మరికొంత పొడిగించాలి

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు రావాల్సిన బియ్యం బకాయిలు రూ.1,891 కోట్లను విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని ఆయన నివాసంలో సీఎం రేవంత్‌తోపాటు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిశారు.

- ఎఫ్‌సీఐకి 2014–15 ఖరీఫ్ కాలంలో రాష్ట్రం నుంచి సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అప్పుడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్రమంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు.
- ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన

మిగతా 2వ పేజీలో ▶

నేషనల్ సేఫ్టీ వీక్ (మార్చి 4- మార్చి 10)

ఈక్వల్ జర్నీ స్లోగా ఉంది

అభద్రత, రక్షణలేమి! అవి ఇన్నేళ్ల మహిళల ప్రయాణాన్ని మళ్లీ మొదటికే తీసుకొస్తాయేమోననే భయం వెంటాడుతోంది! తర్వాత తరాలను జీరో దగ్గర నిలబెట్టకుండా.. వాళ్లకో మైల్‌స్టోన్‌ను అందివ్వాలనేదే ఈతరం మహిళల ఆరాటం! అది విమెన్ ఫ్రెండ్లీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్లే సాధ్యం! ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ చేసిన, చేస్తున్న ప్రయత్నాలను వివరించారు తెలంగాణ సీఐడీ, విమెన్ సేఫ్టీవింగ్ ఏడీజీపీ శిఖాగోయల్.



డిజిటల్ థ్రెట్‌ను ఢీ కొట్టాలి

నేటి మహిళకు పెను సవాల్‌గా మారిన డిజిటల్ థ్రెట్‌ను సమర్థంగా ఢీ కొట్టాలి. ఇబ్బంది ఎదురైనప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి'... అన్నారు సీనియర్ ఐపీఎస్ అధికారి, హైదరాబాద్ నేర పరిశోధన విభాగం డీసీపీ ఎన్.శ్వేత.



- వివరాలు 13లో



మా నియంత్రణ ఉండాల్సిందే

పొద్దున గుడ్‌మార్నింగ్ మొదలు రాత్రి గుడ్‌నైట్ చెప్పే వరకు ఈ రోజుల్లో యువత ఎక్కువగా స్మార్ట్‌ఫోన్లలోనే గడుపుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరిలో 'సోషల్'వాడకం పెరిగింది. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్.. ఇలా ఎన్నో రకాల సోషల్ మీడియా యాప్‌లతో పాటు ఓటీటీల వాడకం విపరీతంగా పెరిగింది. సోషల్ మీడియా అకౌంట్ లేకపోతే నామోషీ అనే స్థాయికి స్కూల్ పిల్లలు సైతం వచ్చేశారు. ఇది చాలా నష్టం చేస్తోందని, పిల్లల సోషల్ మీడియా వాడకంపై నియంత్రణ ఉండాలని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

16లో

ఇక ట్రిపుల్ ఆర్ వరకు హైదరాబాద్ నగరమే!

'మహా' విస్తరణకు ముహూర్తం ఖరారు

- త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చ, అనంతరం ఆమోదించే అవకాశం
- 7,257 చదరపు కి.మీ. నుంచి 11,000 చదరపు కి.మీ. దాకా నగరం విస్తరణ



సాక్షి, హైదరాబాద్: గ్లోబల్‌సిటీ దిశగా పరుగులు తీస్తున్న హైదరాబాద్ పరిధి మరింత విస్తరించనుంది. నిర్మాణాత్మకమైన, ప్రణాళికాబద్ధమైన మహానగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అందులో భాగంగానే హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధి పెరగనుంది. త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి ఆమోదించే అవకాశముంది. ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న నగరాన్ని కోర్ అర్బన్‌గా, ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి ట్రిపుల్ ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని సెమీఅర్బన్‌గా విభజిస్తారు. మిగతా ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణిస్తారు. ఈ మేరకు సెమీఅర్బన్ వరకు సమగ్రమైన మాస్టర్‌ప్లాన్ రూపొందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. దీంతో ఔటర్ రింగ్‌రోడ్డు వరకు సుమారు 2,000 చదరపు కిలోమీటర్లు జీహెచ్ఎంసీ పరిధిలోకి రానుంది. ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు వెలుపల మరో 5 కిలోమీటర్ల వరకు హెచ్ఎండీఏ పరిధి పెరగనుంది. ప్రస్తుతం 7 జిల్లాలు, 7,257 చదరపు కిలోమీటర్లు ఉన్న హెచ్ఎండీఏ పరిధి..11,000 చదరపు కిలోమీటర్ల నుంచి 12,000 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించనున్నట్లు అంచనా. ఇప్పుడు 70 మండలాలు, 1,000 గ్రామపంచాయతీలు, 8 కార్పొరేషన్‌లు, మరో 38 కి పైగా మున్సిపాలిటీలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. కొత్తగా ట్రిపుల్ ఆర్ వరకు పరిధి పెరగనున్న నేపథ్యంలో

మిగతా 5వ పేజీలో ▶



సిద్ధమైన ఇందిరా మహిళా శక్తి బస్సు

8న ఆర్టీసీకి మహిళా సమాఖ్యల అద్దె బస్సులు

16లో

3 వీళ్లకు..1 వాళ్లకు

ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఎన్నికలు

- మూడు కాంగ్రెస్‌కు.. ఒకటి బీఆర్ఎస్‌కు ఖాయం.. ఐదో సీటుపై ఉత్కంఠ.... కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐలలో ఒకరికి చాన్స్
- సీపీఐకి ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్?
- కాంగ్రెస్, సీపీఐల్లో ఎవరికి ఎమ్మెల్సీ స్థానం దక్కాలన్నా ఎంఐఎం సహకారం తప్పనిసరి
- బీజేపీ గైర్హాజరయ్యే అవకాశం.. కాంగ్రెస్‌లో చేరిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వైఖరి ఎలా ఉంటుందోనన్న చర్చ
- బీఆర్ఎస్ రెండో అభ్యర్థిని నిలిపితేనే ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన వేళ.. పార్టీల గెలుపోటములపై చర్చ జరుగుతోంది. ఏ లెక్క ఎలా ఉన్నా, ఎవరు హాజరైనా.. గైర్హాజరైనా పార్టీల బలాబలాను బట్టి చూస్తే.. ఐదు స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ పార్టీకి మూడు, బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ స్థానం తప్పనిసరిగా లభించనున్నాయి. ఐదో స్థానం సాధించేందుకు కాంగ్రెస్‌కు కానీ, బీఆర్ఎస్‌కు కానీ తగిన సంఖ్యా బలం లేదు. దీంతో ఈ స్థానానికి జరిగే ఎన్నిక కీలకంగా మారింది. ఇక్కడ

మిగతా 3వ పేజీలో ▶

నిన్న తనఖా.. నేడు వేలం!

400 ఎకరాల టీజీఐఐసీ భూముల అమ్మకానికి ప్రభుత్వం సన్నద్ధం

- వేలం ద్వారా రూ.25 వేల కోట్లు సమకూర్చుకునే యోచన
- గతంలో ఇవే భూములు రూ.10 వేల కోట్లకు ఐసీఐసీఐకి తాకట్టు
- సుమారు రూ.20 వేల కోట్ల భూమి రూ.10 వేల కోట్లకే తాకట్టు పెట్టడంపై తాజాగా పునరాలోచన
- రెండేళ్ల ఈఎంఐ మొత్తాన్ని డిపాజిట్ చేస్తే సెక్యూరిటీల విడుదలకు ఓకే అన్న బ్యాంకు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) అధీనంలో ఉన్న సుమారు 400 ఎకరాలకు పైగా భూమిని వేలం వేయడం ద్వారా రూ.25 వేల కోట్లు సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో ఐసీఐసీఐ బ్యాంకుకు సెక్యూరిటీ బాండ్ల రూపంలో తనఖా పెట్టిన భూమికి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మాస్టర్ ప్లాన్ లే ఔట్ రూపొందించి దశలవారీగా వేలం వేయడం ద్వారా నిధులు సమీకరించాలని నిర్ణయించింది. మాస్టర్ ప్లాన్ తయారీ, వేలంలో సహకారం అందించేందుకు 'ట్రాన్సాక్షన్ అడ్వైజరీ కన్సల్టెంట్' ఎంపిక కోసం గత నెల 28న టీజీఐఐసీ 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసింది. ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు తమ బిడ్లను దాఖలు చేసేందుకు మార్చి 15వ తేదీని తుది గడువుగా పేర్కొంది.

గతంలో ప్రభుత్వ గ్యారంటీతో ఐసీఐసీఐకి తనఖా

టీజీఐఐసీ అధీనంలో ఉన్న భూములను తాకట్టు పెట్టడం ద్వారా రైతుభరోసా వంటి పథకాల అమలుకు అవసరమైన నిధుల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జూలైలో ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం

మిగతా 12వ పేజీలో ▶

ఇంతంజాత్



ఇలా ప్రతిరోజూ వచ్చి పిల్లల్ని కన్నారా లేదా అడగడం ఏం బాగోలేదు సార్!

గీత దాటితే ఊరుకోను

పార్టీనే ఫస్ట్.. ఆ తర్వాతే ఏదైనా



- ఫ్లెక్సీల్లో కాదు.. ప్రజల్లో ఉండండి
- గత పదేళ్లు పార్టీ జెండా మోసిన వారికి ప్రాధాన్యం
- కులగణన, ఎస్సీ వర్గీకరణను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం ఉండాలి
- మెదక్, మల్కాజ్‌గిరి సమీక్షలో కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్
- అందరినీ కలుపుకోలేకపోతే తప్పుకోండి... నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు పీసీసీ చీఫ్ హెచ్చరిక

- వివరాలు 3లో

'వంతారా'లో మోదీ జీవకారుణ్యం

గుజరాత్‌లోని రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో జంతు సంరక్షణ, పునరావాస కేంద్రాన్ని ప్రారంభించిన ప్రధాని



ప్రధాని వంతారా సందర్శన వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- సాదర స్వాగతం పలికిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ దంపతులు
- ఆశ్రయం పొందుతున్న జంతువులకు స్వయంగా ఆహారం తినిపిస్తూ ప్రాంగణమంతా కలియతిరిగిన మోదీ
- ఒరాంగుటాన్లు, సింహం, చిరుత కూనలతో సరదాగా ఆట..ఎన్‌క్లోజర్లలోని పులులు, సింహాలతో ఫొటోలు
- అక్కడి వైల్డ్ లైఫ్ హాస్పిటల్ సందర్శన.. వైద్య వసతుల పరిశీలన
- సుమారు 3 వేల ఎకరాల్లోని ఈ కేంద్రంలో లక్షన్నరకుపైగా జీవులు
- గాయపడిన, అంతరించిపోయే దశలోని జంతువులకు వంతారాలో ఆశ్రయం

6లో



ఖమ్మం జిల్లా కారేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రం దుస్థితి

ఇబ్బందుల మధ్యే ఇంటర్ పరీక్షలు

- నేటి నుంచి ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా అనేక కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత
- ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో సమస్యల తీవ్రత... ఫ్యాన్లు లేవు.. ఉన్నా పనిచేయని దుస్థితి
- ఎండలు పెరుగుతున్నా మరమ్మతులపై దృష్టిపెట్టని వైనం

2లో

మంచి ప్రణాళికతో మెరుగైన ఫలితం

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు ఏడాది కష్టానికి ఫలితం సాధించే 'పరీక్షా సమయం' ఇది. మంచి ఫలితం సాధించాలంటే చివరిరోజుల్లో ప్రణాళికా బద్ధమైన సన్నద్ధత అవసరం. ముఖ్యంగా ఇప్పుడు పుస్తకాలన్నీ తిరగేసి నానా హైరానా పడకూడదు. ఏడాది చదువును జాగ్రత్తగా పునశ్చరణ (రివిజన్) చేసుకుంటే మెరుగైన ఫలితం ఖాయమని అనేక పరిశోధనలు రుజువు చేశాయి. అమెరికా యూనివర్సిటీలు ఆఖరి నిమిషంలో పరీక్షల సన్నద్ధతపై కొన్ని సూచనలిచ్చాయి. దీని ప్రకారం.. సాధారణంగా రోజుకు ఒక పరీక్షే ఉంటుంది కాబట్టి .. ఏ పరీక్ష రోజు ఆ సబ్జెక్టుకు సంబంధించిన అంశాలే మననం చేసుకోవడం ఉత్తమం. దీనికి అనువుగా టైం టేబుల్‌ను కూడా ముందే సిద్ధం చేసుకోవాలి. కఠినమైన, అత్యంత కఠినమైన, సులభమైన చాప్టర్లుగా విభజించుకుంటే బాగుంటుంది. దీనివల్ల మానసిక ఒత్తిడి దూరమవుతుందని కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధనలో తేలింది. టైం టేబుల్‌ను ముందుగా పేపర్ మీద పెట్టి, దాని ప్రకారం సమయ పాలన పాటించాలి. దీనివల్ల కార్యాచరణ విషయంలోనూ మరింత అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.

టైమ్ టేబుల్‌లో ఏది ముందు?

ముందుగా పరీక్ష రాసే సబ్జెక్టును టైం టేబుల్‌లో ముందు వరుసలో చేర్చాలి. దీనికి ఎప్పుడు ఎంత సమయం ఇవ్వాలనేది ఖరారు చేసుకోవాలి. ఉదయం 4 గంటల సమయంలో కఠినమైన చాప్టర్స్‌పై కుస్తీ పట్టాలి. దీనికి రెండు గంటలు కేటాయించాలి. ఆ తర్వాత మధ్యస్తంగా ఉండే చాప్టర్స్‌ను ఎంచుకోవాలి. దీనికి గంట కేటాయిస్తే చాలు. మరో అరగంట తేలికైన బాగా గుర్తుండే చాప్టర్లు చూసుకోవాలి. ప్రశ్నల రూపంలో వీటిని పరిశీలించి, సమాధానాలు క్లుప్తంగా చూసుకుంటే సరిపోతుంది. అయితే ఒక్కో దానికి మధ్య కొంత విరామం ఇవ్వడం వల్ల మెదడులోని జ్ఞాపకశక్తి పెంచే కణజాలం చురుకుగా పనిచేస్తుంది.

సెల్, టీవీ చూడొద్దు

కొంతమందికి అర్ధరాత్రి వరకూ చదువుకునే అలవాటు ఉంటుంది. ఉదయం కాస్త ఆలస్యంగా లేస్తారు. ఇలాంటి వాళ్ళు రాత్రి భోజనం చేసిన తర్వాత ముఖ్యమైన అంశాలు పునశ్చరణ చేయాలి. ఈ ప్రక్రియ తర్వాత సెల్, టీవీ చూడకూడదు. ఎందుకంటే పునశ్చరణ అంశాలు మెదడులో ముద్రపడి ఉంటాయి. ఇతర చిత్రాలు చూసినప్పుడు పాఠ్యాంశాలు చెదిరిపోయే ప్రమాదం ఉంటుంది.



పునశ్చరణ ఎలా?

పునశ్చరణ ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా ఉంటుంది. కొంతమంది ఏకాగ్రతతో చదివితే బుర్రకెక్కుతుంది. ఈ సమయంలో గతంలో దీన్ని చదివాం.. తేలికగా అర్థమైందన్న భావన రావాలి. ఇలాంటప్పుడు ఒకటికి రెండుసార్లు చూసుకుంటే సరిపోతుంది. కొంతమందికి ఎన్నిసార్లు చదివినా గుర్తు ఉండదు. ఇలాంటి సందర్భంలో కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానాలు రాసుకోవడం ద్వారా పునశ్చరణ చేసుకుంటే కొంత తేలికవుతుంది. ఇక చాలామంది కంబైన్డ్ స్టడీ ద్వారా పునశ్చరణలో మెరుగైన ఫలితం సాధిస్తారు. ఇలాంటి వాళ్ళు ముఖ్యమైన స్నేహితులతో కలిసి కంబైన్డ్ స్టడీ చేయాలి. ప్రశ్నలు, సమాధానాలు ఒకరికి ఒకరు బిగ్గరగా చెప్పుకోవడం వల్ల పునశ్చరణ సజావుగా సాగుతుంది. ప్రతి రివిజన్‌లోనూ పాత ప్రశ్నలు, కొన్నేళ్ళుగా వస్తున్న ప్రశ్నపత్రాలను ఒకసారి చూసుకోవాలి. దీనివల్ల మెదడులోని కీలకమైన కణాలు పరీక్ష మూడ్‌కు చేరుకుంటాయి.

ప్రదేశం కూడా ముఖ్యమే..

పునశ్చరణకు ప్రదేశం కూడా ముఖ్యమైన అంశమే. కొంతమంది నిశ్శబ్దంగా ఉండే ప్రాంతాల్లో చదవాలని అనుకుంటారు. కొంతమంది ప్రత్యేక గదిలో ఒంటరిగా, మరికొందరు స్నేహితులతో కలిసి పునశ్చరణ చేస్తుంటారు. కాబట్టి తమకు ఏది బాగా ఉంటుందనుకుంటే అదే పాటించాలి. ప్రతి అరగంటకోసారి మనసును స్థిమిత పరిచే నిద్రాణ స్థితిని పాటించాలని ఐఐటీ మద్రాస్ పరిశోధకులు చెబుతున్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

రివిజన్ చేసేటప్పుడు కచ్చితంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని పలు పరిశోధనలు సూచిస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఏమాత్రం అందుబాటులో ఉండకూడదు. ఒక్కసారి స్మార్ట్‌ఫోన్ మెసేజ్ చూస్తే పునశ్చరణలో మూడొంతుల అభ్యాసం దెబ్బతింటుందని ఐఐటీ ముంబై అధ్యయనంలో గుర్తించారు.

క్లుప్తంగా...

రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 6న సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణతోపాటు వివిధ కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ప్రధానంగా బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం, ఎస్సీల వర్గీకరణ, హెచ్ఎండీఏ పరిధిని రీజినల్ రింగ్ రోడ్ వరకు విస్తరించడం వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట హాజరైన ఆదిలాబాద్ కలెక్టర్



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి సమీపంలోని రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వైఖరి కారణంగా తమకు జరుగుతున్న అన్యాయంపై బాధిత రైతులు ఇటీవల జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఢిల్లీలో కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ఎదుట కలెక్టర్ హాజరయ్యారు. ఫ్యాక్టరీ ఏర్పాటులో జాప్యం, రైతుల ఇబ్బందులపై కమిషన్‌కు కలెక్టర్ వివరించారు. అనంతరం కమిషన్ సభ్యుడు వీడియో కాల్ ద్వారా బాధిత రైతులతో మాట్లాడారు. త్వరలోనే ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని, ఇందుకోసం ఈనెల 20న కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందని ఆయన వారికి తెలిపారు. ఎలాంటి అన్యాయం జరగకుండా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని వారికి భరోసా కల్పించారు.

వామన్‌రావు దంపతుల హత్య కేసు విచారణ రెండు వారాలకు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సంచలనం సృష్టించిన న్యాయవాది గట్టు వామనరావు దంపతుల హత్య కేసును సీబీఐ విచారించకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని ఆయన తండ్రి గట్టు కిషన్‌రావు తరఫు సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి ఆరోపించారు. 2021 ఫిబ్రవరి 17న పెద్దపల్లి జిల్లాలో న్యాయవాది వామనరావు, ఆయన భార్య నాగమణిలను హత్య చేసిన కేసును సీబీఐకి అప్పగించాలంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఫిబ్రవరి 11న జరిగిన గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేపట్టడానికి అభ్యంతరం లేదని సీబీఐ తరఫు న్యాయవాది చెప్పిన విషయం తెలిసిందే. అసత్య ఆరోపణలతో తమను ఈ కేసులో నిందితులుగా చేర్చారని.. మరణ వాంగ్మూలంలో ఎవరి పేరూ చెప్పలేదని పుట్టా మధుకర్ తరఫు న్యాయవాది వాదన వినిపించారు. ఈ కేసులో మరణ వాంగ్మూలాన్ని ట్రాన్స్‌క్రిప్ట్ చేసి ఇచ్చేందుకు సమయం కావాలని కోరుతూ పుట్టా మధుకర్ తరఫు న్యాయవాది ఇంటర్ లోక్యుటరీ అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

నేటి భవితలో..

- టాప్ స్టోరీ: అందుకోండి.. ఇంటర్న్‌షిప్! టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులు క్షేత్ర నైపుణ్యాలు మెరుగుపరచుకొని.. కొలువులు దక్కించుకునేందుకు చక్కటి మార్గం..ఇంటర్న్‌షిప్! ఇంటర్న్‌షిప్ శిక్షణతో పాటు ప్రతి నెల రూ.5 వేల స్టయిఫెండ్ అందుకునే అవకాశం కల్పిస్తోంది.. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్!! గత ఏడాది ప్రారంభమైన ఈ స్కీమ్‌కు.. తాజాగా రెండో దశ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది! ఈ నేపథ్యంలో.. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ విధానం, అర్హతలు, స్టైపెండ్, దరఖాస్తు ప్రక్రియ తదితర వివరాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్..

నేటి భవిత పేజీ కోసం సాక్షి ప్లస్ (ఈ పేపర్) ను చూడండి



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్లు ఇవి. 215 మంది విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాస్తుండగా బాలికల కోసం ఒక్కటే టాయిలెట్ ఉంది



ఉమ్మడి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తలుపులు లేని బాత్రూంలు. ఇక్కడ 450 మంది పరీక్షలు రాయాల్సి ఉంది

ఇబ్బందుల మధ్యే.. ఇంటర్ పరీక్షలు

నేటి నుంచే ప్రారంభం

- రాష్ట్రవ్యాప్తంగా అనేక కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత
- ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో సమస్యల తీవ్రత
- ఫ్యాన్లు లేవు.. ఉన్నా పనిచేయని పరిస్థితి
- ఎండలు పెరుగుతున్నా మరమ్మతులపై దృష్టి పెట్టని వైనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదలవుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 1,532 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సీసీ కెమెరాల నిఘాతో పాటు అన్ని ఏర్పాట్లు చేశామని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. అయితే విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం సరిగా దృష్టి పెట్టలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రభుత్వ పరిధిలో ఉన్న కళాశాలల్లో 642 కేంద్రాలు ఏర్పాటు చేయగా అనేకచోట్ల కనీస సౌకర్యాలు కూడా లేవని అంటున్నారు. చాలాచోట్ల ఫ్యాన్లు లేవు. కొన్నిచోట్ల ఉన్నా పని చేయడం లేదు. రెక్కలు విరిగిపోయి, బూజుపట్టి కన్పిస్తున్నాయి. ఇప్పటికే వేసవి తీవ్రత పెరిగింది. రానురాను మరింత పెరిగే వీలుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరగనున్నందున విద్యార్థులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కొన్నిచోట్ల భవనాల పైకప్పులు పెచ్చులూడేలా ఉన్నాయి. 480 పరీక్ష కేంద్రాల్లో రక్షిత మంచినీటి వ్యవస్థ లేదు. తాత్కాలికంగా సమీపంలోని వాటర్ ప్లాంట్ల నుంచి క్యాన్ల ద్వారా నీరు తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని కాలేజీల్లోని నీటి ట్యాంకులను ఈ మధ్యే తాత్కాలికంగా శుభ్రం చేసి బోర్ నీళ్ళను వాటిల్లోకి వదిలారు. ఈ నీళ్ళు తాగాలంటే భయమేస్తోందని కాలేజీ సిబ్బందే అంటున్నారు. చాలాచోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలల పరిస్థితి దుర్భరంగా ఉంది. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులకు రవాణా సౌకర్యాలు అరకొరగా ఉన్నాయని అంటున్నారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని దాదాపు 71 మండలాల్లో విద్యార్థులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లోనే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ముఖ్యంగా ప్రహరీ గోడల్లేని కాలేజీల్లో కొన్నేళ్ళుగా ప్రైవేటు కాలేజీలు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. వీటి విషయంలోనూ అధికారులు జాగ్రత్తలు తీసుకోలేదు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

> **జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేస్తాం**
>
> పరీక్షా కేంద్రాల్లో 'సాక్షి' గుర్తించిన మౌలిక వసతుల లేమి విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటాం. తక్షణమే స్పందించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు చెబుతాం. వాస్తవానికి ప్రస్తుతం విద్యార్థులు చదువుతున్న కాలేజీలనే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశాం.
>
> – కృష్ణ ఆదిత్య (ఇంటర్ బోర్డు కార్యదర్శి)

ఒక్కో చోట ఒక్కో సమస్య

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 215 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇక్కడ ఒక్కటే శౌచాలయం ఉండగా అది కూడా అపరిశుభ్రంగా ఉంది. గదుల్లో పెచ్చులూడి పడే పరిస్థితి ఉంది
- వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మోడల్ స్కూల్స్‌లో 450 మంది రాయాల్సి ఉంది. ఇక్కడ శౌచాలయాలు తాళం వేసి ఉన్నాయి. కాలేజీకి ప్రహరీ కూడా లేదు.
- ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో 300 మంది హాజరుకానున్నారు. ఫ్యాన్లు సరిగా లేవు. శౌచాలయాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇదే జిల్లా వెంకటాపురం మండల కేంద్రానికి పరీక్ష రాయడానికి వచ్చే చందుపట్ల, పేరూరు, ధర్మవరం, చెరకూరు గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదు.
- ఖమ్మం జిల్లా కారేపల్లిలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో దాదాపు 900 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఓ పరీక్ష కేంద్రంలో రెక్కలు వంకర తిరిగి ఉన్న ఫ్యాన్‌కు మరమ్మతు చేయించలేదు. హాల్ మొత్తానికి ఒకే ఫ్యాన్ పనిచేస్తోంది.
- కరీంనగర్ జిల్లా పరిధిలో 58 పరీక్ష కేంద్రాల్లో 33,562 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. కరీంనగర్ సైన్స్ కాలేజీలో ఒకే ఒక శౌచాలయం ఉంది. గంగాధర జూనియర్ కాలేజీలో రక్షిత మంచినీటి ప్లాంట్ చెడిపోవడంతో తాగునీటి సమస్య ఉంది. జమ్మికుంట కాలేజీకి ప్రహరీ లేదు.
- నిజామాబాద్ జిల్లాలోని మాక్లూర్ కాలేజీకి ప్రహరీ లేక పోవడంతో గతంలో మాస్ కాపీయింగ్‌కు ప్రైవేటు కాలేజీలు ప్రయత్నించాయి. దర్పల్లి మండలంలోని కాలేజీలో 550 మంది విద్యార్థులకు 7 గదులున్నాయి. నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పనిచేయడం లేదు. మరుగుదొడ్లు కూడా అధ్వాన్నంగా ఉన్నాయి.

నిర్ణయం ఇంకెప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

వాయిదా వేసింది.

ఓ ఎస్ఎల్పీ, మరో రిట్ పిటిషన్‌పై విచారణ

కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌లపై ఎస్ఎల్పీ, మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై రిట్ పిటిషన్ దాఖలు అయిన విషయం తెలిసిందే. కాగా ఈ రెండు పిటిషన్లపై తాజాగా మంగళవారం సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామ శేషాద్రినాయుడు, పి.మోహిత్‌రావు, స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, ముకుల్ రోహత్గీ తదితరులు వాదనలు వినిపించారు.

ఏడాది కావొస్తున్నా చర్యలు లేవు

'గతేడాది మార్చి, ఏప్రిల్‌లో పార్టీ ఫిరాయింపులపై తొలిసారి కోర్టును ఆశ్రయించాం. అనంతరం జూన్‌లో రిట్ పిటిషన్ దాఖలు చేశాం. ఏడాది అవుతున్నా ఇప్పటివరకు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఆర్టికల్ 32, 226 ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ఎలాంటి సమయం అవసరం లేదు. ప్రధానంగా పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ బీ ఫాంపై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. మరో ఎమ్మెల్యే ఏకంగా కాంగ్రెస్ పార్టీ కోసం లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి సంబంధించినంత వరకు వాళ్లు పార్టీ ఫిరాయించినట్టే. దీనిపై తొలుత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా..విచారణకు సమయాన్ని ఖరారు చేయాలంటూ సింగిల్ బెంచ్ నాలుగు వారాలు గడువు ఇచ్చింది. దీనిపై స్పీకర్ కార్యాలయం అప్పీల్‌కు వెళ్లింది. అయితే స్పీకర్‌కు తగినంత సమయం ఇవ్వాలన్న భావనతో ఈ ఉత్తర్వులను డివిజన్ బెంచ్ పక్కన పెట్టింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంను ఆశ్రయించాం. కానీ స్పీకర్ కార్యాలయం ఇప్పటివరకు ఆ తగినంత సమయం అంటే ఎంతో చెప్పనేలేదు. స్పీకర్ సమయం తీసుకునే విషయంలో సుభాష్ దేశాయ్, కేశం మేఘాచంద్, రాజేంద్ర సింగ్ రాణా కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఈ తీర్పుల ఆధారంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది..' అని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అయితే సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై ఎలాంటి గడువు ఫిక్స్ చేయలేదని జస్టిస్ బీఆర్ గవాయి అన్నారు. ఫిరాయింపులపై కాంగ్రెస్ అధికారం ఉన్నచోట ఒకలా... లేనిచోట మరోలా వ్యవహరిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది అర్యమ సుందరం వాదించారు.

రూ.1,891 కోట్ల బియ్యం బకాయిలివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

- 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.
- సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును నెల రోజులు కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని, అప్పుడే సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని కేంద్రమంత్రికి తెలియజేశారు.

4,000 మెగావాట్ల మంజూరును పునరుద్ధరించండి

తెలంగాణకు పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం, తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందంటూ కేంద్రమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుదుత్పత్తిని తాము ప్రోత్సహిస్తున్నామంటూ కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరాం: మంత్రి ఉత్తమ్

తెలంగాణకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. 'ఉదయం, సాయంత్రం రెండుసార్లు కేంద్రమంత్రిని కలిశాం. తెలంగాణకు గత పదేళ్ల నుంచి పౌరసరఫరాల విషయంలో కొన్ని బకాయిలున్నాయి. గతంలో కొన్ని డాక్యుమెంటేషన్ పెండింగ్ వల్ల ఆ నిధులు రాలేదు. సుమారు రూ.2వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సి ఉంది. వాటిని విడుదల చేయాలని కోరాం. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో మహిళా సంఘాలకు కూడా సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నామని, 'పీఎం కుసుమ్'పథకం కింద వాటికి కేంద్ర ప్రభుత్వం నుంచి 4వేల మెగావాట్ల సబ్సిడీ ఇవ్వాలని కోరాం. గిరిజన, మారు ప్రాంతాలకు సబ్సిడీతో సహా అదనంగా సోలార్ పంప్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. అన్ని విషయాల్లో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సానుకూలంగా స్పందించారు. అన్ని విజ్ఞప్తులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు'అని ఉత్తమ్ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డితో అజహరుద్దీన్ భేటీ



మంగళవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అజహరుద్దీన్

సాక్షి, న్యూఢిల్లీ: భారత క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అజహరుద్దీన్ సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలోని అధికార నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో అద్భుతమైన సమావేశం జరిగింది. ఆయన స్ఫూర్తిదాయకమైన నాయకత్వానికి నా కృతజ్ఞతలు. సీఎం విజన్‌లో తెలంగాణ వాస్తవంగా పురోగమిస్తోంది. అభివృద్ధి, అవకాశాలు రాష్ట్రంలోని ప్రతి మూలకు చేరుతున్నాయి'అని పేర్కొన్నారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: సీఎస్

సాక్షి, హైదరాబాద్: మే 4న జరగనున్న నీట్ పరీక్షకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో మంగళవారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను వీలైనంత త్వరగా ఎంపిక చేయాలని సూచించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ పథకం పురోగతిని సమీక్షించారు. అభ్యర్థనలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈనెల 31 వరకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేస్తే లభించే 25 శాతం రాయితీ గురించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఇప్పటికే నామమాత్రపు రుసుము చెల్లించిన వారి దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా చూడాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా జె.చొంగ్తూ, ఆరోగ్య కమిషనర్ ఆర్వీ కర్ణన్, పాఠశాల విద్యా సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి, వైద్య విద్యా సంచాలకుడు నరేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌కు సహకారం: సీఎస్




స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం నుంచి ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌కి సహకారం ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. మంగళవారం బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెక్రటేరియట్ స్పోర్ట్స్‌మీట్‌ను సీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ఆడుతూపాడుతూ పనిచేయాలని, అప్పుడే పని సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సచివాలయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

కోర్టులు జోక్యం చేసుకునే పరిధి ఏంటీ?

కేసీఆర్ అసెంబ్లీ గైర్హాజరుపై దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు

- వివరాలు అందజేయాలని పిటిషనర్ న్యాయవాదికి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అసెంబ్లీకి రావడం అనేది స్పీకర్ వ్యవహారాలకు సంబంధించిన అంశమని, అందులో కోర్టులు జోక్యం చేసుకునే పరిధి ఏంటో చెప్పాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. రెండు వారాలు సమయమిస్తే వివరాలు అందజేస్తానని కౌన్సిల్ బదులిచ్చారు. పూర్తి వివరాలతో వాదనలు వినిపించాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణ ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడంపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యేలా స్పీకర్, కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.విజయ్‌పాల్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. ప్రజలు, ప్రధానంగా రైతు సమస్యలను అసెంబ్లీలో చర్చించేందుకు విపక్ష నేత హాజరుకాకపోవడంతో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది.

న్యాయ సమీక్షకు అవకాశం ఉందా?

పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. '2023, డిసెంబర్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ ఇప్పటివరకు అసెంబ్లీకి హాజరుకాలేదు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతుల ఇబ్బందులపై ప్రస్తావించాల్సి ఉంది. సుదీర్ఘ అనుభవమున్న నేత అసెంబ్లీకి రాకపోవడం ప్రజలను వంచించడమే. ఒకవేళ అనారోగ్య కారణాలతో ఆయన రాలేకపోతే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేసి మరొకరికి అప్పగించాలి. పదవిలో కొనసాగుతూ అసెంబ్లీకి రాకపోవడం సరికాదు. ప్రధాన ప్రతిపక్ష నేత ఇతర ప్రతిపక్షాలకు స్ఫూర్తిగా నిలవాలని చట్టం చెబుతోంది'అని పేర్కొన్నారు. ఈ సందర్భంలో అసెంబ్లీ వ్యవహారాల్లో న్యాయస్థానం ఎలా జోక్యం చేసుకోగలదని ధర్మాసనం ప్రశ్నించింది. న్యాయ సమీక్షకు ఎంతవరకు అవకాశం ఉందో చెప్పాలని ఆదేశించింది. కాగా, పిల్ మెయింటెనబుల్ కాదని శాసనసభ వ్యవహారాల తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి ఈ విజయం నాంది



ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాల్లో ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ఉత్తర తెలంగాణ బీజేపీ కంచుకోటగా మారిందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలవడం చరిత్రాత్మక విజయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ విధానాలకు ఉపాధ్యాయులు, మేధావులు పట్టం కట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి ఈ విజయమే నాంది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతకు నిదర్శనం ఈ విజయమని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రస్థాయిలో ఎండగడతామని లక్ష్మణ్ చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటిసారి బీజేపీ గెలవడం ఎంతో ఆనందంగా ఉందని ఇంతటి చక్కటి విజయాన్ని అందించిన ఉపాధ్యాయులకు, కష్టపడిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

రేవంత్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం అధోగతి పాలు

బీజేపీ నేత కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: తన అనాలోచిత నిర్ణయాలతో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో కాంగ్రెస్ పార్టీ మోసం పరాకాష్టకి చేరిందని ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్ట్ రీసర్వేలో అసలు మోసం దాగుందని, ఉత్తర భాగం అలైన్‌మెంట్ మార్పుతో రైతులు తమ విలువైన భూమిని కోల్పోతున్నారని తెలిపారు. మంగళవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ డీపీఆర్ సర్వే సక్రమంగా చేయకపోతే ట్రిపుల్ ఆర్ వెనక్కు వెళ్తుందన్నారు. ఉత్తర భాగానికి భూసేకరణ చేయకపోగా, దక్షిణ భాగానికి టెండర్ కాల్ చేయాలని డిమాండ్ చేయడం ఏంటని నిలదీశారు. తమ ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలకు జవాబు చెప్పలేక బీజేపీపై ఎదురు దాడి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉపాధ్యాయులు తిరగబడ్డారని, కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ రికార్డు గెలుపు సాధించిందని లక్ష్మణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణ బీజేపీ కంచుకోటగా మారిందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. వారం పది రోజుల్లో బీజేపీ అధ్యక్షుడి నియామకం పూర్తవుతుందన్నారు.

టీచర్ల గొంతుకనై పనిచేస్తా

ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తన విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, కలిసి పనిచేసిన మిత్రులకు నూతనంగా ఎన్నికైన ఖమ్మం–నల్లగొండ–వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. దీన్ని అందరి విజయంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. తనకు వచ్చిన అవకాశాన్ని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం వినియోగిస్తానన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు తమ సమస్యలను ఏ సమయంలోనైనా తన దృష్టికి తేవొచ్చని, అన్ని వేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్ర విద్యా వ్యవస్థలోనూ సరికొత్త మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తానని శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తన విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరినీ త్వరలోనే స్వయంగా కలుస్తానన్నారు. పీఆర్టీయూటీఎస్ నాయకుడిగా ఇంతకాలం ఉపాధ్యాయులతో మమేకమయ్యానని, ఇక ముందు కూడా విద్యారంగ నిపుణులు, టీచర్లు, మేధావుల అభిప్రాయాలను చట్టసభలకు వినిపించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

యువ న్యాయవాదులకు స్టైపెండ్ ఇవ్వండి

ముఖ్యమంత్రికి టీపీసీసీ లీగల్ సెల్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని టీపీసీసీ లీగల్ సెల్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ముఖ్యమంత్రికి మంగళవారం లేఖరాశారు. కొత్తగా న్యాయస్థానాల్లో అడుగుపెట్టిన యువ న్యాయవాదులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి స్టైపెండ్ అందజేయాలని కోరారు. రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కవరేజీ వర్తింపజేయాలని, న్యాయవాదుల రక్షణ కోసం అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పలు వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తోందని, న్యాయవాదులకిచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేయాలని లేఖలో అశోక్‌గౌడ్ కోరారు. బీసీ కులగణన విజయవంతంగా పూర్తి చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

3 వీళ్లకు.. 1 వాళ్లకు

5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఎన్నికలు.. 3 కాంగ్రెస్‌కు.. ఒకటి బీఆర్‌ఎస్‌కు ఖాయం.. ఐదో సీటుపై ఉత్కంఠ

▶ మొదటి పేజీ తరువాయి

ఏ పార్టీ విజయం సాధిస్తుందనేది ఇతర పార్టీల వైఖరిపై ఆధారపడి ఉండడం గమనార్హం. అయితే బీఆర్ఎస్ తన బలానికి మించి రెండు స్థానాలకు అభ్యర్థులను నిలిపితేనే ఎన్నికలు జరిగే అవకాశాలుండగా, అలా జరగకపోతే ఐదు స్థానాలూ ఏకగ్రీవమయ్యే అవకాశాలే స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్చి 29న ఐదుగురు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు రిటైర్ అవుతున్నారు. వీరిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, యెగ్గె మల్లేశం (ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు)తో పాటు ఎంఐఎంకు చెందిన మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ ఉన్నారు. ఈ స్థానాలు భర్తీ చేసేందుకు ఈ నెల 20న ఎన్నికలు జరగనున్నాయి.

బలాబలాలు ఇలా..

→ అసెంబ్లీలో మొత్తం 119 మంది సభ్యులుండగా కాంగ్రెస్ పార్టీకి 65 మంది ఎమ్మెల్యేలున్నారు. మిత్రపక్షమైన సీపీఐకి మరో ఎమ్మెల్యే ఉన్నారు. ఒక్కో అభ్యర్థి గెలిచేందుకు ఈసారి 20 ఓట్లు రావాల్సి ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థులు ముగ్గురికి 60 ఓట్లు పోను మరో 6 ఓట్లు మిగులుతాయి.

→ బీఆర్ఎస్‌కు అధికారికంగా 38 మంది సభ్యుల బలముంది. అంటే ఆ పార్టీ 20 ఓట్లతో నికరంగా ఒక స్థానాన్ని గెలుచుకుంటుంది. ఇంకా 18 ఓట్లు మిగులుతాయి. అయితే బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. వారు బీఆర్ఎస్‌కు సహకరించే పరిస్థితి లేదు. అలాగని కాంగ్రెస్ పార్టీకి ఓటేసే పరిస్థితులు కూడా లేవు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలు సీక్రెట్ ఓటింగ్ పద్ధతిలో జరుగుతాయి. పార్టీ



విప్‌కు భిన్నంగా ఓటేసిన వారిని ఆయా పార్టీలు గుర్తించగలవు కానీ అధికారికంగా నిర్ధారించలేవు. కానీ ఫిరాయింపు అంశంలో అనర్హత కేసు సుప్రీంలో విచారణ జరుగుతున్నందున ఈ 10 మంది ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

ఓటింగ్‌కు బీజేపీ దూరమేనా?

ఈ ఎన్నికల్లో బీజేపీ పాల్గొనే అవకాశం లేదు. ఆ పార్టీకి 8 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. అలాగని ఆ పార్టీ కాంగ్రెస్‌కు లేదా బీఆర్ఎస్‌కు మద్దతిచ్చే అవకాశం కూడా లేదు. దీంతో వారు ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశం ఉంది. అదే జరిగితే అభ్యర్థుల గెలుపునకు అవసరమైన మేజిక్ ఫిగర్‌లో మార్పు వస్తుంది. 19 అవుతుంది. అయినా ఫలితాల్లో మార్పు ఏమీ ఉండదు.

→ బీజేపీతో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన 10 మంది కూడా గైర్హాజరైతే మాత్రం అధికార పార్టీకి కొంత ఊరట లభిస్తుంది. అప్పుడు 101 మంది మాత్రమే ఓటేస్తారు. అప్పుడు మ్యాజిక్ ఫిగర్ 17 అవుతుంది. అప్పుడు నలుగురు గెలిచేందుకు 68 ఓట్లు అవసరమవుతాయి. అంటే కాంగ్రెస్, సీపీఐలకు మరో రెండు ఓట్లు మాత్రమే తక్కువ అవుతాయి. ఎంఐఎం సహకరిస్తే ఆ స్థానం సులువుగా కాంగ్రెస్ పక్షాన చేరుతుంది. కానీ ఎంఐఎం ఐదో సీటు తమకు కావాలని అంటోంది.

మాకే కావాలంటున్న ఎంఐఎం

తమ సభ్యుడు రియాజుల్ హసన్ పదవీ విరమణ నేపథ్యంలో తమకే ఆ సీటు ఇవ్వాలని కాంగ్రెస్‌ను ఎంఐఎం కోరుతోంది. కానీ కాంగ్రెస్ అందుకు సిద్ధంగా లేదు. ఏఐసీసీ సూచన మేరకు నాలుగో స్థానాన్ని కచ్చితంగా సీపీఐకి ఇస్తారనే చర్చ జరుగుతోంది. అప్పుడు ఎంఐఎం ఎలాంటి వైఖరి అనుసరిస్తుందనేది ఆసక్తికరంగా మారనుంది. కాంగ్రెస్ పార్టీ సూచిస్తున్న విధంగా హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో బరిలోకి దిగేందుకు ఎంఐఎం అంగీకరిస్తే కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎంల కూటమి నాలుగు స్థానాలను కైవసం చేసుకుంటుంది. కానీ ఎంఐఎం విభేదించి బీఆర్ఎస్ పక్షాన చేరితే ఫలితం భిన్నంగా ఉంటుంది. పార్టీని వీడిన 10 మంది ఎమ్మెల్యేలను పక్కనపెట్టినా బీఆర్ఎస్‌కు 28 మంది సభ్యులుంటారు. వీరిలో 20 మంది సాయంతో ఒక అభ్యర్థి గెలుస్తారు. మరో 8 మంది మిగులుతారు. వీరికి ఎంఐఎంకు చెందిన ఏడుగురు తోడయితే బలం 15కు చేరుతుంది. అప్పుడు కాంగ్రెస్ పక్షాన కూడా 15 ఓట్లు మాత్రమే మిగులుతాయి. (మ్యాజిక్ ఫిగర్ 17 అయితే, ముగ్గురు సభ్యులు గెలిచేందుకు అవసరమైన 51 ఓట్లు పోను మరో 15 మంది ఎమ్మెల్యేలు మిగిలిపోతారు.

రసవత్తర పోరు

ఒకవేళ కాంగ్రెస్ సీపీఐలతో పాటు 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రతిపాదించే అభ్యర్థులకు ఓటేస్తే వారి బలం 76కు చేరుతుంది. అయినా నలుగురు అభ్యర్థులు గెలవాలంటే 4 ఓట్లు తక్కువ పడతాయి. అప్పుడు ఎంఐఎం కీలకం అవుతుంది. ముందే చెప్పినట్టు ఒకవేళ బీజేపీ గైర్హాజరైతే మాత్రం నలుగురు అభ్యర్థులు గెలవడానికి 76 ఓట్లు సరిపోతాయి. ఈ నేపథ్యంలో అసలు కాంగ్రెస్ పార్టీ ఎన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రతిపాదిస్తుంది? సీపీఐకే అవకాశం ఖాయమా? ఎంఐఎం ఏం చేస్తుంది? ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఓట్లేస్తారా? అసలు బీఆర్ఎస్ రెండో అభ్యర్థిని నిలబెడుతుందా? అనే అనేక ప్రశ్నలతో ఈసారి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఒకవేళ బీఆర్ఎస్ ఒకే అభ్యర్థిని ప్రతిపాదిస్తే కాంగ్రెస్ కూటమికి నాలుగు, బీఆర్ఎస్‌కు ఓ స్థానం దక్కడం మాత్రం ఖాయం.

మ్యాజిక్ ఫిగర్ 20 ఇలా..

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కౌంటింగ్ ప్రక్రియ శాసనసభా నియమావళి ఆధారంగా జరుగుతుంది. ఎమ్మెల్యే కోటాలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఒక్కో అభ్యర్థి గెలిచేందుకు అవసరమైన ఓట్ల (మ్యాజిక్ ఫిగర్) కోసం ప్రత్యేక సూత్రాన్ని పాటిస్తారు. మొత్తం సభలోని ఎమ్మెల్యేల సంఖ్యను ఎన్నికలు జరిగే స్థానాల సంఖ్యకు ఒకటి కలిపి భాగిస్తారు. ఈ మొత్తానికి మరొకటి కలుపుతారు. అప్పుడు వచ్చే సంఖ్యను మేజిక్ ఫిగర్‌గా నిర్ధారిస్తారు. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్య 119. ఈ సంఖ్యను ఐదుకు ఒకటి కలిపి అంటే ఆరుతో భాగిస్తే 19 వస్తుంది. దానికి ఒకటి కలిపితే 20 అవుతుంది. 20 తర్వాత డెసిమల్స్‌లో ఎంత వచ్చినా పట్టించుకోరు. ఈ విధంగా ఈసారి ఒక్కో అభ్యర్థి గెలిచేందుకు 20 ఓట్లు అవసరమవుతాయని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఏ పార్టీ సభ్యులైనా ఓటు వేయకుండా గైర్హాజరైన పక్షంలో మ్యాజిక్ ఫిగర్ మారుతుంది.

గీత దాటితే ఊరుకోను

- పార్టీనే ఫస్ట్.. ఆ తర్వాతే ఏదైనా
- ఫ్లెక్సీల్లో కాదు..ప్రజల్లో ఉండండి
- గత పదేళ్లు పార్టీ జెండా మోసినవారికి ప్రాధాన్యం.. కులగణన, ఎస్సీ వర్గీకరణను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- మెదక్, మల్కాజ్‌గిరి సమీక్షలో కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్
- నేడు అనుబంధ సంఘాల చైర్మన్లు, ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభల సమీక్ష



ఎంపీ సెగ్మెంట్ల సమీక్షలో మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ తదితరులు

సాక్షి, హైదరాబాద్: పార్టీ శ్రేయస్సే ప్రధానమని, పార్టీ తర్వాతే ఏదైనా అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. పార్టీ కోసం త్యాగాలు చేసినా ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఎవరూ నిరాశ చెందాల్సిన పనిలేదని, గాంధీ కుటుంబం చేసిన త్యాగాల ముందు ఎవరి త్యాగాలూ సరిపోవని అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న సమీక్షల్లో భాగంగా మంగళవారం గాంధీభవన్‌లో మెదక్, మల్కాజ్‌గిరి స్థానాల పరిధిలోని పార్టీ నేతలతో ఆమె విడివిడిగా సమావేశమయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. పార్టీ లైన్ ప్రకారమే ఎవరైనా వెళ్లాల్సి ఉంటుందని, గీత దాటితే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు బహిరంగ వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్టీ జెండా మోసినవారికే తొలి ప్రాధాన్యం

పార్టీలో అందరికీ అవకాశాలు కల్పిస్తామని, పదేళ్లుగా పార్టీ జెండాను భుజాన మోసిన వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారు. ఫ్లెక్సీల్లో ఫొటోలు కనిపిస్తే సరిపోదని, ప్రజల మధ్యలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పార్టీలో సామాజిక న్యాయం అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

చేతకాకపోతే తప్పుకోండి: పీసీసీ చీఫ్

నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు తమ పరిధిలోని నేతలు, కార్యకర్తలందరినీ కలుపుకొని వెళ్లాలని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. కలుపుకుని వెళ్లే తత్వం లేకపోతే పక్కకు తప్పుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. కొన్ని నియోజకవర్గాల్లో నేతల మధ్య సమన్వయం లేదని, అలాంటి చోట్ల పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏఐసీసీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

యువతను ఆకర్షించాలి

ఈ సమావేశంలో పార్టీ ఇన్‌చార్జ్‌కి నేతలు పలు సూచనలు చేశారు. రైతు భరోసా, పింఛన్ల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఎమ్మెల్యేలు లేని చోట్ల ప్రొటోకాల్ సమస్యలు వస్తున్నాయని, అధికారులు తమ మాట వినడం లేదని, ఎమ్మెల్యేల పెత్తనం కొన్ని చోట్ల ఎక్కువ అయిందని, ఇందిరమ్మ కమిటీలు వేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఫిర్యాదు చేశారు. 18–26 ఏళ్లలోపు యువత ఎక్కువగా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని.. గాంధీ, నెహ్రూ సిద్ధాంతాలను వారికి పరిచయం చేసి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలని సూచించారు. సెటిలర్లను ఆకట్టుకోవాలని, స్వేచ్ఛగా పనిచేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరినట్లు సమాచారం. అందరి అభిప్రాయాలు విన్న మీనాక్షి.. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పటాన్‌చెరును సరిచేయండి

మెదక్ పార్లమెంటు సమీక్షలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని పరిస్థితులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన తమను పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహారాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. సమావేశంలో పాల్గొన్న మంత్రులు దామోదర, కొండా సురేఖ కూడా పటాన్‌చెరు పరిస్థితిని మీనాక్షికి వివరించారు. సమావేశం అనంతరం మంత్రి దామోదరతో మీనాక్షి ప్రత్యేకంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తానని ఆమె హామీ ఇచ్చినట్టు సమాచారం. నేడు కాంగ్రెస్ అనుబంధ సంఘాల చైర్మన్లతో మీనాక్షి భేటీ కానున్నారు. అనంతరం ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షల్లో ఆమె పాల్గొంటారు.

పీపీపీ పద్ధతిలో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టండి

ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో సురేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పీపీపీ పద్ధతిలో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు పలు సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, దాన్ని సద్వినియోగం చేసుకుని పర్యాటక ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటకులను ఆకర్షించాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించి నిర్వహించిన ప్రీబడ్జెట్ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా టూరిజం పాలసీని రూపొందిస్తున్న నేపథ్యంలో, దానికి తగ్గట్టుగానే బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎకో టూరిజం, స్పిరిచ్యువల్ టూరిజం, టెంపుల్ టూరిజం, మెడికల్–వెల్నెస్ టూరిజంలకు సంబంధించి అందించే ప్రతిపాదనల ఆధారంగా బడ్జెట్ పద్దు ఉంటుందన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ రిజ్వీ, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి స్మితాసబర్వాల్, పర్యాటక శాఖ డైరెక్టర్ హనుమంతు జెండగె పాల్గొన్నారు.

ఆ వేడుకలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయండి

సమ్మక్క–సారలమ్మ జాతర, గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. దేవాదాయ, అటవీశాఖకు సంబంధించి ప్రీబడ్జెట్ సమావేశంలో వారు అధికారులకు పలు సూచనలు చేశారు. సోలార్ పవర్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ పనులు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, పీసీసీఎఫ్ డోబ్రియాల్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరా? ఇద్దరా?

- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులపై బీఆర్‌ఎస్ మల్లగుల్లాలు
- పార్టీ మారిన 10 మందిని ఇరుకున పెట్టేందుకు బరిలోకి రెండో అభ్యర్థి?
- ఎర్రవల్లిలో పార్టీ అధినేత కేసీఆర్‌తో కేటీఆర్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీల ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మంగళవారం ఎర్రవల్లి నివాసంలో సమావేశమై చర్చలు జరిపారు. పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య ఆధారంగా బీఆర్ఎస్‌కు కచ్చితంగా ఒక ఎమ్మెల్సీ స్థానం దక్కనుండగా, రెండో అభ్యర్థిని కూడా బరిలోకి దించితే ఎలా ఉంటుందనే అంశం ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఎన్నిక ఏకగ్రీవం కానిపక్షంలో ఐదుగురికంటే ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉంటే ఎమ్మెల్యేలు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. అప్పుడు బీజేపీ, ఎంఐఎంతోపాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలు అనుసరించే వైఖరి కీలకంగా మారనుంది. బీజేపీ, ఎంఐఎం, బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనకపోతే మారే ఓట్ల లెక్కలను మరింత లోతుగా విశ్లేషించిన తర్వాత రెండో అభ్యర్థిని బరిలోకి దింపాలనే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. ఎమ్మెల్యేల కోటాలో ఐదో అభ్యర్థి ఎన్నిక కోసం అవసరమైన పూర్తి సంఖ్యాబలం ఏ పార్టీకి లేకపోవడం ఉత్కంఠ రేపుతోంది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్న నేతల జాబితాపైనా కేసీఆర్– కేటీఆర్ భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రస్తుతం పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న సత్యవతి రాథోడ్, మహమూద్ అలీతోపాటు జోగు రామన్న, బూడిద భిక్షమయ్యగౌడ్, దాసోజు శ్రవణ్ పేర్లు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. సత్యవతి రాథోడ్ తిరిగి పోటీచేసే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

కొనసాగుతున్న 'గ్రాడ్యుయేట్' కౌంటింగ్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ మధ్య త్రిముఖ పోరు
- ఐదు రౌండ్ల వరకు బీజేపీ, ఆరోరౌండ్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం
- 7,118 ఓట్ల మెజారిటీతో అంజిరెడ్డి ముందంజ

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఎట్టకేలకు మంగళవారం మొదలైంది. ఈ ఎన్నికల్లో అంజిరెడ్డి (బీజేపీ), నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్), ప్రసన్న హరికృష్ణ (బీఎస్పీ)ల మధ్య త్రిముఖపోరు నెలకొంది. బీజేపీ అభ్యర్థి మిగిలిన ఇద్దరి అభ్యర్థుల కంటే స్వల్ప ఆధికత్యను ప్రదర్శిస్తున్నారు. ఈ సెగ్మెంట్‌లో మొత్తం 3.55 లక్షల ఓట్లలో..పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 2,52,100 ఓట్లు పోల్ కాగా, అందులో 2,24,000 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. దాదాపు 28వేల ఓట్లు చెల్లలేదు. వాస్తవానికి సోమవారం ఉదయం నుంచి చెల్లని ఓట్లు, చెల్లుబాటు అయ్యే ఓట్లను వేరు చేసి వడబోసే కార్యక్రమం ప్రారంభమైనా.. అది మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు కేటాయించారు. అందులో ప్రతీ టేబుల్‌కు 1,000 చొప్పున ప్రతీ రౌండ్‌కు 21,000 ఓట్లను 12 రౌండ్లలో లెక్కిస్తామని అధికారులు తెలిపారు.

మొదటి రౌండ్ :లెక్కింపు ప్రారంభమైన తర్వాత తొలిరౌండ్ ఫలితం మధ్యాహ్నం 2.30 గంటలకు వెలువడింది. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 6,712 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 6,676, బీఎస్పీ అభ్యర్థికి ప్రసన్న హరికృష్ణకు, 5,867 ఓట్లు సాధించారు. తొలిరౌండ్‌లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి తన సమీప అభ్యర్థి నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్)పై 36 ఓట్ల స్వల్ప మెజారిటీ సాధించారు.

రెండో రౌండ్ : ఈ రౌండ్‌లోనూ బీజేపీ మెజారిటీ కొనసాగింది. అంజిరెడ్డికి 7,979 (రెండు రౌండ్లు కలిపి 14,691), నరేందర్‌రెడ్డికి 6,522 (రెండు రౌండ్లు కలిపి 13,198), ప్రసన్న హరికృష్ణకు 4,927 (రెండురౌండ్లు కలిపి 10,794) ఓట్లు వచ్చాయి. రెండో రౌండ్‌లోనూ బీజేపీ అభ్యర్థి తన సమీప ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థిపై 1,457 ఓట్లు ఆధిక్యం ప్రదర్శించి.. మొత్తంగా 1,493 ఓట్లు మెజారిటీ సాధించారు.

మూడవ రౌండ్ : మూడో రౌండ్‌లోనూ బీజేపీ తన హవాను కొనసాగించింది. అంజిరెడ్డి 8,619 ఓట్లు (3రౌండ్లు కలిపి 23,310), నరేందర్‌రెడ్డి 5,614 (3 రౌండ్లు కలిపి 18,812), ప్రసన్న హరికృష్ణ 5,086 (3రౌండ్లు కలిపి 15,880) ఓట్లు సాధించారు. మూడో రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి తన సమీప అభ్యర్థి నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్)పై 3,005 ఓట్ల ఆధిక్యం ప్రదర్శించగా, మెజారిటీ 4,498 ఓట్లకు చేరింది.

నాలుగో రౌండ్: ఈ రౌండ్‌లోనూ అంజిరెడ్డి దూకుడు సాగింది. అంజిరెడ్డి 7,807 (4 రౌండ్లు కలిపి (31,117), నరేందర్‌రెడ్డి 6,544 (4 రౌండ్లు కలిపి 25,356), ప్రసన్న హరికృష్ణకు 5,271 (4 రౌండ్లు కలిపి 21,151)ఓట్లు పడ్డాయి. అంజిరెడ్డి తన సమీప అభ్యర్థి నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్)పై 1,263 ఓట్ల ఆధిక్యం ప్రదర్శించగా, మెజారిటీ 5,761 ఓట్లకు చేరింది.

ఐదో రౌండ్: ఈ రౌండ్‌లోనూ బీజేపీ హవా కొనసాగింది. అంజిరెడ్డి 7,850 (5 రౌండ్లు కలిపి 38,967), నరేందర్‌రెడ్డి–6,288 (5 రౌండ్లు కలిపి 31,644), ప్రసన్న హరికృష్ణ 5,411 (5 రౌండ్లు కలిపి 26,562)ఓట్లు సాధించారు. కాగా అంజిరెడ్డి నరేందర్‌రెడ్డిపై 7,323 ఓట్ల లీడ్‌లో ఉన్నారు.

ఆరోరౌండ్ : ఈ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 205 ఓట్ల ఆధిక్యం వచ్చింది. అంజిరెడ్డి 6,855 (6 రౌండ్లు కలిపి 45,822), నరేందర్‌రెడ్డి– 7,060 (6 రౌండ్లు కలిపి 38,704), ప్రసన్న హరికృష్ణ 5548 (6 రౌండ్లు కలిపి 32110)ఓట్లు సాధించారు. మొత్తంగా 7,118 ఓట్ల మెజారిటీతో అంజిరెడ్డి ముందంజలో ఉన్నాడు. మొత్తం లెక్కించాల్సిన ఓట్లు 2,24,000 కాగా, ఆరోరౌండ్ వరకు 1,26,000 ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది.

ఓటేయలేని పట్టభద్రులు, టీచర్లు

- ఈ దఫా ఎన్నికల్లో భారీగా చెల్లకుండా పోయిన ఎమ్మెల్సీ ఓట్లు
- గ్రాడ్యుయేట్ పరిధిలో 28 వేలు, టీచర్లవి 1,396 ఓట్లు ఇన్‌వ్యాలిడ్
- చెల్లని ఓట్లు ఎవరి కొంపముంచుతాయోనని గ్రాడ్యుయేట్ అభ్యర్థుల ఆందోళన



చెల్లని ఓట్లను పరిశీలిస్తున్న కౌంటింగ్ అధికారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: పేరుకు వారు పీజీలు, పీహెచ్‌డీలు చేసిన పట్టభద్రులు... పది మందికి పాఠాలు చెప్పి భావి భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు. అయితే వారిలో కొందరు ఎమ్మెల్సీ ఓటు కూడా సరిగ్గా వేయలేకపోయారు. కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 3.55 లక్షల ఓట్లకుగాను 2,52,100 ఓట్లు పోలయ్యారు. అందులో సుమారు 28,000 ఓట్లను చెల్లనివిగా పరిగణించారు. ఇందుకోసం ఒకటికి రెండుసార్లు వెరిఫికేషన్ కూడా చేశారు. కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీలో 897 ఓట్లు, వరంగల్–ఖమ్మం–నల్లగొంట టీచర్స్ ఎమ్మెల్సీ పరిధిలో 499 ఓట్లు చెల్లలేదు. చెల్లని ఓట్ల సంఖ్య భారీగా ఉండటంలో అవి ఎవరి కొంపముంచుతాయోనన్న ఆందోళన గ్రాడ్యుయేట్ అభ్యర్థుల్లో కనిపిస్తోంది.

అవగాహన లేకపోవడం వల్లే..

వాస్తవానికి ఈసారి ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో అధికారులు మంచి ప్రచారమే కల్పించారు. దీనికితోడు అభ్యర్థులు సైతం ఓటు నమోదులో కీలకంగా వ్యవహరించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ గ్రాడ్యుయేట్ పరిధిలో 1.95 లక్షల ఓట్లకు 1.15 లక్షల ఓట్లు పోల్ అయ్యాయి. ఈసారి అదే సెగ్మెంట్‌లో 3.55 లక్షల ఓట్లు నమోదు కాగా, 2.52 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లకుండా పోయిన గ్రాడ్యుయేట్ 28 వేలు ఉండటంతో, ఓటు వేసే విషయంలో ముందస్తుగా ఎలాంటి అవగాహన కల్పించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందన్న విమర్శలున్నాయి.

డబ్బులు తీసుకొని ఓట్లు చెల్లకుండా చేసి..

ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మొత్తంలో టీచర్ ఓటర్లకు డబ్బులు పంచేవారని వార్తలొచ్చాయి. కొందరు అభ్యర్థులు ఓటును బట్టి.. రూ.5,000, రూ.8,000, రూ.10,000 వరకూ పంచారన్న విమర్శలు ఉన్నాయి. ఇక పట్టభద్రుల విషయానికి వస్తే కొందరు అభ్యర్థులు ఓటుకు రూ.1,000, మరికొందరు రూ.1,500 చొప్పున పంచినట్టు ప్రచారం జరిగింది. అభ్యర్థులు చదువుకున్న వారని, తమ వైపునకు తిప్పుకునేందుకు డబ్బులు ఇస్తే.. తీరా వేలాది ఓట్లు చెల్లకుండా చేసి తమ డబ్బును నీళ్లలో పోశారని లోలోపల బాధపడుతున్నారు. చెల్లకుండాపోయిన ఓట్లు ఎవరి ఓటమికి దారితీస్తాయోనని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఓటు వేశాక.. ప్రాధాన్య అంకెకు ముందు సున్నా పెట్టడం, లేదా అంకెకు సున్నా చుట్టడం, ఫొటోలు చించడం, తొలి ప్రాధాన్యం ఒకరి కంటే ఎక్కువ మందికి ఇవ్వడం, ఫొటోలకు ముందు టిక్ పెట్టడం, సంతకం చేయడం, ముద్రలు వేయడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు రాయడం, వ్యక్తిగత సమస్యలు రాయడం తదితర పొరపాట్ల వల్ల ఓట్లు చెల్లకుండా పోయాయి. మరోవైపు భారీగా ఓట్లు చెల్లకుండా పోవడంపై సోషల్ మీడియాలో ట్రోల్స్ ఆగడం లేదు. వీరి కంటే చదువురాని నిరక్షరాస్యులు నయమంటూ పలువురు కామెంట్లు పెడుతున్నారు.



సంతోషంలో ఉన్నవాళ్లందరూ మరింత సంతోషంగా ఉండాలనే సహానుభూతి పూరిత సంతోషం చూపాలి. ఇది మనలోని అసూయ, ఆగ్రహాలకు విరుగుడుగా పనికొస్తుంది.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 5 మార్చి 2025

ఇది చట్టబద్ధ హత్య!

పొట్ట చేతబట్టుకుని గల్ఫ్ దేశాలకు వలసపోయే కార్మికుల విషాద గాథలు మనకు కొత్తగాదు. జీవితాలు సవ్యంగా వెళ్తే సరేగానీ... ఒకసారంటూ సమస్యల్లో చిక్కుకుంటే అక్కడ నరకం చవిచూడక తప్పదని తరచు వెల్లడయ్యే ఘోర ఉదంతాలు చెబుతాయి. తాజాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబూధాబీలో చేయని నేరానికి ఉరికంబం ఎక్కిన ఉత్తరప్రదేశ్ యువతి షెహజాదీ ఉదంతం మరింత దారుణమైనది. నాలుగు నెలల శిశువును హత్య చేసిందని ఆరోపిస్తూ మోపిన కేసులో ఆమె వాదనలన్నీ అరణ్య రోదనలు కాగా చివరకు గత నెల 15న అక్కడి ప్రభుత్వం ఆ యువతి ఉసురు తీసింది. జవాబుదారీతనం ఏమాత్రం లేని వ్యవస్థలతో నిండిన యూఏఈలో వలస కార్మికులకు వీసమెత్తు విలువుండదు. వారి ప్రాణాలకు పూచీ ఉండదు. కానీ మన దేశం నుంచి వలసపోయే వారిలో అత్యధికులు ఎంచుకునేది యూఏఈనే. ఒక లెక్క ప్రకారం అక్కడ 35 లక్షలకు పైగా భారతీయ వలస కార్మికులున్నారు. ఆ దేశ జనాభాలో వీరి వాటా దాదాపు 33 శాతం. ఈ కార్మికుల్లో అత్యధికులు నివసించేది అబూధాబీలోనే.

వలస కార్మికుల రక్షణ కోసం మన దేశం చర్యలు తీసుకుంటున్న మాట వాస్తవమే అయినా అవి చాలినంతగా లేవు. మనకు యూఏఈతో ద్వైపాక్షిక కార్మిక ఒప్పందాలున్నాయి. ప్రవాసీ బీమా యోజన కింద తప్పనిసరి ఇన్సూరెన్స్ పథకం ఉంది. కార్మికుల హక్కులు కాపాడటానికీ, వలసల క్రమబద్ధీకరణకూ ఈ–మైగ్రేట్ వ్యవస్థ ఉంది. కానీ ఇవేవీ షెహజాదీని కాపాడలేకపోయాయి. చిన్ననాడు ముఖంపై కాలిన గాయాలవల్ల ఏర్పడ్డ మచ్చలను తొలగించుకోవాలని ఆరాటపడి ఆమె ఒక మాయగాడి వలలో చిక్కుకుంది. యూఏఈలో ఉన్న తన బంధువుల ద్వారా అక్కడ ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవచ్చని అతగాడు నమ్మించి షెహజాదీ నుంచి రూ. 3 లక్షలు, బంగారు నగలు తీసుకుని ఆమెను 2021 చివరిలో అబూధాబీకి పంపాడు. శస్త్రచికిత్స మాట వదిలి ఒక ఇంట్లో పనిమనిషిగా చేర్చాడు. ఆ ఇంటి యజమాని భార్య ఒక శిశువుకు జన్మనిచ్చాక అదనంగా శిశు సంరక్షణ భారం కూడా పడింది. నాలుగు నెలలున్న శిశువు వ్యాక్సీన్ వికటించి మరణిస్తే షెహజాదీపై హత్యా నేరం మోపారు. 2022 డిసెంబర్‌లో ఈ ఘటన జరిగిన నాటి నుంచీ దర్యాప్తు పేరుతో ఆమెను జైలుపాలు చేసిన పోలీసులు 2023 ఫిబ్రవరిలో లాంఛనంగా అరెస్టు చేశారు. కోర్టులో విచారణ తంతు నడిపించి ఆమెను దోషిగా తేల్చారు. ఈ క్రమమంతా మన ప్రభుత్వ యంత్రాంగం, యూఏఈలోని మన రాయబార కార్యాలయం ఏం చేశాయన్నదే ప్రశ్న. శిశు మరణానికి కారణం స్పష్టంగా కనబడుతోంది. ఒక్కోసారి వ్యాక్సీన్లు శిశువులకు ప్రాణాంతకం కావటం అసాధారణమేమీ కాదు. ఆ మరణం వ్యాక్సీన్ వల్ల జరిగిందా లేక షెహజాదీయే శిశువుకు హాని తలపెట్టిందా అన్నది పోస్టుమార్టం జరిపితే వెల్లడయ్యేది. కానీ ఆ శిశువు తండ్రి అందుకు ఒప్పుకోలేదట. కనుక షెహజాదీని కోర్టులు దోషిగా నిర్ధారించాయి! సరైన ప్రయత్నాలు జరిపివుంటే న్యాయం జరిగేదేమో! రాష్ట్రపతి, ప్రధాని మొదలుకొని అన్ని స్థాయిల్లోనూ మొరపెట్టుకుంటూనే ఉన్నామని, వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నామని కానీ సరైన స్పందన లేదని షెహజాదీ తండ్రి షబ్బీర్ ఖాన్ అంటున్నారు. ఆఖరికి తమ కుమార్తె బతికుందో లేదో చెప్పమని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆమె తండ్రి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తే తప్ప నిజమేమిటో వెల్లడి కాలేదు.

శస్త్ర చికిత్స కోసం వెళ్లిన యువతిని బలవంతంగా పనికి కుదుర్చుకోవటమేగాక ఆమెపై హత్యా నేరం మోపటం, కింది కోర్టు విధించిన శిక్షను ఉన్నత న్యాయస్థానం కనీస ఆలోచన లేకుండా ఖరారు చేయటం అమానవీయం. ప్రభుత్వం అంతకన్నా బాధ్యతారహితంగా వ్యవహరించింది. గత నెల 15న మరణశిక్ష అమలు చేయగా, 17న రివ్యూ పిటిషన్ దాఖలైనప్పుడు సైతం కేసును పరిశీలిస్తున్నామన్న జవాబే ఇచ్చింది. మరణశిక్ష అమలైనట్టు 28నగానీ మన రాయబార కార్యాలయానికి చెప్పలేదు. కేసు విషయంలో చేయగలిగిందంతా చేశామని మన విదేశాంగ శాఖ వివరిస్తోంది. ఆమె తరఫున క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేయించామని, చట్టాలు కఠినంగా ఉండటంతో కాపాడలేకపోయామని అంటున్నది. కానీ రెండేళ్లుగా నలుగుతున్న ఈ కేసు ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం, ఇతరత్రా హక్కుల సంఘాల దృష్టికి వెళ్లిందో లేదో తెలియదు. ఉసురు తీసేముందు చివరి కోరికగా తల్లిదండ్రులతో మాట్లాడించినా అది రెండు నిమిషాల ముచ్చటే అయింది.

సంపన్నవంతమైన దేశంలో కాయకష్టం చేస్తే మంచి సంపాదన ఉంటుందని భావించి చాలామంది అక్కడికి వెళ్తుంటారు. కానీ 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో పనిచేయాలని, అక్కడ అమల్లోవున్న కఫాలా వ్యవస్థ ప్రకారం వారి వీసాలు యజమానులకు అనుసంధానించి వస్తాయని, దిగినవెంటనే వారు పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకుంటారని, అందువల్ల మరోచోట పని వెదుక్కోవటం అసాధ్యమని చాలామందికి తెలియదు. అధిక గంటలు పనిచేయించుకోవటం, వేతనాలు ఎగ్గొట్టడం, సామాజిక భద్రత పథకాలు లేకపోవటం వలస కార్మికుల బతుకును దుర్భరం చేస్తోంది. ఈ విషయంలో యూఏఈతో మాట్లాడి తగిన చట్టాలు అమలయ్యేలా చూడటం, అక్కడ క్రిమినల్ కేసుల్లో చిక్కుకున్న మన కార్మికుల వివరాలు ఎప్పటికప్పుడు అందించే వ్యవస్థ అందుబాటులోకి తీసుకురావటం అవసరమని చెప్పాలి. వలసపోయే కార్మికులకు అక్కడ పొంచివుండే ప్రమాదాల గురించి అవగాహన పెంచాలి. షెహజాదీని కాపాడుకోలేకపోయినా, ఆ స్థితి మరెవరికీ రాకుండా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

వాడుకున్నవాళ్లకు వాడుకున్నంత...

విశ్లేషణ



పి. వేణుగోపాల్ రెడ్డి

సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రోగ్రామర్ల నుంచి పెద్ద కంపెనీల సీఈఓల దాకా మనవాళ్లదే ఆధిపత్యం. ప్రతీ ప్రఖ్యాత సంస్థ మన దేశంలో బ్రాంచీలు తెరవాల్సిందే. మన డాక్టర్లు వైద్య రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. పంటికైనా తుంటికైనా తక్కువ ఖర్చులో మన్నికైన చికిత్స కోసం మనదాకా రావలసిందే... ఐతే, ఇకపై ఈ పరిస్థితి మారిపోతుంది; సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉద్యోగాలుండవు; డాక్టర్లకు కొలువులుండవు; ఇది మరో యుగాంతానికి దారి తీస్తుంది... కృత్రిమ మేధపై వ్యక్తమవుతున్న భయాందోళనలివి!

మార్పును ప్రతిఘటించడం మనిషి సహజ స్వభావం. పారిశ్రామిక విప్లవంలో యంత్రాలు ప్రవేశించినప్పుడు అవి తమ కడుపు కొడతాయన్న ఆందోళనతో కార్మికోద్యమాలు జరిగాయి. కంప్యూటర్లు వచ్చినప్పుడు అవి తమ ఉద్యోగాలను హరించివేస్తాయనే భయంతో నిరసనలు వెల్లువెత్తాయి. ఏఐ విషయంలో కూడా అలాగే మానసిక ఆందోళనలు కనిపిస్తున్నాయి. గతంలో మార్పును వ్యతిరేకిస్తూ కొంతకాలం ప్రతిఘటించే అవకాశమైనా ఉండేది. కానీ ఈ ఏఐ ఎవరు కాదన్నా ఆగేది కాదు. కాబట్టి ఎవరికి వారు తమకు అవసరమైన మేరకు దీన్ని ఎంత సమర్థంగా ఉపయోగించుకోవాలో నేర్చుకోవడం మంచిది. చాట్ జీపీటీ, గూగుల్ జెమిని, కోపైలట్, గ్రోక్ వంటి ఏఐ టూల్స్‌లో ఉచితంగా అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవడం మొదలుపెట్టాలి.

ఇదొక వాస్తవం

కృత్రిమ మేధ విభిన్నమైన, మరింత ఉన్నతమైన ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. ఇది మనుషులకు ప్రత్యామ్నాయంగా వచ్చిన పరిజ్ఞానం కాదు, మనకు సహాయకారిగా ఉంటూ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు దోహదం చేస్తుంది. మనకు తెలియకుండానే మనమంతా ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నాం. ఫోన్లో అలెక్సానో, గూగుల్‌నో ఉపయోగిస్తాం. ఏదేనా టైపు చేస్తున్నపుడు స్పెల్లింగ్ దోషాలుంటే సవరించి చూపే పరిజ్ఞానాన్ని వాడుతున్నాం. స్మార్ట్ టీవీలో మన అభిరుచికి తగిన సినిమాలు, వెబ్ సిరీస్‌ల వివరాలు మనం అడగకుండానే కనిపిస్తుంటాయి. స్మార్ట్ వాచ్, ఫోన్ యాప్‌ల ద్వారా మన ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు కలిగింది.

సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడుకోవడానికి కూడా ఏఐ ఉపకరిస్తుంది. సాధారణంగా వాట్సాప్‌లో వచ్చే సందేశాలలో కొన్ని అనుమానాస్పదంగా ఉంటాయి. ఏదైనా మెసేజ్‌పై అనుమానం కలిగితే అది నిజమా, కాదా అని ఏఐ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రపంచం ఏఐతో ముందుకు సాగుతోంది, వద్దనుకుంటే మనం వెనుకబడిపోతాం. యువతకు ఏఐ మరింత ఉపయోగకరం, తప్పనిసరి కూడా. దీని ద్వారా సృజనాత్మకతను, వ్యూహరచనా సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు. నిత్య విద్యార్థికి, మార్పును స్వాగతించే వారికి ఏఐ మంచి మార్గదర్శనం చేస్తుంది.

అన్ని రంగాల్లో ఉపయోగం

విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, కృత్రిమ మేధ సాయంతో వారిలో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని ఈమధ్య ఐదు తెలంగాణ జిల్లాల్లోని ముప్పై పాఠశాలల్లో ప్రారంభించారు. ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నప్పుడు కొందరికి వెంటనే అర్థమవుతుంది, మరికొందరు అర్థం చేసుకోలేక క్రమంగా వెనుకబడిపోతారు. ప్రాథమిక విద్యార్థులలో కొందరికి సరిగా చదవడం, రాయడం కూడా రాదు. చిన్నచిన్న కూడికలు, తీసివేతలు కూడా చేయలేరు. అలాంటి వారిని గుర్తించి ఐదేళ్లలో ప్రధాన స్రవంతిలో కలపాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితం 'ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ' పేరుతో ప్రారంభమైన కార్యక్రమం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఆ కార్యక్రమానికి తాజాగా కృత్రిమ మేధను జోడించి సత్ఫలితాలు సాధించే దిశగా వెళ్తున్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో, ప్రతి తరగతి నుంచి చదువులో వెనుకబడిన విద్యార్థులను ఎంపికచేసి వారికి ఏఐ పరిజ్ఞానంతో 40 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అవసరాన్ని బట్టి ప్రతిచోటా విద్యాలయాల్లో ఇలాంటి కార్యక్రమాలు మొదలుపెడితే ఏఐ ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చు.

జన్యుపరీక్షల ద్వారా సేకరించిన సమాచారాన్ని క్రోడీ కరించి, భవిష్యత్తులో రాగల వ్యాధులను పసిగట్టే సామర్థ్యం ఏఐకి ఉందని వైద్యులు చెబుతున్నారు. రోగి ఎక్స్–రేలో కంటికి కనిపించని సూక్ష్మమైన మచ్చలను కూడా విశ్లేషించి రోగనిర్ధారణ చేయడం ఏఐ వల్ల సాధ్యమవుతోందని వైద్యనిపుణులు అంటున్నారు. కృత్రిమ మేధపై అన్ని రంగాల్లో మాదిరిగానే వైద్యరంగంలో కూడా భయాలున్నాయి. ఐతే ఏఐ వల్ల వారి ప్రాధాన్యం తగ్గదనీ, అందులో ప్రావీణ్యం లేకపోతే వెనుకబడే అవకాశాలు మాత్రం ఉన్నాయనీ ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ నాగేశ్వర రెడ్డి చెప్పినట్లు ఈమధ్య చదివాను. ఇప్పటిదాకా కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఏదైనా వచ్చిందంటే దాన్ని అందిపుచ్చుకునే ఆర్థిక స్థోమత అందరికీ ఉండేది కాదు. దానికి భిన్నంగా ఏఐ ఫలితాలను వైద్యరంగంలో అందరికీ అందించే అవకాశాలున్నాయనీ, పల్లెలోనైనా పట్నంలోనైనా అందరికీ సమానంగా వైద్యం అందుబాటులోకి వచ్చేరోజు ఎంతోదూరంలో లేదనీ నిపుణులు అంటున్నారు. కొత్త ఔషధాలను ఆవిష్కరించే పరిశోధనలలో కూడా ఏఐని ఉపయోగించి వేగవంతమైన ఫలితాలను సాధిస్తున్నారు.



ప్రపంచం ఏఐతో ముందుకెళ్తోంది, వద్దనుకుంటే మనం వెనుకబడిపోతాం.

◆ వాతావరణానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం వల్ల ఎరువుల ఖర్చు, నీటి వినియోగం గణనీయంగా తగ్గి, పంట దిగుబడి ఇరవై శాతం పెరిగిందని చెప్పే ఓ రైతు ప్రత్యక్ష అనుభవాన్ని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ఇటీవల పంచుకున్నారు.

◆ కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఏదైనా వచ్చిందంటే దాన్ని అందిపుచ్చుకునే ఆర్థిక స్థోమత అందరికీ ఉండేది కాదు. దానికి భిన్నంగా ఏఐ ఫలితాలను అందరికీ సమానంగా అందుబాటులోకి తేవచ్చు.

వ్యవసాయం సాధారణంగా శాస్త్ర సాంకేతిక పరిశోధనల ఫలితాలను అందుకోవడంలో చివరి వరుసలో ఉంటుంది. ఐతే, ఈమధ్య రైతులలో చైతన్యం, ప్రభుత్వాల చొరవ వలన ఈ రంగంలో సాంకేతికత వినియోగం పెరుగుతోంది. మహారాష్ట్రలోని బారామతి జిల్లాలో ఉష్ణోగ్రతలు, భూసారానికి సంబంధించి ఏఐ అందించిన సమాచారాన్ని ఉపయోగించుకున్న ఓ రైతు మంచి దిగుబడి సాధించాడు. వాతావరణానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం వల్ల ఎరువుల ఖర్చు, నీటి వినియోగం గణనీయంగా తగ్గి, పంట దిగుబడి ఇరవై శాతం పెరిగిందని చెప్పే ఓ రైతు ప్రత్యక్ష అనుభవాన్ని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ఇటీవల పంచుకున్నారు. కరవు, నీటి ఎద్దడి కారణంగా వ్యవసాయం నష్టదాయకంగా మారిన బారామతి జిల్లాలో మైక్రోసాఫ్ట్ సంస్థ ఏఐ ఆధారిత వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పింది. దేశవ్యాప్తంగా ఇలాంటి సహాయ సహకారాలు లభిస్తే వ్యవసాయం లాభదాయకం కావడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తుంది.

మానవ మేధకూ పదును...

కృత్రిమ మేధ ఒక ప్రాంతానికో, దేశానికో కాకుండా యావత్తు విశ్వాన్ని ప్రభావితం చేయగల విస్తృత సామర్థ్యం కలిగిన పరిజ్ఞానం కావడం వలన ప్రపంచ దేశాలన్నీ సమన్వయంతో కచ్చితమైన మార్గదర్శకాలు, నియంత్రణలు ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉంది. దీన్ని వికాసం కోసం వినియోగిస్తే మేలు జరుగుతుంది, విధ్వంసం కోసం వినియోగిస్తే కీడు జరుగుతుంది.

కృత్రిమ మేధలో అతి ముఖ్యమైన అంశం మానవ మేధా సామర్థ్యం. మనం ఎంత సమర్థవంతంగా ప్రశ్న అడిగితే జవాబు అంత కచ్చితంగా, సూటిగా వస్తుంది. మనం అడిగే ప్రశ్నను ప్రాంప్ట్ అంటారు. ఏఐ ద్వారా పనులు చేయించే ప్రాంప్ట్ ఇంజినీర్ ఉద్యోగాలు ఇప్పుడు కొత్తగా పుట్టుకొస్తున్నాయి. ఏఐ టూల్స్ వినియోగించేటప్పుడు మనమంతా ప్రాంప్ట్ ఇంజినీర్లమే.

ప్రతి పౌరుడూ, విద్యార్థీ, సాంకేతిక నిపుణుడూ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి... కృత్రిమ మేధ నిన్నెప్పుడూ తప్పించలేదు, కృత్రిమ మేధ తెలిసినవాడు నిన్ను తప్పించగలడు. కాబట్టి, మానవ మేధకు పదును పెట్టుకుంటూ సమర్థంగా ముందుకు సాగుదాం!

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్
ఈ–మెయిల్: pvg@ekalavya.net

సోషల్ మీడియా

అడ్డొచ్చే సవరణలు



డేటా ప్రొటెక్షన్ లా ద్వారా ఆర్టీఐ చట్టానికి చేసిన మార్పులను మనం గట్టిగా వ్యతిరేకించాలి. ఈ సవరణలు కీలక సమాచారం పొందడాన్ని తీవ్రంగా నియంత్రించడమే కాకుండా, జవాబుదారీతనం కోసం చేస్తున్న పోరాటంలో ఆటంకంగా నిలుస్తాయి. ఆర్టీఐ సవరణలు వెనక్కి తీసుకోవాలి.

– అంజలీ భరద్వాజ్, యాక్టివిస్ట్

అంత అవసరమా?



ఈ దేశంతో ఉన్న సమస్యేమిటో తెలుసా? ఒక స్టార్ క్రికెటర్‌ను ఒక రాజకీయ నాయకురాలు విమర్శించడం అనేది జాతీయ సమస్య అయిపోవడం. దారుణం! (రోహిత్ శర్మ మీద షమా మహమ్మద్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.)

– ప్రదీప్ మ్యాగజీన్, రచయిత

కలిసొచ్చేలా చేస్తున్నారు!



నేననుకోవడం బీజేపీ... రాహుల్ గాంధీ పేరుమీదుగా 'బీజేపీ బెస్ట్ ఫ్రెండ్' అవార్డును 2025 సంవత్సరానికి షమా మహమ్మద్‌కూ, 2024 సంవత్సరానికి శ్యామ్ పిట్రోడాకూ, జీవన సాఫల్యాన్ని మణిశంకర్ అయ్యర్‌కూ ప్రదానం చేయాలి.

– అర్ణబ్ రే, రచయిత

తప్పుడు విమర్శ



ఒక పాలస్తీనా ఫిలింమేకర్ ఒక ఇజ్రాయెలీ జర్నలిస్ట్ (ఆయన యూదు మతవాది కూడా కాదు)తో పనిచేయాలని అనుకున్నారు. ఇద్దరూ కలిసి ఆస్కార్ గెలుచుకున్నారు. పాలస్తీనా అనుకూల ఉద్యమంతో సంబంధం ఉన్నవాళ్లందరూ ఇప్పుడు వాళ్లమీద దాడి చేస్తున్నారు. ఇది ఎవరికి మేలు చేస్తుందంటారు?

– ర్యాన్ గ్రిమ్, జర్నలిస్ట్

యుద్ధం ఆగకూడదా?



రష్యా–ఉక్రెయిన్ యుద్ధం అంతం కావాలని ట్రంప్ కోరుకుంటున్నారు. కానీ యూరప్ దాన్ని కొనసాగించాలనుకుంటోంది. అలాగే జెలెన్‌స్కీ!

– మార్కండేయ కాట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయవాది

ఇన్ బాక్స్

ఆదివాసీ జాతర

ఆదివాసీ తిరుగుబాటుకు తిరుగులేని సాక్ష్యంగా నిలిచిన సమ్మక్క – సారలమ్మలకు మేడారం కేంద్రంగా అతి పెద్ద జాతర జరుగుతుంది. వీరితో సంబంధం కలిగినవాడే పగిడిద్దరాజు. ఆదివాసీ స్వయంపాలన కోసం కాకతీయులపై కత్తులు దూసి కదన రంగంలో అమరులైన సమ్మక్క భర్తే ఈయన. ఈయనకు భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా గుండాల మండలం 'వేపలగడ్డ గ్రామం'లో అత్యంత వైభవంగా 'ఆరెం' వంశస్థులు జాతర జరుపుతారు. ఈ ఏడాది మార్చి 5 నుంచి 7 వరకు ఈ జాతర జరుగుతుంది.



కరువుకాలంలో కాకతీయులకు కప్పం కట్టడానికి నిరాకరించిన కోయ రాజు పగిడిద్దరాజుపైకి చక్రవర్తి ప్రతాప రుద్రుడు దండెత్తి వచ్చాడనీ, ఆ యుద్ధంలో కోయరాజుతో పాటు ఆయన కూతుర్లు సారలమ్మ, నాగులమ్మ; కొడుకు జంపన్న, అల్లుడు గోవిందరాజులు అసువులు బాశారనీ, భార్య సమ్మక్క యుద్ధం చేస్తూ చిలకలగుట్ట ప్రాంతంలో అదృశ్యం అయిందనీ ఆదివాసుల విశ్వాసం. సమ్మక్క కుంకుమ భరిణి రూపంలో ఇప్పటికీ చిలకల గుట్టపై ఉందని కోయలు నమ్ముతారు. అందుకే మేడారంలో జరిగే సమ్మక్క– సారలమ్మ మహాజాతరకు పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారం చేరుకుంటేనే జాతర ప్రారంభం అవుతుంది.

పగిడిద్దరాజును ఒక పోరాట యోధునిగా కీర్తిస్తూ స్మరిస్తూనే దైవత్వం నుండే వీరత్వం పుట్టిందని... ఈయనను ఒక దైవంగా నేడు ఆదివాసీలు కొలుస్తున్నారు. ఈ జాతరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీలు తరలివస్తారు. ఈ సందర్భంగా ఆదివాసీ యువతకు క్రీడలు నిర్వహిస్తారు. ఆదివాసీ స్వయం పాలన కోసం పోరాడి అమరుడైన పగిడిద్దరాజు స్ఫూర్తితో నేడు ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటం చేయాలి. మూలవాసీ అస్తిత్వాన్ని చాటుకోవాలి. 'కంకవనం' చేజారకుండా పొదివి పట్టుకోవాలి. ఆదివాసీ పోరాటాలకు, ఆరాటాలకు ప్రజాతంత్ర శక్తులన్నీ అండగా నిలవాలి.

– వూకె రామకృష్ణ దొర । (నేటి నుండి భద్రాద్రి – కొత్తగూడెం జిల్లా, వేపలగడ్డలో 7వ తేదీ వరకు పగిడిద్ద రాజు జాతర)

పథకాల పట్టికలో పైకి వచ్చేదెప్పుడు?

అభిప్రాయం



చొప్పరపు కృష్ణారావు

శాస్త్ర, సాంకేతిక, ఐటీ లాంటి రంగాల్లో దూసుకుపోతున్న తెలుగు రాష్ట్రాలు, మొత్తంగా భారత్... క్రీడారంగంలో మాత్రం వెలవెలబోతున్నాయి. అంతర్జాతీయ క్రీడల్లో భారత్, జాతీయ క్రీడల్లో తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లు అట్టడుగుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా రూపుదిద్దుకొన్న భారత్‌కు ఈ దుఃస్థితేమిటి?

జనాభా పరంగా ప్రపంచంలోని రెండు అతిపెద్ద దేశాలలో ఒకటైన భారత్ పరిస్థితి క్రీడారంగంలో 'రెండడుగులు ముందుకు, నాలుగడుగులు వెనక్కి' అన్న చందంగా మారింది. పారిస్ ఒలింపిక్స్‌లో 200కు పైగా దేశాలు పాల్గొంటే... పతకాల పట్టికలో భారత్ స్థానం 71 మాత్రమే. 2020 టోక్యో ఒలింపిక్స్ పతకాల పట్టికలో 48వ స్థానంలో నిలిచింది భారత్.

2024 ఒలింపిక్స్‌కు వచ్చేటప్పటికి 23 స్థానాలు దిగువకు పడిపోయింది. కనీసం ఒక్క బంగారు పతకమూ సాధించలేకపోయింది. వందకు పైగా అథ్లెట్ల బృందంతో 16 రకాల క్రీడల్లో పాల్గొన్న భారత్ ఒకే ఒక్క రజత పతకం, ఐదు కాంస్య పతకాలతో సరిపెట్టుకుంది. ఒలింపిక్స్ పతకాల పట్టికలో మన పొరుగు దేశం పాకిస్తాన్‌ది 62వ స్థానం కాగా మనకు దక్కింది 71వ స్థానం మాత్రమే. గత 128 సంవత్సరాలుగా ఒలింపిక్స్‌లో పాల్గొంటూ వచ్చిన భారత్ ఇప్పటి వరకూ సాధించినవి 41 పతకాలు మాత్రమే. వీటిలో పది మాత్రమే బంగారు పతకాలు. మొత్తం స్వర్ణాలలో హాకీజట్టు అందించినవే ఎనిమిది ఉన్నాయి. ఆర్థికంగా, జనాభా పరంగా పాకిస్తాన్ కంటే ఎన్నోరెట్లు బలమైన భారత్ ఒలింపిక్స్ పతకాల సాధనలో వెనుకబడిపోతూనే ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రమే కాదు... 1960, 1968, 1972, 1976, 1984, 1992 ఒలింపిక్స్ పతకాల పట్టికలో సైతం పాకిస్తాన్‌ను భారత్ అధిగమించలేకపోయింది.

ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన అతిపెద్ద దేశం భారత వార్షిక బడ్జెట్ (2025–26) 50.65 లక్షల కోట్లలో క్రీడారంగానికి 3 వేల 800 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడం చూస్తే క్రీడలకు మనం ఏమాత్రం ప్రాధాన్యం ఇస్తున్నదీ ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గత బడ్జెట్ వరకూ క్రీడలకు కేటాయించిన మొత్తం రూ. 800 కోట్లు మాత్రమే. ప్రపంచ పటంలో అంతగా కనిపించని అతిచిన్న దేశాలు బంగారు పతకాలతో పతకాల పట్టిక అగ్రభాగంలో నిలుస్తూ ఉంటే భారత్ మాత్రం



రజత, కాంస్య పతకాలకే పరిమితం కావడం మన వెనుకబాటుతనానికి నిదర్శనం కాక మరేమిటి?

మిగిలిన రంగాలతో పాటు క్రీడారంగంలోనూ ఉన్నతిని సాధించిన దేశాలను మాత్రమే సమగ్ర అభివృద్ధి సాధించిన దేశాలుగా ఐక్యరాజ్యసమితి పరిగణిస్తోంది. ఈ కోణం నుంచి చూస్తే భారత్ అభివృద్ధి ఏపాటిదో మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

అంతర్జాతీయ క్రీడారంగంలో భారత్ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో... జాతీయ క్రీడారంగంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పరిస్థితీ అంతే దారుణంగా తయారయ్యింది. ఉత్తరాఖండ్ వేదికగా ఈమధ్యనే ముగిసిన 38వ జాతీయ క్రీడల్లో 29 రాష్ట్రాల జట్లు పోటీపడితే... పతకాల పట్టికలో తెలుగు రాష్ట్రాలకు దక్కిన స్థానాలు చూస్తే (18వ స్థానంలో ఆంధ్రప్రదేశ్, 26వ స్థానంలో తెలంగాణ) ముక్కుమీద వేలువేసుకోవాల్సిందే! 2002 జాతీయ క్రీడలు నిర్వహించిన సమయంలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో 94 బంగారు పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. అయితే... కేరళ వేదికగా ముగిసిన 2015 జాతీయ క్రీడల పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ 18వ స్థానం, తెలంగాణ 33 పతకాలతో 12వ స్థానం సాధించాయి. రెండు రాష్ట్రాలుగా వేరు పడిన తరువాత మన రాష్ట్రాల పరిస్థితి మరింత దిగజారిపోతూ వచ్చింది.

జనాభా, వైశాల్యం, క్రీడామౌలిక సదుపాయాల పరంగా తమకంటే ఎంతో దిగువన ఉన్న పలు (ఉత్తరాఖండ్, పంజాబ్, హరియాణా) రాష్ట్రాలు పతకాల పట్టికలో మెరుగైన స్థానాలలో నిలిస్తే 5 కోట్లకు పైగా జనాభా కలిగిన ఆంధ్రప్రదేశ్ 7 స్వర్ణ, ఒకే ఒక్క రజత, 6 కాంస్యాలతో సహా మొత్తం 14 పతకాలతో 18వ స్థానం సంపాదించింది.

దేశంలోనే అత్యాధునిక క్రీడా మౌలిక, శిక్షణ సదుపాయాలు కలిగిన రాష్ట్రంగా పేరుపొందిన తెలంగాణ పతకాల పట్టికలో 26వ స్థానానికి దిగజారింది. 212 మంది క్రీడాకారుల బృందంతో 23 క్రీడాంశాలలో పోటీకి దిగిన తెలంగాణ చివరకు 3 స్వర్ణ, 3 రజత, 12 కాంస్యాలతో సహా మొత్తం 18 పతకాలతో గతంలో ఎన్నడూలేని విధంగా పతకాల పట్టిక అట్టడుగు నుంచి 3వ స్థానంలో నిలిచింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరువాత జరిగిన జాతీయ (2022 గోవా, 2023 గుజరాత్) క్రీడల్లో 12, 15 స్థానాలు సాధించడం గమనార్హం.

దేశంగా భారత్, రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్ – తెలంగాణలు క్రీడారంగంపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమయ్యింది. నిర్లక్ష్యం చేస్తే యువశక్తి నిర్వీర్యం కావడమే కాక 'సమగ్ర అభివృద్ధి' అనే భావనే కొండెక్కి కూర్చుంటుంది!

వ్యాసకర్త సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్టు
మొబైల్: 84668 64969

పవిత్ర ప్రార్థనలు



విశ్వవ్యాప్తంగా క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ఉపవాస ధ్యానంలో ఆచరించే తపస్సు కాలాన్ని 'లెంట్ కాలం' అంటారు. లెంట్ అనే లాటిన్ మాటకు చిగురించడం అని అర్థం. ఇది బుధవారంతో ప్రారంభమవుతుంది. అందు చేత 'భస్మ బుధవారం' లేదా 'బూడిద బుధవారం' అంటారు. లెంట్ మొత్తం నలభై రోజులు. లాటిన్ భాషలో 'క్వాడ్రగెసిమ' అనే మాటకు నలభై అని అర్థం. బైబిల్లో నలభై దినాల ఉపవాసానికి ఉదాహరణగా, మోషే నలభై దినాలు ఉపవసించి ప్రార్థన చేశాడు. ఏలియా ప్రవక్త 40 రోజులు ఉపవసించి, ప్రార్థించాడు. నోవా జలప్రళయం 40 దినాలు జరిగింది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి కానానుకు 40 సంవత్సరాలు పయనించారు. ఏసు పరిచర్యకు ఉపక్రమించే ముందు 40 దినాలు ఉపవసించి ప్రార్థించాడు. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రార్థన ఉపవాస ధ్యానాలు 40 రోజులు భక్తి శ్రద్ధలతో నిష్ఠగా ఒంటిపూట సాత్వికాహారం తీసుకుని నియమబద్ధమైన జీవితం గడుపుతూ ఆచరిస్తారు.

బుధవారం రోజు కొన్ని ఆలయాల్లో విశ్వాసులు తాటాకులతోగాని, కొబ్బరి ఆకులతోగాని, ఖర్జూరపు ఆకులతో చేసిన సిలువ ప్రతిమలు తెచ్చి ఉంచుతారు. వాటిని మరుసటి సంవత్సరం వరకు ఉంచి బుధవారం భస్మం చేస్తారు. ఆ బూడిదతో నుదుటపై సిలువ గుర్తు వేసుకుని లేదా తలపై చల్లుకుని బూడిద బుధవారం నుంచి శుభ శుక్రవారం వరకు జరిగే క్వాడ్రగెసిమ కాలం ధ్యానాలు ఆచరిస్తారు.

లెంట్‌కాలం అంతా దేవాలయాల్లో నలభై అంశాలపై ధ్యానం చేస్తూ ప్రార్థనలు జరుగుతాయి. ఈ కాలంలో శుభకార్యాలు గాని, కుటుంబాల్లో జరుపుకునే ఇతర ఉత్సవాలు గాని చేయరు. భస్మ బుధవారం నుంచి శుభ శుక్రవారం వరకూ వచ్చే నలభై దినాలు 'శ్రమల కాలం'గా పరిగణించి, ప్రక్షాళన కోసం పవిత్రపరచుకునే సంప్రదాయాన్ని ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ సమాజం ఆచరిస్తుంది. శుభ శుక్రవారం అనంతరం వచ్చే శనివారాన్ని 'లాజరస్ సాటర్ డే' అంటారు. దీన్నే 'నిశ్శబ్ద శనివారం' అని కూడా పిలుస్తారు. ఏసు మరణించిన శుక్రవారం సమాధిలో ఉన్నా, శనివారం అనంతరం పునర్జీవితుడై తిరిగి లేచిన ఆదివారం 'ఈస్టర్ ఆదివారం'గా జరిగే ప్రార్థనలతో లెంట్‌కాలం పూర్తవుతుంది. ఈ క్వాడ్రగెసిమ కాలం అంతా పాప ప్రక్షాళనతో పాటు వ్యక్తిగత నియమనిష్ఠలను పాటించి, ప్రపంచ శాంతి, సమసమాజ సుహృద్భావ జీవనం కలగాలని ప్రార్థనలు చేస్తారు.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, క్రైస్తవ సాహిత్య పరిశోధకులు
(నేడు భస్మ బుధవారం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.షష్ఠి సా.5.46 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** భరణి ఉ.7.21 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** సా.6.36 నుడి 8.07 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.47 నుండి 12.33 వరకు, **అమృతఘడియలు:** రా.3.36 నుండి 5.03 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 6.03.

క్లుప్తంగా...



వటపత్రశాయిగా నృసింహుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీనృసింహస్వామి వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై తిరు, మాఢ వీధుల్లో ఊరేగారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, పారాయణికులు, వేద పండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పదో తరగతి' విద్యార్థిని ఘటనపై బీసీ కమిషన్ సీరియస్

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా కొత్తగడి సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉపాధ్యాయుల వేధింపులతో పాఠశాల భవనం నుంచి దూకి తబిత అనే పదో తరగతి విద్యార్థిని కాలు విరిగిన ఘటనను బీసీ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. దీనిపై వికారాబాద్ జిల్లా కలెక్టర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణికి.. బీసీ కమిషన్ లేఖ రాసింది. ఈ సంఘటనకు సంబంధించి సవివరంగా విచారణ జరిపి పది రోజుల్లోగా కమిషన్‌కు నివేదిక అందించాలని కోరింది. రాష్ట్రంలో తరచూ ఇలాంటి సంఘటనలు జరగడం, ఉపాధ్యాయులు వేధిస్తున్నారని విద్యార్థులు ఆత్మహత్యాయత్నం చేయడం ఆందోళనకరంగా ఉందని లేఖలో పేర్కొంది.

చిట్‌ఫండ్స్ మోసం కేసులో నలుగురి అరెస్టు

- సీఐడీ డీజీ శిఖాగోయల్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: చిట్‌ఫండ్స్ పేరిట 1,300 మంది బాధితుల నుంచి రూ.70 కోట్లు కొల్లగొట్టిన కేసులో నలుగురు నిందితులను తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. చవ్వ కుమార్, చవ్వ యాదగిరి, చవ్వ వెంకటేశ్, చవ్వ చిన్న ఇస్తారిలను అరెస్టు చేసినట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శంకర్‌పల్లి వీరభద్రీయ పరపతి సహకార సంఘంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి నిందితులు మోసానికి పాల్పడ్డారు.

సరదాగా ఉరి.. తాడు బిగుసుకుని మృతి



కాచిగూడ: ప్రేమించి పెళ్లి చేసుకోబోతున్న ఓ యువతిని సరదాగా భయపెట్టడానికి వేసుకున్న ఉరితాడు బిగిసిపోయి ఓ క్యాబ్ డ్రైవర్ మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... తిలక్‌నగర్‌లో నివాసముంటున్న యాకయ్య కుమారుడు ఆదర్శ్ (25) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ఐదేళ్లుగా నల్లకుంటలో నివాసం ఉంటున్న ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దానికి ఇరువురి తల్లిదండ్రులు కూడా అంగీకరించారు. వచ్చే ఏప్రిల్‌లో వీరి వివాహం కావాల్సి ఉంది. కాగా, సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఐరన్ బాక్స్ వైరుతో ఉరేసుకుంటున్నట్లు సరదాగా కాబోయే భార్యను భయపెట్టాలని అనుకున్నాడు. ఈ క్రమంలో ఫొటో తీసి ఆమెకు పంపాడు. అదే సమయంలో పొరపాటుగా వైరు ఆదర్శ్ మెడకు బిగుసుకుపోవడంతో మరణించాడు.

పాతబస్తీలో వెటర్నరీ డాక్టర్ దారుణ హత్య

- మూడో భార్య ఇంట్లో ఘటన




చాంద్రాయణగుట్ట: వెటర్నరీ డాక్టర్ దారుణహత్యకు గురైన సంఘటన పాతబస్తీ బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి వెలుగుచూసింది. బంజారాహిల్స్‌కు చెందిన మసియుద్దీన్ (57)కు ముగ్గురు భార్యలు. మూడో భార్య షబానా బండ్లగూడలోని క్రిస్టాల్ టౌన్‌షిప్‌లో మొదటి భర్తకు జన్మించిన కుమారుడు సమీర్‌తో కలిసి నివాసముంటోంది. అప్పుడప్పుడు మూడో భార్య ఇంటికి వచ్చే మసియుద్దీన్ తాగిన మైకంలో భార్యను కొట్టసాగాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన వచ్చి భార్యతో గొడవపడి వెళ్లిపోయాడు. తిరిగి మంగళవారం ఉదయం 11 గంటలకు మరోసారి ఆమె ఇంటికి వచ్చిన మసియుద్దీన్ గొడవకు దిగాడు. అప్పటికే ఇంట్లో ఉన్న సమీర్ తన స్నేహితుడితో కలిసి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మసియుద్దీన్‌ను పట్టుకొని చున్నీతో కాళ్లు, చేతులు, నోరు కట్టి పడేశారు. వెంటనే కత్తితో గొంతు, కడుపు భాగాల్లో పొడిచి హత్య చేసి పరారయ్యారు. సాయంత్రం సమాచారం అందడంతో చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్‌కుమార్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. వేధిస్తున్నందుకే హత్య చేశాడా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ

ఎస్‌ఎల్‌బీసీ సహాయక చర్యల్లో కీలక ముందడుగు

- శిథిలాల తొలగింపు వేగవంతం చేసిన సహాయక బృందాలు
- ఏఐ రోబోలను వినియోగించే అవకాశాల పరిశీలన
- ఏ క్షణంలోనైనా కార్మికుల ఆచూకీ దొరికే అవకాశం
- ప్రమాద కారణాలను అన్వేషిస్తున్న సీస్మాలజీ బృందం



కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలుతున్న మట్టి, శిథిలాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసేందుకు కొనసాగుతున్న సహాయక చర్యల్లో కీలక ముందడుగు పడింది. సొరంగం లోపల 13 కి.మీ. దూరంలో ఉన్న మట్టి, శిథిలాలను వేగంగా తొలగించేందుకు ఆధారమైన కన్వేయర్ బెల్టును మంగళవారం మధ్యాహ్నానికి సహాయక బృందాలు అందుబాటులోకి తెచ్చాయి. సింగరేణి సంస్థకు చెందిన నిపుణులు కన్వేయర్ బెల్టు జాయింట్ మెషీన్, డ్రమ్ పరికరాలను బిగించి పునరుద్ధరించారు. కన్వేయర్ బెల్టు ద్వారా గంటకు 800 టన్నుల మేర మట్టిని తరలించేందుకు వీలుంటుంది. అయితే ఇది టన్నెల్ బోర్ (టీబీ) మెషీన్‌లో అంతర్భాగంగా పనిచేస్తుంది. ఇప్పుడు టీబీఎం ముక్కలుగా మారటంతో సింగరేణి మైనింగ్ రెస్క్యూ బృందాలు, ఆర్మీకి చెందిన మినీ బాబ్‌క్యాట్ డోజర్ల సాయంతో గంటకు 20 టన్నుల వరకు మట్టిని బయటకు తరలించే వీలుందని చెబుతున్నారు. సొరంగంలోని ప్రమాద స్థలంలో సుమారు 8 నుంచి 10 వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టి పేరుకుపోయినట్టు అంచనా వేస్తుండగా, ఈ మొత్తం శిథిలాలను తొలగించేందుకు కనీసం రెండు రోజులైనా పడుతుందని చెబుతున్నారు. దీంతో ఏ క్షణమైనా కార్మికుల ఆనవాళ్లు లభించే అవకాశం ఉంది.

రంగంలోకి రోబోటిక్స్ నిపుణులు

సొరంగం కుప్పకూలిన చోట మట్టిని తొలగిస్తే రెస్క్యూ బృందాలకు సైతం ప్రమాదం జరిగే అవకాశం కనిపిస్తుండటంతో సహాయక చర్యల్లో రోబోలను వినియోగించాలని భావిస్తున్నారు. ఇందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎన్వీ రోబోటిక్స్‌కు చెందిన నిపుణులు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏఐ టెక్నాలజీతో కూడిన రోబోల ద్వారా సహాయక చర్యలు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నారు. సొరంగం లోపల ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న సహాయ సిబ్బందికి ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, ఆర్మీ మెడికల్ విభాగం సహకారం అందిస్తున్నాయి. అలాగే సొరంగం కుప్పకూలడంపై ప్రమాద స్థలానికి ఎగువ భాగంలో నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ నిపుణుల బృందం సర్వే చేపడుతోంది. ఎస్డీఆర్‌ఎఫ్ డీజీపీ నాగిరెడ్డి మంగళవారం సంఘటన స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

క్యాబిన్ ప్రదేశంలో చిక్కుకుని ఉంటారా?

ప్రమాద స్థలంలో జీపీఆర్ గుర్తించిన నాలుగు పాయింట్లలో తవ్వకాలు జరిపినా కార్మికుల జాడ కనిపించలేదు. రాడార్ సూచించిన సమీపంలోని ప్రాంతాలను సైతం జల్లెడ పడుతున్నారు. సింగరేణి మైనింగ్ రెస్క్యూ టీం, ర్యాట్ మైనర్స్ మాన్యువల్ డిగ్గింగ్ పద్ధతిలో సాధారణ గడ్డపార, సమ్మెట, తట్ట సామగ్రితోనే తవ్వకాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో టీబీఎం క్యాబిన్ ఉంటుందని భావిస్తున్న చోట తవ్వకాలు జరపగా, కార్మికుల ఆనవాళ్లు లభించినట్టుగా తెలిసింది. ఆ ప్రాంతంలోనే ప్రత్యేకంగా రెస్క్యూ బృందాలు తవ్వకాలు చేపట్టాయి. ఇప్పటికే ఉస్మానియా ఆసుపత్రితో పాటు వైద్య శాఖకు చెందిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం ఘటనా స్థలానికి చేరుకుంది.

సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

నేడు ఏన్కూరు లింక్ కెనాల్ వద్ద మంత్రి తుమ్మల పూజలు



కమలాపురం పంప్‌హౌస్ -3 డిశ్చార్జ్ పాయింట్ నుంచి కాల్వలోకి వెళుతున్న జలాలు

అశ్వాపురం/ములకలపల్లి/జూలూరుపాడు/సాక్షి, హైదరాబాద్: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు నాగార్జునసాగర్ ఆయకట్టుకు అందనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్-1 మోటార్లను సోమవారం నుంచి నడిపిస్తున్నారు. అక్కడి నుంచి ములకలపల్లి మండలం వీకే రామవరంలోని పంప్‌హౌస్-2కు గోదావరి జలాలు చేరాయి. మంగళవారం కమలాపురంలోని పంప్‌హౌస్-3కి చేరగా డిశ్చార్జి పాయింట్ వద్ద ఆ నీటిని ఎత్తిపోశాయి. బీజీకొత్తూరు, పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలు సీతారామ కాల్వ ద్వారా 100.22 కి.మీ. మేర ప్రవహించి ఏన్కూరు లింక్ కెనాల్‌కు చేరుతాయి. ఆపై 8.60 కిలోమీటర్లు ప్రవహించాక నాగార్జునసాగర్ కెనాల్‌కు తరలిస్తారు. ఇదంతా గ్రావిటీ ద్వారా జరగనుండగా. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి, కృష్ణా ఆయకట్టు అనుసంధానం అవుతుంది. బుధవారం ఏన్కూరులోని రాజీవ్ లింక్ కెనాల్‌లోకి నీరు చేరనుండగా.. అక్కడ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జలాలకు పూజలు చేస్తారు.

సీతమ్మసాగర్‌కు సత్వరంగా అనుమతులివ్వండి

కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. మరోవైపు గోదావరిపై రాష్ట్రం నిర్మిస్తున్న ప్రాజెక్టులకు అనుమతులివ్వడంలో తాత్సారం చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. సీతారామ ప్రాజెక్టుకి అనుమతుల జారీ విషయంలో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిధిలోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) కొర్రీలు పెట్టడాన్ని మంగళవారం ఓ ప్రకటనలో తీవ్రంగా తప్పుబట్టారు. ప్రాజెక్టుకి సత్వరంగా పర్యావరణ అనుమతులు సైతం జారీ చేయాలని కేంద్రాన్ని కోరారు. కాగా, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఎత్తిపోస్తున్న 1,500 క్యూసెక్కుల గోదావరి జలాలు బుధవారం ఉదయంకల్లా వైరా, లంకసాగర్ జలాశయాలకు చేరుకుంటాయని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఎన్ఎస్పీ కాల్వ కింద సాగుచేస్తున్న చివరి ఆయకట్టుకు ఆఖరి తడిగా సాగునీరు విడుదల చేయాల్సి ఉండగా, గోదావరి జలాల రాకతో ఆ అవసరాలు తీరుతాయని మంత్రి చెప్పారు.

సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్న డాక్టర్లు
- మొదటి భర్తతో కలిగిన కూతురితో విభేదాలు కారణమా!



అపస్మారక స్థితిలో ఉన్న కల్పనను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కేపీహెచ్‌బీకాలనీ: ప్రముఖ గాయని కల్పన నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట రోడ్డులోని వర్టెక్స్ ప్రివిలేజ్ విల్లాస్‌లో భర్త ప్రభాకర్‌తో కలిసి కల్పన నివాసముంటోంది. రెండురోజుల క్రితం ప్రభాకర్ చెన్నై వెళ్లాడు. మంగళవారం ఉదయం చెన్నై నుంచి ప్రభాకర్ కల్పనకు ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కంగారుపడిన ఆయన అసోసియేషన్ ప్రతినిధులకు విషయం చెప్పాడు. అసోసియేషన్ ప్రతినిధులు వచ్చి తలుపు తీసే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో వారు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పెట్రోలింగ్ మొబైల్-2 కానిస్టేబుళ్లు సమాచారం అందుకున్న వెంటనే కల్పన నివాసానికి వెళ్లి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా, అవి తెరుచుకోలేదు. దీంతో ఇంటి వెనుక వైపు ఉన్న కిచెన్ గది తలుపులను తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. మొదటి అంతస్తులో బెడ్‌పై అపస్మారక స్థితిలో పడుకొని ఉంది. ఎంత పిలిచినా పలకకపోవడంతో అంబులెన్స్‌ను పిలిపించి స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. పల్స్‌రేటు పడిపోవడంతోపాటు స్వయంగా శ్వాస పీల్చుకునే స్థితిలో లేకపోవడంతో కల్పనను వెంటిలేటర్‌పై ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. పోలీసుల సమాచారంతో ప్రభాకర్ హుటాహుటిన చెన్నై నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. కల్పన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు ఇటీవల భర్తతో కేరళకు వెళ్లి అక్కడ చికిత్స తీసుకున్నట్టు తెలిసింది.

కారణమేంటి?

కల్పన ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కేరళకు చెందిన మొదటి భర్తతో కలిగిన కూతురుతో కల్పనకు విభేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో మనస్తాపం చెందిన కల్పన నిద్రమాత్రలు మింగారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రెండో భర్త ప్రభాకర్‌ను కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఇంట్లో తనిఖీలు చేశారు. తాను రెండు రోజులుగా హైదరాబాద్‌లో లేనని, పని మీద బయటకు వెళ్లినట్టు ప్రభాకర్ పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

చితిలోనూ తోడుంటానంటూ..

- రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం
- ఘటనా స్థలంలో భర్త.. చికిత్స పొందుతూ మరుసటిరోజు భార్య మృతి
- ఇద్దరినీ ఒకే చితిలో ఉంచి దహన సంస్కారాలు



ఒకే చితిపై పక్కపక్కనే భార్యాభర్తల మృతదేహాలు.. (ఇన్‌సెట్‌లో) నర్సారెడ్డి, అనసూయ (ఫైల్)

కోరుట్ల రూరల్: కలకాలం కలిసి ఉంటామని అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకున్న ఆ దంపతులు రెండు రోజుల వ్యవధిలోనే మృతి చెందారు. దీంతో ఇద్దరి మృతదేహాలను ఒకే చితిపై ఉంచి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ పరిధి యెఖిన్‌పూర్‌లో విషాదం నింపింది. యెఖిన్‌పూర్‌కు చెందిన జవిడి నర్సారెడ్డి (66), జవిడి అనసూయ (62) దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు పావణి, రజిత, రోజా. అందరికీ వివాహాలు చేశారు. చిన్న కూతురు ఆస్ట్రేలియాలో ఉంటోంది. నర్సారెడ్డి దంపతులు ఆదివారం ఓ శుభకార్యానికి వెళ్తుండగా మెట్‌పల్లి వద్ద వీరి ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నర్సారెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన అనసూయను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. నర్సారెడ్డి చనిపోయిన విషయాన్ని చిన్నకూతురు రోజాకు తెలపడంతో ఆమె హుటాహుటిన యెఖిన్‌పూర్‌కు బయల్దేరారు. సోమవారం రాత్రి వరకు ఆమె యెఖిన్‌పూర్ చేరుకున్నారు. అంతలోనే చికిత్స పొందుతూ అనసూయ కూడా మృతిచెందింది. తల్లి మృతదేహాన్ని కూడా గ్రామానికి తీసుకొచ్చిన కూతుళ్లు తల్లిదండ్రుల మృతదేహాలపై పడి రోదించడం అక్కడున్నవారిని కలచివేసింది. మంగళవారం తల్లిదండ్రులకు కూతుళ్లు అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే చితిలో తల్లిదండ్రుల మృతదేహాలను ఉంచారు. చిన్నకూతురు రోజా దహన సంస్కారాలు నిర్వహించారు. దంపతుల దహన సంస్కారాలు ఒకే చితిలో నిర్వహించడం.. తల్లిదండ్రులను తలచుకుంటూ ముగ్గురు కూతుళ్లు రోదించిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ శోకసంద్రంలో ముంచింది.

కోళ్లు ఇంట్లోకి వస్తున్నాయని.. వృద్ధుడి కాళ్లు నరికారు..

మహబూబాబాద్ జిల్లాలో ఘటన

కురవి: నాటు కోళ్లు ఇంట్లోకి వస్తున్నా యని ఓ వృద్ధుడి కాళ్లు నరికారు. ఈ దారుణం మహబూ బాబాద్ జిల్లా కురవి మండలంసూదనపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. సూదనపల్లి గ్రామంలో మేకల లింగయ్య అనే వ్యక్తి ఇంట్లోకి పక్క ఇంటికి చెందిన కొండ సోమయ్య నాటు కోళ్లు వస్తున్నాయి. దీంతో సోమవారం రాత్రి లింగయ్య ఆగ్రహంతో సోమయ్య ఇంట్లోకి వెళ్లి దూషించాడు. ఆపై గొడ్డలితో రెండు కాళ్లపై నరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సోమయ్యను కుటుంబసభ్యులు మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అదే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఈ ఘటనపై బాధితుడు సోమయ్య భార్య వెంకటమ్మ సీరోలు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై నగేశ్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇక ట్రిపుల్ ఆర్ వరకు హైదరాబాద్ నగరమే!

▶ మొదటి పేజీ తరువాయి

మరో 4 జిల్లాల పరిధిలోని 32 మండలాలు కొత్తగా చేరుతాయి. దీంతో 11 జిల్లాలు, 106 మండలాలు, 1,400లకు పైగా గ్రామాలతో హెచ్‌ఎండీఏ పరిధి భారీగా పెరుగుతుంది. మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిన వెంటనే జీవో విడుదల అవుతుందని హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

అంచలంచెలుగా...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా)ని ఏర్పాటు చేశారు. 650 చదరపు కిలోమీటర్ల వరకు దీని పరిధి ఉండేది. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో 2008లో హుడా స్థానంలో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ)ని ఏర్పాటు చేశారు. దీంతో 7,257 చదరపు కిలోమీటర్ల వరకు హెచ్‌ఎండీఏ పరిధి పెరిగింది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఉండేవి. కొత్తగా జిల్లాల విభజన జరిగిన తర్వాత హెచ్‌ఎండీఏలోని జిల్లాల సంఖ్య 7 కు పెరిగింది. ప్రస్తుతం 11జిల్లాలకు దీని పరిధిని పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు నల్లగొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలు కొత్తగా చేరనున్నాయి. సుమారు 1,400 గ్రామాలు హెచ్‌ఎండీఏలో కలిసే అవకాశముంది. ట్రిపుల్ ఆర్ తర్వాత 5 కిలోమీటర్ల వరకు హెచ్‌ఎండీఏ పరిధి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్లు, ప్రజా రవాణా సదుపాయాలు, మౌలిక సదుపాయాల విస్తరణకు ఇప్పటికే లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యయనం కొనసాగుతోంది.

- ➤ రీజినల్ రింగ్‌రోడ్డును అనుసంధానం చేసే రేడియల్ రోడ్ల నిర్మాణానికి సైతం హెచ్‌ఎండీఏ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. ఔటర్‌రింగ్ రోడ్డు(రావిర్యాల) నుంచి రీజినల్ రింగ్ రోడ్డు (ఆమన్‌గల్లు) వరకు రేడియల్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది.
- ➤ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మెట్రో విస్తరణపైన కూడా దృష్టి సారించింది. లీ అసోసియేషన్ రూపొందించే కామన్ మొబిలిటీ ప్లాన్ సమగ్ర నివేదిక త్వరలో వెలువడనుంది.

వచ్చే నెలలో మాస్టర్‌ప్లాన్‌కు బిడ్డింగ్

మరోవైపు ట్రిపుల్ ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధి పెరగనున్న దృష్ట్యా భవిష్యత్ అవసరాల మేరకు 2051 వరకు హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రూపొందించాల్సిన సమగ్ర మాస్టర్ ప్లాన్ ఏర్పాటుకు ఆసక్తి గల అంతర్జాతీయ సంస్థల నుంచి వచ్చే నెలలో ఆన్‌లైన్ బిడ్డింగ్‌ను ఆహ్వానించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పుడు ఉన్న 5 మాస్టర్ ప్లాన్‌లను విలీనం చేసి ఒకే మాస్టర్‌ప్లాన్‌గా అభివృద్ధి చేస్తారు.

ఫోర్త్ సిటీకి స్పెషల్ అథారిటీ..

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫోర్త్‌సిటీ అభివృద్ధికి స్పెషల్ అథారిటీని ఏర్పాటు చేసేందుకు సైతం చర్యలు చేపట్టింది. ఈ మేరకు గత నెలలోనే జీవో వెలువడింది. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, శంషాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. కొత్తగా స్కిల్ యూనివర్సిటీతో పాటు విద్యాసంస్థలకు, పారిశ్రామికరంగానికి ఈ ప్రాంతం హబ్‌గా మారనుంది. ఈ క్రమంలో ఫోర్త్‌సిటీ పరిధిలోని వచ్చే 56 రెవెన్యూ గ్రామాను అభివృద్ధి చేస్తారు.



కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో దత్తాత్రేయ

కుటుంబ సమేతంగా దర్శించుకున్న హరియాణా గవర్నర్

కొమురవెల్లి (సిద్దిపేట)/జగదేవ్‌పూర్ (గజ్వేల్): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మంగళవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానించారు. ప్రత్యేక పూజల అనంతరం పెద్దపట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు ఎంపీ రఘునందన్‌రావు తదితరులున్నారు. అనంతరం ఆయన జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయాన్ని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. కొండపోచమ్మ ఆలయం వద్ద దత్తాత్రేయను బీజేపీ నేతలు జిలేబీతో తులాభారం వేశారు. జిలేబీ ఓ వైపు పెట్టి తూకం వేయగా దత్తాత్రేయ 65 కేజీల బరువు తూగారు. అలాగే గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజును గవర్నర్ శాలువా కప్పి సన్మానించారు.

బ్యాంకు రుణం తీర్చలేక రైతు ఆత్మహత్యాయత్నం

తన భూమిలో జెండాలు పాతడంతో మనస్తాపం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌని వెంకన్న

కనగల్: బ్యాంకు రుణం తీర్చలేక క్రిమిసంహారక మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.యడవల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జి.యడవల్లి గ్రామానికి చెందిన గౌని భిక్షం 1998–99 సంవత్సరంలో పంట పెట్టుబడి కోసం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జి.యడవల్లి బ్రాంచిలో నాలుగు లోన్లు తీసుకున్నాడు. అయితే, 2005లో మూడు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. పైపులైన్ల కోసం తీసుకున్న రూ.36,000 రుణం మాత్రం పెండింగ్ పడింది. నాటి నుంచి నేటి వరకు వడ్డీతో సహా రూ.1,60,000 అయింది. ఈ మొత్తం కట్టాలని బ్యాంకు అధికారులు పలుమార్లు భిక్షంకు నోటీసులు పంపారు. అయితే, భిక్షం వృద్ధుడు కావడంతో ఆ రుణాన్ని తాము కడతామని భిక్షం కుమారుడు గౌని వెంకన్న, మనవడు గౌని భానుప్రసాద్ బ్యాంకు అధికారులతో మాట్లాడుకుని ఒప్పందం చేసుకున్నారు. కానీ, కొన్ని రోజుల తర్వాత వెంకన్న అంతడబ్బు తాను కట్టలేనని, అన్ని లోన్లు గతంలోనే మాఫీ అయ్యాయని, కావాలనే బ్యాంకు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయాడు. బ్యాంకు రుణం చెల్లించకపోవడంతో 15 రోజుల క్రితం వెంకన్నకు చెందిన భూమిలో బ్యాంకు సిబ్బంది జెండాలు పాతారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్న సోమవారం సాయంత్రం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకన్న ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. కాగా, బ్యాంకులో తీసుకున్న రుణం తిరిగి చెల్లించాలని అందరి రైతులకు పంపించిన మాదిరిగానే భిక్షంకు కూడా నోటీసులు పంపామని సహకార బ్యాంకు అధికారులు చెప్పారు. ఆ రుణం చెల్లించాల్సిందేనని పేర్కొన్నారు.



చంద్ర సూర్యోదయం

భారతదేశ దక్షిణ కొన అయిన తమిళనాడులోని కన్యాకుమారి చివరకు వెళ్లి ఉదయాన్నే సూర్యోదయాన్ని చూసిన వాళ్లు చాలా మందే ఉన్నారు. అయితే ఇక్కడ ఫొటోలో ఉన్న సూర్యోదయాన్ని చూడాలంటే చంద్రమండలానికి వెళ్లాల్సిందే. ఎందుకంటే ఇది చందమామపై కనువిందు చేసిన సూర్యోదయం. మార్చి రెండో తేదీన ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ సంస్థకు చెందిన బ్లూ ఘోస్ట్ అనే ప్రైవేట్ ల్యాండర్ చందమామపై విజయవంతంగా దిగి చరిత్ర సృష్టించిన విషయం తెల్సిందే. ఆ ల్యాండర్ తీసిన అద్భుతమైన చిత్రమిది. ''అద్భుత కాంతుల సూర్యోదయం. చంద్రునిపై దిగాక తొలి సూర్యోదయాన్ని కెమెరాలో బంధించాం. కొత్త ఇంటిపై ఉపరితల పనులు మొదలెట్టాం. నాసా అప్పగించిన 10 రకాల పనులను ఆరంభించాం. వచ్చే రెండు వారాలు, ఆ తర్వాత చంద్రరాత్రిలో పనిచేస్తాం''అని ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేసింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ఎట్టకేలకు ఆగిన అతిపెద్ద మంచుఫలకం

దాదాపు 40 ఏళ్లుగా సముద్రజలాలపై తేలియాడిన ప్రపంచంలోనే అతిపెద్ద మంచుఫలకం ఏ23ఏ ఎట్టకేలకు కదలకుండా ఒకచోట స్థిరంగా ఉండిపోయింది. ప్రస్తుతం అది అంటార్కిటికా ఖండంలోని బ్రిటన్ అధీనంలోని సౌత్ జార్జియా మారుమూల ద్వీప జలాల వద్ద ఆగింది. ఇక్కడ సముద్రం లోతు తక్కువగా ఉండటంతో ఈ భారీ మంచుఫలకం అడుగు కింద నేలను తాకి నిలిచిపోయింది. అయితే అది ఇక్కడే వేగంగా ముక్కలైపోతే పెద్దసంఖ్యలో చిన్న మంచు ముక్కలు చెల్లాచెదురుగా విస్తరించి ఆ ప్రాంతంలో నౌకల రాకపోకలకు, లక్షలాది పెంగ్విన్లు, సీల్స్‌కు ఇబ్బందులు తప్పవు. చేపలు వేట కష్టంగా ఉంటుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 1986లో అంటార్కిటిక్ తీరరేఖ వెంట ఫిల్చ్‌నర్ ఐస్‌షెల్ఫ్ నుంచి భారీస్థాయిలో మంచు విడిపోయి ఏ23ఏ ఐస్‌బర్గ్‌గా ఏర్పడింది. దీని విస్తీర్ణం ఏకంగా 4,000 చదరపు కిలోమీటర్లు. అంటే గ్రేటర్ లండన్ సిటీ కంటే పెద్దది. తొలిసారి విడిపోయాక వెడ్డెల్ సముద్రంలో అడుగు భాగాన్ని తాకి అక్కడే చాన్నాళ్లు నిలిచిపోయింది. తర్వాత మూడేళ్ల క్రితం నుంచి నెమ్మదిగా ముందుకు కదులుతూ తాజాగా సౌత్‌జార్జియా ద్వీపాల చెంతకొచ్చింది. ఇక్కడి నుంచి ఎటుపోతుందో ఎవరికీ తెలీదు. ఇప్పటిదాకా ఇది దాదాపు 2,000 మైళ్లదూరం ప్రయాణించింది.

అమెరికాపై టారిఫ్ యుద్ధం!

డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంపై చైనా, కెనడా, మెక్సికో ఆగ్రహం

- ప్రతీకార సుంకాలు విధించక తప్పదని స్పష్టీకరణ
- అమెరికా ఉత్పత్తులపై సుంకాలు ప్రకటించిన కెనడా
- చర్యలకు కచ్చితంగా ప్రతిచర్య ఉంటుందన్న మెక్సికో
- అమెరికా ఎగుమతులపై అదనంగా 15 శాతం టారిఫ్ విధించిన చైనా



ట్రంప్ ట్రూడో జిన్‌పింగ్ క్లాడియా

వాషింగ్టన్/బీజింగ్/మెక్సికో సిటీ/టొరంటో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన టారిఫ్‌ల యుద్ధం మరింత విస్తరిస్తోంది. ట్రంప్ సోమవారం వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. కెనడా, మెక్సికో ఉత్పత్తులపై 25 శాతం చొప్పున, చైనా ఉత్పత్తులపై అదనంగా 10 శాతం సుంకాలు విధించబోతున్నామని, మంగళవారం నుంచే ఇది అమల్లోకి వస్తుందని ప్రకటించారు. అమెరికాకు వస్తువులను ఎగుమతి చేసే దేశాలు సుంకాలు చెల్లించాల్సిందేనని తెలిపారు. ఫెంటానిల్ వంటి సింథటిక్ డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయడానికి, అక్రమ వలసలను నియంత్రించడానికి ఇలాంటి చర్యలు తప్పనిసరిగా అవసరమని సమర్థించుకున్నారు. చైనా ఉత్పత్తులపై ట్రంప్ ఇప్పటికే 10 శాతం సుంకాలు విధించారు. మరోవైపు చైనా, కెనడా, మెక్సికో సైతం ధీటుగా బదులిస్తున్నాయి. ప్రతీకార సుంకాలపై సై అంటున్నాయి. అమెరికాపై టారిఫ్‌ల యుద్ధం మొదలుపెట్టాయి. ఫలితంగా వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తలెత్తడంతోపాటు ఆయా దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారిపోయి అంతిమంగా ప్రజలు కష్టాలపాలయ్యే ప్రమాదం కనిపిస్తోందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ట్రంప్ నిర్ణయంలో న్యాయం లేదు: కెనడా ప్రధాని

ట్రంప్ ప్రారంభించిన సుంకాలయుద్ధంలో ఎంతమాత్రం న్యాయం లేదని కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో అన్నారు. ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. తమ ఉత్పత్తులపై అన్యాయంగా సుంకాల విధిస్తే, అమెరికాకు తగిన సమాధానం చెప్పక తప్పదని స్పష్టంచేశారు. కౌంటర్-టారిఫ్ చర్యలను ప్రకటించారు. మొదటి దశలో అమెరికా ఉత్పత్తులపై 25 శాతం సుంకాల విధిస్తామని పేర్కొన్నారు. అమెరికా ఎగుమతిదారులు 20.6 బిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ట్రంప్ ప్రభుత్వం గనుక వెనక్కి తగ్గకపోతే తాము విధించే సుంకాలు స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం నుంచే అమల్లోకి వస్తాయని తేల్చిచెప్పారు. ఇక రెండో దశలో భాగంగా మరో 25 శాతం టారిఫ్‌లు విధిస్తామన్నారు. మూడు వారాల్లో 125 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు వసూలు చేస్తామని జస్టిన్ ట్రూడో వెల్లడించారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్, స్టీల్, అల్యూమినియంపై ముందు మరిన్ని సుంకాలు విధిస్తామని తెలియజేశారు. అమెరికా తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనే దాకా టారిఫ్‌ల విషయంలో తమ నిర్ణయంలో మార్పు ఉండదని సంకేతాలిచ్చారు. అమెరికా మనసు మార్చుకొంటే తాము కూడా అదేబాటలో నడుస్తామని పరోక్షంగా సూచించారు. అనవసరమైన వాణిజ్య యుద్ధం ప్రజలకు మేలు చేయదని అభిప్రాయపడ్డారు.

ప్లాన్ బి, సి, డి ఉన్నాయి: మెక్సికో ప్రెసిడెంట్

అమెరికా చర్యలకు ప్రతిచర్య కచ్చితంగా ఉంటుందని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ పేర్కొన్నారు. తమ వద్ద ప్లాన్ బి, సి, డి ఉన్నాయని ప్రకటించారు. తమ దేశ ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం గనుక టారిఫ్‌లు పెంచితే ఏం చేయాలన్నదానిపై స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. అమెరికా, మెక్సికో మధ్య సహకారం ఇప్పటివరకైతే అద్భుతంగా ఉందని చెప్పారు. వాణిజ్యం, భద్రతాపరమైన అంశాలపై ఇటీవల ఇరుదేశాల అధికారుల మధ్య చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయని అన్నారు. తమ ఉత్పత్తులపై అమెరికాలో సుంకాలు విధించే పరిస్థితి ఉండదని అంచనా వేస్తున్నామని, ఒకవేళ అదే జరిగితే తాము కూడా తగిన రీతిలో ప్రతిస్పందిస్తామని స్పష్టంచేశారు.

చైనా అదనపు సుంకాలు

ట్రంప్ ప్రకటనపై చైనా ఘాటుగా స్పందించింది. తమ దేశంలోకి దిగుమతి అయ్యే అమెరికా వస్తువులపై అదనంగా 15 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. చికెన్, గోధుమలు, మొక్కజొన్న, పత్తి తదితర దిగుమతులపై ఈ టారిఫ్ వసూలు చేస్తామని, అలాగే జొన్న, సోయాబీన్, పోర్క్, బీఫ్, సముద్ర ఉత్పత్తులు, పండ్లు, కూరగాయాలు, పాడి ఉత్పత్తులపై అదనంగా 10 శాతం సుంకాలు విధించనున్నట్లు వెల్లడించింది. అదనపు సుంకాలు ఇది ఈ నెల 10వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ మంగళవారం పేర్కొంది. తమ ఉత్పత్తులపై విచ్చలవిడిగా టారిఫ్‌ల మోత మోగిస్తున్న అమెరికాపై ప్రపంచ వాణిజ్య సంస్థకు(డబ్ల్యూటీఓ)కు ఫిర్యాదు చేస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. మరోవైపు సుంకాల విషయంలో అమెరికాతో చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని తెలియజేసింది. ఇదిలా ఉండగా, 10 అమెరికా సంస్థలను విశ్వసనీయం కాని సంస్థల జాబితాలో చేర్చాలని చైనా నిర్ణయించింది. ఇందులో రక్షణ, ఏఐ, విమానయానం, ఐటీ రంగాలకు సంబంధించిన సంస్థలు ఉన్నాయి. చైనా ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం రెండో దశలో భాగంగా అదనంగా 10 శాతం సుంకం విధించింది. ఇది మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. చైనా ఎగుమతి చేసే మొత్తం ఉత్పత్తుల్లో 15 శాతం అమెరికాకే వెళ్తుంటాయి. 2023లో ఇరుదేశాల మధ్య 575 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఇందులో చైనా నుంచి అమెరికాకు 427.2 బిలియన్ డాలర్ల ఎగుమతులు, అమెరికా నుంచి చైనాకు 147.8 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తొలి నాళ్లలోనే చైనా ఉత్పత్తులపై 10 శాతం సుంకాలు విధించారు. తాజాగా మరో 10 శాతం వడ్డించారు. దీంతో ఇప్పటిదాకా సుంకాలు 20 శాతానికి చేరాయి. దీనిపై చైనా ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. చైనా ఉత్పత్తులపై 60 శాతం సుంకాలు విధిస్తానని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పదేపదే ప్రకటించిన సంగతి తెలిసిందే.

మా జోలికొస్తే తీవ్ర పరిణామాలు!

అమెరికాకు కిమ్ సోదరి హెచ్చరిక

సియోల్: అమెరికా, ఆ దేశం తొత్తులు తమతో కయ్యానికి కాలుదువ్వుతున్నాయని, తీవ్ర పరిణామాలు తప్పవని ఉత్తరకొరియా పాలకుడు కిమ్ జొంగ్ ఉన్ సోదరి కిమ్ యో జొంగ్ మంగళవారం హెచ్చరించారు. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ కార్ల్ విన్సన్‌తోపాటు ఆ గ్రూపులోని నౌకలు ఆదివారం దక్షిణ కొరియాకు చేరుకున్నాయి. ఉత్తరకొరియా నుంచి ఎదురవుతున్న బెదిరింపుల నేపథ్యంలో అమెరికా చేపట్టిన ఈ చర్యపై ఈ మేరకు కిమ్ యో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరియా ద్వీప కల్పంలో అమెరికా సైనిక సంపత్తి పెంపు ఒక దుర్మార్గమైన అలవాటని పేర్కొన్నారు. ఇందుకు తగు రీతిలో స్పందిస్తామన్నారు. ఈ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలను చేరుకోగలిగే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాలను ఉత్తరకొరియా చేపట్టే అవకాశాలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు.

పుతిన్‌ను నిలువరించేది ఖనిజాల ఒప్పందం మాత్రమే: వాన్స్

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు పుతిన్ దురాక్రమణ ప్రయత్నాలను నిలువరించగలిగేది యూఎస్- ఉక్రెయిన్ మధ్య కీలక ఖనిజాల ఒప్పందం మాత్రమేనని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. ఇది మాత్రమే ఆచరణ సాధ్యమైన పరిష్కారమన్నారు. యుద్ధం ముగిశాక బ్రిటన్, ఫ్రాన్స్‌ల సారథ్యంలో ఏర్పాటయ్యే అంతర్జాతీయ బలగాలతో ఉక్రెయిన్‌కు ఎటువంటి భద్రతా ఉండదని వ్యాఖ్యానించారు. ఫాక్స్ న్యూస్ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్.. గత 30, 40 ఏళ్లుగా ఎలాంటి యుద్ధాలు చేయని ఏవో కొన్ని దేశాలకు చెందిన 20 వేల బలగాల కంటే అమెరికాతో కీలక ఖనిజాల ఒప్పందం కుదుర్చుకుంటే ఉక్రెయిన్‌కు మెరుగైన భద్రత లభిస్తుందని చెప్పారు. భద్రతకు గ్యారెంటీ కావాలన్నా, రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోసారి ఆక్రమించుకోరాదనుకున్నా ఉక్రెయిన్‌కు అమెరికా మాత్రమే ఆ గ్యారంటీ ఇస్తుందని తెలిపారు.

జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం ప్రారంభం

జంతువులకు స్వయంగా ఆహారం తినిపించిన ప్రధానమంత్రి

'వంతారా'లో మోదీ జీవకారుణ్యం

న్యూఢిల్లీ: గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్ జిల్లాలోని రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో వంతారా జంతు సంరక్షణ, పునరావాస కేంద్రాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. అంతకుముందు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అనంత్ అంబానీ దంపతులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వారంతా స్థానికఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత వంతారా ప్రాంగణమంతా అనంత్ అంబానీతో కలిసి మోదీ కలియతిరిగారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న సింహం, పులి, జిరాఫీ వంటి జంతువుల పిల్లలకు స్వయంగా ఆహారం తినిపించారు. ఒరంగుటాన్లు, ఆసియాటిక్ సింహం పిల్లలు, తెల్ల సింహం పిల్లలు, చిరుతపులి పిల్లలతో కాసేపు ఆడుకున్నారు. వంతారాలో జంతువుల చికిత్స, సంరక్షణ, పునరావాసం కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. వైల్డ్ లైఫ్ హాస్పిటల్‌ను సందర్శించారు. **ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఐసీయూ వంటి వసతులను తిలకించారు. వైల్డ్ లైఫ్ అనస్థీసియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ వంటి** విభాగాలు ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. ఎంఆర్ఐ గదిలో ఆసియాటిక్ సింహానికి ఎంఆర్ఐ చికిత్స, ఆపరేషన్ థియేటర్‌లో చిరుతపులికి జరుగుతున్న శస్త్రచికిత్సను పరిశీలించారు. చింపాంజీలు, నీటి గుర్రాలు, మొసళ్లు, జీబ్రాలు, ఖడ్గమృగం పిల్లను దగ్గరగా గమనించారు. ఒరంగుటాన్‌ను ఆత్మీయంగా హత్తుకున్నారు. దాంతో కాసేపు సరదాగా ఆడుకున్నారు. భారీ కొండచిలువ, రెండు తలల పాము, రెండు తలల తాబేలు, చిరుతపులి పిల్లలు, కొమ్ముల జింక, సీల్ వంటి జంతువులను సైతం మోదీ దగ్గరగా పరిశీలించారు. గాయపడిన ఏనుగులకు చికిత్స అందించే ప్రత్యేక ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి పనితీరు గురించి సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఏనుగుల ఆసుపత్రి కావడం గమనార్హం. రిలయన్స్ సంస్థ అధినేత ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ అత్యాధునిక వసతులతో వంతారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. 3 వేలకుపైగా ఎకరాల్లో ఏర్పాటైన ఈ కేంద్రంలో 2 వేల రకాల జీవులు ఆశ్రయం పొందుతున్నాయి. ప్రమాదాల్లో గాయపడిన, వేటగాళ్ల బారినపడిన జంతువులను, అంతరించిపోయే జంతువుల జాబితాలో ఉన్న వాటిని రక్షించి, ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నారు. ప్రస్తుతం లక్షలన్న రకుపైగా వన్యప్రాణులు వంతారాలో ఉన్నాయి.



పులిపిల్లకు పాలు తాగిస్తున్న ప్రధాని మోదీ



వంతారా ప్రారంభం సందర్భంగా గాజు తెర సమీపానికి వచ్చిన పులితో ప్రధాని మోదీ

జంతువుల పట్ల దయ చూపండి

అరుదైన వన్యప్రాణుల సంరక్షణ, పునరావాసం కోసం వంతారా కేంద్రం నిర్వాహకులు చేపడుతున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. జంతువుల పట్ల అందరూ కారుణ్యం ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మోదీ మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. వంతారాను సందర్శించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. వంతారాలో జంతువుల కోసం అద్భుతమై వసతులు ఉన్నాయని, కొన్ని రకాల జీవులతో తాను స్వయంగా సంభాషించానని ఉద్ఘాటించారు. ఇక్కడ జంతువులకు చక్కటి సంరక్షణ అందిస్తున్నారని తెలిపారు. జంతుజాలం సంక్షేమానికి, పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. వన్యప్రాణుల పట్ల అనంత్ అంబానీ, ఆయన బృందం చూపుతున్న శ్రద్ధను ప్రశంసించకుండా ఉండలేకపోతున్నానని వెల్లడించారు. ఈ భూగోళాన్ని మనతోపాటు పంచుకుంటున్న అటవీ జంతువులను పరిరక్షించుకోవడం శతాబ్దాలుగా మన సంస్కృతిగా కొనసాగుతోందని, అందుకు వంతారా ఒక చక్కటి ఉదాహరణ అని పేర్కొన్నారు. యాసిడ్ దాడికి గురై గాయాలపాలైన గజరాజుకు వంతారాలో చికిత్స అందిస్తున్నారని, కంటికి రెప్పలా కాపాడుతున్నారని ప్రస్తావించారు. కంటిచూపు లేని ఏనుగులు, వేగంగా దూసుకొచ్చిన వాహనాలు ఢీకొట్టడంతో గాయపడిన ఏనుగులు సైతం అక్కడున్నాయని చెప్పారు. మనుషుల నిర్లక్ష్యం వల్ల జంతువులు గాయపడడం బాధాకరమని పేర్కొన్నారు. జనం అంత నిర్లక్ష్యంగా, క్రూరంగా ఎలా ఉంటారని ప్రధానమంత్రి ప్రశ్నించారు. బాధ్యతారాహిత్యానికి ఇకనైనా ముగింపు పలకాలని, జంతువుల పట్ల దయతో మెలగాలని ఉద్బోధించారు.

ఉక్రెయిన్‌కు సాయం బంద్

ట్రంప్ మరో షాకింగ్ నిర్ణయం

- ఆందోళనకరమన్న ఉక్రెయిన్
- కలిసి పనిచేయాలని కోరుతున్నాం
- ఉక్రెయిన్ భద్రతకు హామీ ఇవ్వాలి
- ప్రధాని డెనిస్ డిమాండ్

వాషింగ్టన్/కీవ్: ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటించారు. రష్యాతో శాంతి చర్చల విషయంలో ఉక్రెయిన్ చిత్తశుద్ధి కనబరిచేదాకా అమల్లో ఉంటుందని కుండబద్దలు కొట్టారు. దీన్ని ఉక్రెయిన్, దాని మిత్ర దేశాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ట్రంప్ చర్యలు రష్యాకు లబ్ధి కూర్చేలా ఉంటున్నాయని విమర్శించాయి. ఇది తాము ఊహించని చర్య అంటూ ఉక్రెయిన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికాతో కలిసి పని చేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొంది. ఏ శాంతి ఒప్పందమైనా ఉక్రెయిన్ భద్రతకు హామీ ఇవ్వాలని, దాన్ని ఒప్పందంలో అంతర్భాగంగా చేర్చాలని ఉక్రెయిన్ ప్రధాని డెనిస్ డిమాండ్ చేశారు. రష్యా ఆక్రమించిన తమ భూభాగాన్ని రష్యాలో భాగంగా గుర్తించడానికి వీల్లేదని తేల్చిచెప్పారు.

చర్చలకు ముందుకొస్తేనే...!

రష్యా, ఉక్రెయిన్ మధ్య సాధ్యమైనంత త్వరగా శాంతి చర్చలు ప్రారంభం కావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. కొన్ని రోజుల క్రితం ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో జరిగిన చర్చల్లో ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. అందుకు ముందుకొచ్చేదాకా ఉక్రెయిన్‌కు సైనిక సాయం పునరుద్ధరించే అవకాశం లేదని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టంచేశారు.

అమెరికా ఇచ్చిందెంత?

2022 జనవరి నుంచి 2024 డిసెంబర్ ఉక్రెయిన్‌కు 300 బిలియన్ డాలర్లకుపైగా సాయం అందించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. యూరప్ దేశాలు మాత్రం 100 బిలియన్ డాలర్లే ఇచ్చాయని అన్నారు. కానీ, అమెరికా ఇచ్చింది 182.8 బిలియన్ డాలర్లేనని సాక్షాత్తూ ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అయితే, అందులో నిజం లేదని, అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు అందిన సాయం 119.7 బిలియన్ డాలర్లు మాత్రమేనని జర్మనీకి చెందిన కీల్ ఇన్‌స్టిట్యూట్ స్పష్టంచేసింది.

ట్రంప్‌తో సంవాదం విచారకరం: జెలెన్‌స్కీ

వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సంవాదం జరగడం నిజంగా విచారకరమని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చెప్పారు. విభేదాలు సరి చేసుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన తాజాగా 'ఎక్స్'లో పోస్టుచేశారు. ట్రంప్‌తో చర్చలు జరగాల్సిన విధంగా జరగలేదని అంగీకరించారు. ఉక్రెయిన్-అమెరికా మధ్య భవిష్యత్తులో పరస్పర సహకారం, కమ్యూనికేషన్ నిర్మాణాత్మకంగా ఉండేలా జాగ్రత్తపడతామని వెల్లడించారు. అమెరికా కోరుతున్న అరుదైన ఖనిజాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. దీనిపై ఒప్పందం కుదుర్చుకోవడానికి తమకు అభ్యంతరం లేదన్నారు.

శ్వాసలో సమస్యను పోప్ అధిగమించారు

వాటికన్ వర్గాల వెల్లడి

రోమ్: ముక్కు, నోటి ద్వారా ఆక్సిజన్‌ను ఊపిరితిత్తుల్లోకి పంప్ చేసే వెంటిలేటర్‌తో పోప్ ఫ్రాన్సిస్(88)కు ఇక అవసరం లేదని వాటికన్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ముక్కులో అమర్చిన ట్యూబ్ ద్వారా అధిక ఒత్తిడితో కూడిన ఆక్సిజన్‌తో ఆయన శ్వాస తీసుకుంటున్నారని మంగళవారం వెల్లడించాయి. సోమవారం రాత్రంతా ఆయన నిద్రపోయారని, ఉదయం నుంచి ఆక్సిజన్ ట్యూబ్ సాయంతో ఆయన శ్వాస తీసుకుంటున్నారని పేర్కొన్నాయి. శ్వాసతీసుకోవడంలో రెండు పర్యాయాలు తీవ్ర ఇబ్బందులకు గురవడంతో పోప్‌కు వైద్యులు వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస కల్పించారు. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫాన్ని వైద్యులు తొలగించడంతో శ్వాసలో ఇబ్బందులు తొలగిపోయాయని వాటికన్ వర్గాలు వివరించాయి.

బెంగళూరు విమానాశ్రయంలో 14 కిలోల బంగారంతో కన్నడ నటి అరెస్ట్



రన్యా రావు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో కన్నడ నటి రన్యా రావు 14.8 కిలోల బంగారంతో పట్టుబడింది. దుబాయ్ నుంచి ఎమిరేట్స్ విమానంలో సోమవారం రాత్రి ఇక్కడికి వచ్చిన రన్యాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు అనుమానం వచ్చి సోదాలు చేపట్టారు. ఆమె వద్ద ధరించిన నగలతోపాటు దుస్తుల్లో కడ్డీల రూపంలో దాచిన మొత్తం 14.8 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు అనుమతించిందని అధికారులు తెలిపారు. రన్యా రావు 15 రోజుల వ్యవధిలోనే నాలుగు పర్యాయాలు దుబాయ్‌కి వెళ్లి రావడంతో తమకు అనుమానం వచ్చిందన్నారు. ఈమె ఒంటరిగానే ఇలా బంగారం స్మగ్లింగ్ చేస్తున్నారా లేదా మరేదైనా ముఠాతో ప్రమేయం ఉందా, డీజీపీ స్థాయి అధికారి కూతురు కావడంతో ఇతర అధికారులకు ఈ వ్యవహారం తెలిసే జరుగుతోందా అనే కోణాల్లోనూ విచారణ చేపట్టారు. తనకున్న పరిచయాలతో కస్టమ్స్ చెకింగ్‌లను తేలిగ్గా దాటుకుని వచ్చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. విమానం దిగిన ఆమె స్థానిక పోలీసుల ఎస్కార్టుతో ఇంటికి వెళ్తుండగా అధికారులు అడ్డగించారు. ఆమెను బెంగళూరులోని హెచ్‌బీఆర్ లేఔట్‌లోని ఉన్న డీఆర్ఐ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ సుదీప్ సరసన మాణిక్య(2014) అనే సినిమాతోపాటు పలు దక్షిణాది చిత్రాల్లో రన్యా రావు నటించింది.

పోక్సో కేసుల విచారణకు జడ్జీల కొరత: సుప్రీం



న్యూఢిల్లీ: చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన పోక్సో కేసుల విచారణకు దిగువ కోర్టుల్లో చాలినంత మంది జడ్జీలు లేరని సుప్రీంకోర్టు పేర్కొంది. దీనివల్లే జిల్లాకో ప్రత్యేక పోక్సో కోర్టును ఏర్పాటు చేయడం వంటి తమ నిర్దేశాలు అమలుకు నోచుకోవడం లేదని తెలిపింది. చిన్నారులపై అత్యాచార ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయంటూ 2019లో వెలువడిన నివేదికపై జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ప్రసన్న బి వరాలేల ధర్మాసనం మంగళవారం సుమోటోగా విచారణ చేపట్టింది. జిల్లా కోర్టుల్లో ఎక్కువ సంఖ్యలో పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగానే ఉంటున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్న ధర్మాసనం గుజరాత్‌లో పరిస్థితిని ఉదహరించింది. చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణ, సంబంధిత నేరాల విచారణపై అవగాహన కల్పించేందుకుగాను సినిమా థియేటర్లు, టీవీ చానెళ్లలో ప్రసారం చేయాలని కూడా 2019లో సుప్రీంకోర్టు సూచించింది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ప్రత్యేక పోక్సో కోర్టులను, అందులో ప్రత్యేక ఏర్పాటు చేపట్టాలని కూడా తెలిపింది. అయితే, ప్రధానంగా ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు సకాలంలో అందుకపోవడమే పోక్సో కేసుల విచారణలో జాప్యానికి కారణమని అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది వి.గిరి చెప్పారు. అయితే, చిన్నారులపై నేరాలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో సమష్టి, స్పష్టమైన ప్రతిస్పందనను కూడగట్టే అంశాలపై ధర్మాసనం విచారణ జరిపింది. ఈ నెల 25వ తేదీన ఈ సుమోటో కేసుకు ముగింపు పలుకుతామని తెలిపింది.

రాష్ట్రాలు విఫలమయ్యాయి

- ప్రైవేట్ ఆస్పత్రుల ఫార్మసీల్లో అత్యధిక ధరల్లో ఔషధాలు, వైద్య ఉపకరణాలు
- అసహనం వ్యక్తంచేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అన్ని రాష్ట్రాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ఫార్మసీల్లో ఔషధాలను అత్యధిక రేట్లకు విక్రయించడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. రోగులు, వారి సహాయకుల ప్రయోజనాలను పరిరక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. వైద్యం చేయించుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ఫార్మసీల్లోనే ఔషధాలు, చికిత్స పరికరాలు, ఉపకరణాలను అత్యధిక ధరలకు కొనేలా ఆస్పత్రి యాజమాన్యాలు ఒత్తిడిచేస్తున్న ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. మందులు, ఇంప్లాంట్స్, మెడికల్ పరికరాలను ఆస్పత్రిలోని ఫార్మసీలో లేదంటే తాము సూచించిన వారి వద్దే కొనాలని ప్రైవేట్ ఆస్పత్రి వర్గాలు ఒత్తిడిచేస్తున్నాయని న్యాయ విద్యార్థి సిద్ధార్థ్ దాల్మియా, అతని తండ్రి, న్యాయవాది విజయ్‌పాల్ దాల్మియా దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 5 । మార్చి । 2025




'మల్టీలెవెల్ పార్కింగ్' పనులు చకచకా
బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు సమీపంలో పార్కింగ్ సమస్యను నివారించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.
-8లో



జిమ్.. జర భద్రమ్..
జిమ్‌కి వెళ్లడం ఆరోగ్యానికి మేలే.. కానీ జిమ్‌కి వెళ్లే ముందు మానసికంగా, ఆరోగ్యంగా సంసిద్ధంగా ఉన్నామా? లేదా! అనేది చాలా ముఖ్యమైన అంశం.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
36.0/21.0

వాతావరణం
నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.



పోర్టికో కూలిన ఘటనపై విచారణకు ఆదేశం

8 మందితో కూడిన కమిటీ నియామకం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని నూతన పరిపాలన భవనం పోర్టికో కుప్పకూలిన ఘటనపై విచారణకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఒక నోటిఫికేషన్‌ను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ విడుదల చేశారు. 8 మందితో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో చైర్మన్‌గా స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ వై. సురేష్, సభ్యులుగా ప్రొఫెసర్ మల్లయ్య, ఎస్.సూర్యప్రకాశ్, బాషా, శివాజీ, రామ్‌శేషు, పి.శ్రీనివాసరావు, జీవీ రెడ్డి నియమితులయ్యారు. పోర్టికో కూలిన అంశంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి సమగ్ర నివేదికను నెల రోజుల్లోగా అందించాలని వైస్ చాన్స్‌లర్ ఆదేశించారు. గత నెల 27న పోర్టికో కుప్పకూలిన ప్రమాదంలో 11 మంది కార్మికులకు గాయాలైన విషయం విదితమే.

ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన కారు

- భర్త మృతి.. భార్య, కుమారుడికి తీవ్ర గాయాలు



దుండిగల్: ఔటర్ రింగ్ రోడ్డుపై డీసీఎం వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సతీష్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన కార్తీక్ (38) నగరంలోని నిజాంపేటలో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య సింధు, కుమారుడు కివి (3) ఉన్నారు. స్వగ్రామం వెళ్లిన కార్తీక్ భార్య, కుమారుడితో కలిసి తన కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 5 వద్ద మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని అతివేగంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో అందులో ఇరుక్కున్న కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సింధు, కుమారుడు కివిలకు తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దుండిగల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. మల్లంపేట ఎగ్జిట్ వద్ద దిగి కొన్ని నిమిషాల్లోనే ఇంటికి చేరుకోవాల్సి ఉండగా.. ఖమ్మం జిల్లా నుంచి రాత్రి సమయంలో ప్రయాణం చేయడం నిద్రమత్తులో ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి.. కస్టమర్లకు కుచ్చుటోపీ

- రూ.14 కోట్లు మోసం చేసిన కేటుగాడు
- అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: అధిక వడ్డీ ఆశ చూపించి మోసం చేసిన కేటుగాణ్ని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన కందుల శ్రీనివాస రావు నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో వెల్ విజన్ గ్రూప్ పేరుతో పలు కంపెనీలను ఏర్పాటు చేశాడు. తన కంపెనీలో డిపాజిట్లు, పెట్టుబడులు పెడితే 200 శాతం అధిక వడ్డీ అందిస్తానని రకరకాల స్కీమ్‌లతో ప్రచారం చేశాడు. రూ.లక్ష డిపాజిట్ చేస్తే.. రోజుకు రూ.2 వేల చొప్పున వంద రోజుల పాటు రూ.2 లక్షలు, అలాగే.. రూ.6.50 లక్షలు డిపాజిట్ చేస్తే.. 121 గజాల స్థలంతో పాటు నెలకు రూ.32,500 చొప్పున 20 నెలల్లో రూ.6.50 లక్షలు రీఫండ్ చేస్తామని ప్రకటించాడు. టీవీ, వాషింగ్ మిషన్, ఏసీ వంటి వెల్ విజన్ గ్రూప్ గృహోపకరణాలను ఖరీదు చేసిన వారికి ఉత్పత్తి ఖరీదు మొత్తాన్ని వాయిదాల రూపంలో తిరిగి చెల్లిస్తామని ఆశ పెట్టాడు. ఉదాహరణకు రూ.30 వేలు పెట్టి టీవీ కొనుగోలు చేసే కస్టమర్‌కు టీవీతో పాటు నెలకు రూ.1,500 చొప్పున 20 నెలల్లో రూ.30 వేలు కస్టమర్‌కు రీఫండ్ చేస్తామని ప్రచారం చేశాడు. అత్యాశకు పోయిన సుమారు 200 మంది అమాయకులు రూ.14 కోట్లు డిపాజిట్లు చేశారు. కొన్ని నెలల పాటు వడ్డీ చెల్లించిన శ్రీనివాస రావు.. ఆ తర్వాత బిచాణా ఎత్తేశాడు. బాధితుల ఫిర్యాదుతో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు శ్రీనివాస రావును అరెస్టు చేశారు.



నారాయణగూడలోని ఓ పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

స్టూడెంట్స్.. ఆల్ ది బెస్ట్!

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రథమ సంవత్సరం కోసం హైదరాబాద్ జిల్లాలో 244 పరీక్ష కేంద్రాల్లో 85,753 మంది, రంగారెడ్డిలో 185 కేంద్రాల్లో 80,409, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 150 కేంద్రాల్లో 64,107 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంటర్మీడియట్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. విద్యార్థులూ.. పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించడమే మీ ముందున్న లక్ష్యం. ఆల్ ది బెస్ట్!

– సాక్షి, సిటీబ్యూరో

నడుస్తున్న కారులో అగ్ని కీలలు

రాజేంద్రనగర్: నడుస్తున్న కారు ఇంజిన్‌లోంచి పొగలు రావడంతో అప్రమత్తమైన యజమాని.. వాహనాన్ని పక్కకు నిలిపి పరిశీలిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పై మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ఉదయ్ కుమార్ తన మారుతీ సుజుకీ కారులో అరాంఘర్‌లోని పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పైనుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్నాడు. ఫ్లై ఓవర్ 211వ పిల్లర్ వద్దకు రాగానే వాహనం ముందు భాగంలోని ఇంజిన్‌లోంచి పొగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన ఉదయ్ కుమార్.. పక్కకు ఆపి పరిశీలిస్తుండగా మంటలు చెలరేగి వాహనం మొత్తం అలుముకున్నాయి. నిమిషాల వ్యవధిలో కారు మంటల్లో చిక్కుకుంది. విషయం తెలుసుకున్న అత్తాపూర్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఫ్లై ఓవర్‌పై ఈ ఘటన చోటు చేసుకోవడంతో వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపారు.



కారులో చెలరేగిన మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గాంధీ ఆస్పత్రిలో ఇదేం దుస్థితి?

విధులకు గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు

- ప్రొఫెసర్లు, అసోసియేట్లకు షోకాజ్ నోటీసులు
- వైద్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన గాంధీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అవుట్ పేషెంట్ విభాగాలన్నింటా కలియ తిరిగారు. రోగులు, రోగి సహాయకులతో మాట్లాడారు. వైద్య సేవలు, సమస్యలు, సౌకర్యాలపై ఆరా తీశారు. డాక్టర్ల అటెండెన్స్ రిజిస్టర్ తెప్పించుకుని పరిశీలించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పలువురు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు చేపట్టాలని, షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని అక్కడే ఉన్న డీఎంఈ, గాంధీ సూపరింటెండెంట్‌లకు ఆదేశించారు.

అసలేం జరుగుతోంది?

నర్సింగ్ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ అందుబాటులో లేకపోవడంతో విస్మయం వ్యక్తం చేశారు. గాంధీ ఆస్పత్రిలో ఏం జరుగుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేడియాలజీ విభాగంలోని ఎక్స్‌రే, ఎమ్మారై, సీటీస్కాన్ తదితర వార్డులు, రెండో అంతస్తులోని జనరల్ మెడిసిన్ ఇన్‌పేషెంట్ వార్డును పరిశీలించారు. అనంతరం మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లోని సంతాన సాఫల్య కేంద్రాన్ని (ఐవీఎఫ్) సందర్శించారు. ఇప్పటి వరకు ఎంతమందికి సేవలు అందించారు, సక్సెస్ రేట్ ఎంత, ప్రస్తుతం ఎంత మంది ఉన్నారు, విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, సిబ్బంది సంఖ్య ఎంత అంటూ ఆరా తీయగా.. ఒక్కదానికి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఐవీఎఫ్ సెంటర్‌కు సంబంధించిన వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంఈని ఆదేశించారు.



ఇంక్యుబేటర్‌లో చికిత్స పొందుతున్న నవజాత శిశువును పరిశీలిస్తున్న మంత్రి

సీరియస్‌గా రివ్యూ చేయాలి..

గాంధీ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై సీరియస్‌గా రివ్యూ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాంధీలో కొనసాగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మెడికల్, నాన్ మెడికల్ ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గాంధీలో సమస్యలు, లోపాలపై వారం రోజుల్లో రివ్యూ సమావేశం నిర్వహిస్తానని వివరించారు.

చీటీపై రాసిస్తే చిటికెలో పరిష్కారం!

గాంధీభవన్‌కు వచ్చి నీ సమస్యను చీటీపై రాసిస్తే చిటికెలో పరిష్కారం దొరుకుతుందని ఓ దివ్యాంగురాలికి మంత్రి దామోదర్ రాజనర్సింహ భరోసా ఇచ్చారు. మంగళవారం గాంధీఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో దివ్యాంగ వృద్ధురాలు రాజనర్సింహను కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. సదరం సర్టిఫికెట్ కోసం ఏళ్ల తరబడిగా తెలంగాణ భవన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయిందని, ప్రస్తుతం తనకు సదరం ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని వేడుకుంది. తెలంగాణ భవన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని.. ఇప్పుడున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, గాంధీ భవన్‌కు వచ్చి చీటీపై రాసిస్తే సమస్యకు చిటికెలో పరిష్కారం దొరకుతుందని మంత్రి ఆమెకు వివరించారు. ఓ చీటీపై తన ఫోన్ నంబరు రాసి ఇచ్చారు. ఫోన్ చేసి తన క్యాంపు కార్యాలయానికి వస్తే సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఆమె వివరాలు అడిగి తెలుసుకుని కొంత నగదు ఆర్థిక సాయంగా అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు మంత్రి రాజనర్సింహ.



వృద్ధురాలికి ఫోన్ నంబరు రాసి ఇస్తున్న రాజనర్సింహ

బస్ షెల్టర్ బాలేదా?

అక్కడే స్కాన్ చేసి ఫిర్యాదు చేయండి

- కొత్త విధానాన్ని అమల్లోకి తేనున్న బల్దియా

ఇక్కడ కనిపిస్తున్న బస్ షెల్టర్ల దృశ్యాలు ఇప్పటివి కావు. పరిస్థితులు మాత్రం ఎప్పటికీ అలాగే ఉంటున్నాయి. పేరుకు మాత్రం ప్రజల కోసమని బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నప్పటికీ.. అవి ప్రజలకు ఉపయోగపడటం కంటే ప్రకటనలు ఏర్పాటు చేస్తున్న యాడ్ ఏజెన్సీలకే బాగా పనికొస్తున్నాయి. రాత్రుళ్లలో ప్రజలకు చీకట్లే ఉంటున్నా, వాటి ఆదాయం మాత్రం జిగేల్‌మంటోంది.



మెహిదీపట్నంలోని బస్ షెల్టర్

సాక్షి, సిటీబ్యూరో:

గ్రేటర్ నగరంలో బస్సులను నడిపేది ఆర్టీసీ అయినా, బస్‌షెల్టర్లను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తుంది. ప్రజల సదుపాయార్థమని వీటిని ఏర్పాటు చేస్తున్నప్పటికీ, అవి ప్రజలకు ఉపయోగపడటం లేదు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతున్నారే తప్ప ప్రయాణికుల వాటితో సదుపాయం ఒనగూరడంలేదు. ఇదే తరుణంలో ప్రముఖ వాణిజ్యప్రాంతాల్లో, ప్రధాన రహదారులపై ఉన్న షెల్టర్లు వాటిని ఏర్పాటు చేసిన ఏజెన్సీలకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసేటప్పుడే ఆసక్తి ఉన్న ఏజెన్సీలన్నీ పాల్గొనేందుకు వీల్లేకుండా నచ్చిన వారికి దక్కేలా టెండరు నిబంధనలు రూపొందిస్తున్నారు. కనీసం నిబంధనల మేరకైనా నిర్వహణ ఉంటోందా అంటే అదీ లేదు.

- ఈ నేపథ్యంలో బస్‌షెల్టర్లను ప్రజలకు సదుపాయంగా ఉంచాలని భావిస్తున్న జీహెచ్‌ఎంసీ.. బస్‌షెల్టర్లలో తమకు ఎదురవుతున్న ఇబ్బందుల్ని అక్కడి నుంచే ఫిర్యాదు చేసేందుకు వీలుగా అక్కడే క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేయనుంది. వాటిని స్కాన్ చేసి ఇబ్బందుల్ని ఫిర్యాదు చేస్తే, నిర్ణీత వ్యవధిలోగా (రెండు మూడు రోజుల్లోగా) వాటిని పరిష్కరించాలని భావిస్తోంది. లేని పక్షంలో సంబంధిత ఏజెన్సీకి పెనాల్టీలు విధించడంతో పాటు వాటిని వసూలు చేసేందుకూ తగిన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. సంబంధిత క్యూఆర్ కోడ్‌లు సిద్ధమయ్యాయని, త్వరలోనే ప్రజల వినియోగానికి అందుబాటులో ఉంచనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు.

అమలుకు నోచుకోని నిబంధనలు

జీహెచ్‌ఎంసీ పరిధిలో దాదాపు 1300కు పైగా బస్‌షెల్టర్లున్నాయి. నిబంధనల మేరకు వాటిని ఏర్పాటు చేసిన ఏజెన్సీలు గ్రేడ్లను బట్టి డస్ట్‌బిన్ల నుంచి మొదలు పెడితే బస్సులు సదరు షెల్టర్‌కు చేరుకోనున్న సమయాన్ని తెలిపేలా రియల్‌టైమ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. కానీ ఏవీ ఏర్పాటు చేయకుండానే అవి ఆదాయం పొందుతున్నాయి.

తాజాగా అందుబాటులోకి రానున్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి ఈ సమస్యల్ని ఫిర్యాదు చేయొచ్చు.

- కూర్చునేందుకు బెంచీలు, కుర్చీలు లేకుంటే..
- ఉన్నా కూర్చునేందుకు వీల్లేకుండా విరిగిపోయి ఉంటే..
- ఏరోజుకారోజు శుభ్రం చేయకుండా ఉంటే..
- పైకప్పు లేకుంటే. ఉన్నా వానొస్తే తడవకుండా సరిగా లేకపోతే..
- రాత్రుళ్లు లైట్లు వెలగని పక్షంలో..
- బస్సుల నెంబర్లు, రూట్‌మ్యాప్‌లు లేకపోతే..
- బస్‌షెల్టర్ గ్రేడ్‌ను బట్టి మొబైల్ చార్జింగ్ పాయింట్ లేనిపక్షంలో..
- కాగితాలు వంటివి వేసేందుకు డస్ట్‌బిన్ లేకుంటే.
- పబ్లిక్ టాయ్‌లెట్ లేకపోతే..

ఫిర్యాదులు ఇకనైనా పరిష్కరిస్తారా ?

ప్రయాణికుల నుంచే ఇబ్బందులు తెలుసుకునేందుకని ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌ల ఏర్పాట్లకు సిద్ధమయ్యారు. వీటి ఏర్పాటుతోనైనా సమస్యలు తీరుతాయా? లేదా? అనేది ముమ్ముందు తెలుస్తుంది.

రెండేళ్ల క్రితమే..

దాదాపు రెండేళ్ల క్రితం సెంట్రల్ అడ్వర్టయిజ్‌మెంట్ మానిటరింగ్ ప్లాట్‌ఫార్మ్ (క్యాంప్)పేరిట ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించేందుకు సంబంధిత అధికారులు ఆర్ఎఫ్‌పీ టెండర్లు పిలిచారు. రియల్‌టైమ్‌లో అధికారులే ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తూ బాగులేని వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్విట్టర్ (ఎక్స్) వంటి వాటిద్వారా ప్రజలు ఫిర్యాదు చేసినా పరిష్కరిస్తామన్నారు. కానీ.. ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. బస్సుల రాకపోకలు తెలిసేలా సదుపాయం కల్పించేందుకని ఇటీవల మరో ఆర్ఎఫ్‌పీ ఆహ్వానించారు. ఇది ఏ మేరకు అమలు చేస్తారో తెలియదు.





ఖైరతాబాద్‌లో..

అంబులెన్స్‌ల 'ఆడిటింగ్'

దుర్వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు



- సిటీలో సోమవారం నుంచి ప్రారంభమైన తనిఖీలు
- ఫలితంగా అనేక అంశాలు వెలుగులోకి..
- అనవసరంగా సైరన్ మోగించిన వారిపై కేసులు



మంగళవారం తార్నాకలో అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సంచరిస్తున్న అంబులెన్స్‌ల కారణంగా సాధారణ వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అత్యవసరమైన పేషెంట్లను తరలిస్తున్న వాటికి మాత్రమే 'గ్రీన్ లైట్' విధానం అమలు చేస్తున్నారు. అవసరం లేకపోయినా, ఖాళీగా సంచరిస్తున్న సందర్భాల్లో సైరన్ వినియోగిస్తే ఆయా అంబులెన్స్ యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. నగర ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి నగర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైంది. అంబులెన్స్‌ల వ్యవహారంపై ట్రాఫిక్ బృందాలు ప్రత్యేక దృష్టి సారించాయి. మంగళవారం కొన్ని కేసులు నమోదయ్యాయి. ఇదే రోజు పెంపుడు కుక్కకు సంతాన నిరోధక ఆపరేషన్ కోసం.. రోగులను తీసుకువెళ్లాల్సిన అంబులెన్స్‌లో సైరన్ మోగించుకుంటూ వెళ్లిన డ్రైవర్‌ను పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. అంబులెన్స్‌ను సీజ్ చేయడం గమనార్హం.

ఆస్పత్రులున్న ప్రాంతాల్లో మరీ ఇబ్బంది..

సిటీలోని ఆసుపత్రులను నగర నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి రోగులు వస్తుంటారు. వీరిలో కొందరిని అంబులెన్స్‌ల్లో తరలిస్తుంటారు. ఈ కారణంగానే నగరంలోని ఏ చౌరస్తాను తీసుకున్నా సరాసరిన ప్రతి గంటకు కనిష్టంగా ఐదు అంబులెన్స్‌ను క్రాస్ చేస్తుంటాయి. ఆస్పత్రులు ఎక్కువగా ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిధుల్లో ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఏ ప్రాంతం నుంచి వచ్చే అంబులెన్స్ అయినా ఇక్కడికే చేరుకుంటుండటమే దీనికి కారణం. ప్రస్తుతం అన్ని అంబులెన్స్‌ల్నీ ఒకే తరహాలో పరిగణిస్తున్న ట్రాఫిక్ పోలీసులు సైరన్ వినిపిస్తే చాలు అప్రమత్తమవుతున్నారు. సదరు జంక్షన్‌లో మిగిలిన దిశల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఆపి.. అంబులెన్స్ ఉన్న దిశలో వాటినే ముందుకు పంపిస్తున్నారు. ఇలా ఒకసారి ఆపిన చౌరస్తా మళ్లీ గాడిన పడటానికి కొన్ని నిమిషాల సమయం పడుతోంది. ఫలితంగా ఇతర వాహనచోదకులకు సమయం, ఇంధనం వృథా అవుతోంది.

ఆ ప్రతిపాదనలకు ఆచరణ సాధ్యం కాక...

సాధారణంగా అంబులెన్స్ అనగానే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని తరలిస్తోందనే భావన కలుగుతుంది. ఈ నేపథ్యంలో వీటికి నగర రోడ్లపై ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని గతంలో భావించారు. రహదారులపై కుడి వైపుగా అంబులెన్స్‌ల కోసం ప్రత్యేకంగా లైన్ ఏర్పాటు చేయాలని భావించారు. ఆపై వీటికి రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) ట్యాగ్స్ జారీ చేయడంతో పాటు సిగ్నల్స్‌కు రీడర్లను ఏర్పాటు చేయాలనుకున్నారు. ఫలితంగా ఓ చౌరస్తా వద్దకు అంబులెన్స్ వచ్చిన వెంటనే ఆర్ఎఫ్ ట్యాగ్ ద్వారా సిగ్నల్ గుర్తించి ఆ మార్గంలో గ్రీన్ లైట్ ఉంచేలా చేయాలని భావించారు. అయితే.. నగర రోడ్లపై ఈ రెండూ ఆచరణ సాధ్యం కాదని తేలడంతో ప్రస్తుతం ప్రతి అంబులెన్స్‌ను క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బంది మాన్యువల్‌గా క్లియరెన్స్ ఇస్తున్నారు. ఇటీవల కాలంలో అంబులెన్స్‌ల సంచారం పెరగడంతో అనేక జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అన్నీ తీవ్రమైన కేసులే ఉండట్లేదు..

ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న ట్రాఫిక్ విభాగం అధికారులు గడిచిన కొన్ని రోజులుగా అంబులెన్స్‌లపై అధ్యయనం చేశారు. ఫలితంగా సిటీలో సంచరిస్తున్న అన్ని అంబులెన్స్‌ల్లోనూ అత్యవసర వైద్యం అందించాల్సిన పేషెంట్లు ఉండట్లేదని తేలింది. ఉదాహరణకు గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఇచ్చే ప్రాధాన్యం చేయి విరిగిన వ్యక్తికి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలోనే అంబులెన్స్‌లపై సమగ్ర విధానం రూపకల్పనకు నిర్ణయించారు. ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేకంగా ఓ సెల్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అత్యవసర పేషెంట్లను తరలిస్తున్న లేదా వారి కోసం వెళ్తున్న అంబులెన్స్‌ల వివరాలను ఆస్పత్రులు లేదా నిర్వాహకులు ఈ సెల్‌కు అందించేలా చేయనున్నారు. వాటి పూర్వాపరాలు పరిశీలించే ఇక్కడి అధికారులు అది ప్రయాణించే రూట్‌లోని జంక్షన్లను అప్రమత్తం చేస్తూ రిజిస్ట్రేషన్ నెంబర్ తదితరాలు అందిస్తారని, ఈ విధానంతో అటు అత్యవసర రోగులకు, ఇటు ప్రజలకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

అపార్ ఐడీతో విద్యార్థులకు మేలు


సదస్సులో మాట్లాడుతున్న శ్రీరాం వెంకటేష్

ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేష్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 75 శాతం విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం తెలంగాణలోని ఇతర యూనివర్సిటీలకు మార్గదర్శిగా నిలవడం గర్వంగా ఉందని ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేష్ కొనియాడారు. అంబేడ్కర్ వర్సిటీలో 'అపార్ అమలు' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన సదస్సు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీరాం వెంకటేష్ మాట్లాడుతూ డీజీ లాకర్, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, అపార్ ఐడీ వంటివి విద్యార్థి తాను చదువుకున్న విద్యా సంబంధిత విషయాలకు సంబంధించి కీలకమైన అంశాలుగా పేర్కొన్నారు. విద్యార్థి తన విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నాక ఉద్యోగం కోసం ఏ సంస్థ దగ్గరకు వెళ్లినా సర్టిఫికెట్ల పరిశీలన సులభం అవుతుందన్నారు. ఆ సర్టిఫికెట్ ఒరిజినలా, లేక ఫేక్ సర్టిఫికెటా అనేది కూడా తేలిపోతుందన్నారు. రానున్న రోజుల్లో కూడా తెలంగాణలోని అన్ని విశ్వ విద్యాలయాల్లో అపార్ ఐడీలను రూపొందించి విద్యార్థులకు సహాయకారిగా నిలవడానికి, అవసరమైన శిక్షణ కోసం ఆర్థికపరమైన సహాయాన్ని అందించడానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి సిద్ధంగా ఉందని వెల్లడించారు. త్వరలోనే తెలంగాణలోని అన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా ఆయా విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలలకు అపార్ ఐడీ నమోదుపై అవగాహన పెంపొందిస్తూ శిక్షణను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. యూనివర్సిటీ ఉపకులపతి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అపార్ ఐడీ నమోదు, అవగాహన పెంపొందించడానికి, శిక్షణ ఇవ్వడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి అంబేడ్కర్ వర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ సంస్థలకు నామమాత్రపు రుసుముతో, ప్రైవేటు విద్యా సంస్థలకు ఉన్నత విద్యా మండలి నిర్దేశించిన ప్రకారం రుసుముతో శిక్షణ కార్యక్రమాలు సీఎస్టీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎస్టీడీ) డైరెక్టర్ పరాంకుశం వెంకటరమణ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు రాజశేఖర్, అంబేడ్కర్ వర్సిటీ కంప్యూటర్ సెంటర్ ఇన్‌ఛార్జి వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సెమినార్‌లో తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాల విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ బోర్డు, టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగాల నుంచి 60 మంది ప్రతినిధులు తమ అనుభవాలు, సమస్యల పరిష్కారానికి అవసరమైన మెలకువలను నేర్చుకున్నట్లు వివరించారు. ఈ సెమినార్‌లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

నేపాల్‌లో ఆ ఇద్దరు నేరగాళ్లు!

- జనవరిలో బీదర్, అఫ్జల్‌గంజ్‌ల్లో కాల్పులు
- చెన్నై మీదుగా పశ్చిమ బెంగాల్‌కు బిహారీలు
- అక్కడి నుంచి దేశ సరిహద్దులు దాటిన వైనం
- గతంలోనూ ఇలా చేసిన అమన్, అలోక్ ద్వయం


అమన్ కుమార్


అలోక్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు అమన్ కుమార్, అలోక్ కుమార్ దేశ సరిహద్దులు దాటి నేపాల్ పారిపోయినట్లు నగర పోలీసులు గుర్తించారు. ఈ ఏడాది జనవరి 16 ఈ రెండు నేరాలకు పాల్పడిన బీహారీ ద్వయం పశ్చిమ బెంగాల్ మీదుగా నేపాల్ వెళ్లినట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. నేరచరితులైన వీళ్లు గతంలోనూ ఇలా దేశం దాటి, పోలీసుల హడావుడి తగ్గిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చారని అధికారులు చెప్తున్నారు.

మీర్జాపూర్ నుంచి మారణకాండ...

బిహార్‌లోని వైశాలి జిల్లా ఫతేపూర్ పుల్వారియాకు చెందిన అమన్ కుమార్, అలోక్ కుమార్, చందన్ కుమార్, రాజీవ్ సాహ్నిలతో ఈ ముఠా ఏర్పడింది. వాహనాలపై తిరుగుతూ, పట్టణ శివార్లలో రెక్కీ చేసి, ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనాలనే టార్గెట్‌గా చేసుకోవడం వీరి నైజం. అలోక్ కుమార్ నేతృత్వంలో సాగే ఈ ముఠా 2023 సెప్టెంబర్ 12న ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో పంజా విసిరింది. సెక్యూరిటీ గార్డు జై సింగ్‌ను హత్య చేసి రూ.40 లక్షలు దోచుకుపోయింది. యూపీ పోలీసులు దాదాపు ఏడాది పాటు గాలించి గత ఏడాది సెప్టెంబర్‌లో చందన్ కుమార్‌ను ముంబైలో, రాజీవ్ సాహ్నిని వైశాలిలో పట్టుకున్నారు. అప్పట్లో అమన్, అలోక్‌లు వైశాలి జిల్లాలోని మహిసార్ జనధన్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వీరి కోసం వెళ్లగా.. పోలీసుల కళ్లు గప్పి నేపాల్ పారిపోయారు.

బిహార్‌లోనూ అనేక నేరాలు చేసి...

యూపీ పోలీసుల హడావుడి తగ్గిన తర్వాత ఈ ద్వయం నేపాల్ నుంచి బీహార్ చేరుకుంది. అప్పటికే తమ వద్ద ఉన్న డబ్బు అయిపోవడంతో మళ్లీ నేరాలు మొదలెట్టింది. ఈ ఏడాది జనవరిలో నగరానికి వచ్చి, షెల్టర్ తీసుకుంది. అదే నెల 16న బీదర్‌లో పంజా విసిరింది. ఎస్బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ సంస్థ ఉద్యోగిని గిరి వెంకటేష్‌ను చంపి, శివకుమార్‌ను గాయపరిచి రూ.83 లక్షలతో ఉడాయించింది. నగరంలో షెల్టర్ తీసుకున్న అమన్, అలోక్ నగదుతో తిరిగి ఇక్కడికే వచ్చి నేరానికి వాడిన ద్విచక్ర వాహనాన్ని ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉంచారు. అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్ వెళ్లేందుకు అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకుంది. అక్కడ జరిగిన పరిణామాలతో మేనేజర్ జహంగీర్‌ను కాల్చడం, పారిపోవడం జరిగిపోయాయి.

ఆధారాలు దొరక్కుండా ప్రయాణాలు...

అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లిన వీళ్లు... అక్కడ నుంచి గజ్వేల్ వెళ్లడానికి మరో ఆటో మాట్లాడుకున్నారు. అనివార్య కారణాలతో తిరుమలగిరిలో దిగేసి... ఇంకో ఆటోలో మియాపూర్ వెళ్లారు. ఆపై తిరుపతి వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ ఎక్కి కడపలో దిగిపోయారు. మరో బస్సులో నెల్లూరు, అట్నుంచి చెన్నై వెళ్లారు. చెన్నై నుంచి రైలులో కోల్‌కతా చేరుకున్న ఈ ద్వయం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి ప్రాంతం నుంచి నేపాల్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై ఇప్పటికే యూపీ పోలీసులు రూ.2 లక్షలు, కర్ణాటక పోలీసులు రూ.5 లక్షలు రివార్డు ప్రకటించారు. త్వరలో హైదరాబాద్ అధికారులూ రివార్డు ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నారు. గత రెండు నెలల్లో 82 కేసులను దర్యాప్తు చేసిన పోలీసులు..11 రాష్ట్రాల్లోని 161 మంది అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. ఇందులో అత్యధికంగా 37 ట్రేడ్ ఫ్రాడ్ కేసుల్లో 82 మంది నేరస్తులు ఉన్నారని అధికారులు తెలిపారు. అలాగే 11 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న సూరత్‌కు చెందిన నలుగురు పాత నేరస్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ట్రేడింగ్, పార్ట్ టైం జాబ్స్ సామాన్యులను నిలువెల్లా మోసం చేస్తున్న అజయ్ ఆనంద్ భాయ్ ఇటాలియా, జల్పేష్, విశాల్ అరివాడ్ తుమ్మర్, హిరేన్ కుమార్ ప్రవీణ్ భాయ్‌లను పట్టుకున్నారు. అలాగే 15 డిజిటల్ అరెస్టు కేసుల్లో 27 మందిని, 12 పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్స్‌లలో 26 మందిని, ఐదు అడ్వర్టయిజ్‌మెంట్ మోసాల్లో 8 మందిని అరెస్టు చేశామని అధికారులు తెలిపారు.

చే నంబర్ ఫ్లైఓవర్ కింద అగ్ని ప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అంబర్‌పేట: అంబర్‌పేట చే నంబర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ కింద నిర్మాణం పనులు చేపడుతున్న షెడ్లలో వెల్డింగ్ చేస్తుండగా మంటలు చెలరేగాయి. దీంతో పరిసరా ప్రాంతాల ప్రజలు ఉరుకులు పరుగులు పెట్టారు. మంగళవారం ఉదయం ఫ్లైఓవర్ కింద ఉన్న చెత్తకు నిప్పంటుకుని మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అంబర్‌పేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ముషీరాబాద్ అగ్నిమాపక సిబ్బంది విచ్చేసి గంట పాటు శ్రమించి మంటలను ఆదుపులోకి తెచ్చారు. షెడ్లల్లో వాహనాలకు వాడే ఆయిల్, పాత కేబుల్స్ ఉండడంతో అతి కష్టం మీద మంటలు అదుపులోకి వచ్చాయి. పక్కనే పెట్రోల్‌బంక్ ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కీచక తండ్రికి ఏడేళ్ల జైలు

శంకర్‌పల్లి: కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్న తండ్రి కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెల్లడించారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విస్లావత్ రాముునాయక్(43) మద్యానికి బానిసయ్యాడు. 2018లో తన సొంత కూతురైన బాలిక(13)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పూర్తి వాదనలు విన్న జడ్జి పద్మావతి.. నిందితుడికి పైశిక్షలు విధిస్తూ తీర్పు చెప్పారు.

కీసరగుట్ట ఆలయ హుండీ లెక్కింపు


లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ తటాకం నారాయణ

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.92,49,961 ఆదాయం సమకూరింది. ప్రసాదాలు, వివిధ ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాల టికెట్ల విక్రయం ద్వారా రూ.63,51,060 ఆదాయం రాగా, హుండీ ఆదాయం రూ.28,98,901 వచ్చిందని, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈవో సుధాకర్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం దేవాలయం మహామండపంలో హుండీని లెక్కించారు. ఈ ఆదాయాన్ని స్వామిపేరిట కీసర ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు వారు తెలిపారు. గతేడాది బ్రహ్మోత్సవాల కంటే ఈసారి సుమారు రూ.14,70,436ల మేర ఆదాయం పెరిగిందన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా

పేలిన సిలిండర్

ఒకరికి తీవ్ర గాయాలు


సిలిండర్ పేలడంతో ఎగిసి పడిన మంటలు

మూసాపేట: అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా సిలిండర్ పేలడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా పరిసర ప్రాంతవాసులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి బాగ్‌అమీర్ కాలనీలో హరి శంకర్ త్యాగి అనే వ్యక్తి ఎలక్ట్రికల్ అండ్ గ్యాస్ సర్వీస్ షాపును నిర్వహిస్తున్నాడు. మంగళవారం షాపులో పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. షట్టర్ పైభాగం రేకులు, షట్టర్‌లు ఎగిరి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. షాపు పూర్తిగా ధ్వంసమైంది. రీఫిల్లింగ్ చేస్తున్న హరి శంకర్‌కు కాళ్లు, చేతులు కాలిపోయాయి. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జనావాసాల మధ్య అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నందుకు అతనిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

'మల్టీలెవెల్ పార్కింగ్' పనులు చకచకా

- కేబీఆర్ పార్కు వద్ద ఆరు అంతస్తుల్లో నిర్మాణం
- 72 కార్లు పార్కింగ్ చేసుకునే అవకాశం


కేబీఆర్ పార్కు పక్కన మల్టీ లెవెల్ పార్కింగ్ నమూనా

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు సమీపంలో పార్కింగ్ సమస్యను నివారించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పార్కు పక్కనే ఉన్న జీహెచ్ఎంసి స్థలంలో ఈ నిర్మాణం గత రెండు వారాల నుంచి ముమ్మరంగా జరుగుతున్నది. ఆరు అంతస్తులలో నిర్మాణం జరుగుతున్న ఈ మల్టీ లెవెల్ పార్కింగ్‌లో ఒక్కో ఫ్లోర్‌లో 12 కార్లు పార్కింగ్ చేయవచ్చు. ఇలా మొత్తం ఆరు ఫ్లోర్లలో 72 కార్లు పార్కు చేసుకునే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌కు చెందిన నవనిర్మాణ ఏజెన్సీ ఈ పనులు చేస్తున్నది. రూ.రెండున్నర కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పార్కింగ్ నిర్మాణంలో హైడ్రాలిక్ పద్ధతిలో లిఫ్ట్ సౌకర్యం ఉంటుంది. పార్కింగ్ కోసం కారు రాగానే ఈ హైడ్రాలిక్ లిఫ్ట్‌లో ఏ ఫ్లోర్లో ఖాళీగా ఉంటే ఆ ఫ్లోర్ లోకి కారు తీసుకెళ్లి పార్కింగ్ చేస్తారు. కారు పార్కింగ్ చేసిన తర్వాత ఒక చిప్‌ను కారు యజమానికి ఇస్తారు. వాకర్లు, ఇతర పనుల కోసం వచ్చిన వారు తమ కార్లు పార్క్ చేసిన తర్వాత..పని పూర్తికాగానే వెళ్తే డ్రైవర్ కారును కిందికి తెప్పిస్తాడు. ప్రస్తుతం ఇలాంటి మల్టీ లెవెల్ పార్కింగ్ వ్యవస్థ బెంగళూరు, చెన్నైలో మాత్రమే ఉంది. హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా కేబీఆర్ పార్కు పక్కన నిర్మిస్తున్నారు. దీని చుట్టూ కేఫెలు, ఇతర దుకాణాలు కూడా ఏర్పాటు చేస్తారు. పార్కింగ్ ప్రాంతం అంతా సుందరంగా తీర్చి దిద్దుతారు. ఇప్పటికే ఫుట్‌పాత్‌పై ఉన్న బస్సు షెల్టర్లను నోటీసులు అందజేసి తొలగించారు. ఇక్కడ కొనసాగుతున్న కడక్ చాయ్‌తో పాటు 1980 మిలిటరీ హోటల్ కూడా తొలగించనున్నారు. ఈ రెండు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ఇక్కడ మల్టీ లెవెల్ పార్కింగ్ వ్యవస్థ నిర్మాణం పూర్తయిన తర్వాత పరిసరాలన్నీ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు.

గూగుల్‌ను వాడి..

గుడులలో దోపిడీ!

శివారు ప్రాంతాల్లోని ఆలయాలే టార్గెట్

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ
- దొంగిలించిన సొత్తుతో జల్సాలు
- అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు చిక్కిన దుండగులు
- 20 కిలోల వెండి బిస్కెట్లు స్వాధీనం



నిందితులు ఇంతియాజ్ షరీఫ్, వేణు

అబ్దుల్లాపూర్‌మెట్: చోరీలు పాల్పడేందుకు సాంకేతికతను ఎంచుకున్నారీ దుండగులు. గ్రామ శివారుల్లో ఉండే దేవాలయాలనే లక్ష్యంగా చేసుకున్నారు. గూగుల్‌మ్యాప్‌లో అప్‌లోడ్ చేసే దేవతామూర్తులకు అలంకరించిన బంగారు, వెండి ఆభరణాలను అపహరించేందుకు పక్కా ప్రణాళికతో తెగబడ్డారు. నగర శివారులోని ఘట్‌కేసర్, దుండిగల్, బీబీనగర్, ఇబ్రహీంపట్నం, జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లోని దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు దుండగులు ఎట్టకేలకు వాహన తనిఖీ చేపడుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు చిక్కారు. సీఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున వాహన తనిఖీ చేపడుతున్న పోలీసులకు ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తుల తీరు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని బ్యాగును తనిఖీ చేయగా అందులో బిస్కెట్ల రూపంలో ఉన్న 20 కిలోల వెండి కనిపించింది. దుండగులిద్దరినీ స్టేషన్‌కు తీసుకుని విచారించగా మేడ్చల్‌లోని పోలీస్ క్వార్టర్స్ వెనకాల నివసించే మహ్మద్ ఇంతియాజ్ షరీఫ్, మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన రంగా వేణులుగా గుర్తించారు. ఇద్దరు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి ఎలాగైనా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దేవాలయల్లో దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. అందుకు గూగుల్‌మ్యాప్‌ను వినియోగించుకున్నారు.

విజయవాడలో విక్రయించి

నివాస గృహాలకు దూరంగా, గ్రామ శివారుల్లో ఉండే ఆలయాలను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతూ బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకు పోయారు. వాటిని కరిగించి బిస్కెట్ల రూపంలో విజయవాడలో విక్రయించి సొమ్ము చేసుకుంటూ జల్సాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల మండలంలోని పిగ్లీపూర్ గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో దొంగతనం చేసిన వెండి ఆభరణాలను కరిగించి బిస్కెట్లుగా మార్చి విజయవాడలో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులకు చిక్కారు. పిగ్లీపూర్‌తో పాటు ఘట్‌కేసర్, దుండిగల్, బీబీనగర్, ఇబ్రహీంపట్నం, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లోని దేవాలయాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరు దుండగుల నుంచి 20 కిలోల వెండి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మున్సిపాలిటీలకు నిధుల పంట!

జీఓ 51, అమృత్ పథకాల కింద భారీగా మంజూరు

సాక్షి, సిటీబ్యూరో: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని పురపాలక సంఘాల్లో జీవో 51, అమృత్ పథకాల్లో మంజూరైన పనులపై తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి సమీక్షించారు. మంగళవారం తన కార్యాలయంలో ఇంజినీరింగ్ సిబ్బందితో పనుల ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు కార్యాచరణపై సూచనలు ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఫీల్డ్ విజిట్ నిర్వహించి పురపాలక సంఘాలు, స్థానిక ఎమ్మెల్యేలతో సమీక్షించనున్నట్లు తెలిపారు. పురపాలక సంఘాలకు కొత్తగా మంజూరైన పనులు, వాటికి సంబంధించిన నిధులను వివరించారు. అమృత్ 2.0 ప్యాకేజీ-3 కింద సంగారెడ్డి, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ డివిజన్‌లకు రూ.130 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్లు విశ్వనాథ్ రాజు, చిన్నారావు, వెంకటేశ్వర్లు, జ్యోతిర్మయి, ఈఈలు విజయభాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ సందీప్, రమణ మూర్తి పాల్గొన్నారు.

జీవో 51 పథకం కింద మంజూరైన నిధులిలా..

పురపాలక సంఘం	మంజూరైన నిధులు (రూ.ల్లో)
పెద్ద అంబర్‌పేట	రూ.15 కోట్లు
షాద్‌నగర్	రూ.61 కోట్లు
ఇబ్రహీంపట్నం	రూ.15 కోట్లు
శంకర్ పల్లి	రూ.36 కోట్లు
కొత్తూరు	రూ.37 కోట్లు
ఆమనగల్	రూ.25 కోట్లు
జల్‌పల్లి	రూ.10 కోట్లు
శంషాబాద్	రూ.20 కోట్లు
ఆదిభట్ల	రూ.10 కోట్లు
తుర్కయంజాల్	రూ.25 కోట్లు
బడంగ్‌పేట్	రూ.15 కోట్లు
జిల్లెలగూడ	రూ.15 కోట్లు
తుక్కుగూడ	రూ.15 కోట్లు
తాండూర్	రూ.49 కోట్లు
వికారాబాద్	రూ.8 కోట్లు
పరిగి	రూ.4 కోట్లు
కొడంగల్	రూ.9 కోట్లు

- జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.25 కోట్లు
- మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.15 కోట్లు

అమృత్ పథకంలో మంజూరైన నిధులిలా..

పురపాలక సంఘం	మంజూరైన నిధులు
కొడంగల్	రూ.3 కోట్లు
పరిగి	రూ.11 కోట్లు
వికారాబాద్	రూ.8 కోట్లు
తాండూరు	రూ.20 కోట్లు
శంకర్ పల్లి	రూ.25 కోట్లు
ఆమనగల్	రూ.23 కోట్లు
కొత్తూరు	రూ.13 కోట్లు
షాద్‌నగర్	రూ.20 కోట్లు

మేడ్చల్ సర్కిల్‌కు రూ.27 కోట్లు

హాల్‌టికెట్ కోసం విద్యార్థి ఆందోళన

- పూర్తి ఫీజు చెల్లించకపోవడంతో యాజమాన్యం నిరాకరణ
- విషయం వైరల్ కావడంతో ఇచ్చేసిన వైనం


కళాశాల ఎదుట బైఠాయించిన విద్యార్థి వెంకట పవన్

మీర్‌పేట: ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం అవుతుండగా పరీక్షకు సిద్ధం కావాల్సిన ఓ విద్యార్థి హాల్‌టికెట్ ఇవ్వాలని కళాశాల ఎదుట బైఠాయించాడు. ఈ సంఘటన మీర్‌పేట పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ.. మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన వెంకట పవన్ బాలాపూర్ చౌరస్తాలోని శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పూర్తి ఫీజు చెల్లించలేకపోయాడు. దీంతో కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ క్రమంలో వెంకట పవన్ మంగళవారం రూ.5వేలు చెల్లించాడు. పూర్తి ఫీజు చెల్లిస్తే గానీ హాల్‌టికెట్ ఇచ్చేది లేదని తెగేసి చెప్పింది. దీంతో పవన్ కళాశాల ఎదుటే కూర్చొని హాల్‌టికెట్ ఇవ్వాలని వేడుకున్నాడు. విషయం కాస్తా స్థానికంగా వైరల్ కావడంతో యాజమాన్యం రూ.5వేలు తిరిగి చేయడంతో పాటు హాల్‌టికెట్ అందజేసింది.

ఇఫ్తార్‌తో మత సామరస్యం



ఇఫ్తార్ విందులో బాబాఫసీయుద్దీన్

రహమత్‌నగర్: ఇఫ్తార్‌తో మతసామరస్యం పెంపొందుతుందని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బాబాఫసీయుద్దీన్ అన్నారు. బోరబండ డివిజన్ స్వరాజ్ నగర్‌లో మంగళవారం స్థానిక ముస్లిం యువకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ డివిజన్ నాయకుడు కాసుల మహేష్‌కుమార్‌గౌడ్, అనిల్, సోహెల్, బస్తీ అధ్యక్షుడు రజ్వీ పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



రమేష్(ఫైల్)

వెంగళరావునగర్: భార్య నిద్ర లేచేసరికి భర్త కనిపించకుండా పోయిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం డీఎస్ రమేష్, సులోచన దంపతులు. కొంతకాలంగా ఓంనగర్‌లో నివాసం ఉంటున్నారు. రమేష్ రిటైర్డ్ ఎంప్లాయి. ఆయనకు ఇటీవల మతిస్థిమితంగా సరిగ్గా లేదు. సోమవారం భార్యాభర్తలు ఇంట్లో నిద్రపోయారు. ఉదయం సులోచన నిద్ర లేచేసరికి భర్త కనిపించలేదు. అతడి వద్ద ఫోన్ కూడా లేదు. దీంతో సులోచన మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేల పునాదుల్లోనే చరిత్ర

సనత్‌నగర్: చరిత్ర అంటే ఎక్కడో లేదని, మనం నిలబడిన నేల పునాదుల్లోనే ఉందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ శ్రీనివాస్ అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిస్టరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'తెలంగాణ చారిత్రక మూలలు'పై మంగళవారం నిర్వహించిన విశ్లేషణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో చరిత్ర ఒక జీవన విధానమన్నారు. ప్రతిఒక్కరూ చరిత్రను తెలుసుకోవడమే ద్వారానే భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. తెలంగాణలో జరిగిన తవ్వకాల్లో లభించిన బ్రహ్మీ పదాల ద్వారా బుద్ధుడి కాలంలోనే బౌద్ధం తెలంగాణలో వ్యాపించిందని వివరించారు. కార్యక్రమంలో చరిత్ర విభాగం అధ్యాపకులు సంధ్యజ్యోత్స్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణప్రియ, స్నేహ, డాక్టర్ నరసింహులు, భాస్కర్‌రెడ్డి, విజయ రాఘవ, కమల, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



గురుమూర్తిలేన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహేశ్వరి

సనత్‌నగర్: అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని గురుమూర్తిలేన్‌లో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు చేపట్టలేదని వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అలాగే సీసీ రోడ్డు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేవని, ప్రస్తుతం గతంలో మంజూరైన పనులే ఇంకా జరగడం లేదని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత శ్రీహరితో పాటు జీహెచ్‌ఎంసీ ఏడీఈ, ఏఈ, జలమండలి మేనేజర్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 21, క్యాప్సికం 33, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 40, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 20, చామగడ్డ 45, మొరంగడ్డ 40, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవేంకటేశ్వర స్వామి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారు మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. వజ్రకవచం ధరించిన సప్తగిరీషుడు సూర్యకిరణాల వెలుగులో సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి తిరుగుతున్న స్వామివారిని దర్శించుకుంటే రాజ్యాంగపరమైన అధికారులతో కార్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకని ఆలయ అర్చకులు తెలిపారు. సనాతన హైందవ సంప్రదాయంలో సూర్య ఆరాధనకు విశేష ప్రాధాన్యం ఉందని తెలిపారు. సూర్యారాధన వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. మేళ తాళాలు, సంప్రదాయ నృత్యాల మధ్య జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారు చంద్రప్రభ వాహనంలో దర్శనమిచ్చారు.





ప్రజావాణి ఫిర్యాదులు.. 634

- పేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల పరిధిలో 99 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ప్రజావాణికి పెరుగుతున్న ఫిర్యాదులు



ప్రజావాణిలో సమస్యలను స్వీకరిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: సమస్యలు పరిష్కరించాలంటూ అటు ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణికి, ఇటు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలో ఏడాది వ్యవధిలో వివిధ ఫిర్యాదులపై సీఎంఓ ప్రజావాణికి, కలెక్టర్ ప్రజావాణికి 634 పిటిషన్లు అందాయి. ఇందులో 99 శాతం పిటిషన్లను తహసీల్దార్ పరిశీలించి వాటికి లిఖిత పూర్వక సమాధానాలు పంపించారు. షేక్‌పేట మండల పరిధిలో కలెక్టర్ ప్రజావాణికి ఏడాది వ్యవధిలో 252 మంది తమ పిటిషన్లను అందజేశారు. ఇందులో 246 ఫిర్యాదులను పరిష్కరించారు. ఇతర శాఖలకు చెందిన ఎనిమిది పిటిషన్లను ఆయా విభాగాల అధికారులకు పంపించారు. నాలుగు దరఖాస్తులు మాత్రం ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయని, షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి తెలిపారు. సీఎంఓ ప్రజావాణికి ఏడాది వ్యవధిలో షేక్‌పేట మండల పరిధిలో 100 ఫిర్యాదులు అందగా ఇందులో 92 పరిష్కరించారు. రెండు పిటిషన్లు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజావాణికి అందుతున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు అక్కడ అధికారులు ఏ మండల పరిధి కిందికి వస్తుందో ఆ మండలానికి పంపిస్తున్నారు. ఇక్కడికి వచ్చిన పిటిషన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్లు ఎంత వరకు పరిష్కరించగలమో పరిశీలించి వాటికి సమాధానాలు రాస్తున్నారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు తదితర సమస్యలపైనే 99 శాతం దరఖాస్తులు అందుతున్నాయి. అయితే కొత్తగా పింఛన్లు ఇచ్చే ప్రక్రియ లేకపోవడం, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు తమ పరిధిలో లేకపోవడంతో రెవెన్యూ కార్యాలయాల్లో ఈ పిటిషన్లు పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఖైరతాబాద్‌లో 276 ప్రజావాణి దరఖాస్తులు..

ఖైరతాబాద్ మండల పరిధిలో కలెక్టర్ ప్రజావాణికి 146 పిటిషన్లు స్వీకరించారు. ఇందులో 140 దరఖాస్తులు పరిశీలనకు నోచుకోగా, ఆరు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎంఓ ప్రజావాణికి 130 దరఖాస్తులు రాగా, ఇందులో 126 పరిష్కరించగా, ప్రస్తుతం నాలుగు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పటికప్పుడు ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని దరఖాస్తుదారులకు సమాధానాలు అందజేస్తామని ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ తెలిపారు. ఈ మండల పరిధిలో ఎక్కువగా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల గురించే దరఖాస్తులు వచ్చాయి. వీటికి తగిన పరిష్కార మార్గాలను ప్రభుత్వం ఆలోచిస్తోంది.

జలమండలి జర దేఖో..



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-10 యూకో బ్యాంక్ ముందు భారీ మ్యాన్‌హోల్ గుంత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-10లోని యూకో బ్యాంక్ ముందు జలమండలి ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ పక్కన భారీ గుంత ఏర్పడింది. ప్రమాదకరంగా ఉన్న ఈ గుంతలో వాహనదారులను అప్రమత్తం చేస్తూ ఓ కర్రను ఏర్పాటు చేశారు. ఈ గుంత రోజుకు ఇంత చొప్పున పెద్దది అవుతుండగా ప్రమాదం పొంచి ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ మూతను ఆనుకునే ఈ గుంత ఏర్పడింది. జలమండలి అధికారులు ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కళాకారులకు న్యాయం చేయాలి



అభివాదం చేస్తున్న కళాకారులు

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనుమోజు వెంకన్న డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరాకంటి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రతాప్, గ్రేటర్ బాధ్యుడు జవాజి ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జెకట్టి ప్రతి గ్రామంలో ధూంధాంలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపుతూ ఉద్యమాన్ని ముందుకు నడిపామని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ సాంస్కృతిక సారథిలో కేవలం 551 మంది కళాకారులకే ఉద్యోగాలు ఇచ్చారని, అవికూడా అర్హులకు ఇవ్వకుండా డబ్బులు తీసుకుని ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, 15 నెలలు గడుస్తున్నా ఊసే లేదని అన్నారు. సమావేశంలో పాలాటి రాజు, డాక్టర్ సలీం, సత్యనారాయణ, నకిరకంటి చిరంజీవి, భూమయ్య, పుష్ప, కవిత పాల్గొన్నారు.

వ్యవసాయంలో టెక్నాలజీ ఎంతో అవసరం



మాట్లాడుతున్న రైతు నరేందర్‌రెడ్డి

పంజగుట్ట: టెక్నాలజీ సరిగ్గా ఉపయోగించుకోకపోవడంతోనే దేశంలో వ్యవసాయం కుదేలవుతోందని పలువురు రైతులు అన్నారు. అన్నిరంగాల్లో భారత్ అద్భుతంగా రాణిస్తోందని, చంద్రమండలం వరకు చేరుతున్నా వ్యవసాయంలో టెక్నాలజీ ఉపయోగించుకోవడంలో మాత్రం ఇతర దేశాలతో పోలిస్తే చాలా వెనుకంజలో ఉన్నామని వారు అభిప్రాయపడ్డారు. జాతీయ రైతు సాధికారత కార్యక్రమం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులు నరేందర్‌రెడ్డి, అశోక్ కుమార్, దయానంద్, సోమిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకునే హక్కును ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత, అధిక దిగుబడి, ఆదాయం పెంపునకు జన్యుపరంగా మార్పు చేసిన పంటలు ఎంతో ముఖ్యం అన్నారు. వ్యవసాయ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అమెరికా, బ్రెజిల్, అర్జెంటీనాలో రైతులకు లభిస్తున్న అవకాశాలు మన దేశంలో రైతులు ఎందుకు పొందకూడదన్నారు. వాతావరణ మార్పులు సంప్రదాయ సాగు విధానాలకు కొత్త సవాళ్లు విసురుతున్నాయని, ఈ నేపథ్యంలో వీటిని తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే పంటలు ఎంతో అవసరమన్నారు. జన్యు పంటల వల్ల పురుగుల మందు వినియోగం తగ్గుతుందని, వాటివల్ల కలిగే సమస్యలు తగ్గుతాయని, ఇది పర్యావరణానికి ఎంతో మంచిదన్నారు.

నిత్యం ప్రమాదాలు.. పట్టించుకోరేం..



చెట్టును ఢీకొట్టిన సినిమా వాహనం

రహమత్‌నగర్: మూలమలుపు వద్ద ఉన్న పల్లపు రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్పీఆర్‌హిల్స్ గాయత్రిహిల్స్‌కు వెళ్లే దారిలో సబ్ స్టేషన్ వద్ద ఉన్న పల్లపు ప్రాంతంలో వాహనాలు అదుపు తప్పుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. పదుల సంఖ్యలో వాహనాలు ఈ ప్రాంతంలో బోల్తా పడ్డాయి. ఎంతో మందికి గాయాలయ్యాయి. గతంలో ఈ ప్రాంతంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా ఇనుప కమాన్ ఉండేది. ఆరేళ్ల క్రితం ఎస్పీఆర్‌హిల్స్‌లో దళిత స్టడీ సెంటర్ భూమి పూజ కోసం అప్పటి సీఎం కేసీఆర్ రాక సందర్భంగా ఈ కమాన్‌ను తొలగించారు. తాజాగా మంగళవారం రాత్రి ఓ సినిమా షూటింగ్ వాహనం ఇదే రోడ్డుపై అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని బస్తీవాసులు అన్నారు. ఈ ప్రాంతంలో కమాన్ ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకుడు గ్యార నాగరాజు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని బస్తీవాసులు కోరుతున్నారు.

చకచకా వ్యర్థాల తొలగింపు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలో పేరుకుపోయిన మురుగు, వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు తొలగించారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆదేశాల మేరకు నాలుగు రోజుల నుంచి జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 ఇంజినీర్లు నాలాలో డీసిల్టింగ్ పనులు చేపట్టారు. పేరుకుపోయిన మురుగుతో పాటు వ్యర్థాలను తొలగించారు. బసవతారకనగర్, ఎంజీనగర్‌లలో ఈ సమస్య తీవ్రరూపం దాల్చింది. కార్పొరేటర్ చొరవతో ఇంజినీర్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెద్ద ఎత్తున మురుగును తొలగించారు. దీంతో ఇక్కడి రోడ్లు కొంతమేర బాగుపడ్డాయి.



మురుగును తొలగించిన తర్వాత బసవతారకనగర్ బస్తీ రోడ్డు

283 మంది రాంగ్ సైడ్ డ్రైవింగ్



రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న స్కూటరిస్టులకు జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై ఫోకస్ పెట్టిన ట్రాఫిక్ పోలీసులు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తూ 283 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. ఒక్కొక్కరికి రూ.700ల చొప్పున జరిమానా విధించి కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఎస్సార్ నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 160 మంది, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 మంది, బంజారాహిల్స్‌లో 61 మంది, పంజగుట్టలో 42 మంది స్కూటరిస్టులు రాంగ్‌సైడ్‌లో వెళ్తూ నిబంధనలను తుంగలో తొక్కారు.

నో ఎంట్రీలో 18 లారీలు..

నిబంధనలు ఉల్లంఘించి నిషేధిత వేళల్లో నో ఎంట్రీ సమయంలో రోడ్లపైకి వచ్చిన భారీ వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝళిపించారు. నో ఎంట్రీలో రోడ్డెక్కిన వాహనాలపై వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానా విధించడమే కాకుండా వాహనాలను సీజ్ చేశారు. ఎస్సార్‌నగర్‌లో 5, జూబ్లీహిల్స్‌లో 9, బంజారాహిల్స్‌లో 2, పంజగుట్టలో 2 భారీ వాహనాలు నిషేధిత సమయంలో రోడ్డెక్కగా పోలీసులు పట్టుకున్నారు.

రాంగ్‌సైడ్‌లో వస్తే ఊరుకోం..

బంజారాహిల్స్: ద్విచక్ర వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించి రాంగ్‌సైడ్‌లో దూసుకుపోతూ ప్రమాదాలకు కారణమవుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రాంగ్ సైడ్ వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పెద్ద సంఖ్యలో రాంగ్‌సైడ్‌లో వస్తూ ద్విచక్రవాహనదారులు పట్టుబడ్డారు. వీరికి జరిమానాలు విధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతిరోజూ పలుచోట్ల వాహనదారులు రాంగ్‌సైడ్‌లో దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఎక్కడ ఎక్కువగా ఇలాంటి పరిస్థితి ఉంటుందో ఆ ప్రాంతాలను గుర్తించి అక్కడే తనిఖీలు చేపడుతున్నారు.



రాంగ్‌సైడ్‌లో వచ్చిన ద్విచక్ర వాహనదారుడికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

సనత్‌నగర్: నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కేంద్రాల్లో తాగునీరు, బెంచీలు, ఇతర సౌకర్యాలను సిద్ధం చేశారు. వేసవి దృష్ట్యా విద్యార్థులు అస్వస్థతకు గురైతే చికిత్స అందించేందుకు సెంటర్ల వద్దే వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నది. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సిట్టింగ్ బృందాలను సిద్ధం చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఇప్పటికే ఐదుగురితో హైపర్ కమిటీని నియమించారు. విధులు నిర్వర్తించే సిబ్బంది సైతం సెంటర్లలోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లద్దని, అలాగే పరీక్ష జరిగే సమయంలో కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు అందాయి.

నిఘా నీడలో పరీక్షా సెంటర్లు..

సనత్‌నగర్, ఎస్సార్‌నగర్, బేగంపేట, రాంగోపాల్‌పేట, మార్కెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 26 సెంటర్లలో పరీక్షలు జరగనున్నాయి. అత్యధికంగా ఎస్సార్‌నగర్ పీఎస్ పరిధిలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటికే కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. దీనిద్వారా పరీక్షల నిర్వహణ తీరును అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. 500 మంది విద్యార్థులు ఉన్న సెంటర్‌లో ఇద్దరు చొప్పున పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి..

పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరగనున్నాయి. విద్యార్థులను ఉదయం 8.15 నుంచి హాల్‌లోకి అనుమతిస్తారు. 8.45 నుంచి 9 గంటల వరకు వచ్చే విద్యార్థుల ఆలస్యానికి గల కారణాలపై ఆరా తీసి లోనికి అనుమతించనున్నారు.

పోలీస్‌స్టేషన్ వారీగా సెంటర్లు	
ఎస్సార్‌నగర్	20
బేగంపేట	1
రాంగోపాల్‌పేట	2
మార్కెట్	3
సనత్‌నగర్	0



హాల్ టికెట్లు నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ట్రాఫిక్ పోలీసుల సహకారం..

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయంలో చేరుకునేలా ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉండనున్నారు. సెంటర్ల చిరునామా విషయంలో విద్యార్థులు గందరగోళానికి గురైతే వారికి దిశానిర్దేశం చేసేందుకు పోలీసులు ఉండనున్నారు. ఎప్పటిలాగానే ట్రాఫిక్ సిబ్బంది విద్యార్థులకు పూలు అందించి మంచిగా పరీక్షలు రాయాలని విషెస్ చెప్పి లోనికి పంపించేందుకు సెంటర్ల వద్ద సిబ్బంది రెడీగా ఉండనున్నారు.



వరప్రసాద్ రెడ్డికి మెమొంటో బహూకరిస్తున్న ముత్యంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అచ్యుతాదేవి

ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారత

శాంతా బయోటెక్ అధినేత కె.ఐ.వరప్రసాద్ రెడ్డి

కాచిగూడ: ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ఆ దిశగా మహిళలు ముందుకు సాగాలని శాంతా బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం పెరగాలని అన్నారు. రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డి మహిళా కళాశాల వార్షికోత్సవాలు మంగళవారం నారాయణగూడలోని కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వరప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళలు 33 శాతం రిజర్వేషన్ల కోసం కాకుండా సమానత్వం దిశగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, సింధూర, డి.భగవతి తదితరులు పాల్గొన్నారు.

దేశ పురోగతికి భౌగోళిక పరిశోధనలు దోహదం

– జీఎస్ఐ రిటైర్డ్ డీడీజీ డాక్టర్ రామకృష్ణన్



జీఎస్ఐ ఆవిర్భావ దినోత్సవాల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిటైర్డ్ డీడీజీ రామకృష్ణ తదితరులు

మన్సూరాబాద్: భౌగోళిక పరిశోధనలు, ఖనిజ అన్వేషణ, సాంకేతిక ఆవిష్కరణలు దేశ పురోగతికి తోడ్పాటునందిస్తాయని జీఎస్ఐ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) డాక్టర్ ఎం.రామకృష్ణన్ అన్నారు. జీఎస్ఐ 175వ ఆవిర్భావ దినోత్సవాలను జీఎస్ఐటీఐలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయనతోపాటు జీఎస్ఐ ఏడీజీ ఎస్‌డీ పట్నాజే ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖనిజ వనరుల అన్వేషణలను పెంచడంలో జీఎస్ఐ నిబద్ధతతో పనిచేస్తోందని అన్నారు. భౌగోళిక శాస్త్ర ఆవిష్కరణలో జీఎస్ఐ అగ్రగామి సంస్థగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీడీజీ డాక్టర్ ఎస్.రవి, రిటైర్డ్ డీజీలు ఎన్.కుటుంబరావు, రాజు, డీఎంజీ కె.శశాంక్, ఏఎండీ డైరెక్టర్ పీకే శర్మ, టీజీఎండీసీ వైస్ చైర్మన్ బీఆర్‌వీ సుశీల్‌కుమార్, సింగరేణి జనరల్ మేనేజర్ బి. శ్రీనివాసరావు, ప్రొఫెసర్ డాక్టర్ కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ మీడియా ప్రతినిధులకు శిక్షణ



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి(ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ) సంస్థలో వివిధ దేశాలకు చెందిన మీడియా ప్రతినిధుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఐటీఈసీ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి గయానా, నేపాల్, శ్రీలంక, టాంజానియా, సురినామ్ నుంచి 26 మంది మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ మాట్లాడుతూ పత్రికలు స్వేచ్ఛాయుత, బాధ్యతాయుత పత్రికా వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని పెంపొందిస్తాయన్నారు.సామాజిక, ఆర్థిక పురోగతిని ప్రోత్సహించడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అయితే సోషల్ మీడియా ఆవిర్భావం మీడియా ప్రపంచంలో గొప్ప మార్పులను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రావులపాటి పాల్గొన్నారు.

నగరంలో నేడు

- ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో హార్మోనైజింగ్ హ్యూమన్ టచ్,ఏఐ టూరిజం, హాస్పిటాలిటీ పుస్తకావిష్కరణ కార్యక్రమం గచ్చిబౌలి చోటా అంజయ్య నగర్‌లోని రాడిసన్ హైదరాబాద్ హైటెక్ సిటీలో సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- గచ్చిబౌలిలోని కోటక్ పుల్లెల గోపిచంద్ బాడ్మింటన్ అకాడమీలో సీఎస్ఎస్‌హెచ్ ఎన్ సూర్ హెల్తీ స్మైయిన్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకించి హెల్తీ స్మైయిన్ క్యాంపెయిన్ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుంచి జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

- ప్రధాన రహదారిలో ఉన్న ఆక్రమణల తొలగింపు
- ఎనిమిది కాలనీలకు తప్పిన ట్రాఫిక్ ఇబ్బందులు
- స్థానికుల ఫిర్యాదుతో చర్యలు తీసుకున్న హైడ్రా



నిజాంపేట రూట్ క్లియర్!

సాక్షి, సిటీబ్యూరో: అసలే రద్దీ రహదారులు.. ఆపై ఆక్రమణలు.. వాహనచోదకుల అవస్థలు అన్నీ ఇన్నీకావు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అంతే సంగతులు. అయితే హైడ్రాకు ఫిర్యాదు చేయగా ఏళ్లనాటి ఆక్రమణలు మాయమయ్యాయి. వాహనచోదకుల కష్టాలు తీరాయి. మొత్తానికి నిజాంపేట రూట్ క్లియర్ అయింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) మంగళవారం నిజాంపేటలోని బాలాజీ హిల్స్, ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారుల ఆక్రమణలను తొలగించింది. రోడ్లను ఆక్రమిస్తూ నిర్మించిన అపార్ట్‌మెంట్ ర్యాంపులు, మొక్కల కోసం నిర్మాణాలు, ఫెన్సింగ్ లతోపాటు పైఅంతస్తులకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న ఇనుప మెట్లతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు, ఆయా కాలనీవాసులు చేసిన ఫిర్యాదులకు హైడ్రా స్పందించింది. ఇందిరమ్మ కాలనీలో రహదారిని పలువురు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతోపాటు అదనపు గదులు నిర్మించుకున్నారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ కారణంగా వెంకటరాయనగర్, బాలాజీ కాలనీ, కేఎస్ ఆర్ కాలనీ, కొలను తులసిరెడ్డి (కేటీఆర్) కాలనీసహా ఎనిమిది కాలనీలకు రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై విచారణ చేసిన హైడ్రా అధికారులు ఆయా ఆక్రమణలను తొలగించాలని యజమానులకు రెండు నెలలు గడువు ఇచ్చారు. అయినప్పటికీ పరిస్థితి మారకపోవడంతో మంగళవారం నిజాంపేట మున్సిపల్ అధికారులతో కలిసి కూల్చివేతలు చేపట్టారు. పలుచోట్ల రహదారి ఆక్రమణల్ని తొలగించారు. దాదాపు కిలోమీటరుకుపైగా ఉన్న ఆక్రమణలు కూల్చేశారు.

కూల్చివేతలతో ఉద్రిక్తత

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ ఫేజ్ –2 కాలనీలో మంగళవారం హైడ్రా చేపట్టిన కూల్చివేతలు ఉద్రిక్తంగా మారాయి. పలువురు స్థానికులు అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. తమ ఇళ్ల ముందున్న నిర్మాణాలను ఎందుకు కూలుస్తున్నారని ప్రశ్నించారు. చిన్న, చిన్న నివాసాలతోపాటు, వ్యాపారాలు చేసుకునే తమ నిర్మాణాల్లో ఉన్న సామాన్లు సైతం తరలించేందుకు సమయం ఇవ్వలేదని ఆరోపించారు. లక్షలాది రూపాయల సామాన్లు పాడయ్యాయని కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తమపై ఎందుకు కక్ష కట్టిందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంచి చేస్తుందని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తమ కుటుంబాలనే ఛిన్నాభిన్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండున్నరేళ్లుగా పోరాడుతున్నాం

ఈ రహదారుల ఆక్రమణలపై దాదాపు రెండున్నర ఏళ్లుగా పోరాడుతున్నాం. ఆక్రమణలను తొలగించాలని కోర్టు తీర్పు కూడా ఉంది. మున్సిపాలిటీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. అయినా ప్రయోజనం లేకపోయింది. హైడ్రాను ఆశ్రయించిన వెంటనే విచారణ చేపట్టి రెండు నెలల క్రితం సంబంధీకులకు నోటీసులు ఇచ్చారు. ఎవరూ స్పందించకపోవడంతో హైడ్రా కూల్చేసింది.

– చిరంజీవి, బాలాజీ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం

ఈ ఆక్రమణల కారణంగా చాలా ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం. వాటర్ ట్యాంకర్లు కూడా ఈ మార్గంలో వచ్చే పరిస్థితి లేదు. స్కూల్ వ్యాన్లు వచ్చే అవకాశం కూడా లేకపోవడంతో పిల్లలు నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తున్నారు. హైడ్రా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించారు.

– విజయ్, బాలాజీ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి



పెరిగిన చిరుధాన్యాల ప్రాధాన్యం



రైతులతో జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ డైరెక్టర్ తారా సత్యవతి

ఏజీ వర్సిటీ: దేశంలో కోవిడ్‌-19 తర్వాత చిరుధాన్యాల ప్రాధాన్యం బాగా పెరిగిందని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ డైరెక్టర్ సి.తారా సత్యవతి, కర్ణాటక అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మహేష్ పాటిల్ అన్నారు. భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ మిల్లెట్స్ మేళా రెండోరోజు మంగళవారం తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లోని ఎస్సీ, ఎస్టీ రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తి, సాంకేతికత వినియోగం, పురుగుమందుల వాడకం గురించి వివరించారు. రైతులకు శ్రీ అన్న ప్రాసెసింగ్ శిక్షణ యూనిట్, ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్, న్యూట్రీహబ్ ప్యాకేజింగ్ యూనిట్‌లను చూపించి వాటి గురించి వివరించారు. రైతులకు మట్టి పరీక్షా కిట్‌లను ఉచితంగా అందజేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం చిరుధాన్యాల సాగు, సాంకేతికతపై తీసిన డాక్యుమెంటరీ చిత్రాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో నెహ్రూ జంతు ప్రదర్శన శాల డైరెక్టర్ సునీల్ హీరేమత్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ గురించి రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

అర్హులకు రుణాలు అందించాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు జాప్యం లేకుండా రుణాల అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీపీసీ ఆధ్వర్యంలో రుణాల మంజూరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సర్వీస్ సెక్టార్లలో ఎక్కువగా రుణాలు అందించినట్లు చెప్పారు. షెడ్యూల్ కులాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు టీఎస్ఐ పాస్ మేరకు వివిధ సెక్టార్లలో, షెడ్యూల్ తెగలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు సర్వీస్ సెక్టార్లలో రుణాలను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రుణాల మంజూరు, యూనిట్ల గ్రౌండింగ్, సబ్సిడీ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. సమావేశంలో డీపీసీ జీఎం పవన్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, ఎల్డీఎం సుబ్రహ్మణ్యం, డీసీటీఓ పుష్పలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల స్థితి మెరుగుపడేలా వేతన సవరణ



మాట్లాడుతున్న జనకప్రసాద్, శ్యాంసుందర జాజు, ఎస్.నరసింహారెడ్డి తదితరులు

చిక్కడపల్లి: రాష్ట్రవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలను సవరించేందుకు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో సలహా మండలి సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా వేతన సవరణ చేయాలని ప్రతినిధులు అభిప్రాయపడ్డారని చెప్పారు. వివిధ రంగాల్లోని కార్మికులకు సముచిత వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని మండలి తీర్మానించిందని పేర్కొన్నారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో సలహా మండలి కార్యదర్శి శ్యాంసుందరజాజు, కార్మిక ప్రతినిధులు ఎస్.నరసింహారెడ్డి, పిచ్చిరెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ యూసుఫ్, యాజమాన్య ప్రతినిధులు మీలా జయదేవ్, నర్ర రవికుమార్, బాసాని చంద్రప్రకాష్, ప్రొఫెసర్ రవి, ప్రొఫెసర్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు వంశీ చలనచిత్ర స్వర్ణోత్సవాలు



గన్‌ఫౌండ్రీ: దర్శకుడు వంశీ తీసిన చలనచిత్రాలు చూడముచ్చటగా ఉంటాయని సినీనటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో వంశీ ఆర్ట్ థియేటర్స్, శారద ఆకునూరి(అమెరికా)ల సంయుక్త ఆధ్వర్యంలో దర్శకుడు వంశీ ఐదు దశాబ్దాల చలనచిత్ర స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కుటుంబమంతా చూడదగ్గ సినిమాలు తీసే దర్శకుల్లో వంశీ ఒకరని కొనియాడారు. అంతకుముందు గాయనీ గాయకుల సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీ దర్శకులు రేలంగి నర్సింహారావు, నిర్మాతలు వేమూరి సత్యనారాయణ, ఏడిద రాజా, సినిమాటోగ్రాఫర్లు ఎంవీ రఘు, హరి, వంశీ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో ఒబెసిటీ

సాక్షి, సిటీబ్యూరో: జీవనశైలి,సామాజిక ప్రభావాలు, ఒత్తిడి వంటివి ఒబెసిటీకి దారి తీస్తున్నాయని నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ అన్నారు. ప్రపంచ ఒబెసిటీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన ఏఐజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో 'బ్రేక్ ది వెయిట్'పేరిట ఓ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఒబెసిటీపై పోరాటంలో భాగంగా మానసిక, శారీరక కారణాలనూ గుర్తించాలని సూచించారు. పోలీసు శాఖలోని అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకుగాను ఫిట్ కాప్ అనే యాప్‌ను ప్రారంభించామని, దీనిలో 18 వేల మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. దీని ద్వారా దాదాపు 400 మంది జీవనశైలి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని గుర్తించామన్నారు. ఏఐజీ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు ఒబెసిటీ అనేది విదేశీయుల సమస్య మాత్రమే అనుకునే పరిస్థితి లేదని, మన దేశంలో 60 శాతం మంది ఇప్పటికే ఈ సమస్యతో బాధపడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

వరి సాగులో యూరియా వాడకం తగ్గవచ్చు

– ఇరి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజయ్ కోహ్లీ

ఏజీవర్సిటీ: రాబోయే నూతన రకాల వరిసాగులో 50 శాతం యూరియా వాడకం తగ్గే అవకాశం ఉందని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఇరి) ఫిలిప్పైన్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజయ్ కోహ్లీ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'భవిష్యత్తు బాగు కోసం వరి పరిశోధన'అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ రూపొందించిన వరి రకాలతో ఆసియా ఖండంలో ఆహార భద్రత సాధ్యమైందని చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వరి పరిశోధన సంస్థ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ సంస్థలను ఆయన సందర్శించి వర్సిటీలో జరుగుతున్న వరి పరిశోధనల గురించి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ జానయ్య, అజయ్ కోహ్లీ, మహంతి సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావును కలుసుకున్నారు. కార్యక్రమంలో వరల్డ్ ఫుడ్‌ప్రైజ్ అవార్డు గ్రహీత డాక్టర్ సమరెండు మహంతి, డాక్టర్ మీనాక్షి సుందరం, డాక్టర్ బలరాం పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

– ప్రముఖ రచయిత్రి అనితా భోగ్లే

రాయదుర్గం: విజయానికి సామర్థ్యం, వైఖరి, అభిరుచి ఎంతో ముఖ్యమైనవని ప్రముఖ రచయిత అనితా భోగ్లే అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఆమె రచించిన 'ఈక్వల్ ఎట్ డిఫరెంట్'పుస్తకంపై ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియా గజ్దార్‌తో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా నిర్వాహకులపై దృష్టి సారించే 'ఈక్వల్ ఎట్ డిఫరెంట్' అనే పుస్తకాన్ని రాశానని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చాప్టర్ సభ్యులు, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవ ఉదాత్తమైనది: శ్రీధర్‌బాబు

స్పర్శ్ హాస్పైస్ ఆస్పత్రి సేవలు అభినందనీయం

రాయదుర్గం: మానవ సేవకు మించి మరొకటి లేదని, అది ఉదాత్తమైనదని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు అన్నారు. కేన్సర్ రోగులకు స్పర్శ్ హాస్పైస్ ఆస్పత్రి చేస్తున్న వైద్యసేవకు వందనమని అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో పాలియేటివ్ కేర్ సదుపాయం ఉన్న స్పర్శ్ హాస్పైస్ ఆస్పత్రికి జాగ్వార్ ల్యాండ్ రోవర్, బద్రుకా ట్రస్ట్ సంయుక్తంగా రూ.51 లక్షల వ్యయంతో నాలుగు గ్రీన్ కార్లు, మూడు ద్విచక్ర వాహనాలను వితరణ చేశారు. మంత్రి, ఆస్పత్రి డాక్టర్లు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవారం వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది రోగులను కుటుంబసభ్యులుగా చూసుకోవడం అభినందనీయమని అన్నారు. రోగుల ఇళ్లకు వెళ్లి రెండు గంటలపాటు కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో నైతిక మద్దతు ఇవ్వడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. 15 ఏళ్లుగా 12 వేల మంది రోగులకు వైద్యసేవ అందించారని కొనియాడారు. నీటి బిల్లులు, ఆస్తి పన్ను మాఫీ వంటి అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. దాతల సహకారంతో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు, ఆస్పత్రి గవర్నింగ్ బోర్డు సభ్యులు కె.వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, జగదీశ్ రామడుగు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ళ సంజీవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య బృందం, నిర్వాహకులు, రోటరీ క్లబ్ బంజారాహిల్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, బద్రుకా ట్రస్ట్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



స్పర్శ్ హాస్పైస్ ఆస్పత్రి గవర్నింగ్ బోర్డు సభ్యులు, వైద్య బృందం, దాతలతో మంత్రి శ్రీధర్‌బాబు

మహిళలు ఫిట్‌గా ఉంటే కుటుంబానికి ప్రా'ఫిట్'

అంబేడ్కర్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఘంటా చక్రపాణి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి తదితరులు

బంజారాహిల్స్: మహిళలు అన్ని విషయాల్లో ఫిట్‌గా ఉంటే ఆ కుటుంబం అన్ని విధాలుగా ఫిట్‌గా ఉన్నట్లేనని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు–క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఫిట్ ఇండియా'కార్యక్రమాన్ని యూనివర్సిటీలో ఆయన ప్రారంభించారు. ఫిట్ ఇండియా కార్యక్రమానికిగాను దేశవ్యాప్తంగా 69 విశ్వవిద్యాలయాలను ఎంపిక చేయగా, అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉండటం గర్వకారణమన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వారంపాటు ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత వంటి అంశాల్లో మహిళలను సిద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. బాలికల ఉత్సాహాన్ని బట్టి క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని, వారిలో ఆరోగ్యంతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, యూజీసీ–డెబ్ డైరెక్టర్ పల్లవీ కాబ్డే, మహిళా విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ మేరీ సునంద, మహిళా ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ మారథాన్‌ను నిర్వహించారు. అనంతరం మహిళలు బ్యాడ్మింటన్, క్యారమ్స్ తదితర క్రీడల్లో చురుకుగా తదితరులు పాల్గొన్నారు.

రైతులు నష్టపోతున్నా పట్టని ప్రభుత్వాలు

మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వర్‌రావు



చుండూరు రంగారావును సన్మానిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: ప్రకృతి వైపరీత్యాలకు రైతులు నష్టపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వర్‌రావు అన్నారు. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి, పొనక కనకమ్మ జయంతి ఉత్సవాల సభ మంగళవారం ఇక్కడి రాజాబహద్దూర్ వెంకటరామిరెడ్డి భవనంలో జరిగింది. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పొనక కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డి సాంస్కృతిక, సంగీత, సాహిత్య అవార్డులను పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రాంచంద్రప్రసాద్, ప్రజాకవి గోరెటి వెంకన్న, ఆంధ్రా చరణ్‌సింగ్ చుండూరు రంగారావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.రవికుమార్, ప్రొఫెసర్ వైబీ సత్యనారాయణలకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శోభనాద్రీశ్వర్‌రావు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు రైతులపట్ల సవతి ప్రేమ చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కనకమ్మ స్వాతంత్ర్యం, మహిళల హక్కులు, దళితుల ఆత్మగౌరవం కోసం ఎంతో పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పి.వేణుగోపాల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు డాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సంపూర్ణ సహకారం



మోండా డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి. చిత్రంలో ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్

– మేయర్ విజయలక్ష్మి

కంటోన్మెంట్: నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బేగంపేట సర్కిల్ మోండా డివిజన్ పరిధిలో రూ.59.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికలతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వని విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగు నెలల్లో జీహెచ్ఎంసీకి రూ.700 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రతి జోన్‌కు రూ.25 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జీహెచ్ఎంసీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి వేగం పుంజుకుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కార్యక్రమంలో అధికారులు సమ్మయ్య, సుబ్రమణ్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

– రాచకొండ సీపీ సుధీర్ బాబు



నాగోలు: రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. మహిళా అధికారులు పూర్తి శక్తితో పనిచేయాలని, కలల సాకారానికి అహర్నిశలూ పాటుపడాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం నాగోలులోని పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉంటుందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. మహిళలను గౌరవించడం మన భారతీయ సంస్కృతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, రాజేష్ చంద్ర, ప్రవీణ్ కుమార్, ఇందిర, సునీతారెడ్డి, మనోహర్, మల్లారెడ్డి, శ్రీనివాసులు, ఉషా విశ్వనాథ్, నాగలక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

జిమ్‌కి వెళ్లడం ఆరోగ్యానికి మేలే.. కానీ జిమ్‌కి వెళ్లే ముందు మానసికంగా, ఆరోగ్యంగా సంసిద్ధంగా ఉన్నామా? లేదా! అనేది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అందుకు తగిన మూల్యం తప్పదని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. జిమ్ చేసే క్రమంలో నియమావళిని తప్పక పాటించాలని, ప్రాథమిక అవగాహన తప్పనిసరిగా పెంచుకోవాలని చెబుతున్నారు. ఇటీవల జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తూ ప్రమాదవశాత్తూ ఓ మహిళ మృతి చెందిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇప్పుడీ అంశాలు చెప్పుకోడానికి ఇదే ప్రధాన కారణం. సొంత ప్రయోగాలకు పోకుండా నిపుణుల సలహాల మేరకే వ్యాయామం చేయాలనేదే ఇందులోని ముఖ్య ఉద్దేశం. - సాక్షి, సిటీబ్యూరో

మిసెస్ ఇండియా పోటీలకు తెలుగు ఎన్ఆర్ఐ

జాతీయ వేదికపై తెలంగాణకు బింధు ప్రియ ప్రాతినిధ్యం



సాక్షి, సిటీబ్యూరో: లండన్ వేదికగా ప్రముఖ బహుళ జాతి సంస్థలో కార్పొరేట్ లీడ్ రోల్ నిర్వహిస్తున్న తెలుగు వనిత బింధు ప్రియ.. త్వరలో జరగనున్న మిసెస్ ఇండియా 2025 పోటీల్లో ఎన్ఆర్ఐ విభాగంలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ వేదికపై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించడం సంతోషంగా ఉందని నిజామాబాద్ జిల్లాకు చెందిన బింధు ప్రియ తెలిపారు. 2025 ప్రారంభంలో ఎన్ఆర్ఐ విభాగంలో మిసెస్ ఇండియా తెలంగాణ–2025 కిరీటాన్ని గెలుచుకుని త్వరలో జరగనున్న మిసెస్ ఇండియా పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గిటార్, పియానో వంటి సంగీత వాయిద్యాల్లో బింధుకు ప్రావీణ్యంతో పాటు యూకేలోని ప్రసిద్ధ వేదికలపైన నృత్య ప్రదర్శనలివ్వడం విశేషం. సేవా (ఎస్ఈడబ్ల్యూఏ) సభ్యురాలిగా నిరుపేద విద్యార్థుల విద్య, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారు.

జిమ్.. జర భద్రమ్..







అవగాహన అవసరం అంటున్న నిపుణులు

నగర జీవనంలో భాగమైన ఫిట్‌నెస్ కేంద్రాలు

అవగాహనా లోపంతో ఔత్సాహికుల అవస్థలు

సొంత ప్రయోగాలతో పెరుగుతున్న ప్రమాదాలు

ఇటీవల వైరల్ అవుతున్న యస్తిక మృతి వీడియో

ట్రైనర్ పర్యవేక్షణ తప్పనిసరి అంటున్న నిపుణులు

ఈ మధ్యనే ఒక జాతీయ స్థాయి ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించిన యస్తిక (17) ప్రాక్టీస్‌లో భాగంగా 270 కిలోల బరువును ఎత్తుతూ ప్రమాదానికి గురైంది. ప్రమాదవశాత్తు వెయిట్స్ మెడపై పడి చనిపోయింది. సోషల్ మీడియాలో ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీంతో ఇలాంటి ప్రమాదాలకు సంబంధించిన మరికొన్ని వీడియోలను పలువురు సామాజిక మాధ్యమాల్లో.. షేర్ చేస్తున్నారు. కేవలం చిన్న పొరపాట్లే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయేలా చేస్తాయి. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిమ్, వ్యాయామ సమయాల్లో తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలను సూచిస్తున్నారు.

జిమ్ పార్ట్‌నర్ తప్పనిసరి..

ప్రమాదకర వ్యాయామాలు చేస్తున్న సమయంలో జిమ్ పార్ట్‌నర్‌ను ఎంచుకోవడం తప్పనిసరి. ట్రైనర్ ఉన్నప్పటికీ ఎక్కువ సమయం విభిన్న వర్కవుట్లు చేసే క్రమంలో పార్ట్‌నర్ ప్రమాదాల నుంచి రక్షణగా నిలుస్తారు. ముఖ్యంగా బెంచ్ ప్రెస్, స్క్వాట్స్ వంటి వ్యాయామాల్లో, అధిక బరువులను ఎత్తుతూ వర్కవుట్లు చేసే సమయంలో భాగస్వామి సమన్వయం చేస్తారు. స్పాటర్ లిఫ్టింగ్ సమయంలో సహాయకారిగా ఉంటారు.

టెక్నిక్స్‌తోనే సేఫ్..

వెయిట్ లిఫ్టింగ్ వంటి కఠిన వ్యాయామాలు చేసే క్రమంలో ఆరోగ్యంగా ఫిట్‌గా ఉండటం ప్రాథమిక నియమం. ఫామ్‌లో లేని సమయంలో ఎలాంటి బరువులూ ఎత్తే ప్రయత్నం చేయకూడదు. దీంతోపాటు జిమ్ టెక్నిక్స్ ప్రమాదాలు, గాయాల బారినుంచి సంరక్షిస్తాయి. శారీరక, మానసిక దృఢత్వమే హాస్పిటల్ బెడ్‌పై కాకుండా వెయిట్ లిఫ్టింగ్ బెంచ్‌పై ఉండేందుకు ఉపకరిస్తుందని ఉమెన్ ఫిట్నెస్ ట్రైనర్ శ్వేత పేర్కొన్నారు.

పరిసరాలను గమనించాలి..

వ్యాయామం చేస్తున్న సమయంలో చాలా మంది ఇయర్ బడ్స్ పెట్టుకుంటారు. ఇది ప్రమాదాలకు కారణం కావచ్చు. వ్యాయామం చేసేటప్పుడు జిమ్ పరిసరాల్లో, ఇతరులు చేస్తున్న వ్యాయామ ప్రక్రియలను గమనిస్తుండాలి. లేదంటే పొరపాటున ఇతరులు చేసే వ్యాయామ పరికరాలు తగలడం, మీద పడటం, రాడ్స్ తగలడం వంటి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని ట్రైనర్లు చెబుతున్నారు.



ద్రవాలతో డీహైడ్రేషన్‌కు చెక్..

సాధారణంగా జిమ్ సెంటర్లన్నీ వెంటిలేషన్ తక్కువగా ఉండే పెద్ద పెద్ద హాల్స్‌లో నిర్వహిస్తుంటారు. ఓ వైపు వ్యాయామం ద్వారా వచ్చే వేడి, మరో వైపు ఉబికివచ్చే చెమటలు. ఈ కారణాలతో శరీరం డీహైడ్రేట్ కావడం సర్వసాధారణం. ఇలాంటి సమయాల్లో అనువైన ద్రవాలు, పానీయాలు తీసుకోవడం కీలకం. లేదా ఇతర ప్రమాదాలకు డీహైడ్రేషన్ కూడా కారణమవుతుంది.



క్రమశిక్షణ ముఖ్యం..

జిమ్ కల్చర్‌లో క్రమశిక్షణ ప్రాథమిక నియమం. ఫిట్నెస్ వ్యాయామాల తరువాత జిమ్ ఎక్విప్‌మెంట్ వాటిని భద్రపరిచే ర్యాక్‌లో పెట్టడం ఇతరులను ప్రమాదాల నుంచి నివారిస్తుంది. జిమ్ ఫ్లోర్‌పై డంబెల్స్, వెయిటింగ్ బెల్స్ ఎక్కడివక్కడే ఉంచడం వల్ల కాలికి గాయాలయ్యే ప్రమాదం ఉంది. ఒక్కోసారి స్కిప్ అయ్యి దానిపై పడితే తలకు బలమైన గాయాలు అయిన సందర్భాలూ కోకొల్లలు. జిమ్‌లో తగిలే గాయాలకు మరో ప్రధాన కారణం 'వ్యాయామ క్రమశిక్షణ' లేకపోవడమేనని ప్రముఖ ట్రైనర్ సంతోష్ హెన్రిక్ తెలిపారు.

వార్మ్ అప్ తప్పనిసరి..

వ్యాయామాలకు ముందు వార్మ్ అప్ తప్పనిసరి. దీనిని గంటల తరబడి చేయాల్సిన అవసరం లేదు.. ముఖ్యంగా కార్డియో యంత్రాలను ఉపయోగిస్తుంటే, నెమ్మదిగా ప్రారంభించి క్రమంగా పరుగుకు చేరుకోవాలి. స్టైల్ సెషన్ చేయబోతున్నట్లయితే.. శరీరమంతా రక్తప్రసరణ సజావుగా సాగేలా తేలికపాటి జాగింగ్‌తో ప్రారంభించాలి. బరువులు ఎత్తడం, పిన్- లేదా ప్లేట్-లోడెడ్ మెషీన్ల విషయంలో వాటి కదలికలకు అనుగుణంగా శరీరాన్ని ఉంచాలి.



సమయం తప్పనిసరి..

ఉరుకుల పరుగుల జీవితంలో ఎప్పుడు కుదిరితే అప్పుడు ఆదరాబాదరా జిమ్‌కి వెళ్లడం సరికాదు. ఇది అత్యంత ప్రమాదకరం. వ్యాయామాలు, ఫిట్నెస్ ప్రక్రియలను నిర్దేశిత సమయాల్లోనే చేయాలి. తక్కువ సమయంలో పూర్తి చేసి వెళ్లాలనే తొందరలో ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అంతేకాదు.. జిమ్ పార్ట్నర్ కోసం త్వరగా ముగించడం, ఎక్కువ సేపు చేయడం కూడా ప్రమాదమే.

మన స్థాయికి తగ్గట్టుగానే..

వ్యాయామాల్లో ఎక్కువగా చేసే తప్పులు 'సామర్థ్యానికి మించిన బరువులను ఎత్తడం'. అధిక బరువులను ఓ క్రమ పద్ధతిలో రోజు రోజుకూ పెంచుకుంటూ పోవాలనేది నిపుణుల సూచన. ఎంత ఎత్తగలరో అంతే ఎత్తండి అని ప్రతి ట్రైనర్ చెబుతుంటారు. అనివార్యకారణాల వల్ల కొన్ని రోజులు జిమ్‌కు వెళ్లని పక్షంలో.. తిరిగి మునుపటి బరువులు ఎత్తడం సరికాదు. దీనివల్ల కండరాలకు గాయాలయ్యే ప్రమాదం ఉందని బంజారాహిల్స్‌లోని ఓ జిమ్ ట్రైనర్ రవి చెబుతున్నారు.

టవల్ తప్పనిసరి..

వ్యాయామాలు చేసేవారు తమతోపాటు తప్పనిసరిగా టవల్ వెంట తీసుకెళ్లాలి. ఇది ఆరోగ్య రక్షణకు, ప్రమాదాల నివారణకు సహకరిస్తుంది. వ్యాయామాల సమయంలో పట్టే చెమట వల్ల బరువైన వస్తువులు జారిపోయే ప్రమాదం ఉంది. తద్వారా గాయాలు కావొచ్చు. టవల్‌తో చెమటను తుడుచుకోవడం వల్ల దాని ద్వారా వచ్చే సూక్ష్మ క్రిములు తొలగిపోయి చర్మానికి రక్షణ చేకూరుతుంది.

కలినరీ కళాశాలలో కోల్డ్ కట్స్ డే







సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్మెంట్ వేదికగా నిర్వహించిన ఫుడ్ ఫెస్ట్ ఆకట్టుకుంది. నేషనల్ కోల్డ్ కట్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా హోటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలు మంగళవారం నోరూరించాయి. ఇందులో భాగంగా స్టైలిష్ డెకరేషన్‌తో వెజ్, నాన్ వెజ్ వంటకాలు ఆహార ప్రియులను అలరించాయి. అమెరికాలో ఎంతో ఘనంగా నిర్వహించే నేషనల్ కోల్డ్ కట్స్ ఫుడ్ ఫెస్ట్ హైదరాబాదులో నిర్వహించడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి తెలిపారు. కలినరీ అండ్ హోటల్ మేనేజ్మెంట్ చివరి సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో భాగంగా ఇలాంటి ఫెస్ట్‌లో వంటకాలను ప్రదర్శించడం వారి భవిష్యత్తుకు ఉపకరిస్తుందన్నారు. కోల్డ్ అండ్ కట్స్ ఫుడ్ ఫెస్ట్ ఐటీసీ కోహినూర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ అమర్ జమల్, తెలంగాణ స్పైస్ కిచెన్ కార్పొరేట్ చెఫ్ రిజ్వాన్ అబ్దుల్, షర్టన్ హోటల్ ఎగ్జిక్యూటివ్ బెంజిమన్ ముఖ్య అతిథులుగా హాజరై పలు వంటకాలను రుచిచూశారు.

చిత్రం భళా..

ఆకట్టుకుంటున్న చతుర్వింశతి ప్రదర్శన


సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ హాజరు















విజయనగర్‌కాలనీ : క్షణంలో అదృశ్యమయ్యే సుందర చిత్రాలను కెమెరాల్లో బంధించి ప్రపంచానికి చాటిచెప్పే అద్భుత కళ ఫొటోగ్రఫీ అని జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.గంగాధర్, 'బాహుబలి' సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో చతుర్వింశతి పేరిట మంగళవారం ఆర్ట్, ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు వివిధ అంశాలపై ప్రదర్శనలను ప్రారంభించారు. ఫొటో ఎగ్జిబిషన్‌లో దేశంలోని పలు నగరాలు, పుణ్యక్షేత్రాలు, నృత్యం, పల్లె జీవనం, వైల్డ్‌లైఫ్, మోడలింగ్, ఏజెన్సీ ప్రాంతాలు, పక్షులు వంటి చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభకు, సృజనాత్మకతకు ఈ ప్రదర్శన అద్దం పడుతుందన్నారు. కళామతల్లికి చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ఫైన్ ఆర్ట్స్‌లో భాగమైన ఫొటోగ్రఫీ విద్యార్థులు సినిమా, టీవీ రంగాలతో పాటు దేశ విదేశాల్లో అత్యున్నత పదవుల్లో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రదర్శ ఈ నెల 7 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మధుకర్, ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంఎల్ ఆనంద్‌రావు, ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఆర్.కమల్‌రాయ్, ఎన్.హరీష్‌కుమార్, అన్నారపు నరేందర్, జితేందర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నోరూరించే లజీజ్-ఈ-గోష్త్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మటన్ ప్రియుల జిహ్వా చాపల్యాన్ని తీర్చేందుకు బార్బెక్యూ నేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో 'లజీజ్–ఈ–గోష్త్' పేరుతో ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభించారు. ఈ ఫెస్టివల్ ఏప్రిల్ 6 వరకూ ఆహార ప్రియులను అలరించనుందని బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీ లిమిటెడ్ సీడీవో మాన్సూర్ మెమోన్ తెలిపారు. ఈ విందులో అరుదైన వంటకాలైన మటన్ మారగ్ సూప్, ఖీమా కలేజి, మటన్ ఖీమా పావ్, గలౌటీ కబాబ్, మటన్ శేఖావతి సీఖ్, మటన్ రాన్ వంటి స్పెషల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన వంటకాల్లో మృదువైన మసాలాలతో హైదరాబాదీ మటన్ హలీం, నిహారి గోష్త్, షాహీ మటన్ ఖోర్మా, హైదరాబాదీ జాఫ్రాని మటన్ దమ్ బిర్యానీ వంటి రుచులను ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ ఫెస్టివల్ అనుభూతిని పెంచేందుకు థీమ్‌కు అనుగుణంగా వేషధారణలో ఉన్న సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.





FOOD FEST


టోలిచౌకీలో ఊర్మిళ చౌహాన్ సందడి

గోల్కొండ : హైదరాబాద్ వంటకాలు అంటే తనకు ఎంతో ఇష్టమని మిస్ ఇండియా తెలంగాణ–2023 ఊర్మిళ చౌహాన్ అన్నారు. టోలిచౌకీలోని హోటల్ ఇంపీరియల్‌లో మంగళవారం హలీం ఆరగించారు. మొగల్ వంటకాలు మరీ ముఖ్యంగా హలీం, బిర్యానీ అంటే తనకు ఇష్టమని ఊర్మిళ చెప్పారు. ఆమె వెంట ఇంపీరియల్ హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.



ఐఐటీహెచ్‌లో స్టెమ్ సెల్ డొనేషన్ క్యాంప్

సాక్షి,సిటీబ్యూరో: బ్లడ్ క్యాన్సర్, ఇతర రక్త రుగ్మతల నివారణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ డీకేఎంఎస్ ఫౌండేషన్ ఇండియా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీ)తో కలిసి స్టెమ్‌సెల్ డొనేషన్, అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఐఐటీ హైదరాబాద్ కళాశాల వార్షికోత్సవం ఎలాన్–ఎన్విజన్ 2025లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 350 మందికి పైగా విద్యార్థులు రక్త మూల కణ దాతలుగా పేర్లు నమోదు చేసుకోడానికి ముందుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలాన్–ఎన్విజన్ 2025 కో–ఆర్డినేటర్ మెహుల్ శ్రీవాత్సవ, డీకేఎంఎస్ ఆసియా ఎండీ పాట్రిక్ పాల్ పాల్గొని రక్తమూలకణ దాన కార్యక్రమంపై మాట్లాడారు.



క్లుప్తంగా...

నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

మూసీ బాధితులకు అండగా నిలబడండి

- రైతు కమిషన్‌తో సామాజిక, పర్యావరణ వేత్త మేధాపాట్కర్ భేటీ



మేధాపాట్కర్‌ను కలిసిన కోదండరెడ్డి తదితరులు


సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవం పథకంలో ఇళ్లు కోల్పోయిన వారికి అండగా నిలవాలని ప్రముఖ సామాజిక, పర్యావరణ వేత్త మేధాపాట్కర్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆమె రెండ్రోజులుగా మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శించారు. మంగళవారం బీఆర్కే భవన్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్‌తో మేధాపాట్కర్ సమావేశమయ్యారు. తన పర్యటన, మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల ఇళ్లు కోల్పోయిన వారి విషయాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతుల గురించి కమిషన్‌తో చర్చించారు. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, వ్యవసాయ భూములు, ఇతర భూములు, కోల్పోయిన వారికి ఆర్థికసాయం అందించడానికి సర్కార్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఫోర్త్ సిటీ విషయంలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. మూసీ పునరుజ్జీవం చర్చలతోనే సాధ్యం అని ఆమె స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి పాలన పట్ల మేధాపాట్కర్ సంతృప్తి వ్యక్తం చేసినట్టు కమిషన్ తెలిపింది.

ముసద్దీలాల్, ఎంబీఎస్ జువెల్లర్స్‌పై పీసీ దాఖలు చేసిన ఈడీ

- డైరెక్టర్లపై మనీలాండరింగ్ కింద అభియోగాలు

సాక్షి, హైదరాబాద్: మనీలాండరింగ్ కేసులో ముసద్దీలాల్ జెమ్స్ అండ్ జువెల్లర్స్, ఎంబీఎస్ జువెల్లర్స్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రాసిక్యూషన్ కంప్లైంట్ (పీసీ) దాఖలు చేసింది. డైరెక్టర్లు సుఖేష్ గుప్తా, కత్రి రవిప్రసాద్, వల్లూరి మోహన్‌రావులపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అభియోగాలు మోపింది. ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ కంప్లైంట్‌ను నాంపల్లిలోని ఆర్థిక నేరాల కోర్టు విచారణకు స్వీకరించింది. కేసు వివరాలను హైదరాబాద్ జోన్ ఈడీ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ మంగళవారం వెల్లడించారు. గోల్డ్ క్రెడిట్ స్కీమ్ పేరుతో ముసద్దీలాల్ జెమ్స్ అండ్ జువెల్లర్స్ సుఖేష్‌గుప్తా మినరల్స్ అండ్ మెటల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎంఎంటీసీ) ఆఫ్ ఇండియా వద్ద గోల్డ్ బులియన్ బయ్యర్ క్రెడిట్ లోన్స్ స్కీమ్ ఆఫర్ తీసుకున్నాడు. 5 శాతం మార్జిన్ మనీ అదనంగా చెల్లించకుండా మోసం చేశాడు. దీని ద్వారా ఎంఎంటీసీకి రూ.549.06 కోట్ల నష్టం వాటిల్లింది. ఇలా సంపాదించిన సొమ్మును వివిధ కంపెనీలకు మళ్లించారు. ఎంఎంటీసీ ఫిర్యాదు ఆధారంగా 2018లో సీబీఐ కేసు నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది.

పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల నిరసన



ప్రజావాణిలో చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సర్పంచుల జేఏసీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మంగళవారం ప్రజాభవన్ ఎదుట మాజీ సర్పంచులు నిరసన తెలిపారు. సచివాలయం సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ తర్వాత ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ, 'మీనాక్షమ్మా.. మా సర్పంచుల గోడు వినిపించుకోండి. ప్రభుత్వం ద్వారా మాకు రావలసిన పెండింగ్ బిల్లులు ఇప్పించండి'అని కోరారు. తమ పెండింగ్ బిల్లుల కోసం శాంతియుత మార్గంలో అనేక రూపాల్లో నిరసన తెలిపినా ప్రభుత్వం దయ చూపడం లేదన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ సీఎంతో మాట్లాడి తమను ఆత్మహత్యల బారి నుండి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కాగా, మంగళవారం నాటి ప్రజావాణికి 401 దరఖాస్తులు అందాయి. ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు.

సోలో ట్రిప్‌కే అతివల ఆసక్తి

ట్రెండ్ మార్చిన మహిళలు

2025లో మహిళల 'సోలో ట్రావెలింగ్' ప్రధాన ట్రెండ్

- గతేడాది కంటే 7 శాతం పెరుగుతుందని అంచనా
- పాప్ సంస్కృతి, రిట్రీట్ వెల్నెస్ పర్యాటకానికి ఆసక్తి
- పర్యాటక శక్తి కేంద్రంగా ప్రకాశిస్తున్న ఆసియా
- వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫామ్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: పర్యాటకుల అభిరుచి కొత్త పుంతలు తొక్కుతోంది. వర్తమాన జీవితంలో సంతోషానికే ప్రాధాన్యత పెరుగుతోంది. ఈ క్రమంలోనే 2025 సంవత్సరం మహిళల సోలో ప్రయాణాలకు కేరాఫ్‌గా మారనుంది. దీనికితోడు వెల్నెస్ రిట్రీట్‌లు, పాప్ సంస్కృతి ప్రేరేపిత టూర్లపై ఆసక్తి కనిపిస్తోంది. వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫామ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ఈ ఏడాది అత్యంత ముఖ్యమైన ట్రెండ్‌లలో 'సోలోగా మహిళా ప్రయాణం' ఒకటిగా నిలుస్తోంది. 2024లో సోలో వీసాలకు దరఖాస్తు చేసిన మహిళలు 30 శాతం ఉంటే.. ఈ ఏడాది 37 శాతానికి పెరుగుతుందని అంచనా వేస్తోంది. సుమారు 25–40 ఏళ్ల మధ్య మహిళలు సోలో ట్రిప్‌లను ఉద్యమంగా చేపట్టబోతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. బాలి, థాయ్‌లాండ్, జపాన్ వంటి గమ్యస్థానాలలో సాహస యాత్రల ద్వారా తమ అన్వేషణను చేపట్టాలని భావిస్తున్నట్టు తేలింది.

పర్యాటక శక్తి కేంద్రంగా ఆసియా

ప్రపంచ ప్రయాణ రంగంలో ఆసియా ఆధిపత్యం కొనసాగుతోంది. థాయ్‌లాండ్, జపాన్, వియత్నాంతో పాటు ఇండోనేషియా 2025లో అత్యంత పర్యాటక రద్దీని ఎదుర్కోనుంది. వీసా రహిత విధానాలు, వివిధ ఎక్స్‌పోలు లక్షలాది మంది సందర్శకులను ఆకర్షించనుంది. సింగపూర్‌కు చెందిన డిస్నీ క్రూయిజ్‌కు 27 శాతానికిపైగా డిమాండ్ పెరగనుంది.

నోరూరించే రుచుల కోసం

ప్రయాణ ప్రణాళికలో ఆహారం ప్రధాన భాగంగా మారుతోంది. 2025లో వంటకాల పర్యాటకం గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు. ఇటలీ ట్రఫుల్ ఫెస్టివల్, థాయ్‌లాండ్ సాంగ్‌క్రాన్ ఫుడ్ ఫెస్టివల్ వంటి ఐకానిక్ ఈవెంట్లు ప్రపంచవ్యాప్తంగా ఆహార ప్రియులను ఆకర్షిస్తున్నాయి. అదే సమయంలో స్లోవేనియా, లావోస్, ఫారో దీవులు వంటి ఆఫ్‌బీట్ గమ్యస్థానాలు సాహస యాత్రల అనుభవాలను మహిళలు కోరుకుంటున్నారు.

ఆరోగ్యకర ప్రయాణం

ప్రయాణికులు తమ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. బాలి, తైవాన్ వంటి ప్రశాంతమైన గమ్యస్థానాలలో యోగా, ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఎక్కువ ప్రాంతాలను చుట్టిరావడం కంటే ఒకే ప్రాంతంలో అనుభూతులను పూర్తిగా ఆస్వాదించేలా 'స్లో ట్రావెలింగ్' భావనను అలవర్చుకుంటున్నారు. మరోవైపు పాప్ సంస్కృతి ప్రయాణాన్ని ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా ఇష్టపడుతున్నారు. అభిమానులు తమకు ఇష్టమైన సినిమాలు, ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాల నుంచి ప్రేరణ పొంది టూర్లను ప్లాన్ చేసుకుంటున్నారు.





ఆధారం : పీఐబీ

యూపీ, బిహార్‌లోనే డాల్ఫిన్లు ఎక్కువ

మనదేశంలోని నదుల్లో మొత్తం 6,327 డాల్ఫిన్లు ఉన్నాయి. ఇందులో గంగానది, దాని ఉపనదుల్లో 5,689 ఉంటే.. బ్రహ్మపుత్ర, దాని ఉపనదులు, బియాస్ నదుల్లో మిగతావి ఉన్నాయి. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ జాతీయ వన్యప్రాణి మండలి సమావేశంలో డాల్ఫిన్లపై ఒక నివేదిక విడుదల చేశారు. మనదేశంలో ఇలాంటి నివేదిక ఇదే మొదటిసారి. దేశంలోని 8 రాష్ట్రాల్లోని 28 నదుల్లో సర్వే చేసి దీన్ని రూపొందించారు. అత్యధిక డాల్ఫిన్లు యూపీ, బిహార్‌లలోని నదుల్లో ఉన్నాయి.

రాష్ట్రం	డాల్ఫిన్ల సంఖ్య
యూపీ	2,397
బిహార్	2,220
పశ్చిమ బెంగాల్	815
అస్సాం	635
ఝార్ఖండ్	162
రాజస్తాన్, మధ్యప్రదేశ్	95
పంజాబ్	3

పాత ప్రాజెక్టుల బాగోగులు పట్టవా?



- నిర్వహణ, పర్యవేక్షణకు నయాపైసా విదల్చని సర్కారు
- 2024–25 బడ్జెట్‌లో రూ.480 కోట్ల కేటాయింపులు
- ఇప్పటివరకు ఒక్క రూపాయి విడుదల చేయని వైనం
- 170 పనులకు సంబంధించి రూ.160 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్
- నీటిపారుదల శాఖ ఓకే చేసినా ఆర్థిక శాఖ ససేమిరా

సాక్షి, హైదరాబాద్: కొత్త సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఏటా రూ.వేల కోట్లు ఖర్చుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. నిర్మాణం పూర్తైన ప్రాజెక్టుల బాగోగులకు మాత్రం నయాపైసా విదల్చడం లేదు. దీంతో రూ.లక్షల కోట్లు విలువ చేసే ప్రాజెక్టులు గాలిలో దీపంలా మారాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ (ఓ అండ్ ఎం)కు 2024–25 బడ్జెట్‌లో రూ.480 కోట్లు కేటాయించగా, మరో 26 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్నా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి విడుదల చేయలేదు. సాగునీటి ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల విలువ రూ.160 కోట్లకు ఎగబాకింది. మొత్తం 170 పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నీటిపారుదల శాఖ టోకెన్లు జారీ చేసినా, ఆర్థిక శాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లు (బీఆర్ఓ) జారీ చేయకపోవడంతో వాటికి మోక్షం లభించడం లేదు.

దయనీయంగా దేవాదుల

కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు మినహా రాష్ట్రంలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణను ప్రభుత్వం.. ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించింది. దేవాదుల ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ చూస్తున్న కాంట్రాక్టర్ ఏడాదికాలంగా బిల్లులు చెల్లించకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించలేక చేతులెత్తేశారు. దీంతో కార్మికులు ఇటీవల పంప్‌హౌస్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. తక్షణమే బిల్లులు చెల్లించకపోతే మోటార్లను బంద్ చేసి నీటి పంపింగ్‌ను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. రెండేళ్ల పాటు ఓ అండ్ ఎం పనులు నిర్వహించేందుకు రూ.22 కోట్ల అంచనాలతో కాంట్రాక్టు అప్పగించగా, సదరు కాంట్రాక్టర్‌కు రూ.9 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే యాసంగి సాగు చివరి దశలో ఉండడంతో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌కు సర్దిచెప్పి నీటి పంపింగ్ కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.

ఓ అండ్ ఎం లోపాలే శాపం!

గతేడాది గోదావరికి వచ్చిన వరదల్లో తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు పెద్దవాగు కొట్టుకుపోగా, నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. 500కి పైగా చెరువులకు కూడా గండ్లు పడ్డాయి. వీటికి నిర్వహణ లోపాలే కారణమనే ఆరోపణలొచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యాలకు కూడా నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు ఓ కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తన మధ్యంతర నివేదికలో స్పష్టం చేసింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. తెలంగాణ ఏర్పడ్డాక గత 11 ఏళ్లలో కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.1.9 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ప్రాజెక్టుల నిర్వహణకు మాత్రం ఏటా రూ.100 కోట్లను కూడా ఖర్చు చేయడం లేదు. నెలకు కనీసం రూ.20 కోట్లు ఇచ్చినా ప్రాజెక్టుల నిర్వహణ సజావుగా సాగుతుందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

పనులు చిన్నవే.. కాని అత్యంత కీలకం!

రాష్ట్రంలో 40 వరకు భారీ, మధ్యతరహా జలాశయాలుండగా, వాటికి 1,884 గేట్లున్నాయి. 42 వేల కి.మీ. మేర ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, 900 కి.మీ. మేర పైప్డ్ కాల్వలు, 138 పంప్‌హౌస్‌లు, 115 సబ్‌స్టేషన్లతో పాటు కాల్వలపై బ్రిడ్జీలు, అక్విడక్ట్‌లు వంటి 1.3 లక్షల ఇతర నిర్మాణాలున్నాయి. జలాశయాల గేట్లకు గ్రీజింగ్, గేట్లు ఎత్తే క్రేన్లు, జనరేటర్లు, రోప్‌వైర్లకు మరమ్మతులు, కాల్వల్లో కలుపు మొక్కల తొలగింపు, దెబ్బతిన్న కాల్వలకు మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులు, డిస్ట్రిబ్యూటరీల నిర్వహణ వంటి పనులు నీటిపారుదల శాఖలోని ఓ అండ్ ఎం విభాగం పరిధిలోకి వస్తాయి. స్థానిక చిన్నస్థాయి కాంట్రాక్టర్లే వీటిని చూస్తుండగా, బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేపట్టేందుకు వారు ముందుకు రావడం లేదు. ఏదైనా జలాశయం గేట్లకు గ్రీజింగ్‌కు ఏటా రూ.10 లక్షల లోపే వ్యయం కానుండగా, ఈ పనులు చేయకపోతే వరదల సమయంలో గేట్లు మొరాయించే ప్రమాదం ఉంటుంది. కాల్వల్లో కలుపు మొక్కలు, పూడిక పేరుకుపోవడంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో చాలా ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని పెద్దసంఖ్యలో ఫిర్యాదులొస్తున్నాయి.

రోడ్డెక్కిన ఎయిర్‌పోర్ట్ భూ నిర్వాసితులు

- భూమికి బదులు భూములు ఇవ్వాలని డిమాండ్
- ఆర్డీవో, ఏసీపీ హామీతో ఆందోళన విరమణ



వరంగల్ -నెక్కొండ రోడ్డుపై గుంటూరుపల్లి వద్ద భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్: మామునూరు విమానాశ్రయ రన్‌వే విస్తరణలో భూములు కోల్పోతున్న 200 మంది నిర్వాసితులు రోడ్డెక్కారు. మంగళవారం ఉదయాన్నే సర్వే కోసం వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామ సరిహద్దులోనే అడ్డుకున్నారు. వరంగల్–నెక్కొండ రహదారిపై గుంటూరుపల్లిలో గాడిపెల్లి, నక్కలపెల్లి, నల్లకుంట, గుంటూరుపల్లి గ్రామాల ప్రజలు బైఠాయించి నినాదాలు చేశారు. రన్‌వే కింద భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూములివ్వాలని.. లేదా బహిరంగ మార్కెట్ ధరకి తగినట్టుగా పరిహారం చెల్లిస్తే భూములిచ్చేందుకు తాము సిద్ధమేనని చెప్పారు. గుంటూరుపల్లి నుంచి నగరానికి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం చూపిన తర్వాతే భూ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో గ్రామంలో ఒక్కసారి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, మామునూరు ఏసీపీ తిరుపతి, ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా స్పెషల్ పోలీసులు మోహరించారు. భూ నిర్వాసితులతో జిల్లా కలెక్టర్ నేరుగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తెగేసి చెప్పారు. దీంతో కొద్దిసేపు భూ నిర్వాసితులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. జిల్లా కలెక్టర్‌తో చర్చించి ప్రత్యామ్నాయ దారితోపాటు భూ సమస్యకు మార్గం చూపుతామని ఆర్డీవో హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. కాగా, విమానాశ్రయం పునరుద్ధరణతో అక్కడ ఒక్కసారిగా భూమి రేట్లు పెరిగాయి. దీంతో ఎయిర్ పోర్ట్ రన్‌వే కింద భూములు కోల్పోతున్న రైతులు ఆందోళనకు దిగినట్టు తెలుస్తోంది.

కలెక్టర్ ఎన్‌వోసీ ఎలా జారీ చేస్తారు?

సర్కార్ భూమిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ నౌఖల్సా గ్రామం ప్రశాంతి హిల్స్ పరిధిలోని 25 ఎకరాల భూమిలోని 200 గజాలకు సంబంధించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)ను కలెక్టర్ ఎలా జారీ చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. చట్టంలోని ఏ నిబంధన మేరకు ఎన్‌వోసీ జారీ చేసే అధికారం ఉందో చెప్పాలని ఆదేశించింది. నిర్దిష్ట ఆస్తిపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదని 2023, సెప్టెంబర్ 4న ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలిచ్చింది. సీఎస్ నుంచి సరైన వివరణ రాని పక్షంలో ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల కాపీ ప్రత్యేక మెసెంజర్ ద్వారా సీఎస్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది. పిటిషన్ ఉపసంహరణకు దరఖాస్తు చేసినా అనుమతించరాదని స్పష్టంచేసింది. తదుపరి విచారణ ఈనెల 10కి వాయిదా వేసింది. ప్రశాంతి హిల్స్ పరిధి సర్వే నంబర్ 66/2లోని 25 ఎకరాలపై ప్రభుత్వానికి హక్కులున్నాయని పేర్కొంటోంది. ఈ క్రమంలో అందులోని 200 గజాల్లో కె.మృత్యుంజయ రెడ్డి ఇంటి నిర్మాణం కోసం ఎన్‌వోసీ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్ నల్లకుంటకు చెందిన ఏ.చెన్నెమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కలెక్టర్‌తో పాటు శేరిలింగంపల్లి తహసీల్దార్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)ని అధికారిక ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ భూమిపై సర్కారుతోపాటు నాగా సహకార సంఘం హక్కులున్నాయని చెబుతోందన్నారు. సివిల్ కోర్టులో పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే ఆ 200 గజాల ప్లాట్‌పై మృత్యుంజయరెడ్డికి ఎన్‌వోసీ జారీ చేశారని పేర్కొన్నారు. అనంతరం నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి పొందారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన తీరు సందేహాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు పన్నాగం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: గతంలో ప్రభుత్వ భూముల అమ్మకంపై మొసలికన్నీరు కార్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం వేలాది కోట్ల రూపాయల విలువైన భూముల వేలానికి తెరలేపాడని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ భూములను అమ్మబోమని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి..విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. ప్రభుత్వ భూముల అమ్మకంపై అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన రేవంత్ క్షమాపణ చెప్పాలని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మాస్టర్‌ప్లాన్ పేరిట రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25 పరిధిలోని 400 ఎకరాలను వేలం వేసి రూ.30 వేల కోట్లు సమీకరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గతంలో ఇవే భూములను బ్యాంకర్లకు తనఖా పెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించిందని చెప్పారు. బ్యాంకులో తనఖా పెట్టిన భూములను తిరిగి వేలం వేయడం ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. గత ఏడాది జూన్ 26న అసెంబ్లీ వేదికగా వాస్తవాలను తాను బయటపెట్టినా, ప్రభుత్వం బుకాయించిందని తెలిపారు. నిండుసభలో సీఎం, మంత్రులు తప్పుడు సమాచారంతో సభ్యులను తప్పుదోవ పట్టించారని హరీశ్‌రావు మండిపడ్డారు. తలాతోక లేని విధానాలు, నిర్ణయాలతో రాబడి తగ్గి చివరకు ప్రభుత్వ భూములను అమ్ముకునే స్థాయికి రేవంత్ ప్రభుత్వం దిగజారిందన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ

అసెంబ్లీలో తాను అడిగిన నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు సమాధానాలు రాకపోవడాన్ని ప్రశ్నిస్తూ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు హరీశ్‌రావు మంగళవారం లేఖ రాశారు. అసెంబ్లీ బిజినెస్ రూల్స్ 52(1) ప్రకారం..శాసనసభ్యులు అడిగిన నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు రాతపూర్వక సమాధానాలను సభాటేబుల్‌పై అందుబాటులో ఉంచాల్సి ఉంటుందని ఆ లేఖలో గుర్తు చేశారు. అయితే గడిచిన అసెంబ్లీ సమావేశాల్లో తాను అడిగిన ప్రశ్నలకు ఇప్పటివరకు సమాధానాలు రాలేదన్నారు. రాష్ట్ర, నియోజకవర్గ ప్రయోజనాల కోసం అసెంబ్లీలో ప్రశ్నలు అడగటం, సకాలంలో వాటికి సమాధానాలు పొందటం శాసనసభ్యుల హక్కుగా హరీశ్‌రావు పేర్కొన్నారు. తాను అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానాలు ఇచ్చేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు.

నిన్న తనఖా.. నేడు వేలం!

▶ మొదటి పేజీ తరువాయి

కంచ గచ్చిబౌలిలోని 25(పీ) సర్వే నంబరులోని సుమారు రూ.20 వేల కోట్లు విలువ చేసే 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టాలని నిర్ణయించింది. 'క్యాపిటల్ ట్రస్ట్' అనే మర్చంట్ బ్యాంకర్‌కు రూ.10 వేల కోట్ల రుణ సేకరణ బాధ్యతను అప్పగించింది. ఈ క్రమంలో 9.6 శాతం వడ్డీపై రుణం ఇచ్చేందుకు ఐసీఐసీఐ బ్యాంకు ముందుకు వచ్చింది. అయితే ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలనే మెలిక పెట్టింది. ప్రభుత్వ గ్యారంటీతో తాకట్టు ద్వారా తీసుకునే రుణాలకు కూడా 'ద్రవ్య బాధ్యత బడ్జెట్ నిర్వహణ' (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధన వర్తిస్తుందని ఆర్‌బీఐ వర్గాలు స్పష్టం చేశాయి. అయినప్పటికీ నిధుల అత్యవసరాన్ని దృష్టిలో పెట్టుకుని గత ఏడాది అక్టోబర్ 26న జరిగిన కేబినెట్ భేటీలో ఆమోదం తెలపడంతో రుణ సేకరణ ప్రక్రియ పూర్తయింది.

సెక్యూరిటీల విడుదలకు షరతులతో ఓకే

రూ.20 వేల కోట్లకు పైగా విలువ కలిగిన భూములపై కొల్లేటరల్ సెక్యూరిటీ పెట్టి కేవలం రూ.10 వేల కోట్ల రుణం తీసుకోవడంపై ప్రభుత్వం ఇప్పుడు పునరాలోచనలో పడింది. అవే భూములు వేలం వేస్తే రూ.20 వేల నుంచి రూ.25 వేల కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశముందనే అంచనాకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే వేలం వేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అయితే తమకు కొల్లేటరల్ సెక్యూరిటీగా పెట్టిన భూములను వేలం వేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సెక్యూరిటీ బాండ్లు విడుదల చేసేందుకు ఐసీఐసీఐ తొలుత నిరాకరించినట్లు తెలిసింది. అయితే తమకు నిధులు అత్యవసమని, కొల్లేటరల్ సెక్యూరిటీ బాండ్లను తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. రుణం తీర్చేందుకు పదేళ్ల వ్యవధి ఉండటాన్ని, ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. దీంతో కొన్ని షరతులతో బాండ్ల విడుదలకు ఐసీఐసీఐ అంగీకరించినట్లు సమాచారం.

ఈఎంఐ డిపాజిట్‌కు అంగీకారం?

భూ తనఖా ద్వారా తీసుకున్న రూ.10 వేల కోట్ల రుణానికి ప్రభుత్వం ప్రతినెలా రూ.100 కోట్ల మేర కిస్తీ (ఈఎంఐ) కింద చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే రెండేళ్ల పాటు చెల్లించాల్సిన కిస్తీ సుమారు రూ.2,500 కోట్లు ముందస్తుగా డిపాజిట్ చేస్తేనే కొల్లేటరల్ సెక్యూరిటీ బాండ్లు తిరిగి ఇస్తామంటూ ఐసీఐసీఐ విధించిన షరతుకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిసింది. ఈ మేరకు డబ్బులు డిపాజిట్ చేసేందుకు ఓ వైపు సన్నాహాలు చేస్తూనే వేలం ప్రక్రియకు తెరలేపింది.

గతంలో ఎకరం రూ.50 వేలకే విక్రయించిన చంద్రబాబు సర్కారు

కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25(పీ)లోని సుమారు 425 ఎకరాల భూమిని 2003లో నాటి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల చొప్పున 'ఐఎంజీ అకాడమీస్ భారత' అనే సంస్థకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. అయితే మంత్రివర్గ ఆమోదం, ఒప్పందం లేకుండానే అధికారులు ఎంఓయూపై సంతకాలు చేశారు. అయితే ఎంఓయూలో పేర్కొన్నట్లుగా ఐఎంజీ ఎలాంటి పెట్టుబడులు పెట్టకపోవడంతో 2006లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం భూమిని తిరిగి తీసుకునేందుకు హైకోర్టును ఆశ్రయించింది. సుమారు రెండు దశాబ్దాలకుపైగా సుదీర్ఘ పోరాటం తర్వాత ఈ భూమిని ప్రభుత్వానికి అప్పగించాలని గత ఏడాది ఆరంభంలో హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో ఈ భూమి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది.

నేటి గోదావరి బోర్డు సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ యాజ మాన్య బోర్డు 17వ సమావేశం బుధవారం జరగాల్సి ఉండగా, ఏపీ విజ్ఞప్తితో వాయిదా పడింది. సమావేశం తదుపరి తేదీని మళ్లీ తెలియజేస్తామని గోదావరి బోర్డు రెండు రాష్ట్రాలకు లేఖ రాసింది.

రూ. పది కోట్ల భూమికి ఎసరు

- కబ్జా యత్నాన్ని అధికారుల దృష్టికి తెచ్చిన 'సాక్షి'
- స్పందించిన కమిషనర్... నిర్మాణాల తొలగింపు



జేసీబీతో నిర్మాణాల తొలగింపు



జ్యోతిరెడ్డి

పటాన్‌చెరు: సుమారు రూ.పది కోట్ల విలువచేసే రెండు వేల గజాల ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు తాజా మాజీ కౌన్సిలర్ ఒకరు ప్రయత్నించగా ఈ విషయాన్ని అధికారుల దృష్టికి 'సాక్షి'ప్రతినిధుల బృందం తీసుకెళ్లి సదరు కబ్జాను సమర్థవంతంగా అరికట్టగలిగింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బీరంగూడ గుట్టకు వెళ్లే దారిలోని సర్వే నంబర్ 993లోని రెండు వేల గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు మాజీ కౌన్సిలర్ ఒకరు ప్రయత్నించారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా కిందిస్థాయి రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో చేతులు కలిపి రాత్రికి రాత్రే గదులను నిర్మించేశారు. వాటికి మున్సిపాల్టీ నుంచి ఇంటి నంబర్లను కూడా సాధించి తెల్లారేసరికి గదులకు రంగులు వేసేశారు. ఇక్కడ గజం విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుంది. కళ్లముందే జరుగుతున్న కబ్జాను స్థానికులు 'సాక్షి'ప్రతినిధుల బృందానికి ఉప్పందించగా...ఇదే విషయాన్ని మంగళవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ ఎ.జ్యోతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో మున్సిపల్ సిబ్బంది జేసీబీతో అక్రమ నిర్మాణాలను సాయంత్రానికల్లా నేలమట్టం చేశారు. ఈ విషయంపై స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డిని 'సాక్షి'వివరణ కోరగా...తాను ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలనలో ఉన్నానని ఆ నిర్మాణం సంగతి తెలుసుకుంటానన్నారు. కమిషనర్ జ్యోతిరెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు సహకరించే ప్రసక్తే లేదన్నారు. చాకచక్యంగా వ్యవహరించిన 'సాక్షి'ప్రతినిధుల బృందాన్ని స్థానికులు అభినందించారు.

ఆస్తి పన్ను చెల్లించాలని ఇంటి ముందు బైఠాయించి..

- మున్సిపల్ అధికారుల నిరసన



ఆర్మూర్ టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని యోగేశ్వర కాలనీలో మంగళవారం మున్సిపల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఆస్తిపన్ను వసూలు చేశారు. అయితే ఓ ఇంటి యాజమాని ఆస్తి పన్నును నాలుగేళ్లుగా కట్టకపోవడంతో సుమారు రూ.లక్షకు పైగా బకాయి పేరుకుపోయింది. దీంతో ఆస్తి పన్ను చెల్లించాలని అధికారులు ఆ ఇంటి ముందు బైఠాయించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 5-3-2025



ఆ విషాదం నుంచే....

తొలి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగిన కొద్దిరోజులకే న్యూయార్క్ నగరంలోని ట్రయాంగిల్ ఫ్యాక్టరీలో ఘోరమైన అగ్ని ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో 140 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోగా, వారిలో ఎక్కువమంది యువతులు ఉన్నారు. ఈ సంఘటన మహిళలు ఎదుర్కొంటున్న భయానక పని పరిస్థితులను ఎత్తి చూపింది. కార్మిక సంస్కరణలకు, పని ప్రదేశాలలో మెరుగైన భద్రతాప్రమాణాలను నెలకొల్పడానికి దారి తీసింది.



నేషనల్ సేఫ్టీ వీక్

(మార్చి 4- మార్చి 10)

పని ప్రదేశాల నుండి బహిరంగ ప్రదేశాల వరకు ఎన్నో చోట్ల భద్రత ప్రాముఖ్యతను గుర్తు తెస్తుంది... జాతీయ భద్రతా దినోత్సవం. భద్రతా అవగాహన-అమలుకు అంకితమైన 'నేషనల్ సేఫ్టీ వీక్'లో భాగంగా వివిధ రంగాలలో, వివిధ ప్రదేశాలలో, వివిధ కోణాలలో మహిళల భద్రతకు ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కార మార్గాలు వెదకడం అత్యవసరం. అనివార్యం. వికసిత భారత్‌కు ఆయువు పట్టు... మహిళల శ్రేయస్సు, భద్రత...

నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ప్రకారం భారతదేశంలో 15-49 సంవత్సరాల వయస్సు గల 30 శాతం మంది మహిళలు శారీరక, లైంగిక, గృహ హింసను అనుభవిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మన దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయి.

***

మహిళల భద్రత, భద్రతా ప్రాజెక్ట్‌ల కోసం ప్రభుత్వం 'నిర్భయ నిధి'ని ఏర్పాటు చేసింది. నిర్భయ నిధి కింద బ్యూరో ఆఫ్ పోలిస్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డి) దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులు, వైద్య అధికారులకు శిక్షణ ఇస్తారు. నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. లైంగిక దాడి సాక్ష్యాల సేకరణ(సెక్సువల్ అసాల్ట్ ఎవిడెన్స్ కలెక్షన్) కిట్‌లను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపిణీ చేయడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు.

***

'ఉమెన్ పీస్ అండ్ సెక్యూరిటీ ఇండెక్స్'(డబ్ల్యూపీఎస్-2023)లో 177 దేశాల్లో మహిళల భద్రతలో మన దేశం నాలుగో స్థానంలో నిలిచింది. మొదటి రెండు స్థానాలను డెన్మార్క్, స్విట్జర్లాండ్ దక్కించుకున్నాయి. అఫ్గనిస్తాన్ అట్టడుగు స్థానంలో ఉంది.

***

2022: మహిళలను లక్ష్యంగా చేసుకొని రాజకీయ హింసకు పాల్పడే టాప్10 దేశాల్లో భారత్ కూడా ఉంది. ఈ జాబితాలో 537 సంఘటనతో మెక్సికో అగ్రస్థానంలో ఉంది. 125 సంఘటనలతో మన దేశం 7వ స్థానంలో ఉంది.

***

ఉమెన్ సేఫ్టీకి సంబంధించి వివిధ సంస్థలు ట్రైనింగ్ సెషన్స్ నిర్వహిస్తున్నాయి. ప్రమాదకరమైన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి నుంచి సేఫ్టీకి సంబంధించిన టిప్స్, సేఫ్టీకి సంబంధించిన గోల్డెన్ రూల్స్ చెప్పడం, యాప్స్‌ను పరిచయం చేయడం వరకు ఎన్నో చేస్తున్నారు. సెల్ఫ్-డిఫెన్స్‌కు సంబంధించి అపోహలను తొలగిస్తున్నారు.

డిజిటల్ థ్రెట్‌ను ఢీ కొట్టాలి

ట్రెడిషనల్ ముప్పుకు అదనంగా ఈ-థ్రెట్స్
సోషల్‌మీడియా రాకతో మరింత పెరుగుదల
భయం వీడితేనే నేటి మహిళకు పూర్తి భద్రత
బాధితుల వివరాల గోప్యతకు పోలీస్ భరోసా



ఎన్. శ్వేత

'సోషల్ మీడియా సహా డిజిటల్ ప్రపంచం మానవ జీవితాల్లోకి చొచ్చుకుపోయింది. అప్పటి దాని వల్ల ముంచుకొస్తున్న ముప్పును తెలుసుకున్నాం. ఇప్పుడు నిరోధక మార్గాలు అన్వేషిస్తున్నాం. నేటి మహిళకు పెను సవాల్‌గా మారిన డిజిటల్ థ్రెట్‌ను సమర్థంగా ఢీ కొట్టాలి. ఇబ్బంది ఎదురైనప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి'... అన్నారు సీనియర్ ఐపీఎస్ అధికారి, హైదరాబాద్ నేర పరిశోధన విభాగం డీసీపీ ఎన్.శ్వేత. మహిళల భద్రతపై ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ పలు కీలకాంశాలు వివరించారు.

వేధింపులు పరిధి దాటాయి

ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా పని చేస్తున్నారు. ఆమెకు ఏళ్లుగా ఎదురవుతున్న వేధింపులు, గృహహింస తదితరాలను ట్రెడిషనల్ థ్రెట్‌గా చెప్పుకోవచ్చు. నేటి మహిళ వీటిని చాలా వరకు సమర్థంగా ఎదుర్కొంటోంది. ఫలానా ప్రాంతంలో ఈవ్ టీజింగ్ చేసే పోకిరీలు ఉన్నారని తెలిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం లేదా ఆ వైపు వెళ్లకుండా జాగ్రత్త పడతాం. అయితే డిజిటల్ థ్రెట్‌కు, సైబర్ పోకిరీలకు ప్రాంతం, పరిధి అంటూ ఉండవు.

ముప్పును పట్టించుకోవట్లేదు

డిజిటల్ మీడియాను మహిళలు, యువతులు ఓ మంచి ఎక్స్‌ప్రెషన్ ప్లాట్‌ఫాంగా వినియోగించుకుంటున్నారు. తమ అభిప్రాయాలు, అభిరుచులను అక్కడ స్వేచ్ఛగా వెలిబుచ్చుతున్నారు. తద్వారా వేల మందికి సుపరిచితులుగా మారిన, ఆర్థికంగా నిలదొక్కుకున్న అతివలూ ఎందరో ఉన్నారు. అయితే ఈ ఎక్స్‌ప్రెషన్‌లో అంతర్లీనంగా ఉన్న ముప్పును గుర్తించలేకపోతున్నారు. ఫలితంగా అనేక మంది మహిళలు ఫిజికల్‌గా, వర్చువల్‌గా, ఎమోషనల్‌గా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జాగ్రత్తలను విస్మరిస్తున్నారు

స్వభావ సిద్ధంగానే మహిళలు బాహ్య ప్రపంచంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. తొందరగా అపరిచిత వ్యక్తులతో మాట్లాడరు. నమ్మకం కలిగే వరకు అభిరుచులు పంచుకోవడం మాట అటుంచి కనీసం తమ పేరు కూడా చెప్పరు. రియల్ వరల్డ్‌లో ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా... వర్చువల్ వరల్డ్‌లో మాత్రం తొందరపడుతున్నారు. హాయ్, హలోతో మొదలైన ఈ పరిచయాలు వ్యక్తిగత ఫొటోలు షేర్ చేసుకునే వరకు వెళుతున్నాయి. ఇవే కొన్నిసార్లు విపరీత పరిణామాలకు కారణం అవుతున్నాయి.

వీరి భయమే వారికి ధైర్యం

డిజిటల్ థ్రెట్‌కు లోనైన మహిళలు, యువతులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయట్లేదు. కుటుంబం, సమాజం, వ్యక్తిగత జీవితం.. ఇలా అనేక అంశాలను ఊహించుకుని భయపడుతున్నారు. ఈ భయమే ఎదుటి వారికి ధైర్యం అవుతోంది. మరింత రెచ్చిపోతూ బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి వెళుతున్నారు. మీ పరువు అనేది మీ చేతుల్లో, మీ ప్రవర్తనలోనే ఉంటుందని గుర్తుంచుకోండి. నట్టింట్లో, నడివీధిలోనే కాదు... 'నెట్'ఇంట్లోనూ బాధితురాలిగా మారిన అతివకు అన్ని ఏజెన్సీలు అండగా ఉంటాయి. వీళ్లు తమకు సమస్యలు ఉన్నాయని ఒప్పుకోవాలి. ధైర్యంగా ముందుకువచ్చి పోలీసులతో పాటు సంబంధిత ఏజెన్సీలకు ఫిర్యాదు చేయాలి.

ఫిర్యాదు ఎక్కడైనా చేయవచ్చు

మీరు ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ మరే ప్రాంతంలో అయినా ఏ ఏజెన్సీకి అయినా ఫిర్యాదు చేయవచ్చు. కేసు నమోదు చేసిన వాళ్లే దర్యాప్తు చేయడమో, సంబంధిత ప్రాంతానికి బదిలీ చేయడమో జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధితుల పేర్లు, వివరాలు బయటకు రాకుండా గోప్యత పాటిస్తారు. ఈ విషయంలో న్యాయస్థానాలు సైతం బాధితులకు పూర్తి అండ, సహాయసహకారాలు అందిస్తుంటాయి. టెక్నాలజీని వాడుకోవాలి. విచక్షణతో ముందుకు వెళ్లాలి.

- ఎన్.శ్వేత, డీసీపీ
నేర పరిశోధన విభాగం, హైదరాబాద్

ఈక్వల్ జర్నీ స్లోగా ఉంది



శిఖాగోయల్

హక్కులను సాధించడానికి పోరాట పటిమ... అవకాశాలను అందుకోవడానికి ప్రతిభాపాటవాలు... సాధించి, అందుకున్న దాంట్లో స్థిరపడే చోటే పోరాటం... ఇవన్నీ అవసరం అవడానికి కారణం అభద్రత, రక్షణలేమి! అవి ఇన్నేళ్ల మహిళల ప్రయాణాన్ని మళ్లీ మొదటికే తీసుకొస్తాయేమోననే భయం వెంటాడుతోంది! తర్వాత తరాలను జీరో దగ్గర నిలబెట్టకుండా.. వాళ్లకో మైల్‌స్టోన్‌ను అందివ్వాలనేదే ఈతరం మహిళల ఆరాటం! అది విమెన్ ఫ్రెండ్లీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్లే సాధ్యం! ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ చేసిన, చేస్తున్న ప్రయత్నాలను వివరించారు తెలంగాణ సీఐడీ, విమెన్ సేఫ్టీవింగ్ ఏడీజీపీ శిఖాగోయల్.

ఏ రంగంలో అయినా మహిళా ప్రాతినిధ్యం పెరిగితేనే మహిళలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడడానికి ఆస్కారం ఉంటుంది. మొదటినుంచీ పురుషాధిపత్య రంగమైన పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనూ మహిళల ప్రాతినిధ్యం పెరగాలి. ఇదివరకటితో పోలిస్తే పెరిగింది కూడా. అయినా జాతీయ స్థాయిలో చూస్తే వీరి సంఖ్య 25 శాతం కూడా లేదు. తెలంగాణ పోలీస్ శాఖలో మహిళల సంఖ్య పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తోంది. దాంతో రాష్ట్ర పోలీస్ శాఖలో మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024లో రికార్డ్ స్థాయిలో 2,500 మంది మహిళలను అపాయింట్ చేశాం. అంటే దాదాపు 20 శాతం. ఎస్సీటీపీసీ ప్రోగ్రామ్ ద్వారా 2,338 మందిని తీసుకున్నాం. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద బ్యాచ్ ఇది. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి మహిళలను ప్రోత్సహించడానికే ఇలాంటి ప్రీ రిక్రూట్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్స్‌ని ఏర్పాటు చేశాం. మౌలిక సదుపాయాల కల్పనలోనూ కృషి జరుగుతోంది. అయినా ఈ రంగంలో స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించడానికి ఇంకా చాలా దూరమే ప్రయాణించాల్సి ఉంది. మహిళల నియామకాలను పెంచడంలో చిత్తశుద్ధి ప్రయత్నాలతోపాటు జెండర్ పాలసీ, మహిళలకు లీడర్‌షిప్ ట్రెనింగ్స్ అనేవీ చాలా అవసరం. ఇన్ని అవాంతరాల మధ్య కూడా గుర్తించదగిన విజయాన్నే సాధిస్తున్నాం.

భద్రతా నగరాల్లో ఒకటిగా...

మహిళా భద్రత, రక్షణ కేవలం బహిరంగ ప్రదేశాలకే పరిమితమైంది కాదు. ఇంటి నుంచి మొదలు స్కూల్, వర్కింగ్ ప్లేస్, ట్రాన్స్‌పోర్ట్ ఇలా అన్ని చోట్లా సమస్యగానే ఉంది. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణకు పెద్ద పీట వేస్తోంది. షీ టీమ్స్, భరోసా సెంటర్స్, సాహస్, సీడీఈడబ్ల్యూ (డొమెస్టిక్ వయొలెన్స్) కౌన్సెలింగ్ సెంటర్స్, ఫాస్ట్ ట్రాక్ కోర్ట్స్, చట్టాలను కఠినంగా అమలుపరచడం, నిర్భయ ఫండ్స్‌తో అధునాతన నిఘా పరికరాలు, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ సెంటర్స్, హెల్ప్‌లైన్స్ వంటివాటితో భద్రత, రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేశాం. దీంతో మహిళలు నిర్భయంగా బయటకు వచ్చి.. తమకు నచ్చిన రంగంలో రాణించే వాతావరణం ఏర్పడింది. కిందటేడు మార్చిలో టీ సేఫ్ సర్వీస్‌ను ప్రారంభించింది ప్రభుత్వం. ఇది చదువు, స్త్రీల హక్కులు, చట్టాల గురించి అమ్మాయిల్లో అవగాహన కల్పించడం, అలాగే మహిళలను గౌరవించాలనే స్పృహను అబ్బాయిల్లో కలిగించడం వంటి కార్యక్రమాలను చేపడుతూ సమాజంలో మహిళల మీద జరుగుతున్న హింసను తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. వీటన్నిటి వల్లే తెలంగాణ ఈరోజు దేశంలోనే అత్యధిక వర్కింగ్ విమెన్ ఉన్న రాష్ట్రంగా, హైదరాబాద్.. దేశంలోకెల్లా భద్రతా నగరాల్లో ఒకటిగా నిలిచాయి.

సవాళ్లు...

ఇంత చేస్తున్నా ఇంకా చాలామంది మహిళల్లో తమ హక్కులు, చట్టాల విషయంలో పూర్తి అవగాహన రాలేదు. దీనివల్ల గృహహింస, పని ప్రదేశాల్లో లైంగికవేధింపులు వంటివాటి మీద ఫిర్యాదు చేయడం లేదు. అవగాహన ఉన్నవారు కూడా వెనుకడుగు వేస్తున్నారు పరువు, ప్రతిష్ఠ లాంటి భయాల వల్ల. ఇవన్నీ మహిళల భద్రత, రక్షణకు అడ్డంకులుగా మారుతున్నాయి. అయినా పోలీస్ శాఖ అలుపెరగని ప్రయత్నం చేస్తోంది.

మనమే క్రియేట్ చేసుకోవాలి...

ఏ రంగంలో మహిళలు మైనారిటీగా ఉంటారో ఆ రంగంలో సవాళ్లు తప్పనిసరి. అయితే వాటికి భయపడకుండా మన సపోర్ట్ సిస్టమ్‌ను మనమే రూపొందించుకోవాలి. దాన్ని విజయానికి సోపానంగా మలచుకోవాలి. ప్రాధాన్యాలను గ్రహించి.. దానికి అనుగుణంగా పనిచేసుకు పోవడమనేది కూడా ఒక నైపుణ్యంగా మారుతుంది. ప్రాధాన్యాలను గ్రహిస్తూ వర్క్- లైఫ్ బ్యాలెన్స్‌ని ఒక స్కిల్‌లా డెవలప్ చేసుకోవాలి.

SCENE - DO NOT CROSS - CRIME SCENE - DO NOT CROSS - CRIME SCENE - DO NOT CROSS - CRIME SCENE - DO NOT CROSS **క్లూస్ టీమ్** DO NOT CROSS - CRIME SCENE - DO NOT CROSS - CRIME SCENE -

కనపడని నాలుగో సింహం..

సినిమాల్లో 'శుభం' కార్డు పడే సమయంలో 'యూ ఆర్ అండర్ అరెస్ట్' అంటూ ఇన్‌స్పెక్టర్ పరుగెత్తుకు వచ్చి నేరస్థుడికి అలవోకగా సంకెళ్లు వేస్తాడు. అయితే నిజజీవితంలో అలా కాదు. నేరస్థుడిని పట్టుకోవడానికి లక్ష సవాళ్లు ఎదురవుతాయి. అలా అని నేరస్థుడిని పట్టుకోవడంలో ఆలస్యం జరగకూడదు. 'నేరస్థుడిని త్వరగా పట్టుకోవాలి' అనే తొందరపాటు కూడా ఉండకూడదు. '99 మంది దోషులు చట్టం నుంచి తప్పించుకున్నా... ఒక్క అమాయకుడు శిక్షకు గురి కాకూడదు' అనే మాట ఉండనే ఉంది! క్రైమ్ సీన్ సవాలు విసురుతుంది. ఎవరైతే ఆ సవాలును స్వీకరించి, తమ తెలివితేటలు, శక్తి సామర్థ్యాలకు పదును పెట్టి, ఏ పుట్టలో ఏ పాము ఉందో కనిపెట్టి నిందితుడిని కటకటాల వెనక్కి తీసుకువెళతారో... వారే క్రైమ్‌సీన్ ఆఫీసర్‌లు. క్లూస్‌టీమ్‌లో భాగంగా పని చేసే క్రైమ్‌సీన్ ఆఫీసర్లు (సీఎస్ఓ) నేరం జరిగిన వెంటనే ఘటనాస్థలికి వెళ్లి అణువణువూ అధ్యయనం చేసి, దర్యాప్తు అధికారులుగా ఉండే పోలీసులు నిందితులను పట్టుకోవడానికి అవసరమైన ఆధారాలు అందిస్తారు. హైదరాబాద్ క్లూస్‌టీమ్‌లో మొత్తం 43 మంది సీఎస్ఓలు ఉండగా వీరిలో ఆరుగురే మహిళలు. పోలీసులు మనకు కనిపించే మూడు సింహాలైతే... ఈ 'సీఎస్ఓ'లు కంటికి కనిపించని నాలుగో సింహం. 'క్లూ'లు అందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గుడిబోయిన ఇందిర, దానం ఎలిజబెత్‌లు ఎన్నో ముఖ్యమైన కేసుల దర్యాప్తులో కీలక పాత్ర పోషించారు...

– శ్రీరంగం కామేష్,
క్రైమ్ రిపోర్టర్, హైదరాబాద్



ఇందిర

హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన **గుడిబోయిన ఇందిర** 2015 నుంచి హైదరాబాద్ క్లూస్ టీమ్‌లో సీఎస్ఓగా పని చేస్తోంది. తన పదేళ్ల సర్వీసులో ఎన్నో నేరస్థలాలకు వెళ్లి కీలక ఆధారాలు సేకరించి కేసు చిక్కుముడి వీడడంలో కీలక పాత్ర పోషించింది. ఆ కేసులలో కొన్ని...

నిందితుడు... ఇదిగో... ఈ ఇంట్లోనే!

హైదరాబాద్‌లోని మెట్టుగూడ నల్లపోచమ్మ ఆలయం దగ్గర నివసించే రేణుక పెద్ద కుమారుడు యశ్వంత్ మౌలాలీలోని రైల్వే కాంట్రాక్టర్ దగ్గర పని చేసి మానేశాడు. ఫిబ్రవరి ఆరోతేదీన కొంతమంది దుండగులు తమ ఇంట్లోకి చొరబడ్డారని, తల్లితో పాటు తనపై కత్తితో దాడి చేశారని యశ్వంత్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో ఈ హత్యాయత్నం కేసు సంచలనం సృష్టించింది.

విధి నిర్వహణలో భాగంగా సీఎస్ఓ ఇందిర యశ్వంత్ ఇంటికి వెళ్లింది. ఘటనాస్థలిలో ఉన్న పరిస్థితులతోపాటు ఆ ఇంటి పరిసరాలను అధ్యయనం చేసింది. రేణుక ఒంటిపై ఉన్న కత్తిపోట్లు ఎదుటివాళ్లే పొడిచినట్లు ఉన్నప్పటికీ యశ్వంత్ గాయాలపై అనుమానం వచ్చింది. దీనికితోడు వారి ఇంటికి బయటనుంచి గడియపెట్టి ఉందనే విషయం తెలుసుకున్న ఇందిర మరింత లోతుగా ఆరా తీసింది. ఈ నేరంలో మూడో వారి ప్రమేయం లేదంటూ పోలీసులకు నివేదించింది. దీంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా యశ్వంతే నిందితుడని తేలింది. కుటుంబ కలహాలు, పెళ్లి కావట్లేదనే బాధతో డిప్రెషన్‌కు గురైన యశ్వంత్ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన తల్లికి కత్తిపోట్లు పడ్డాయి. దీంతో భయాందోళనలకు గురైన యశ్వంత్ తనపై కేసు కాకుండా ఉండటానికి 'ఎవరో మాపై హత్యాయత్నం చేశారు' అంటూ నాటకం ఆడాడు. కుమారుడిని జైలుకు పంపడం ఇష్టంలేక పోలీసులను తప్పుదోవ పట్టించింది రేణుక. చివరకు ఇందిర చొరవతో కేసు కొలిక్కివచ్చి యశ్వంత్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది.

స్క్రూ డ్రైవర్ ముక్కే... పక్కాగా పట్టించింది!

నాలుగేళ్ల క్రితం బేగంపేటలో ఒక ఇంట్లో చోరీ జరిగింది. నేరస్థలిని సందర్శించిన ఇందిర అక్కడ విరిగిన స్క్రూడ్రైవర్ ముక్కను గుర్తించింది. బాధితులు పక్కింటివారిపై అనుమానం వ్యక్తం చేయడంతో వారింట్లో సోదాలు చేశారు. అక్కడ మిగిలిన స్క్రూ డ్రైవర్ దొరకడంతో వారే నిందితులుగా తేలి కేసు కొలిక్కివచ్చింది.

సూసైడ్ నోట్ కనిపెట్టి... అతడి ఆట కట్టించింది

కుటుంబ కలహాల నేపథ్యంలో గత వారం వారాసిగూడ ప్రాంతంలో ఒక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆ సమయంలో ఆమె భర్త కూడా ఇంట్లోనే ఉండటంతో ఇది హత్యగా అనుమానించారు. ఘటనాస్థలికి వెళ్లిన ఇందిర మృతురాలి శరీరంతో పాటు ఆమె వస్త్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి సూసైడ్ నోట్ వెలికి తీసింది. ఆత్మహత్యకు ప్రేరేపించడం, వేధింపుల కేసు భర్తపై నమోదైంది.

***



ఎలిజబెత్

తట్టిఅన్నారంలోని జీవీఆర్ కాలనీకి చెందిన **దానం ఎలిజబెత్** 2015 నుంచి హైదరాబాద్ క్లూస్ టీమ్‌లో సీఎస్ఓగా పని చేస్తోంది. ఇప్పటి వరకు అనేక కేసుల దర్యాప్తులో కీలకంగా మారిన ఆధారాలను సేకరించి అందించింది. గత ఏడాది చివరలో హబీబ్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చిన 'గుండెపోటు మరణం' ఎలిజబెత్ అందించిన ఆధారాలతోనే హత్యగా తేలింది.

డస్ట్‌బిన్‌లో దాగిన రహస్యం

కురుమబస్తీకి చెందిన రేణుక ఇంటి అరుగుపై ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుండెపోటు వచ్చి ఉంటుందని, తమ అరుగుపై పడుకుని ప్రాణాలు విడిచి ఉంటాడని రేణుక పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న హబీబ్‌నగర్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో మృతుడు ఏ బ్యాట్రీలేన్‌కు చెందిన ఖాలేద్‌గా గుర్తించారు. రేణుక ఇంట్లోనూ సోదాలు చేయాలని పోలీసులు క్లూస్ టీమ్‌ను కోరారు.

ఎలిజబెత్ అక్కడకు వెళ్లి రేణుక ఇంటిలో అణువణువూ పరిశీలించింది. రేణుక మంచం పైన కనిపించిన కొన్ని వెంట్రుకలు ఖాలేద్ వెంట్రుకలతో సరిపోలాయి. రేణుక వంటగదిలో ఉన్న డస్ట్‌బిన్‌లో ఓ కొత్త కాటన్ టవల్ పడి ఉండటం ఎలిజబెత్ దృష్టిలో పడింది. కొత్త టవల్ డస్ట్‌బిన్‌లో ఉండటం, అదీ కిచెన్‌లోది కావడంతో అనుమానించింది. ఆ టవల్ తడిగా ఉండటంతోపాటు కొన్ని రకాలైన మరకలు ఉన్నట్లు కనిపెట్టింది. వీటి ఆధారంగా రేణుక హత్య చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం అందించింది ఎలిజబెత్. దీంతో అధికారులు రేణుకను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అనుకోకుండా హత్య చేశానని, తన సోదరుడు వెంకటేష్ సాయంతో మృతదేహాన్ని ఇంట్లోంచి బయటకు తీసుకువచ్చి అరుగుపై పడుకోబెట్టానని రేణుక ఒప్పుకుంది. రేణుక-ఖాలేద్‌ల మధ్య కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఆరోజు రేణుక ఇంటికి వెళ్లిన ఖాలేద్ తన కోరిక తీర్చమని కోరగా ఆమె అంగీకరించలేదు. ఆ సమయంలో జరిగిన గొడవలో బెడ్‌పై పడిన ఖాలేద్ నోరు, ముక్కు టవల్‌తో మూసేసి హత్య చేసింది. రేణుకతో పాటు ఆమె సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు.

Inspiration

నా ఇన్‌స్పిరేషన్ మా అమ్మ...

- సుధా మూర్తి, రచయిత



ఎలాగంటే...

'ఇతరులకు సహాయపడటం అనే విలువను నాన్న నుంచి నేర్చుకున్నప్పటికీ.. అలా సహాయపడే స్థితికి ఎదగడానికి స్ఫూర్తి మా అమ్మే! చదువుకుంటే సాధికారతను సాధించవచ్చు. సాధికారత సాధిస్తేనే ఇతరులకు సహాయం అందించే స్థితి వస్తుందనేది అమ్మ. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అనే మాటను అమ్మ బాగా నమ్ముతుంది. ఆ నమ్మకమే నన్ను ఇంజినీర్‌ని చేసింది. టాటాలో తొలి మహిళా ఇంజినీర్‌గా అడుగుపెట్టిన క్రెడిట్ నాకు సొంతమైనా దాని వెనుక ప్రోత్సాహం మాత్రం అమ్మదే! మహిళ చదువుకుంటే తనను తాను మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంచుకోగలదు. ఆరోగ్యవంతురాలైన ఆ స్త్రీ కుటుంబ సంక్షేమం పట్లా శ్రద్ధ తీసుకోగలదనేది ఆవిడ ఉద్దేశం. నా మీద మా గ్రాండ్‌మదర్ ప్రభావం కూడా చాలా ఉంది. పిల్లలకు మనం ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. శ్రద్ధ, ఆప్యాయతాను రాగాలని మా బామ్మ ద్వారానే తెలుసుకున్నాను. నా కథల్లోని కొన్ని స్త్రీ పాత్రలకు ఆవిడే స్ఫూర్తి.

లీగల్

స్త్రీల రక్షణ కోసం అందరికీ తెలిసి ఉండవలసిన చట్టాలు

1. అనైతిక వ్యాపార (నివారణ) చట్టము, 1956
The Immoral Traffic (Prevention) Act, 1956
2. వరకట్న నిషేధ చట్టం, 1962. The Dowry Prohibition Act, 1961
3. గృహహింస నుండి మహిళల రక్షణ చట్టం, 2005. Protection of Women from Domestic Violence Act, 2005
4. పనిచేయుచోట మహిళలపై లైంగిక హింస (నివారణ, నిషేధము - పరిహార) చట్టం, 2013. The Sexual Harassment of Women at Workplace PREVENTION, PROHIBITION and REDRESSAL Act, 2013
5. స్త్రీల అసభ్య చిత్రణ (నిషేధ) చట్టం, 1986. The Indecent Representation of Women (Prohibition) Act, 1986
6. భారతీయ సాక్ష్య అధినియం, BNS IPC) లోని స్త్రీలపై జరుగుతున్న లైంగిక దాడులు, మహిళల గౌరవానికి భంగం కలిగించే నేరాలు, గృహహింస, వివాహం చేసుకుంటానని నమ్మించి మోసగించటం వంటి పలు రకాల నేరాలకు గల శిక్షలు.
7. పలు వివాహ చట్టాలు - క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 125 (144 బిఎన్ఎస్ఎస్) ద్వారా తమను తాము పోషించుకోలేని మహిళలకు మెయింటెనెన్స్, భరణం పొందే హక్కు
8. తల్లి దండ్రుల, వయోవృద్ధుల పోషణ - పరిరక్షణ చట్టం, 2007
9. విద్యాహక్కు చట్టం, 2009
10. చిన్నపిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించటానికి POCSO Act, 2012



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది.
మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

నాకు నచ్చిన పాత్ర లాలస

- కాత్యాయని

Impact



గాఢంగా చీకట్లు కమ్మిన ఒక రాత్రి- ఆకాశాన్ని చీలుస్తూ ఒక మెరుపు మెరుస్తుంది... మనల్ని, మన పరిసరాలనీ మన కళ్ళకే చూపించి మాయమైపోతుంది. ఆ మెరుపును మన ఇంటి దీపంలాగా గోడకు వేలాడదీసుకుందామంటే కుదరదు. కుదిరినా భరించటానికి ఆ ఇంటికి శక్తి చాలదు. ఆ క్షణకాలపు వెలుగులో ఏం చూడగలరో, పరిసరాలను ఎంత చక్కదిద్దుకోగలరో ఎవరికి వాళ్ళు నిర్ణయించుకోవాల్సిందే. సరిగ్గా ఆ మెరుపులాంటిదే లాలస! చలం రాసిన 'జీవితాదర్శం'లో నాయిక.

లాలస నాకు నచ్చింది అని చెప్పిన వాళ్ళకు కొన్ని ప్రశ్నలు ఎదురవుతాయి- స్త్రీలందరికీ ఆమె ఆదర్శమా? అనుసరణీయమా? ఆ దారిలో నడవటం ఆడవాళ్ళకు క్షేమమా? అంటూ. అన్నిటికీ జవాబు ఒకటే- కాదు.

మరెందుకు మాట్లాడుకోవాలి లాలస గురించి? స్త్రీ పురుష సంబంధాలు- అధికారం వల్లనో, అవసరాల కోసమో సాగేవిగా ఉండరాదని, అవి హృదయగతమైన సంబంధాలుగా ఉండాలని చెప్పినందుకు, వాటిలో కపటమూ మోసమూ చోటు చేసుకున్నప్పుడు ఎంత బలమైన నిర్మాణమైనా లోలోపల గుల్లబారి కూలిపోక తప్పదని చెప్పటానికి తనను తానొక ప్రయోగశాలగా మార్చుకున్నందుకు లాలస గురించి మాట్లాడుకోవాలి.

లాలస నమ్మి, ఆచరించిన 'హృదయవాదం' అతి ప్రమాదకరమైనది. ఉనికిలో వున్న ఏ ఆదర్శ నమూనాలోనూ అది ఇమడదు. 'నీతిమంతమైన' ఏ నిర్మాణమూ దాన్ని భరించదు.

నిజానికి లాలస పేచీ పడింది నీతితోనూ, ఆదర్శాలతోనూ కానే కాదు. 'నీతి చాలా గొప్ప విషయమూ, అవసరమైన విషయమూ' అని గౌరవించే లాలస ఆ నీతులూ, ఆదర్శాలూ హృదయం లోంచి పుట్టే సహజ ప్రేరణలుగా కాకుండా ఉత్తి రిచువల్స్‌గా తయారవటాన్ని అసహ్యించుకుంటుంది. స్త్రీలను సమానులుగా మనస్ఫూర్తిగా గుర్తించకుండా, అలా ఉన్నట్టుగా కనబడే వ్యక్తులకు సామాజిక గౌరవం ఉన్నందుకే ఆలా నడుచుకునే హిపోక్రటిక్ ఆదర్శ జీవులను ఆమె నిలదీస్తుంది. అయితే ఇలా విమర్శించినంత మాత్రాన తానొక ఆదర్శ వ్యక్తిననే భ్రమలు ఆమెకేమీ లేవు. 'నువ్వు నాకు ఆదర్శమైన పురుషుడివి కావు... ఆదర్శమైన స్త్రీ కూడా లేదు. కానీ, నేనొకతెను ఉన్నానని నమ్ముతున్నావు, దురదృష్టవంతుడివి కనుక' అని తను పెళ్ళాడబోతున్న వ్యక్తితో నిస్సంకోచంగా చెప్పగలదు లాలస. ఆదర్శవంతమైన మనుషులు, అత్యంత కఠినమైన స్వీయ ప్రయత్నంతో రూపొందగలరే తప్ప, సామాజిక నిర్బంధంతో కాదని ఆమె నమ్మకం. ఆ ప్రయత్నంలో ఎగుడు దిగుళ్ళూ, తప్పటడుగులూ ఉండి తీరుతాయి. ఏ విలువల ప్రాతిపదికన బయల్దేరుతామో వాటిని కోల్పోయే స్థితికి దిగజారే ప్రమాదమూ ఎదురు కావచ్చు. వీటన్నిటికీ సిద్ధపడి, ఒక విలువను ప్రతిపాదించగల స్థాయికి చేరిన వ్యక్తి లాలస. జనసామాన్యాన్ని కూడగట్టి నడిపించటానికీ, ఆచరణాత్మకమైన నిర్మాణాలను రూపొందించటానికీ పనికొచ్చే నాయకులు కాదు లాలస వంటి వ్యక్తులు. ఆ పనుల కోసం రూపొందాయని చెప్పే మార్గాలు మూఢనమ్మకాలుగా మారిపోకుండానూ, ఆ నిర్మాణాలు గిడసబారిపోకుండానూ హెచ్చరించే అనుభవాల ప్రయోగశాలలు వీళ్ళు. మార్పు కొరకు జరిగే ప్రతి ఉద్యమమూ మానవీయమైన సహజ చర్యగా సాగాలని, ఆదర్శాలన్నవి మనుషుల వ్యక్తిత్వాల్లో అసంకల్పితంగా భాగమై పోయేంత సహజ స్పందనలుగా మారాలనీ కలలుగనే మానవులు. అలాంటి కలలు గన్న పాత్రగా లాలస పాఠకులకు నచ్చుతుంది.

1 చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో వరుసగా మూడుసార్లు (2013, 2017, 2025) ఫైనల్లోకి ప్రవేశించిన తొలి జట్టుగా భారత్ నిలిచింది.

7 ఐసీసీ వన్డే టోర్నీలలో కోహ్లికి లభించిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (10), రోహిత్ శర్మ (8) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

14 ఐసీసీ టోర్నీలలో అత్యధికంగా 14 సార్లు ఫైనల్ చేరుకున్న జట్టుగా భారత్ గుర్తింపు పొందింది. ఆస్ట్రేలియా (13)ను భారత్ వెనక్కి నెట్టింది.

746 చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్ల జాబితాలో కోహ్లి (746 పరుగులు) రెండో స్థానానికి చేరాడు. తొలి స్థానంలో క్రిస్ గేల్ (791 పరుగులు), మూడో స్థానంలో జయవర్ధనే (742) ఉన్నారు.

ఆస్ట్రేలియాను కొట్టేశారు...



కోహ్లి

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోకి టీమిండియా

తొలి సెమీఫైనల్లో 4 వికెట్లతో ఆసీస్‌పై ఘనవిజయం

విరాట్ కోహ్లి అర్ధ సెంచరీ ● ఆకట్టుకున్న రాహుల్, అయ్యర్
సమష్టిగా రాణించిన బౌలర్లు ● ఆదివారం దుబాయ్‌లోనే ఫైనల్ పోరు

కంగారేమీ లేదు... అంతా మన నియంత్రణలోనే సాగింది... ఆస్ట్రేలియాతో ఐసీసీ నాకౌట్ మ్యాచ్ అనగానే పెరిగే ఉత్కంఠ, ఒత్తిడి అన్నింటినీ టీమిండియా అధిగమించేసింది... ఎప్పటిలాగే టాస్ ఓడిపోవడం మినహా 11 బంతుల ముందే మ్యాచ్ ముగించే వరకు భారత్ అన్ని విధాలుగా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ముందు పదునైన బౌలింగ్‌తో... ఆపై చక్కటి బ్యాటింగ్‌తో ఆస్ట్రేలియాను పడగొట్టి చాంపియన్స్ ట్రోఫీలో ఆఖరి సమరానికి అర్హత సాధించింది.

265 పరుగుల లక్ష్యం... చాంపియన్స్ ట్రోఫీ గత రెండు మ్యాచ్‌లలో భారత్ ఛేదించిన స్కోర్లతో పోలిస్తే ఇది కాస్త ఎక్కువ. బ్యాటింగ్ సాగుతున్నకొద్దీ పిచ్ నెమ్మదిస్తోంది. అయితేనేమి... కోహ్లి తనకు మాత్రమే సాధ్యమైన రీతిలో క్లాస్ ఆటతీరుతో అలవోకగా పరుగులు రాబడుతూ జట్టును నడిపించాడు. ఆరంభంలో రోహిత్, ఆపై అయ్యర్, రాహుల్, పాండ్యా... ఇలా అంతా అండగా నిలవడంతో గెలుపు భారత్ దరిచేరింది. ఆసీస్ ఆట సెమీఫైనల్లోనే ముగిసింది.


2017 చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్ చేరిన భారత్ తుది పోరులో పాకిస్తాన్ చేతిలో ఓడింది. ఆ తర్వాత మూడు ఐసీసీ వన్డే టోర్నీల్లోనూ కనీసం సెమీస్ లేదా ఫైనల్‌కు చేరి తమ స్థాయిని చూపించింది. మధ్యలో గెలిచిన టి20 వరల్డ్ కప్ దీనికి అదనం. ఇప్పుడు మరో టైటిల్ వేటలో టీమిండియా ప్రత్యర్థి ఎవరో నేడు తేల నుంది. ఇదే జోరు కొనసాగిస్తే 2013 తరహాలోనే అజేయ ప్రదర్శనతో మళ్లీ మనం చాంపియన్స్ కావడం ఖాయం!

గిల్‌కు అంపైర్ వార్నింగ్



హెడ్ క్యాచ్ పట్టినప్పుడు శుబ్‌మన్ గిల్ ప్రదర్శించిన 'అతి' ఆనందం అంపైర్ నుంచి హెచ్చరికకు గురయ్యేలా చేసింది. క్యాచ్ అందుకోగానే కొద్ది సేపయినా తన చేతిలో ఉంచకుండా అతను బంతిని గాల్లోకి విసిరేశాడు. నిజానికి క్యాచ్ పట్టడంలో అతను ఎక్కడా తడబడలేదు. అయితే ఎంతసేపు అనే విషయంలో నిబంధనలు సరిగ్గా లేకపోయినా... కనీసం 2–3 సెకన్ల పాటు ఫీల్డర్ బంతిని తన నియంత్రణలో ఉంచుకోవాలి. ఇదే విషయాన్ని అంపైర్ ఇల్లింగ్‌వర్త్ ప్రత్యేకంగా గిల్‌కు వివరించాడు. ఇలాంటి సందర్భాల్లో అవుట్/నాటౌట్ ఇచ్చే విషయంలో అంపైర్‌కు విచక్షణాధికారం ఉంటుంది.

స్మిత్ అదృష్టం



అక్షర్ వేసిన ఇన్నింగ్స్ 14వ ఓవర్లో అనూహ్యం చోటు చేసుకుంది. స్మిత్ డ్రైవ్ చేయగా బంతి అతడి ప్యాడ్‌ల మీదుగా స్టంప్స్‌ను తాకింది. అయితే బెయిల్స్ పడకపోవడంతో స్మిత్ బతికిపోయాడు. ఆపే ప్రయత్నం చేస్తే తన కాలితోనే స్టంప్స్ పడిపోతాయని భావనతో కావచ్చు స్మిత్ అలా కూడా చేయలేదు. ఆ సమయంలో అతని స్కోరు 23 పరుగులు. అతని స్కోరు 36 వద్ద ఉన్నప్పుడు షమీ బౌలింగ్‌లో బలంగా షాట్ కొట్టగా... తన ఎడమ చేత్తో క్యాచ్ పట్టే ప్రయత్నం చేసిన షమీ విఫలమయ్యాడు. అయితే ఇది చాలా కఠినమైన క్యాచ్.

రోహిత్‌కు లైఫ్



కెప్టెన్ రోహిత్ శర్మ 28 పరుగుల ఇన్నింగ్స్‌లో కూడా రెండుసార్లు అదృష్టం కలిసొచ్చింది. 13 పరుగుల వద్ద బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో అతను ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను కనోలీ వదిలేయగా... 14 వద్ద కాస్త కష్టసాధ్యమైన క్యాచ్‌ను లబుషేన్ అందుకోలేకపోయాడు.



ఐసీసీ చైర్మన్ జై షా నుంచి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న కోహ్లి

“ పాకిస్తాన్‌పై ఎలా లక్ష్యాన్ని ఛేదించామో ఇది కూడా దాదాపు అదే తరహాలో సాగింది. అప్పుడు సెంచరీ చేసినా ఏడు ఫోర్లే కొట్టాను. పరిస్థితులను అర్థం చేసుకోవడమే అన్నింటికంటే ముఖ్యం. దాని ప్రకారమే నా వ్యూహం సాగుతుంది. స్ట్రయిక్ రొటేట్ చేయడం కూడా అలాంటిదే. ఇలాంటి పిచ్‌పై భాగస్వామ్యాలు నెలకొల్పడం కీలకం. బౌండరీలతో వేగంగా ఆటను ముగించే ప్రయత్నంలో నేను వెనుదిరిగా. కొన్నిసార్లు అనుకున్న ప్రణాళికలు పని చేయవు. క్రీజులో పరుగుల కోసం నేను తొందరపడలేదు. అదే నా ఇన్నింగ్స్‌లో నాకు నచ్చిన విషయం. సింగిల్స్ తీయడాన్ని కూడా ప్రాధాన్యతగా భావిస్తేనే మంచి క్రికెట్ ఆడుతున్నట్లు లెక్క. ఇక ఎలాంటి ఒత్తిడి లేదు. లక్ష్యం దిశగా వెళుతున్నామని అప్పుడే అర్థమవుతుంది. ఇలాంటి నాకౌట్ మ్యాచ్‌లలో చేతిలో వికెట్లు ఉంటే ప్రత్యర్థి కూడా ఒత్తిడిలో సునాయాసంగా పరుగులు ఇచ్చేస్తుంది. అప్పుడు మన పరిస్థితి మరింత సులువవుతుంది. ఓవర్లు చేయాల్సిన పరుగుల గురించి స్పష్టత ఉంటే చాలు. రన్‌రేట్ ఆరు పరుగులకు వచ్చినా సమస్య ఉండదు. ఎందుకంటే ఈ సమయంలో వికెట్లు తీస్తేనే ప్రత్యర్థికి అవకాశం దక్కుతుంది తప్ప నిలదొక్కుకున్న బ్యాటర్లను వారు అడ్డుకోలేరు. ఈ దశలో మైలురాళ్లు నాకు ఏమాత్రం ముఖ్యం కాదు. సెంచరీ సాధిస్తే మంచిదే. లేకపోతే విజయం దక్కిన ఆనందం ఎలాగూ ఉంటుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో సంబరాలు ఉంటాయి. ఏం చేసినా ఒదిగి ఉండి మళ్లీ సాధన చేయడం, జట్టును గెలిపించేందుకు మళ్లీ కొత్తగా బరిలోకి దిగడమే నాకు తెలిసింది. ఇప్పటికీ అదే చేస్తున్నాను. **–విరాట్ కోహ్లి**


స్మిత్


రోహిత్, షమీ


అయ్యర్


రాహుల్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో వరుసగా మూడోసారి భారత్ ఫైనల్ చేరింది. గత టోర్నీ రన్నరప్ అయిన టీమిండియా ఈసారి అజేయ ప్రదర్శనతో తుది పోరుకు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (96 బంతుల్లో 73; 4 ఫోర్లు, 1 సిక్స్), అలెక్స్ కేరీ (57 బంతుల్లో 61; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. షమీ 3 వికెట్లు పడగొట్టగా... రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 48.1 ఓవర్లలో 6 వికెట్లకు 267 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (98 బంతుల్లో 84; 5 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడగా... శ్రేయస్ అయ్యర్ (62 బంతుల్లో 45; 3 ఫోర్లు), కేఎల్ రాహుల్ (34 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. నేడు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగే రెండో సెమీఫైనల్ మ్యాచ్ విజేతతో ఆదివారం దుబాయ్‌లోనే జరిగే ఫైనల్లో భారత్ తలపడుతుంది.

రాణించిన స్మిత్...

హెడ్ మరోసారి భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. 'సున్నా' వద్ద ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను షమీ అందుకోలేకపోవడంతో అతను బతికిపోగా, మరో ఎండ్‌లో కూపర్ కనోలీ (9 బంతుల్లో 0) విఫలమయ్యాడు. పాండ్యా ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన హెడ్, షమీ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. దాంతో ఆరో ఓవర్లోనే భారత్ స్పిన్నర్ కుల్దీప్‌ను బౌలింగ్‌కు దింపింది. మరో మూడు ఓవర్ల తర్వాత భారత్ అసలు ఫలితం సాధించింది. వరుణ్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే భారీ షాట్ ఆడబోయి హెడ్ లాంగాఫ్‌లో గిల్‌కు క్యాచ్ ఇవ్వడంతో జట్టు ఊపిరి పీల్చుకుంది. మరోవైపు స్మిత్ సాహసాలకు పోకుండా జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. అతనికి కొద్దిసేపు లబుషేన్ (36 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్) సహకరించాడు. 68 బంతుల్లో స్మిత్ హాఫ్ సెంచరీ పూర్తయింది. అయితే తక్కువ వ్యవధిలో లబుషేన్, ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 11)లను అవుట్ చేసి జడేజా దెబ్బ కొట్టాడు. ఈ దశలో స్మిత్, కేరీ భాగస్వామ్యంతో జట్టు కోలుకుంది. వీరిద్దరు కలిసి స్కోరును 200 వరకు తీసుకొచ్చారు. ఈ భాగస్వామ్యం బలపడుతున్న దశలో షమీ ఆటను మలుపు తిప్పాడు. అతని బౌలింగ్‌లో ముందుకొచ్చి షాట్ ఆడబోయిన స్మిత్ బౌల్డయ్యాడు. మ్యాక్స్‌వెల్ (5 బంతుల్లో 7; 1 సిక్స్) విఫలం కాగా, ఆసీస్ వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో కేరీ దూకుడుతో జట్టు మెరుగైన స్కోరు సాధించగలిగింది.

కీలక భాగస్వామ్యాలు...

ఛేదనలో ఆరంభంలోనే శుబ్‌మన్ గిల్ (11 బంతుల్లో 8; 1 ఫోర్) వెనుదిరగ్గా... క్రీజ్‌లో ఉన్నంత సేపు రోహిత్ శర్మ (29 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. అయితే ఓపెనర్లు వెనుదిరిగిన తర్వాత కోహ్లి, అయ్యర్ భాగస్వామ్యంతో జట్టు సురక్షిత స్థితికి చేరింది. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేసిన వీరిద్దరు ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా టీమ్‌ను విజయం దిశగా నడిపించారు. ఈ క్రమంలో 53 బంతుల్లో కోహ్లి హాఫ్ సెంచరీ పూర్తి కాగా, అయ్యర్ దానిని చేజార్చుకున్నాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 18.3 ఓవర్లలో 91 పరుగులు జోడించారు. ఆ తర్వాత అక్షర్ పటేల్ (30 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్), రాహుల్‌లతో కోహ్లి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. 51 వద్ద మ్యాక్స్‌వెల్ క్యాచ్ వదిలేయడం కూడా కోహ్లికి కలిసొచ్చింది. చక్కటి షాట్లతో ఆకట్టుకున్న అతను టోర్నీలో మరో శతకం అందుకునేలా కనిపించాడు. అయితే విజయానికి 40 పరుగుల దూరంలో భారీ షాట్‌కు ప్రయత్నించి విరాట్ అవుటయ్యాడు. ఈ స్థితిలో హార్దిక్ పాండ్యా (24 బంతుల్లో 28; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్ ఛేదనను సులువు చేసింది. 20 బంతుల్లో 24 పరుగులు చేయాల్సి ఉండగా కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే జంపా ఓవర్లో పాండ్యా రెండు వరుస సిక్సర్లు బాదగా... అతను అవుటైన తర్వాత మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో రాహుల్ మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) గిల్ (బి) వరుణ్ 39; కనోలీ (సి) రాహుల్ (బి) షమీ 0; స్మిత్ (బి) షమీ 73; లబుషేన్ (ఎల్బీ) (బి) జడేజా 29; ఇన్‌గ్లిస్ (సి) కోహ్లి (బి) జడేజా 11; కేరీ (రనౌట్) 61; మ్యాక్స్‌వెల్ (బి) అక్షర్ 7; డ్వార్‌షుయిస్ (సి) అయ్యర్ (బి) వరుణ్ 19; జంపా (బి) పాండ్యా 7; ఎలిస్ (సి) కోహ్లి (బి) షమీ 10; తన్వీర్ సంఘా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 264. వికెట్ల పతనం:** 1–4, 2–54, 3–110, 4–144, 5–198, 6–205, 7–239, 8–249, 9–262, 10–264. **బౌలింగ్:** షమీ 10–0–48–3, హార్దిక్ పాండ్యా 5.3–0–40–1, కుల్దీప్ యాదవ్ 8–0–44–0, వరుణ్ చక్రవర్తి 10–0–49–2, అక్షర్ పటేల్ 8–1–43–1, రవీంద్ర జడేజా 8–1–40–2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) కనోలీ 28; గిల్ (బి) డ్వార్‌షుయిస్ 8; కోహ్లి (సి) డ్వార్‌షుయిస్ (బి) జంపా 84; అయ్యర్ (బి) జంపా 45; అక్షర్ (బి) ఎలిస్ 27; రాహుల్ (నాటౌట్) 42; పాండ్యా (సి) మ్యాక్స్‌వెల్ (బి) ఎలిస్ 28; జడేజా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (48.1 ఓవర్లలో 6 వికెట్లకు) 267. వికెట్ల పతనం:** 1–30, 2–43, 3–134, 4–178, 5–225, 6–259. **బౌలింగ్:** డ్వార్‌షుయిస్ 7–0–39–1, ఎలిస్ 10–0–49–2, కనోలీ 8–0–37–1, జంపా 10–0–60–2, సంఘా 6–0–41–0, మ్యాక్స్‌వెల్ 6.1–0–35–0, హెడ్ 1–0–6–0.

“ ఆటలో ఆఖరి బంతి పడే వరకు ఏమీ చెప్పలేం. ఆసీస్ ఇన్నింగ్స్ ముగిశాక ఇది మరీ చిన్న స్కోరేమీ కాదని, విజయం కోసం మేం చాలా బ్యాటింగ్ చేయాల్సి ఉంటుందని అర్థమైంది. ఇవాళ మా బ్యాటింగ్ అన్ని రకాలుగా బాగుంది. పిచ్ కూడా మెరుగ్గా అనిపించింది. అయితే పిచ్‌పై ఎక్కువ దృష్టి పెట్టకుండా మా ఆటనే నమ్ముకున్నాం. ఆరు బౌలింగ్ ప్రత్యామ్నాయాలు, ఎనిమిదో నంబర్ వరకు బ్యాటింగ్ చేయగలవారు ఉండాలని మేం కోరుకున్నాం. దానిని బట్టే జట్టును ఎంపిక చేశాం. ఇప్పుడు ఆ ఆరుగురు బౌలర్లను సమర్థంగా వాడుకున్నాం. కోహ్లి ఎన్నో ఏళ్లుగా ఇదే తరహాలో జట్టును గెలిపిస్తూ వస్తున్నాడు. ఫైనల్‌కు ముందు ఆటగాళ్లంతా ఫామ్‌లో ఉంటే జట్టులో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అయితే దాని గురించి అతిగా ఆలోచించడం లేదు. సమయం వచ్చినప్పుడు అంతా సరైన రీతిలో స్పందిస్తారు. **–రోహిత్ శర్మ, భారత కెప్టెన్**

4 ఐసీసీ ఈవెంట్లు... వన్డే వరల్డ్ కప్, టి20 వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లలో భారత్‌ను ఫైనల్ చేర్చిన తొలి కెప్టెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు.

336 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న భారతీయ ఫీల్డర్‌గా కోహ్లి ఘనత వహించాడు. 334 క్యాచ్‌లతో రాహుల్ ద్రవిడ్ పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు. వన్డేల్లో అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న రెండో ఫీల్డర్‌గానూ కోహ్లి (161 క్యాచ్‌లు) నిలిచాడు. శ్రీలంక ప్లేయర్ మహేళ జయవర్ధనే (218 క్యాచ్‌లు) తొలి స్థానంలో ఉన్నాడు.

దుబాయ్‌కు వెళ్లేదెవరో?



నేడు చాంపియన్స్ ట్రోఫీలో రెండో సెమీఫైనల్

- న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా 'ఢీ'
- గెలిచిన జట్టు ఆదివారం దుబాయ్‌లో భారత్‌తో అమీతుమీకి సిద్ధం
- మధ్యాహ్నం గం.2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

లాహోర్: ఎనిమిదేళ్ల విరామం తర్వాత జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్ తొలి బెర్త్‌ను ఖరారు చేసుకోగా... ఫైనల్ రెండో బెర్త్ కోసం దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు నేడు ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం దుబాయ్‌లో జరిగే టైటిల్ పోరులో టీమిండియాతో ఆడుతుంది. ఐసీసీ టోర్నీల్లో దురదృష్టం వెంటపెట్టుకొని తిరిగే దక్షిణాఫ్రికా జట్టు ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని చూస్తుంటే... పాకిస్తాన్ పిచ్‌లపై ఇటీవల ముక్కోణపు సిరీస్ గెలిచిన న్యూజిలాండ్ అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. బలాబలాల దృష్ట్యా ఇరు జట్లు సమ ఉజ్జీలే అయినా... నాణ్యమైన స్పిన్నర్లు అందుబాటులో ఉన్న న్యూజిలాండ్‌దే పైచేయిగా కనిపిస్తోంది. ఇరు జట్లు గతంలో ఒక్కోసారి ఈ టోర్నీలో విజేతగా నిలిచాయి. 1998లో దక్షిణాఫ్రికా, 2000లో న్యూజిలాండ్ ఈ ట్రోఫీని చేజిక్కించుకున్నాయి. అయితే అప్పట్లో ఈ టోర్నీ పేరు చాంపియన్స్ ట్రోఫీ అని కాకుండా... 'ఐసీసీ నాకౌట్ ట్రోఫీ' అని ఉండేది. ఐసీసీ టోర్నీల్లో 'చోకర్స్'గా ముద్ర చెరిపేసుకోవాలని తెంబా బవుమా సారథ్యంలో దక్షిణాఫ్రికా జట్టు కృతనిశ్చయంతో ఉంది. మరోవైపు 2015, 2019 వన్డే ప్రపంచకప్‌లలో తుదిమెట్టుపై తడబడి రన్నరప్‌తో సరిపెట్టుకున్న న్యూజిలాండ్ ఈసారి ట్రోఫీ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. గ్రూప్ 'బి'లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి... ఆసీస్‌తో పోరు వర్షం కారణంగా రద్దు కావడంతో దక్షిణాఫ్రికా 5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. మరోవైపు గ్రూప్ 'ఎ'లో రెండు మ్యాచ్‌లు గెలిచి, ఒక దాంట్లో ఓడి 4 పాయింట్లతో కివీస్ సెమీస్‌కు చేరింది.

సఫారీలకు సాధ్యమేనా?

ఫార్మాట్‌తో సంబంధం లేకుండా ఐసీసీ నిర్వహిస్తున్న గత 7 ఈవెంట్లలో నాకౌట్‌కు చేరిన దక్షిణాఫ్రికా జట్టు... ఈసారి కప్పుకొట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. 2023 పురుషుల వన్డే ప్రపంచకప్, 2024 పురుషుల టి20 ప్రపంచకప్, 2025 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ), 2024 పురుషుల అండర్–19 వరల్డ్‌కప్, 2024 టి20 ప్రపంచకప్, 2025 మహిళల అండర్–19 ప్రపంచకప్ ఇలా.. ఈ ఏడు టోర్నీల్లో సఫారీ టీమ్ నాకౌట్ దశకు చేరింది. గాయం కారణంగా గత మ్యాచ్‌కు అందుబాటులో లేకపోయిన దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా ఈ మ్యాచ్‌లో ఆడనున్నాడు. జోర్జీ కూడా కోలుకున్నప్పటికీ అతడికి తుది జట్టులో చోటు దక్కడం అనుమానమే. మార్క్‌రమ్, డసెన్, క్లాసెన్, మిల్లర్, రికెల్టన్ కలిసి కట్టుగా రాణించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే సూచనలు ఉన్న నేపథ్యంలో స్టార్ ఆటగాళ్లలో ఒకరు ఇన్నింగ్స్ ఆసాంతం నిలవాల్సిన అవసరముంది. బౌలింగ్‌లో స్టార్ పేసర్లు కగిసో రబడ, లుంగి ఇన్‌గిడి కంటే... ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్, ముల్డర్ బాగా ప్రభావం చూపుతున్నారు. కేశవ్ మహరాజ్ స్పిన్ బౌలింగ్ బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.

ఆత్మవిశ్వాసంతో కివీస్...

పాకిస్తాన్ వేదికగా ఇటీవల జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ సొంతం చేసుకున్న న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో ఉంది. లీగ్ దశలో భాగంగా భారత్ చేతిలో ఓడినప్పటికీ కివీస్‌ను తక్కువ అంచనా వేసేందుకు లేదు. విల్ యంగ్, రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్, డారిల్ మిషెల్, టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్, బ్రేస్‌వెల్ రూపంలో న్యూజిలాండ్ బ్యాటింగ్ బలంగా ఉంది. బౌలింగ్ రూర్కే, హెన్రీ, జేమీసన్‌తో పాటు కెప్టెన్ సాంట్నర్ కీలకం కానున్నాడు.



విలియమ్సన్

7 ఐసీసీ టోర్నీల్లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లు జరగగా... అందులో న్యూజిలాండ్ 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. నాలుగింటిలో దక్షిణాఫ్రికా గెలిచింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
96	37
72,990	22,083

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	18,031	▽	319
డోజోన్స్	42,432	▽	759
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,771	▽	100
డాక్స్	22,377	▽	769
షాంఘై	3,324	△	7
నికాయ్	37,331	▽	454

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,432
బంగారం (99.5 స్వచ్ఛత)	86,086
వెండి (కేజీ)	95,293

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		86.95	87.97
£	బ్రిటన్ పౌండ్		108.54	113.45
€	యూరో		90.31	92.96
¥	జపాన్ ఎన్ (100)		57.90	59.37
AU$	ఆస్ట్రేలియా డాలర్		53.12	55.33
S$	సింగపూర్ డాలర్		62.63	67.32
SAR	సౌదీ రియాల్		22.37	23.93
UAE D	యూఏఈ దిర్హామ్		22.87	24.65
¥	చైనా యువాన్		11.13	12.96

మళ్లీ మెరిసిన బంగారం

- 10 గ్రాములపై రూ.1,100 పెరుగుదల
- రూ.89,000 మార్క్‌కు చేరిక



న్యూఢిల్లీ: పసిడికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. మంగళవారం ఒక్కరోజే రూ.1,100 పెరిగింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం ధర రూ.89,000 మార్క్‌ను మరోసారి చేరుకుంది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం ధర ఇంతే పెరిగి రూ.88,600కు చేరుకుంది. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పవనాల మద్దతుతో జ్యుయలర్లు, స్టాకిస్టులు కొనుగోళ్లకు మొగ్గు చూపించినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. చైనా, కెనడా, మెక్సికోలపై ట్రంప్ సుంకాలు ప్రకటించగా, ఆయా దేశాలు సైతం ప్రతిగా స్పందించడంతో బంగారం ధరలు పెరిగినట్టు బులియన్ ట్రేడర్లు తెలిపారు. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఏప్రిల్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్టు ధర రూ.806 పెరిగి రూ.86,190 వద్ద ఉంది. మరోవైపు వెండి ధర సైతం కిలోకి రూ.1,500 ర్యాలీ చేసి, రూ.98,000కు చేరింది. అమెరికాపై కెనడా, చైనా ప్రతీకార సుంకాలు విధించడం బంగారం ధరల్లో తాజా ర్యాలీకి దారితీసినట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అనలిస్ట్ జతీన్ త్రివేది తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ మార్కెట్లో గోల్డ్ ఔన్స్‌కు 22 డాలర్లు లాభపడి 2,922 డాలర్లకు చేరుకుంది.

ప్రపంచం చూపు.. భారత్ వైపు

- నమ్మకమైన భాగస్వామిగా అన్ని దేశాలు మనల్ని గుర్తిస్తున్నాయి
- ఈ అవకాశాలను అందిపుచ్చుకోండి...
- పారిశ్రామిక రంగానికి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



న్యూఢిల్లీ: ప్రపంచమంతా భారత్‌ను నమ్మకమైన భాగస్వామిగా చూస్తోందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి భారీ స్థాయిలో చర్యలు చేపట్టాలని పారిశ్రామిక రంగానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. తయారీ రంగాన్ని, ఎగుమతులను మరింతగా ప్రోత్సహించేందుకు త్వరలోనే ప్రభుత్వం రెండు పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. నియంత్రణలు, పెట్టుబడులు, సులభతరమైన వ్యాపార నిర్వహణకు సంబంధించిన సంస్కరణలపై బడ్జెట్ తదనంతర వెబినార్‌లో మాట్లాడుతూ ఆయన ఈ అంశాలను పేర్కొన్నారు. ప్రపంచ డిమాండ్‌ను తీర్చగలిగేలా భారత్‌లో తయారు చేయగల కొత్త ఉత్పత్తులను గుర్తించాలని పారిశ్రామికవేత్తలను ఆయన కోరారు. 'దీన్ని సాకారం చేసే సత్తా మన దేశానికి, మీకు (పరిశ్రమలు) ఉంది. ఇదొకొ గొప్ప అవకాశం. ప్రపంచ ఆకాంక్షల విషయంలో మన పరిశ్రమలు ప్రేక్షక పాత్ర వహించకుండా, అందులో కీలకపాత్ర పోషించాలి. మీకు మీరే అవకాశాలను అందింపుచ్చుకోవాలి' అని పారిశ్రామికవేత్తలకు మోదీ సూచించారు. 'భారత్ ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వృద్ధి ఇంజిన్‌గా నిలుస్తోంది. అందుకే ప్రతి దేశం భారత్‌తో ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలనుకుంటోంది. మన తయారీ రంగం దీన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈలకు చౌక రుణాలివ్వాలి...

దేశవ్యాప్తంగా ఉన్న ఆరు కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు సకాలంలో, తక్కువ వడ్డీ రేట్లకు నిధులను అందించేందుకు కొత్త తరహా రుణ పంపిణీ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని మోదీ నొక్కి చెప్పారు. 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ మహిళా ఎంట్రప్రెన్యూర్లకు తొలిసారిగా రూ. 2 కోట్ల వరకు రుణాలను అందించనున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈలకు కేవలం రుణాలివ్వడమే కాకుండా, మార్గనిర్దేశం, తోడ్పాటు అందించేలా మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌లను రూపొందించాలన్నారు. ఏ దేశ ప్రగతికైనా మెరుగైన వ్యాపార పరిస్థితులు చాలా కీలకమని, అందుకే తమ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో 40,000కు పైగా నిబంధనల అమలు అడ్డంకులను తొలగించిందన్నారు. జనవిశ్వాస్ 2.0 చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. బడ్జెట్లో ఎంఎస్ఎంఈ రుణాలపై గ్యారంటీ కవరేజీని రెట్టింపు స్థాయిలో రూ.20 కోట్లకు పెంచామని, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల నిమిత్తం రూ.5 లక్షల వరకు పరిమితితో క్రెడిట్ కార్డులను అందించనున్నట్లు ప్రధాని పేర్కొన్నారు.

ఎగుమతులకు అనుకూల కేంద్రంగా భారత్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: భారత్‌ను ఎగుమతులకు అనుకూల కేంద్రంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు, ఈ దిశగా నియంత్రణల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. నియంత్రణపరమైన అడ్డంకుల్లేని బలమైన తయారీ రంగం పెద్ద ఎత్తున దేశీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించగలదన్నారు. ఇది ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుందని, భారత్ అంతర్జాతీయంగా విశ్వసనీయమైన భాగస్వామిగా అవతరించగలదన్నారు. బడ్జెట్ అనంతరం ఏర్పాటు చేసిన వెబినార్‌లో ఆమె మాట్లాడారు. వ్యాపార సులభతర నిర్వహణకు వీలుగా వ్యాపార సంబంధిత చట్టాలను నేరరహితం చేయడం వల్ల రిస్కులు తగ్గుతాయని.. పరిశ్రమలు విశ్వాసంతో పనిచేస్తాయన్నారు. ఇప్పటికే 42వేలకు పైగా నిబంధనల అమలు భారాన్ని తొలగించినట్టు తెలిపారు. 2014 నుంచి 3,700 నిబంధనలను నేరరహితంగా మార్చినట్టు చెప్పారు. జన్ విశ్వాస్ చట్టం–2023లో 180 చట్టపరమైన నిబంధనలను నేరరహితంగా చేసినట్టు తెలిపారు. జన్ విశ్వాస్–2 లోనూ 100కు పైగా నిబంధనలను నేరరహితంగా మార్చనున్నటు చెప్పారు.

ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందాలకు కొత్త నమూనా: సీఈఏ

ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందాల్లో కొత్త నమూనా అన్నది.. మారుతున్న అంతర్జాతీయ పెట్టుబడుల వాతావరణంలో ఆధునిక సవాళ్లను పరిష్కరించే విధంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) అనంత నాగేశ్వరన్ అన్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా 'భారత్‌ను పెట్టుబడులకు అనుకూల దేశంగా మార్చడం 'అన్న అంశంపై మాట్లాడారు. భారత్‌కు చెందిన ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం నమూనాను చివరిగా సవరించి 10 ఏళ్లు దాటిపోయిందంటూ, ఈ కాలంలోఅంతర్జాతీయ పెట్టుబడుల ముఖచిత్రం ఎంతో మార్పునకు లోనైనట్టు చెప్పారు. ఇన్వెస్టర్లు వర్ధమాన దేశాల్లో తమ పెట్టుబడులకు రక్షణ కోరుకుంటున్నట్టు తెలిపారు.

రిలయన్స్‌కు కేంద్రం షాక్..

- రూ. 24,500 కోట్ల నష్టపరిహారానికి నోటీసు
- ఓఎన్‌జీసీ బ్లాక్ నుంచి అక్రమంగా గ్యాస్ ఉత్పత్తి, విక్రయ అభియోగం



న్యూఢిల్లీ: వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి కేంద్రం షాకిచ్చింది. ఓఎన్‌జీసీకి చెందిన క్షేత్రం నుంచి గ్యాస్ అక్రమంగా ఉత్పత్తి చేసినందుకు, గడువులోగా బ్యాటరీ సెల్ ప్లాంటు ఏర్పాటు చేయనందుకు గాను రెండు డిమాండ్ నోటీసులు ఇచ్చింది. మొదటి దానికి సంబంధించి రూ. 24,500 కోట్ల నష్టపరిహారం కట్టాలని ఆదేశించింది. ఇక రెండో అంశానికి సంబంధించి సుమారు 3.1 కోట్ల పెనాల్టీ విధించింది. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణా గోదావరి బేసిన్‌లో రిలయన్స్–బీపీ, ప్రభుత్వ రంగ ఓఎన్‌జీసీ గ్యాస్ క్షేత్రాలు పక్కపక్కనే ఉన్నాయి. ఓఎన్‌జీసీ క్షేత్రం నుంచి తమ క్షేత్రంలోకి వచ్చిన గ్యాస్‌ను రిలయన్స్, దాని భాగస్వామ్య సంస్థ బీపీ వెలికితీసి, విక్రయించుకుని, లబ్ధి పొందినట్లు అభియోగాలు ఉన్నాయి. దీనికి సంబంధించి రిలయన్స్, బీపీ నష్టపరిహారం కట్టాలనే అంశం తెరపైకి వచ్చింది. కానీ, ఈ వివాదంలో అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌లో కంపెనీలకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చినప్పటికీ ఢిల్లీ హైకోర్టు ఫిబ్రవరి 14న వాటిని తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో తమతో పాటు నికో (గతంలో భాగస్వామి)కి కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ డిమాండ్ నోటీసులు పంపినట్లు ఎక్స్ఛేంజీలకు రిలయన్స్ తెలిపింది.

మరోవైపు, 10 గిగావాట్ హవర్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యంతో బ్యాటరీ సెల్ ప్లాంటు ఏర్పాటుకు సంబంధించి తొలి మైలురాయి పనులను పూర్తి చేయడంలో జాప్యానికి గాను అనుబంధ సంస్థ రిలయన్స్ న్యూ ఎనర్జీ బ్యాటరీ స్టోరేజ్ లిమిటెడ్‌కి భారీ పరిశ్రమల శాఖ పెనాల్టీ విధించినట్లు రిలయన్స్ తెలిపింది. ఈ గడువును పొడిగించాలంటూ ప్రభుత్వాన్ని ఆర్ఎన్ఈబీఎస్ఎల్ కోరినట్లు వివరించింది. జనవరి 1 నుంచి మార్చి 3 వరకు లెక్కేస్తే జరిమానా రూ. 3.1 కోట్లు ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఆ దేశాలపై సుంకాలు.. భారత్‌కు అవకాశాలు
జెమినీ ఎడిబుల్స్ చేతికి అన్నపూర్ణ ఫుడ్స్

మార్కెట్ వాటాపై మరింత ఫోకస్


- 150 కొత్త ఏసీ మోడల్స్ ఆవిష్కరించిన బ్లూస్టార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా రూమ్ ఏసీల మార్కెట్లో తమ వాటాను పెంచుకోవడంపై బ్లూస్టార్ మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం సుమారు 13.75 శాతంగా ఉన్న వాటాను 15 శాతానికి పెంచుకోనున్నట్లు కంపెనీ ఎండీ బి. త్యాగరాజన్ తెలిపారు. ఇందులో భాగంగా శ్రీసిటీ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యాలను ప్రస్తుతమున్న 6.5 లక్షల యూనిట్ల నుంచి దశలవారీగా, పూర్తి స్థాయిలో 12 లక్షలకు పెంచుకుంటున్నట్లు వివరించారు. అన్ని ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాల పెంపుపై ఏటా రూ. 100 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నామని, ఈ ఆర్థిక సంవత్సరం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై రూ. 32 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల మార్కెట్లో తమకు సుమారు 15 శాతం మార్కెట్ వాటా ఉందని వివరించారు.

మంగళవారమిక్కడ కొత్తగా 150 మోడల్స్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు వివరించారు. ఈ ఉత్పత్తుల్లో ఏఐ ప్రో ప్లస్, డీఫ్రాస్ట్ క్లీన్ టెక్నాలజీ తదితర ఫీచర్లతో స్మార్ట్ వైఫై, హెవీ డ్యూటీ, ఇన్వర్టర్ ఏసీలు ఉన్నాయి. వీటి ధర రూ. 28,990 నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఆర్థిక సంవత్సరం సుమారు 15 లక్షల యూనిట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరం దాదాపు 18 లక్షల ఏసీల విక్రయ లక్ష్యాలు ఉన్నట్లు త్యాగరాజన్ చెప్పారు.

సెన్సెక్స్... 73,000 దిగువకు



ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 96 పాయింట్లు క్షీణించి 72,990 వద్ద ముగిసింది. వెరసి 73,000 దిగువకు చేరింది. నిఫ్టీ అయితే వరుసగా పదో రోజు నీరసించింది. 37 పాయింట్ల నష్టంతో 22,083 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 452 పాయింట్లు పతనమై 72,634ను తాకింది. ట్రంప్ టారిఫ్ భయాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ప్రభావంతో మార్కెట్లు పతనమవుతున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో బజాజ్ ఆటో, హీరో మోటో, బజాజ్ ఫిన్, హెచ్‌సీఎల్ టెక్, ఐషర్, నెస్లే 5–2 శాతం మధ్య డీలాపడ్డాయి.

వీక్లీ ఎక్స్‌పైరీలు మార్పు: నిఫ్టీ ఇండెక్స్ డెరివేటివ్స్ వీక్లీ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీని గురువారం నుంచి సోమవారానికి మారుస్తున్నట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. అలాగే, నిఫ్టీ నెల, 3 నెలలు, 6 నెలల ఎఫ్అండ్‌వో కాంట్రాక్టులు కూడా ఎక్స్‌పైరీ నెలలోని ఆఖరు గురువారం కాకుండా ఆఖరు సోమవారం నాడు ఎక్స్‌పైర్ అవుతాయి. బ్యాంక్ నిఫ్టీ, ఫిన్ నిఫ్టీ మొదలైన వాటికి కూడా ఇది వర్తిస్తుంది. ఇది ఏప్రిల్ 4 నుంచి అమల్లోకి వస్తుంది.

యూఎస్ బేర్: యూఎస్ ఆర్థిక వ్యవస్థ బలహీనపడనున్న అంచనాలు మరోసారి స్టాక్ మార్కెట్లను దెబ్బతీశాయి. నాస్‌డాక్, డోజోన్స్, ఎస్అండ్‌పీ 2 శాతం పతనమయ్యాయి. యూరప్‌లో జర్మనీ ఇండెక్స్ 3.5% పతనంకాగా.. ఫ్రాన్స్, ఇటలీ, యూకే సూచీలు సైతం 2–1 శాతం స్థాయిలో నష్టపోయాయి.

సాక్షి సినిమా


కాకులు తల్వార్‌లు పట్టినయ్



నాని

'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం నుంచి 'రా స్టేట్‌మెంట్' పేరుతో ఓ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో రా స్టేట్‌మెంట్ విడుదలైంది. 'చరితలో అందరూ చిలకలు, పావురాలు గురించి రాసిన్రు గానీ, గదే జాతిలో పుట్టిన కాకుల గురించి రాయలేదు' అనే డైలాగ్‌తో గ్లింప్స్ ఆరంభం అవుతుంది. 'ఒక ధగడ్ వొచ్చి మొత్తం జాతిలో జోష్ తెచ్చిండు.. థూ.. అనిపించుకున్న కాకులు తల్వార్‌లు పట్టినయ్' అంటూ ఓ మహిళ వాయిస్ ఓవర్‌లో చెప్పిన డైలాగ్స్ కూడా ఈ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''ది ప్యారడైజ్' గ్లింప్స్ కన్నడ, మలయాళ, బెంగాలీ వెర్షన్లు త్వరలో విడుదల కానున్నాయి. మా చిత్రం 2026 మార్చి 26న విడుదలవుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఐదుగురు నాయికలతో..?



అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఓ భారీ బడ్జెట్ పీరియాడికల్ మూవీ రూపొందనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించనుందని, ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారనీ ప్రచారం జరుగుతోంది. కాగా, ఈ చిత్రంలో ఐదుగురు హీరోయిన్స్ ఉంటారని, ఇందులో ముగ్గురు విదేశీ నాయికలు ఉంటారని భోగట్టా. అయితే మెయిన్ హీరోయిన్ మాత్రం జాన్వీ కపూర్ అని సమాచారం. మరి... వార్తల్లో ఉన్నట్లు అల్లు అర్జున్–అట్లీ కాంబినేషన్ మూవీలో ఐదుగురు నాయికలు ఉంటారా? అనే ప్రశ్నకు క్లారిటీ రావాలంటే కొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

రెండు సినిమాలూ బ్లాక్‌బస్టర్ కావాలి

– హీరో నితిన్




మహేశ్వర్ రెడ్డి, నితిన్, జీవీ ప్రకాశ్‌కుమార్, దివ్య భారతి

''ఫస్ట్ సీ ఫ్యాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా వస్తున్న 'కింగ్‌స్టన్' ట్రైలర్, విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ట్రైలరే ఇలా ఉంటే సినిమా ఇంకెంత అద్భుతంగా ఉంటుందో అనిపిస్తోంది'' అని హీరో నితిన్ అన్నారు. సంగీత దర్శకుడు – నటుడు జీవీ ప్రకాశ్‌కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కింగ్‌స్టన్'. ఈ చిత్రంలో దివ్య భారతి హీరోయిన్‌గా నటించారు. జీ స్టూడియోస్‌తో కలిసి జీవీ ప్రకాశ్‌కుమార్ తన సొంత బ్యానర్ ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రం తమిళ, తెలుగు భాషల్లో ఈ నెల 7న విడుదల కానుంది. గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నితిన్ మాట్లాడుతూ – ''మార్చి 7 నువ్వు స్టార్ట్ చేయ్... మార్చి 28న (నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా ఈ తేదీన రిలీజ్ కానుంది) మేము క్లోజ్ చేస్తాము. ఈ రెండు సినిమాలూ బ్లాక్‌బస్టర్ హిట్ కావాలి'' అన్నారు. ''నిర్మాతగా 'కింగ్‌స్టన్' నా తొలి మూవీ. 'హ్యారీ పోట్టర్'లాంటి మల్టీ యూనివర్స్ సినిమాలు చూసినప్పుడు ఆ డ్రీమ్‌లోకి వెళ్లినట్టుగా అనిపిస్తుంది. ఆ తరహా సినిమాల ప్రేరణతో 'కింగ్‌స్టన్' తీశాను. కానీ ఏ హాలీవుడ్ మూవీని కాపీ కొట్టలేదు'' అని పేర్కొన్నారు జీవీ ప్రకాశ్‌కుమార్. ఈ వేడుకలో పాల్గొన్న నిర్మాత 'మైత్రీ' రవిశంకర్, దర్శకుడు వెంకీ కుడుముల, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి ఈ సినిమా విజయం సాధించాలన్నారు.

నేను హీరోగా నటించిన రోజులు గుర్తొచ్చాయి

– రాజేంద్ర ప్రసాద్



''నేను సినిమా ఇండస్ట్రీకి వచ్చి 48 ఏళ్లు అయ్యింది. 'రాబిన్ హుడ్' కథ, నటన పరంగా చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈ మూవీ చూశాక నేను హీరోగా చేసిన వినోదాత్మక సినిమాలు, ఆనాటి రోజులు ఆడియన్స్‌కి గుర్తుకు వస్తాయి. అలాగే నాకు కూడా పాత రోజులు గుర్తొచ్చాయి'' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన రాజేంద్రప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ– ''రాబిన్‌హుడ్'లో ఇండియాలోనే హయ్యస్ట్ సెక్యూరిటీ ఏజెన్సీ నడిపే పాత్ర నాది. ఈ మధ్య కాలంలో నేను చేసిన బెస్ట్ క్యారెక్టర్స్‌లో ఇదొకటి. నా ఏజెన్సీలో పని చేయడానికి నితిన్ వస్తాడు. ఫారిన్ నుంచి వచ్చిన శ్రీలీలకి భద్రత కల్పించే బాధ్యత మా ఏజెన్సీది. నితిన్, నాకు మధ్య టైమింగ్ బాగా కుదిరింది. నటుడిగా ఈ జీవితం దేవుడు, ప్రేక్షకులు ఇచ్చిన గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. 'శ్రీమంతుడు' సినిమా నుంచి మైత్రీ మూవీ మేకర్స్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. సినిమా అంటే ప్యాషన్ ఉన్న ఈ బేనర్‌లో సినిమాలు చేయడం అద్భుతమైన అనుభూతి. నాకు కొత్త, పాత తేడాలుండవు. నిజానికి నాతో వర్క్ చేయడానికి కొత్త దర్శకులే చాలా ఇష్టపడతారు. దాదాపు ఏడు సినిమాలు చేస్తున్నాను. మరో ఐదు సినిమాలు ఆరంభం కావాల్సి ఉంది'' అన్నారు.

చిన్న సాయం పెద్ద సంతోషాన్నిస్తుంది

– వరలక్ష్మి



నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ పుట్టినరోజు నేడు (మార్చి 5). ఈ సందర్భంగా తన భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని లెప్రా సొసైటీ అనాథ ఆశ్రమానికి వెళ్లారు. అక్కడి చిన్నారులతో సమయాన్ని గడిపి, వారికి బహుమతులు అందించారు. అనంతరం ఆశ్రమానికి తమ వంతు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ– ''చెన్నై నుంచి హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యాను. అందుకే ఇక్కడి అనాథాశ్రమంలోని 62 మంది చిన్నారుల కోసం విరాళం ఇచ్చాం. ఈ చిన్న సాయం కూడా వారికి పెద్ద సంతోషాన్ని ఇస్తుంది. అందరూ తమ వంతుగా సాయం చేయండి'' అన్నారు. నికోలయ్ సచ్‌దేవ్ మాట్లాడుతూ– ''ఇక్కడి చిన్నారులను కలసిన తర్వాత భావోద్వేగంగా అనిపించింది. మనకి ఉన్న దాంట్లో సాయం చేస్తే ఈ ప్రపంచం మళ్లీ మనకి సాయపడుతుంది. ఇక్కడికి మళ్లీ ఆరు నెలల తర్వాత వస్తాం'' అని చెప్పారు.

మంచి సినిమాలివ్వడానికి ముందుంటాం

– నిర్మాత 'బన్నీ' వాసు



ఛత్రపతి శివాజీ తనయుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ బయోపిక్‌గా రూపొందిన హిందీ చిత్రం 'ఛావా'. విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో యేసుబాయి భోంస్లే పాత్రను రష్మికా మందన్న పోషించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న హిందీలో విడుదలైంది. ఈ నెల 7న తెలుగులో గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఛావా' హిందీలో ఎంత పెద్ద ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలుసు. అంత మంచి సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు గర్వపడుతున్నాం. భాష ఏదైనా మంచి సినిమా అయితే తెలుగులో తీసుకురావడానికి మా గీతా ఆర్ట్స్ ముందుంటుంది. ఇక 'ఛావా' చివరి 25 నిమిషాలు ఇండియా మొత్తం కన్నీళ్లు పెట్టించింది. అద్భుతమైన క్వాలిటీతో తెలుగులో డబ్ చేశాం. ఈ చిత్రం తెలుగులోనూ ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

మా ప్రయోగం అందరికీ నచ్చుతుంది

– దర్శకుడు బి. శివప్రసాద్



హరిప్రసాద్, శివప్రసాద్, శేఖర్‌చంద్ర, రాహుల్

ఆర్టిస్టులను చూపించకుండా కేవలం కథ, కథనాల ప్రాధాన్యంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ప్రయోగాత్మక చిత్రం 'రా రాజా'. పద్మ సమర్పణలో బి. శివప్రసాద్ తెరకెక్కించారు. ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానున్న సందర్భంగా బి. శివప్రసాద్ మాట్లాడుతూ– ''నిర్మాతగా సినిమాలు చేస్తున్నప్పుడు నా మైండ్‌లోకి వచ్చిన ఓ పాయింట్‌ను కథగా మార్చా. అలా అనుకోకుండా దర్శకుడిగా మారాను. మా 'రా రాజా' ప్రివ్యూ చూసినవారు బాగుందని మెచ్చుకున్నారు. మా ప్రయోగం అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''మంచి మ్యూజిక్ ఇచ్చే స్కోప్ దక్కింది'' అన్నారు శేఖర్ చంద్ర. కెమేరామేన్ రాహుల్ శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.

ముగ్గురు యువకుల ప్రయాణం



కార్తికేయ దేవ్, శాన్వీ, హర్ష రోషన్

హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సి. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి. కృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో శాన్వీ మేఘన మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సూపర్ నేచురల్, మ్యాజికల్ పవర్ ఎలిమెంట్స్ ఉన్నాయి'' అన్నారు. ''ముగ్గురు యువకుల ప్రయాణం, వాళ్ల జీవితంలో వచ్చిన మ్యాజికల్ ఎలిమెంట్స్‌ను ఎలా ఎదుర్కొన్నారు? వంటి విషయాలు సినిమా చూసి తెలుసుకోవాలి'' అని హర్ష రోషన్ తెలిపారు. ''ఈ సినిమాలో వినోదం, భావోద్వేగాలు... ఇలా అన్ని అంశాలున్నాయి'' అన్నారు కార్తికేయ దేవ్. ''వైవిధ్యమైన కథా చిత్రమిది'' అని సుప్రీత్ కృష్ణ తెలిపారు. ''ప్రేక్షకుల టైమ్‌కి, డబ్బుకి విలువ ఇచ్చే చిత్రమిది'' అన్నారు నిహాల్ కోదాటి.


విలువైన అంశాలతో నారి



ఆమని

ఆమని లీడ్ రోల్‌లో వికాస్ వశిష్ఠ, కార్తికేయ దేవ్, నిత్య శ్రీ, మౌనికా రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'నారి'. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ''మహిళల్ని గౌరవించడం, అన్ని రంగాల్లో ఆడపిల్లలు ఎదిగేందుకు సహకరించడం, ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో 13–20 ఏళ్ల పిల్లలు ప్రమాదంలో ఉన్నారనే అంశాలతో 'నారి'ని రూపొందించాం. విలువైన అంశాలతో తీసిన ఈ సినిమా అందరికీ చేరువ కావాలని 7, 8 తేదీల్లో 'నారి'ని చూసే కపుల్స్ కోసం టికెట్స్‌పై వన్ ప్లస్ వన్ ఆఫర్ ఇస్తున్నాం. ఆ రెండు రోజుల్లో అన్ని షోస్‌కు ఈ ఆఫర్ వర్తిస్తుంది'' అని దర్శక-నిర్మాతలు తెలిపారు.

తాత ముత్తాతల మీద ప్రమాణం!



సప్తగిరి

సప్తగిరి, ప్రియాంకా శర్మ జోడీగా నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పణలో కేవై బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించారు. నిర్మాత 'దిల్' రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. ఈ మూవీ టీజర్‌ని హీరో ప్రభాస్ లాంచ్ చేశారు. ''ప్రసాద్ అనే నేను... కట్నం శాసనాల గ్రంథంలో ఉన్న రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌కు గౌరవం ఇస్తూ... తరతరాలుగా కట్నం విషయంలో మా తాత ముత్తాతలు ఫాలో అవుతున్న షరతులకు కట్టుబడి ఉంటానని మా తాత ముత్తాతల మీద ప్రమాణం చేస్తున్నా'' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి.



మా నియంత్రణ ఉండాల్సిందే..


పిల్లల సోషల్ మీడియా అకౌంట్లపై తల్లిదండ్రుల అభిప్రాయం

డీపీడీపీ రూల్స్ అమలు చేయాలన్న 88 శాతం మంది

పిల్లలు చూసే కంటెంట్‌ను గుర్తించాలన్న 58 శాతం మంది

తప్పుడు వయస్సుతో అకౌంటు తెరిచేవారిపై దృష్టి పెట్టాలని సూచన

లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో వెల్లడి



పొద్దున గుడ్‌మార్నింగ్ మొదలు రాత్రి గుడ్‌నైట్ చెప్పే వరకు ఈ రోజుల్లో యువత ఎక్కువగా స్మార్ట్‌ఫోన్లలోనే గడుపుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరిలో 'సోషల్'వాడకం పెరిగింది. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్.. ఇలా ఎన్నో రకాల సోషల్ మీడియా యాప్‌లతోపాటు ఓటీటీల వాడకం విపరీతంగా పెరిగింది. సోషల్ మీడియా అకౌంట్ లేకపోతే నామోషీ అనే స్థాయికి స్కూల్ పిల్లలు సైతం వచ్చేశారు. ఇది చాలా నష్టం చేస్తోందని, పిల్లల సోషల్ మీడియా వాడకంపై కచ్చితంగా నియంత్రణ ఉండాలని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

వయసు తప్పుగా చూపి..

వాస్తవానికి సోషల్ మీడియా యాప్‌లలో ఖాతా తెరవాలంటే కనీసం 18 ఏళ్లు ఉండాలి. అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారు ఖాతా తెరవాలంటే వారి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. కానీ, వయస్సును తప్పుగా చూపిస్తూ 18 ఏళ్లలోపు వారు సొంతంగా సోషల్ మీడియా ఖాతాలు తెరవటం షరా మామూలైంది. దీంతో అవగాహన లేని వయస్సులో పిల్లలు సైబర్ విష ప్రపంచంలో కోరి కష్టాలు తెచ్చుకుంటున్నారు. ఏదో ఒక అనర్థం జరిగేవరకు తల్లిదండ్రులకు తెలియటం లేదు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) రూల్స్‌- 2025ను తీసుకువచ్చింది. ఇందులో పలు కీలక అంశాలను చేర్చారు. 18 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా ఖాతా తెరవాలన్నా, ఓటీటీ యాప్‌లు, గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో చేరాలన్నా తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరి చేశారు. ఈ నూతన నిబంధనలపై తల్లిదండ్రుల అభిప్రాయాలను లోకల్ సర్కిల్స్ సంస్థ సేకరించింది. దేశవ్యాప్తంగా 349 జిల్లాల్లోని 44 వేలమంది పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను సర్వే చేసి ఈ సంస్థ నివేదికను రూపొందించింది. కాగా, ఏ వయస్సు చిన్నారులు తమ వయస్సును ఎంతశాతం ఎక్కువగా చూపి సోషల్ మీడియా ఖాతాలు తెరుస్తున్నారన్న అంశంపై బ్రిటన్ సంస్థ ఆఫ్‌కామ్ ఓ నివేదిక విడుదల చేసింది. వయస్సు తప్పుగా నమోదు చేస్తున్న వారిలో 8 నుంచి 17 ఏళ్లలోపు చిన్నారులు 77 శాతం సొంత ప్రొఫైల్స్‌తో సోషల్ మీడియా ఖాతాలు వాడుతున్నట్టు ఆ సంస్థ తెలిపింది.

- సాక్షి, హైదరాబాద్



8న ఆర్టీసీకి మహిళా సమాఖ్యల అద్దె బస్సులు

మొదటి విడతలో 50 బస్సులు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

సెర్ప్ నిధులతో ఆర్టీసీకి 600 అద్దె బస్సులు ఇవ్వాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్)ల ద్వారా ఇందిర మహిళా శక్తి పథకం కింద టీజీఎస్ ఆర్టీసీకి అద్దెకు ఇవ్వనున్న 50 బస్సులను ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ బస్సులను ప్రారంభిస్తారు. మంత్రి సీతక్క చొరవతో దేశంలోనే తొలిసారిగా మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి బస్సులు అద్దెకు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళా సమాఖ్యలు స్వయం ఉపాధికే పరిమితం కాకుండా, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీతక్క తెలిపారు. ఎంఎంఎస్‌ల ద్వారా ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సుల కొనుగోలుకు అవసరమైన నిధులను గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 600 బస్సులకు నిధులు సమకూర్చాలని నిర్ణయించగా, మొదటి దశలో ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లోని (ప్రస్తుత 17 జిల్లాలు) 150 ఎంఎంఎస్‌లకు 150 బస్సులు అందించనున్నారు. రెండో దశలో మిగిలిన 450 బస్సుల కొనుగోలు చేస్తారు. ఒక్కో బస్సు విలువ రూ.36 లక్షలు. మంగళవారం ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. బస్సుల కొనుగోలు కోసం ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీ ఇవ్వనుంది. ఈ బస్సులను సమాఖ్యల పేరిటే రిజిస్టర్ చేస్తారు. సెర్ప్ సీఈవో, టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒకే కులం పెళ్లిళ్లతోనూ వ్యాధులు

మేనరికాల మాదిరే జన్యు సమస్యలు

సీసీఎంబీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: 'బంధువుల అమ్మాయే. అన్నీ కుదిరాయి. అందుకే చేసుకుంటున్నాం.. మా కులపువాళ్లే. అమ్మాయి బాగుంటుంది. సంబంధం ఖాయం చేశాం.. పెళ్లిళ్ల విషయంలో ఈ రకమైన మాటలు తరచూ వింటూనే ఉంటాం. అయితే ఈ రకంగా దగ్గరి చుట్టాలు, ఒకే కులంలో పెళ్లిళ్ల వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని అంటున్నారు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు. కొన్ని కులాల వారికి కొన్ని రకాల వ్యాధులు వారసత్వంగా వస్తాయని గతంలో జరిగిన పరిశోధనల్లో తేలింది. సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ కె.తంగరాజ్ బృందం ఇటీవల నిర్వహించిన అధ్యయనం కూడా ఈ విషయాన్ని నిర్ధారించింది. ఒకే కులంలో ఎక్కువగా పెళ్లిళ్లు చేసుకోవడం (కులాలతో పాటు చిన్నచిన్న సమూహాలకు కూడా ఇది వర్తిస్తుంది) వల్లనే ఆయా కులాల వారికి కొన్ని రకాల జబ్బులు వారసత్వంగా వస్తున్నాయని ఈ అధ్యయనం చెబుతోంది. నాలుగు వేర్వేరు సమూహాలకు చెందిన 281 మంది జన్యు క్రమాలను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చినట్టు తంగరాజ్ తెలిపారు. జబ్బులకు వాడే మందులు కొన్ని సమూహాల్లో ఎందుకు భిన్నమైన ప్రభావం చూపుతాయనే అంశాన్ని కూడా పరిశీలించామని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన శాస్త్రవేత్త డాక్టర్ ప్రతీసా మచ్చ తెలిపారు. కీళ్లు, వెన్ను, లిగ్మెంట్లలో వాపు/మంటకు కారణమయ్యే స్పాండిలైటిస్‌కు ఒక నిర్దిష్ట జన్యుపరమైన మార్పుతో సంబంధం ఉందని చెప్పారు. HLA& B27:04 అని పిలిచే ఈ జన్యు మార్పు కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రాంతంలో ఒక సామాజికవర్గం వాళ్లలో ఈ స్పాండిలైటిస్ ఎక్కువగా ఉందని గుర్తించినట్లు కిమ్స్ ఆసుపత్రి రుమటాలజిస్ట్ డాక్టర్ శరత్ చంద్రమౌళి వీరవల్లి వెల్లడించారు. కొన్ని కులాలు, సమూహాలకే ప్రత్యేకమైన వ్యాధుల జన్యు రూపాంతరాలను కూడా గుర్తించినట్లు వివరించారు. ఆయా సమూహాల్లోని వారు ఈ వ్యాధులకు వాడే ఔషధాలు ఇతరులలో కంటే భిన్నంగా పని చేస్తాయని సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ దివ్య తేజ్ పేర్కొన్నారు.

మైలేజీ తగ్గి.. టైర్లు అరిగి



ఆర్టీసీకి నిర్వహణ పరమైన ఖర్చుల భారం

5.10 కి.మీ. కంటే తగ్గిపోయిన కేఎంపీఎల్

ఏడాదికి అదనంగా వేయి టైర్లు కొనాల్సిన పరిస్థితి

వేగంగా దెబ్బతింటున్న కమాన్‌పట్టీలు

ప్రభుత్వానికి ఆర్టీసీ నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతితో నిర్వహణపరమైన ఖర్చులు కూడా తడిసిమోపెడవుతున్నట్టు ఆ సంస్థ లెక్కగట్టింది. కోల్పోతున్న టికెట్ ఆదాయానికి సరిపడా ప్రభుత్వం రీయింబర్స్ చేయటం లేదు. ఆ రూపంలో వస్తున్న నష్టానికి, ఇప్పుడు నిర్వహణపరమైన ఖర్చులు తోడవుతుండటంతో మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీపై భారం భారీగానే ఉంటోందని తెలుస్తోంది. ఆక్యుపెన్సీ రేషియో వంద శాతానికి చేరటంతో బస్సుల్లో లోడ్ విపరీతంగా పెరుగుతోంది. దీంతో ఆర్టీసీ బస్సుల మైలేజీ పతనమవుతోంది. ఇప్పటివరకు దేశంలో మెరుగైన కేఎంపీఎల్ (లీటరు డీజిల్‌కు వచ్చే మైలేజీ) విషయంలో తెలంగాణ ఆర్టీసీకి మెరుగైన రికార్డు ఉంది. సగటున తెలంగాణ ఆర్టీసీ బస్సులు లీటరు డీజిల్‌తో 5.18 కి.మీ.లు తిరుగుతున్నాయి. హైదరాబాద్ సిటీ బస్సులను మినహాయిస్తే ఇది 5.5 కి.మీ.గా ఉంటోంది. నగరంలో మైలేజీ తక్కువగా ఇచ్చే పరిస్థితులు ఉంటున్నందున అది సగటున 5.18గా నమోదవుతోంది. మహాలక్ష్మి పథకం వల్ల బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగి మైలేజీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో కొన్ని నెలలుగా దాని సగటు 5.10 లోపే నమోదవుతోంది. ఈ రూపంలో డీజిల్ వినియోగం పెరిగింది. అది రోజుకు రూ.20 లక్షల వరకు ఉంటోందని సమాచారం. ఇక టైర్లు కూడా వేగంగా అరిగిపోతున్నాయి. వాహన బరువు పెరిగేకొద్దీ టైర్ల జీవితం కాలం తగ్గుతుంది. సగటున 60 వేల కి.మీ. జీవితకాలం నుంచి 40 వేల కి.మీ.కు తగ్గినట్టు తెలుస్తోంది. ఆర్టీసీ సగటున సంవత్సరానికి 10 వేల వరకు టైర్లు కొనుగోలు చేస్తోంది. ఇప్పుడు అదనంగా మరో వేయి టైర్లు కొనాల్సి వస్తున్నట్టు సమాచారం. బస్సుల కమాన్‌పట్టీలు కూడా తొందరగా పాడవుతున్నాయి.

బస్‌పాస్ ఆదాయంలోనూ కోతే..

ఇక బస్ పాస్ ఆదాయంలో రోజుకు రూ.కోటి వరకు కోత పడుతోంది. గతంలో ఆర్టీసీ బస్‌పాస్‌లు తీసుకునే మహిళలు ఇప్పుడు ఉచితంగా ప్రయాణిస్తుండటంతో బస్‌పాస్‌ల సంఖ్య తగ్గిపోయింది. ఆ రూపంలో రోజుకు రూ.కోటి వరకు కోత పడుతోంది. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ప్రారంభమై ఏడాది దాటినందున, నిర్వహణ పరమైన భారంపై ఆర్టీసీకి స్పష్టత వచ్చింది. దీంతో ఆర్టీసీకి మహాలక్ష్మి రూపంలో అందించే ఆర్థిక సాయాన్ని భారీగా పెంచాలని కోరుతోంది. ప్రస్తుతం నెలకు రూ.310 కోట్ల వరకు మంజూరు చేస్తోంది. అందులో కొంత మొత్తం బకాయి పెట్టి మిగతాది చెల్లిస్తోంది. ఇప్పుడు కనీసం దాన్ని రూ.400 కోట్లకు పెంచాలని కోరుతోంది.



అంబులెన్స్‌లో పెంపుడు కుక్కలు

కు.ని. ఆపరేషన్‌కు సైరన్ మోగిస్తూ తరలిస్తుండగా డ్రైవర్ అదుపులోకి..

బంజారాహిల్స్(హైదరాబాద్): పెంపుడు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు అంబులెన్స్‌లో సైరన్ మోగించుకుంటూ తీసుకెళుతుండగా, ఆ అంబులెన్స్‌ను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. రోగులు లేకుండానే అంబులెన్స్‌లు సైరన్లు మోగిస్తూ అడ్డదారులు, రాంగ్‌రూట్‌లో రెడ్ సిగ్నల్స్ పడిన తర్వాత కూడా మితిమీరిన వేగంతో దూసుకెళుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశించారు. దీంతో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ పంజగుట్ట చౌరస్తాలో మంగళవారం అంబులెన్స్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతలో ఓ అంబులెన్స్ సైరన్ మోగించుకుంటూ వచ్చింది. పోలీసులు చూడగా అందులో రెండు పెంపుడు కుక్కలు కనిపించాయి. ఇదేమిటని ప్రశ్నించగా, హిమాయత్‌నగర్‌లోని మేఘనకు చెందిన రెండు పెంపుడు కుక్కలకు కు.ని. ఆపరేషన్‌కు మియాపూర్‌కు తీసుకెళుతున్నానని అంబులెన్స్ డ్రైవర్ లక్ష్మీనారాయణ వెల్లడించాడు. దీంతో ఆ అంబులెన్స్‌ను సీజ్ చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
బుధవారం। 5-3-2025



ఓపెన్‌కాస్ట్ గనిలో వాహనంలో బొగ్గు లోడ్ చేస్తున్న దృశ్యం

27 రోజులు.. 12.16 మిలియన్ టన్నులు

సింగరేణిలో వార్షిక లక్ష్యసాధనపై నీలినీడలు

రోజుకు 4 లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తేనే సాధ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరడం కష్టంగానే కనిపిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఇందులో 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు 64.06 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 59.84 మిలియన్ టన్నులే(93 శాతం) ఉత్పత్తి నమోదైంది. మిగిలిన నెలలో (మార్చి 3వ తేదీ వరకు అందిన గణాంకాల ప్రకారం) ఇంకా 12.16 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేయాలి. అంటే సగటున రోజుకు సుమారు 4 లక్షల టన్నుల ఉత్పత్తి తప్పనిసరి. కానీ 11 ఏరియాల్లో రోజువారీ ఉత్పత్తి లక్ష్యమైన 2.80 లక్షల టన్నుల్లో 2.50 లక్షల టన్నులే నమోదవుతోంది.

భూగర్భ గనుల్లో వెనుకంజ

సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల్లో 18 ఓపెన్‌కాస్ట్ గనులు, 24 భూగర్భ గనులు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఓపెన్ కాస్ట్ గనుల్లో 58.57 మిలియన్ టన్నుల లక్ష్యానికిగాను 55.56 మిలియన్ టన్నులు(95 శాతం), భూగర్భ గనుల్లో 54.83 లక్షల టన్నులకు 42.73 లక్షల టన్నుల(78 శాతం) ఉత్పత్తి నమోదైంది. వాస్తవంగా భూగర్భ గనుల్లో కార్మికుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా, ఓసీల కంటే తక్కువ లక్ష్యాన్ని నిర్దేశించినా, 100 శాతం ఉత్పత్తి సాధ్యం కావడం లేదు. ఈ విషయంలో ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండాపోయింది. దీనికి అధికారుల నిర్లక్ష్యం తోడవుతోందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓసీల్లో రోజుకు సుమారు 2.40 లక్షల టన్నులు సాధిస్తుంటే, భూగర్భగనుల్లో రోజుకు 16 వేల టన్నులే నమోదవుతోంది.

వంద శాతం ఐదు ఏరియాల్లోనే..

గడిచిన ఫిబ్రవరిలో సింగరేణివ్యాప్తంగా ఐదు ఏరియాల్లోనే 100 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైంది. బెల్లంపల్లి ఏరియా 114 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, శ్రీరాంపూర్ ఏరియాలో 112 శాతం, మణుగూరు ఏరియాలో 111 శాతం, ఆర్జీ–1 ఏరియాలో 110 శాతం, ఆర్జీ–3లో 103 శాతం ఉత్పత్తి సాధించారు. మిగిలిన వాటిల్లో ఆర్జీ–2 ఏరియా 99 శాతం, మందమర్రి ఏరియా 95, భూపాలపల్లి 86 శాతం, కొత్తగూడెం ఏరియా 80 శాతం, ఏఎల్‌పీ 67, ఇల్లెందు ఏరియా 51 శాతంతో సరిపెట్టుకున్నాయి.

11 మాసాల్లో రెండు ఏరియాల్లో..

ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన 11 నెలల్లో పరిశీలిస్తే 100 శాతం లక్ష్యాన్ని రెండు ఏరియాలే సాధించాయి. ఇల్లెందు ఏరియా(కొత్తగూడెం రీజియన్) 110 శాతం, ఆండ్రియాల ప్రాజెక్ట్ (రామగుండం రీజియన్) 111 శాతం ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలిచాయి. ఇక కొత్తగూడెం ఏరియా 96, మణుగురు ఏరియా 97, బెల్లంపల్లి ఏరియా 95, మందమర్రి 77, శ్రీరాంపూర్ 86, ఆర్జీ–1 ఏరియా 94, ఆర్జీ–2 ఏరియా 94, ఆర్జీ–3 ఏరియా 98, భూపాలపల్లి ఏరియా 74 శాతం సాధించి వెనుకంజలో ఉన్నాయి.

11 నెలల్లో ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి వివరాలు (టన్నుల్లో)

ఏరియా	ఉత్పత్తి లక్ష్యం	ఉత్పత్తి అయ్యింది	శాతం
కొత్తగూడెం	1,31,84,500	1,26,64,845	96
మణుగూరు	1,15,92,000	1,12,14,827	97
రామగుండం-2	87,80,000	82,94,710	94
శ్రీరాంపూర్	57,45,100	49,57,145	86
రామగుండం-3	56,42,000	55,57,063	98
రామగుండం-1	44,92,400	42,21,764	94
భూపాలపల్లి	43,20,800	31,87,944	74
ఇల్లెందు	35,85,000	39,41,642	110
బెల్లంపల్లి	33,80,000	32,07,007	95
మందమర్రి	32,06,000	24,53,011	77
ఆండ్రియాల	3,91,700	3,94,638	101

సమష్టిగా లక్ష్యసాధనకు కృషి



ప్రతీ ఉద్యోగి, అధికారి సమష్టిగా పనిచేసి వార్షిక లక్ష్యసాధనకు కృషి చేయాలి. అందరూ రోజుకు ఎనిమిది గంటలు కచ్చితంగా బాధ్యతగా పని చేయాలి. మస్టర్ నమోదు చేయించుకొని బయటకు వెళ్లే వారిపై చర్యలు తీసుకోవడమేకాక ప్రతీ ఉద్యోగి విధులకు సకాలంలో హాజరయ్యేలా అధికారులు పర్యవేక్షించాలి. సంస్థ అభివృద్ధికి పనిచేస్తున్నామా లేదా అని అంతా ఆత్మపరిశీలన చేసుకుంటే ఫలితం ఉంటుంది. – ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

జోరుగా.. హుషారుగా..

- ఈవీలలో జంట నగరాల బాటలో గ్రేటర్ వరంగల్
- స్మార్ట్ సిటీ వరంగల్‌లో 'ఇ–స్మార్ట్'వాహనాల పరుగులు
- తెలంగాణలో మెరుగైన రోడ్లు.. మొత్తంగా 1,10,756.39 కి.మీ.లు
- రయ్యిమంటున్న వాహనాలు.. పెరిగిన ఎలక్ట్రిక్ బైక్‌లు, కార్లు
- తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్)–2024 రిపోర్టులో వెల్లడి



తెలంగాణలో రోడ్ల వివరాలు (కిలోమీటర్లలో)

మొత్తం రోడ్ల పొడవు: 1,10,756.39
సిమెంట్ రోడ్లు: 11,438.06
తారు రోడ్లు (బ్లాక్ టాప్): 59,499.25
మెటల్ రోడ్లు: 8,291.77
అన్‌మెటల్ రోడ్లు: 31,527.32

రోడ్లు, భవనాల శాఖ రోడ్లు: 28,707.43
పంచాయతీరాజ్ రోడ్లు (పీఆర్‌ఈడీ): 68,539.27
30 జాతీయ రహదారులు, పొడవు: 4,497.0
జీహెచ్‌ఎంసీ రోడ్ల పొడవు: 9,013

రాష్ట్రంలో పెరుగుతున్న వాహనాలు

సంవత్సరం	రిజిస్ట్రేషన్ వాహనాలు (అన్ని రకాలు)
2020–21	8,79,826
2022–23	9,51,780
2023–24	9,76,073

సాక్షి ప్రతినిధి, వరంగల్: పదేళ్ల కిందటే ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్లోకి వచ్చినా 2019 వరకు అవి మెట్రో నగరాలను దాటి రాలేదు. అయితే ప్రస్తుతం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై మొగ్గు చూపుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు పలు కంపెనీలు మంచి ఫీచర్ బైక్‌లతో షోరూంలు ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో ఎలక్ట్రిక్ బైక్స్, ఆటోలు, కార్ల అమ్మకాలు పరుగులు పెడుతున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల బాటలో వరంగల్ పయనిస్తోంది వరంగల్ మహా నగరం రోడ్ల మీద ఎలక్ట్రిక్ వాహనాల సంచారం పుంజుకుంటోంది. ఇవి స్మార్ట్ వాహనాలు కూడా కావడంతో టెక్నాలజీ ప్రియులను మరింతగా ఆకర్షిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సీసీ, తారు రోడ్ల సౌకర్యం పెరిగి వాహనాలు, ఈవీ వాహనాల సంఖ్య పెరిగినట్లు తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్)–2024 గణాంకాలు చెబుతున్నాయి.

మెరుగైన రవాణా సౌకర్యం.. పెరుగుతున్న వాహనాలు

తెలంగాణలో జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులు మెరుగయ్యాయి. ఇదే సమయంలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ తదితర ద్వితీయశ్రేణి నగరాల్లోనూ తారు, సీసీ రోడ్లు పెరిగాయి. మొత్తంగా తెలంగాణలో మొత్తం రోడ్ల పొడవు 1,10,756.39 కిలోమీటర్లు కాగా, ఇందులో సిమెంట్ రోడ్లు 11,438.06 కి.మీ.లు, తారు రోడ్లు (బ్లాక్ టాప్) 59,499.25 కి.మీ.లు, మెటల్ రోడ్లు 8,291.77 కి.మీ.లుగా ఉన్నాయి. ఇందులో 28,707.43 కి.మీ.లు రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షణలో ఉండగా, 68,539.27 కి.మీ.లు పంచాయతీరాజ్ (పీఆర్‌ఈడీ), 4,497.0 కి.మీ.ల పొడవు గల 30 రోడ్లు జాతీయ రహదారుల పరిధిలో ఉన్నాయి. జీహెచ్‌ఎంసీలో 9,013 కి.మీ.ల పొడవు రహదారులు ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. దీంతో మూడేళ్లలో బైక్‌లు, కార్లు, జీపులు, లారీలు తదితర వాహనాల రిజిస్ట్రేషన్‌లు కూడా పెరిగినట్లు వెల్లడించారు. 2020–21లో 8,79,826 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా, 2022–23లో 9,51,780, 2023–24లో 9,76,073 వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతుండగా.. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల తర్వాత వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీలో కూడా ఈవీ వాహనాల సందడి పెరిగింది.

స్మార్ట్ సిటీస్.. 'ఇ–స్మార్ట్' వెహికిల్స్

మోడల్, బ్రాండ్, బ్యాటరీ కెపాసిటీ, ఇంజన్ సామర్థ్యం బట్టి రూ.44,900ల నుంచి రూ.3.10 లక్షల ధరతో ఎలక్ట్రిక్ బైక్స్ లభిస్తున్నాయి. రూ.12 లక్షల నుంచి రూ.23.49 లక్షల వరకు కార్లు ప్రస్తుత మార్కెట్లో ఉన్నాయి. హీరో ఎలక్ట్రిక్ ఆప్టిమా ఎల్‌ఏ, ప్యూర్ ఎనర్జీ, బజాజ్, టీవీఎస్, ఓలా, ఒకినవా, ఆంపియర్ తదితర కంపెనీలు షోరూంలను ఏర్పాటు చేశాయి. ఈ–కార్ల విషయానికొస్తే టాటా నెక్సాన్ ఈవీ, మహీంద్రా ఈ2వో ప్లస్, ఎంజీ జెడ్ ఎస్ ఈవీ, హ్యుందాయ్ కోనా ఎలక్ట్రిక్, టాటా టిగోర్ తదితర ఈవీలు నగరవాసులకు అందుబాటులోకి వచ్చాయి. వీటి ధర కంపెనీని బట్టి రూ.8.98 లక్షల నుంచి రూ.26.27 లక్షల వరకు పలుకుతోంది. గంటన్నర నుంచి 9 గంటల వరకు చార్జింగ్ చేస్తే గంటకు 80 నుంచి 180 కిలోమీటర్ల గరిష్ట వేగంతో 110 నుంచి 471 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేస్తున్నారు. ఈవీలో వినియోగం పెంచేందుకు తెలంగాణ వ్యాప్తంగా విరివిగా విద్యుత్ కంపెనీల ఆధ్వర్యంలో చార్జింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) మేనేజర్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

హైదరాబాద్ తర్వాత.. గ్రేటర్ వరంగల్‌లోనే

మెట్రో, స్మార్ట్‌సిటీల్లో ఎలక్ట్రిక్ వాహనాలు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల తర్వాత వరంగల్ ట్రైసిటీస్‌లోనే ఎక్కువగా ఈవీ బైక్‌లు, కార్లు తిరుగుతున్నట్లు చెబుతున్నారు. రవాణాశాఖ గణాంకాల ప్రకారం 2022, మార్చి వరకు గ్రేటర్ వరంగల్‌లో మొత్తం 853 ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా, 2023 మార్చి నాటికి 3,289 ఈవీ వాహనాలు నమోదు కాగా.. 2024 డిసెంబర్ వరకు 4,309 ఎలక్ట్రిక్ బైకులు, ఆటోలు, కార్ల విక్రయాలు జరిగాయి. 2023–24 అట్లాస్ రిపోర్టు ప్రకారం హైదరాబాద్‌లో 15,290, మేడ్చల్ మల్కాజిగిరిలో 14,860, రంగారెడ్డిలో 11,882, సంగారెడ్డిలో 2,224 ఈవీ బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మిగతా జిల్లాల్లో కూడా ఇప్పుడిప్పుడే ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పుంజుకుంటున్నాయి.

ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రభుత్వం ప్రోత్సాహం



పర్యావరణానికి మేలు చేసే (ఈవీలు)ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదు. రూ.లక్షకు 14 శాతం వరకు ఉండే జీవితకాల పన్ను మినహాయింపు కూడా లభిస్తోంది. నిర్వహణ వ్యయం పూర్తిగా తగ్గింది. దీంతో ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వాహనాలు 2024–2025లో రెట్టింపుస్థాయిలో కొనుగోళ్లు జరిగాయి.
– జైపాల్‌రెడ్డి ఎంవీఐ, వరంగల్

ఈవీతో ఖర్చులు తగ్గించుకున్నా



గతేడాది ఎలక్ట్రిక్ ఈవీ బైక్ కొనుగోలు చేశా. గతంకంటే రోడ్లు బాగున్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేవు. పెట్రోల్ వాహనం ఉన్నప్పుడు నెలకు పెట్రోలుకు రూ.2 వేలు, మరమ్మతులకు రూ.600లు ఖర్చయ్యేవి. ఈవీ బైక్ కొనుగోలు చేసిన నాటి నుంచి ఖర్చులు తగ్గించుకున్నా. రెండు రోజులకోసారి చార్జింగ్ పెడితే 90 కిలో మీటర్లు ప్రయాణిస్తున్నా. మెయింటెనెన్స్ ఖర్చులు లేవు. చాలా ఆదా అవుతోంది.
– నీర్ల శశికుమార్ వరంగల్, ఈవీ బైక్ యజమాని

హ్యాపీగా ప్రయాణం చేస్తున్నాం



ఇటీవల మా బంధువులకు లాంగ్ వేరియంట్ విద్యుత్ కారును కొనుగోలు చేశా. వాహనంతో పాటు 35 కిలో వాట్ల బ్యాటరీ వచ్చింది. 8 సంవత్సరాలు వారంటీ ఇచ్చారు. ఒక్కసారి ఫుల్ బ్యాటరీ చార్జింగ్ పెడితే హ్యాపీగా 300 కిలో మీటర్ల వరకు ప్రయాణం చేస్తున్నాం. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం, ట్రాఫిక్ సమస్యలతో మరింత ఎక్కువ ఇంధనం ఖర్చు కావటం వల్ల కార్ల వినియోగం భారమైంది. ఈవీ కారుతో ఖర్చును వేల రూపాయల్లో తగ్గించుకున్నాం.
– గోనెల రాంప్రసాద్, వరంగల్

ప్రభుత్వం చెప్పలేక.. వ్యవసాయ కమిషన్ చైర్మన్‌తో చెప్పిస్తారా?

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: సాగునీరు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే మంత్రులు తమాషా చూస్తున్నారా? వారికి రైతుల కష్టాలు పట్టవా? అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పంటలు వేయొద్దని ప్రభుత్వం చెప్పలేక.. వ్యవసాయ కమిషన్ చైర్మన్‌తో చెప్పిస్తారా? అని ధ్వజమెత్తారు. ఏడాది కాలంలోనే 450 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వాళ్లకు దక్కాల్సిన రైతు బీమా సొమ్ము ఇప్పటికీ రాలేదని ఆరోపించారు. పంటలకు కరెంటు, నీళ్లు సరిగా ఇవ్వడం లేదని, రైతు భరోసా ఇప్పటివరకు అందలేదని, రుణమాఫీ ఇంకా పూర్తి కాలేదని, యాసంగిలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. తాము వేసిన పంటలకు నీరందక రైతులు పశువులకు మేతగా వాడుతుంటే.. పంటలు ఎండిపోవడానికి కూడా కేసీఆరే కారణమంటారా? అని ప్రశ్నించారు.

అటకెక్కిన క్రిస్టియన్ భవన నిర్మాణ పనులు

- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను అటకెక్కించిందని, క్రిస్టియన్లను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తోందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆరోపించారు. మంగళవారం ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణంలో ఉన్న క్రిస్టియన్ భవన్‌ను క్రిస్టియన్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్ సాగర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు క్రిస్టియన్ల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలం కేటాయించి, రూ.10 కోట్లు క్రిస్టియన్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు భవన నిర్మాణ పనులు సాగడం లేదని విమర్శించారు. ఎక్కడ బీఆర్‌ఎస్ పార్టీకి పేరు వస్తుందనే అక్కసుతోనే నిర్మాణ పనులు ఆపివేశారని, వెంటనే నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని రాజీవ్‌సాగర్ డిమాండ్ చేశారు.




పాత పుస్తకాలకు ఏమాత్రం గిరాకీ తగ్గడం లేదు. అబిడ్స్ జీపీఓ వద్ద రోడ్డు పక్కన అమ్ముతున్న ఓ పాత పుస్తకాల దుకాణం వద్ద కొనుగోలుదారుల దృశ్యం

చీర కట్టిన చేను



అడవిపందులు, ఇతర పశువుల బారి నుంచి కాపాడుకునేందుకు ఓ రైతు తన మొక్కజొన్న చేనుకు చీరలతో తడి కట్టాడు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామ శివారులో ఓ రైతు తన చేను చుట్టూ కట్టిన రంగురంగుల చీరలు హైవే వెంట వెళ్లే వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి.
– శాయంపేట



మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు వద్ద ఆహ్లాదకర దృశ్యం



పిలవని అతిథి

విరిసిన పూలపైకి పిలవని అతిథిగా వచ్చి ఊటలూరే మకరందాన్ని ఒడుపుగా సేకరిస్తుంది తేనె టీగ. ఇలా మైళ్లకొద్దీ ప్రయాణించి సేకరించిన మకరందాన్ని తేనెపట్టులో భద్రపరుస్తుంది. గుంటూరు జిల్లా ఈపూరు సమీపంలో తేనెటీగ పూల నుంచి మకరందాన్ని సేకరిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



వేసవితాపం.. వీటితో దూరం

వేసవి వచ్చిందంటే రోడ్లపై ఎక్కడికక్కడ పుచ్చకాయలు కుప్పలుపోసి అమ్ముతుంటారు. వేసవితాపం నుంచి సేదతీరేందుకు ప్రజలు కూడా వీటినే ఎక్కువగా తీసుకుంటారు. నెల్లూరు మినీ బైపాస్‌లో అమ్మకం కోసం పెట్టిన పసుపు రంగు పుచ్చకాయలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు.



నేలపై నింగి నీలిముద్ర

పరిశీలించి చూస్తే ప్రకృతిలో ప్రతిదీ ఓ సుందర దృశ్యమే. మండుటెండలో ఈ నీలినీడ చూపరులను ఆకట్టుకుంది. కడప నగరంలోని చెమ్ముమియాపేట–రాయచోటి వంతెనపై మంగళవారం మధ్యాహ్నం ఈ నీలి నీడలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్ కడప

కూటమి పాలనలో వ్యవసాయ సంక్షోభం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉండడానికి కూటమి ప్రభుత్వమే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. నెల్లూరు నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది పుట్టి ధాన్యం రూ.22 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.17వేలకు పడిపోయిందని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం మాత్రం దిష్టిబొమ్మలా వ్యవహరిస్తోందన్నారు. ఆప్కాస్ ద్వారా కార్మికులు వేతనాలు తీసుకుంటుంటే దానిని రద్దుచేసి టీడీపీ నాయకులకు కాంట్రాక్టు ఇచ్చి 4శాతం కమీషన్ కొట్టేసేందుకు సిద్ధపడిందని ఆరోపించారు. అదానీ, మోదీ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని టీడీపీ తాకట్టు పెడుతోందన్నారు. మార్చి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు సాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ ప్రాజెక్టు భూముల్లో జంగిల్ క్లియరెన్స్

ముత్తుకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం గ్రామంలో రిలయన్స్ విద్యుత్ ప్రాజెక్టు(కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్) కోసం సేకరించిన భూముల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం గతంలో సుమారు 2,600 ఎకరాలు సేకరించారు. అనంతరం కొద్దికాలానికే పనులు నిలిచిపోవడంతో 15 ఏళ్ల నుంచి ఈ భూముల్లో ఏపుగా చెట్లు పెరిగాయి. పాములు, వన్యప్రాణులకు ఆవాసాలుగా మారాయి. ఇటీవల ఈ ప్రాజెక్టు యజమాని అనిల్ అంబానీ కృష్ణపట్నం వచ్చి భూములు పరిశీలించి వెళ్లారు. జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలకు అప్పగించారు. పొక్లెయిన్ ద్వారా ముళ్ల చెట్లు, పొదలను తొలగించి, జేసీబీ ద్వారా భూములను చదును చేసే పనులను కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్వహిస్తున్నారు. ఈ విధంగా ఒక ఎకరాలో యంత్రాల ద్వారా పనులు చేయిస్తే రూ.13 వేలు చెల్లిస్తారని ప్రచారం సాగుతోంది.


అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు యూటీఎఫ్ సంఘానికి వైఎస్సార్‌సీపీ ముసుగు వేస్తూ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్‌లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై మంగళవారం సంఘం ముఖ్యనాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్‌కు వైఎస్సార్‌సీపీ ముసుగు వేయడం సరికాదని, వాస్తవానికి ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ అభ్యర్థులకు కూటమి ముసుగు వేయడం ద్వారా అధికార పక్షమే ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందన్నారు.

పతాక స్థాయిలో ప(వర్)రువు పోయే..

డిస్కంల బకాయిలు : రూ.6482 కోట్లు

- దేశ వ్యాప్తంగా ఓవర్ డ్యూ జాబితాలో ఉన్న ఏకైక రాష్ట్రం
- చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి
- బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనడం తప్పని గత ప్రభుత్వ హయాంలో గగ్గోలు
- ఇప్పుడు అదే పనిలో కూటమి ప్రభుత్వం
- అప్పుడు కొన్న వెంటనే బిల్లుల చెల్లింపు
- తాజాగా నెల గడువు దాటినా జెన్ కోలకు డబ్బు చెల్లించని వైనం



సాక్షి, అమరావతి: చంద్రబాబు చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండదని ఇప్పటికే ప్రజలకు అర్థం అయ్యింది. సంపద సృష్టిస్తానని, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేనని ఇటీవలే ఆయన చేతులెత్తేశారు. ఇక ఇప్పుడు విద్యుత్ సంస్థల వంతు వచ్చింది. వాటికి అప్పుల బాట పట్టిస్తుండడం తాజా పరిస్థితి. దేశ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్‌కో)లకు బకాయిలు కట్టని ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలిచింది. మొత్తం చెల్లించాల్సిన బకాయి రూ.6482.13 కోట్లకు చేరింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పేమెంట్ రాటిఫికేషన్ అండ్ అనాలసిస్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్ (పీఆర్ఏఏపీటీఐ–ప్రాప్తి) పోర్టల్ ఈ విషయాన్ని తన వెబ్ సైట్‌లో బహిరంగ పరిచింది.

నిషేధం ముంగిట...

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ లేట్ పేమెంట్ సర్‌చార్జ్ (ఎల్‌పీఎస్) స్కీం కింద బకాయిల క్లియరెన్స్ కోసం విద్యుత్ ఆలస్య చెల్లింపు సర్‌చార్జ్ రూల్స్ 2022ను రూపొందించింది. విద్యుత్ ఉత్పాదక సంస్థలు, ఇంటర్–స్టేట్ ట్రాన్స్ మిషన్ లైసెన్సీలు, ఎలక్ట్రిసిటీ ట్రేడింగ్ లైసెన్సీల బకాయిలకు ఈ నియమాలు వర్తిస్తాయి. వీటి ప్రకారం ఉత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కు సంబంధించిన బిల్లులను 45 రోజుల్లోగా డిస్కంలు చెల్లించాలి. లేదంటే విద్యుత్ క్రయవిక్రయాలపై నిషేధం విధిస్తారు. ఈ నేపథ్యంలో ఎల్‌పీఎస్ పథకం కింద ప్రతి నెల 5వ తేదీలోగా విద్యుత్ ఉత్పాదక జనరేటర్లకు చెల్లించవలసిన బకాయిలన్నీ డిస్కంలు చెల్లిస్తుంటాయి. ఒక వేళ ఆ గడువులోగా చెల్లించలేకపోతే డిఫాల్టర్ జాబితాలో రాష్ట్రాన్ని చేరుస్తారు. అప్పటికీ కట్టకపోతే ×ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్) నుంచి క్రయవిక్రయాలు జరపకుండా డిస్కంలపై కేంద్రం నిషేధం విధిస్తుంది. గత ప్రభుత్వంలో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనడం తప్పని ఇదే చంద్రబాబు పదే పదే గగ్గోలు పెట్టారు. నిజానికి అప్పుడు ప్రజావసరాల కోసం కొన్న వెంటనే జెన్‌కోలకు బకాయిలు చెల్లించేవారు. ఇప్పుడు పరిస్థితి తారుమారు కావడం గమనార్హం.

తొలి నుంచి అవకతవకలే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ సంస్థల్లో కాసులు దండుకోవడం కోసం ఉద్యోగుల బదిలీలకు భారీగా సిఫారసులే ఇచ్చింది. ఇది ప్రభుత్వాన్ని విమర్శల పాలు చేసింది. ఇక తాము బలవంతంగా రాజీనామా చేయించిన డైరెక్టర్ల స్థానంలో కొత్త వారిని ఇంత వరకూ నియమించలేదు. తాజాగా పాలకులు విద్యుత్ సంస్థలను అప్పుల పాలు చేస్తున్నారు. ఏకంగా జాతీయ స్థాయిలో రాష్ట్రం పరువు తీస్తున్నారు.

బాకీ కట్టకపోతే.. కష్టాలు

రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఇక్కడి అవసరాలకు సరిపోనప్పుడు ఆ లోటును పూడ్చుకోవడానికి ఎనర్జీ ఎక్స్ఛేంజ్ నుంచి విద్యుత్ సంస్థలు విద్యుత్ కొనుగోలు చేస్తుంటాయి. అదే విధంగా మన దగ్గర విద్యుత్ మిగిలితే దానిని ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌లో విక్రయిస్తుంటాయి. ఆ విధంగా మన రాష్ట్ర విద్యుత్ సంస్థలు ప్రతి రోజూ విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. అయితే దానికి చెల్లించాల్సిన బకాయిలు మాత్రం సకాలంలో చెల్లించడం లేదు. బాకీ కట్టకపోతే కరెంటు కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి వీలు ఉండదు.

జాతీయ విద్యుత్ ఉత్పత్తిదారుల సంఘం ఆవేదన

డిస్కంలు ఆలస్యంగా చెల్లింపులు చేయడం వల్ల ఉత్పత్తి సంస్థలు తాము తీసుకున్న రుణాలను సకాలంలో తీర్చలేకపోతున్నాయి. ముఖ్యంగా ఉత్పత్తి సంస్థలు బొగ్గు కోసం ముందస్తు చెల్లింపులు చేస్తాయి. వర్కింగ్ క్యాపిటల్‌ను దానికోసం పూర్తిగా వినియోగించేయడం వల్ల క్రెడిట్ రేటింగ్ పడిపోతుంది. తర్వాత అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తుందని జాతీయ విద్యుత్ ఉత్పత్తిదారుల సంఘం (ఏపీపీ) ఆవేదన వ్యక్తం చేస్తోంది.

బకాయిల తీరిది...

నెల రోజులు దాటిపోయిన బకాయిలు ఓవర్ డ్యూగా ప్రాప్తి పోర్టల్ చూపిస్తోంది. ఆ మొత్తం రూ.**3595.29** కోట్లు

నెల రోజుల లోపు బకాయిలు రూ.**2886.84** కోట్లు.

దీంతో మొత్తం చెల్లించాల్సిన బకాయి రూ.**6482.13** కోట్లకు చేరింది.

పనసతో విందు.. భలే పసందు

- ఉద్దానం పనసకు భలే గిరాకీ
- ఉత్తరాదికి విరివిగా ఎగుమతి
- రోజుకు 55 టన్నుల సరఫరా



వజ్రపుకొత్తూరు:

ఉద్దానం పనస ఉత్తరాదికి తరలి వెళుతోంది. హోలీ, ఉగాది పర్వదినాలు ముందుండడంతో ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి ఊపందుకుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో పనసతో చేసే విందులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పనస హల్వా, పొట్టు కూర, పకోడి, గింజల కూర, ఇడ్లీ పచ్చళ్లు, బూరెలు లాంటి వంటకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక స్థానికంగా ఉద్దానం ప్రాంతంలోని పెళ్లిళ్లలో పనస ముక్కల బిర్యాని, గూన చారు, పొట్టు కూరకు మంచి పేరుంది. ఇటీవల శాస్త్ర పరిశోధనల్లో పనస గింజలు, పొట్టుతో తయారు చేసే పొడితో షుగర్ వ్యాధికి ఇన్సులిన్ అదుపులో ఉంచుకునేందుకు అవసరమైన ఫైబర్ ఎక్కువ ఉందని తేలడంతో పనస ఆధారిత వంటకాలకు ప్రాధాన్యత పెరిగింది. సహజ సిద్ధంగా కల్తీ లేకుండా పెరిగే పనస ప్రతీ వయసు వారు తినేందుకు అనుకూలమైన ఫలం కావడం విశేషం. 70 శాతం ఎగుమతి చేసే ఒక్క కాయలోనే కాదు. 30 శాతం ఫలాలుగా తినే పండులోనూ మంచి పోషకాలు ఉంటాయని న్యూట్రీషియన్‌లు చెబుతున్నారు.

మిశ్రమ పంటగా..

శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో ప్రధాన పంటగా కాకుండా 16వేల హెక్టార్లలో మిశ్రమ అంతర పంటగా దీన్ని రైతులు పండిస్తారు. సీతంపేటతో పాటు వజ్రపుకొత్తూరు, పలాస, మందస, కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, నందిగాం మండలాల్లో ఏటా ఏప్రి ల్, మే నెలల్లో కాపునకు వచ్చే ఈ పంట ప్రస్తుతం ఫిబ్రవరి ప్రారంభంలోనే కాపునకు వచ్చింది. మే నెల వరకు వచ్చే కాపులో 70 శాతం మేర కాయలను ఉత్తరాది రాష్ట్రాలైన ఒడిశా, బీహార్ ఉత్తర ప్రదేశ్, కోల్‌కతాలకు ఎగుమతి చేస్తున్నారు. పూండి, పలాస, హరిపురం, పాలకొండ కేంద్రాలుగా కిలో పనస కాయ రూ.25 ధరతో రోజుకు 55 టన్నుల వరకు ఎగుమతి చేస్తున్నారు. అంటే రోజుకు జిల్లా నుంచి రూ. 13.75 లక్షలు టర్నోవర్ జరుగుతోంది. దీంతో రైతులకు మే నెల వరకు మంచి ఆదాయం సమకూరుతుంది.

అదనపు ఆదాయం

పనస రైతులకు అదనపు ఆదాయ వనరు. జీడి, కొబ్బరి తోటల్లోని గట్లపై ఖాళీ స్థలాల్లో మిశ్రమ అంతర పంటగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎలాంటి చీడ పీడ లు ఆశించకుండా పంట కాసింది. పంట ప్రారంభం కాబట్టి కిలో రూ.25ల వరకు ధర ఉంది. ఎకరాకి 4 నుంచి 10 చెట్లు వరకు గిరిజన, ఉద్దానం ప్రాంతాల్లో రైతులు పనసను పండిస్తున్నారు. ఏడాదికి రైతు రూ.20 వేలు వరకు ఆర్జిస్తున్నారు.



– కె.సునీత, ఉద్యానవన శాఖ అధికారి, పలాస

వంటకాలు:
హల్వా, పొట్టు కూర, పకోడి, గింజల కూర, ఇడ్లీ పచ్చళ్లు, బూరెలు
- ఉద్దానం ప్రాంతంలోని పెళ్లిళ్లలో పనస ముక్కల బిర్యాని, గూన చారు, పొట్టు కూర

ఔషధ విలువలు:
పనస గింజలు, పొట్టుతో తయారు చేసే పొడితో షుగర్ వ్యాధికి సంబంధించి ఇన్సులిన్ అదుపులో ఉంచుకునేందుకు అవసరమైన ఫైబర్ ఎక్కువ ఉందని శాస్త్ర పరిశోధనల్లో తేలింది.

ఎగుమతి ఎక్కడికి:
ఒడిశా, బీహార్ ఉత్తరప్రదేశ్, కోల్‌కతా

సరఫరా
రోజుకు **55** టన్నులు



ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెట్టి మోసపోయా

- నెల రోజుల్లో పింఛను డబ్బులు చెల్లిస్తా
- పింఛను డబ్బులతో పారిపోయిన సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ లక్ష్మీప్రసాద్
- వీడియో ద్వారా అధికారులకు విజ్ఞప్తి



భార్య, పిల్లలతో లక్ష్మీప్రసాద్

దాచేపల్లి: 'ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోయా. నెలరోజులు గడువు ఇస్తే పింఛను డబ్బులు చెల్లిస్తా...' అని పింఛనుదారుల డబ్బులు తీసుకుని పారిపోయిన పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీలోని వార్డు సచివాలయం–3 వెల్ఫేర్ సెక్రటరీ సంపతి లక్ష్మీప్రసాద్ సామాజిక మాధ్యమాల్లో మంగళవారం ఒక వీడియో పెట్టారు. 'సార్.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెట్టి ఎన్నో డబ్బులు పోగొట్టుకున్నా. గవర్నమెంట్ డబ్బులు కూడా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి మోసపోయా. నేను తప్పు చేశానని ఈ రోజు అర్థమైంది. కలెక్టర్ గారు, కమిషనర్ గారు నేను తప్పు చేశా. నన్ను క్షమించండి. ఒక నెల నాకు అవకాశం ఇస్తే నా తల్లిదండ్రులను బతిమాలుకుని నేను తీసుకున్న డబ్బులను చెల్లిస్తా. నేను చేసిన తప్పు వల్ల నా భార్య, పిల్లలతో సహా రోడ్డుపై పడ్డా. పిల్లలు రెండు రోజుల నుంచి ఏమీ తినలేదు. ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. నా తప్పు తెలుసుకున్నా. ఒక్క అవకాశం ఇప్పించండి. ఇంకోసారి ఇటువంటి తప్పు చేయను. నా భార్య, పిల్లలతో కలిసి సూసైడ్ చేసుకోవాలని డిసైడ్ అయ్యాం. సార్ మమ్మల్ని క్షమించండి' అని లక్ష్మీప్రసాద్ ఆ వీడియోలో విన్నవించారు. ఫిబ్రవరి 28న బ్యాంక్ నుంచి డ్రా చేసిన రూ.8.23 లక్షల పింఛన్ డబ్బులతో లక్ష్మీప్రసాద్ పారిపోయిన విషయం తెలిసిందే. అతనిపై దాచేపల్లి నగరపంచాయతీ కమిషనర్ ఎంవీ అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో దర్యాప్తు చేపట్టారు. తాజాగా లక్ష్మీప్రసాద్ తాను మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో అతని ఆచూకీ తెలుసుకునేందుకు నగర పంచాయతీ అధికారులు, పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

కూటమి హామీ తుంగలో తొక్కేశారా ?

విద్యార్థి సంఘాల ఐక్యవేదిక

తిరుపతి సిటీ: ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కామన్ పీజీసెట్‌ను రద్దుచేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కేశారా అంటూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక మండిపడింది. ఏపీ పీజీ సెట్ రద్దు చేయాలంటూ తిరుపతిలో మంగళవారం వర్సిటీలు, డిగ్రీ కళాశాలను మూసివేసి బంద్ పాటించారు. ఈ సందర్భంగా నేషనల్ లా స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుందరరాజు అధ్యక్షతన ఎస్వీయూలో ఏర్పాటుచేసి సభలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,683 మంది స్వామివారిని దర్శించుకోగా, 23,453 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

పంచహారతులతో దేదీప్యమానంగా పెద్దింట్లమ్మ



కైకలూరు: ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోటలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మ తల్లి జాతర మంగళవారానికి నాలుగోరోజుకు చేరింది. అమ్మవారు పంచ హారతుల మధ్య దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుష్పాలంకరణ, ధూపసేవ, బాలభోగం, నీరాజన పుష్పాలంకరణ చేశారు.ఆలయ ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వేడుకగా గరుడ పంచమి

నెల్లూరు(బృందావనం): గరుడ పంచమిని పురస్కరించుకొని నగరంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గరుడసేవను వేడుకగా మంగళవారం నిర్వహించారు. తాయార్లకు పూలంగిసేవను జరిపారు. మూలవర్లు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

మద్దిలో విశేష పూజలు



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చన సేవలు చేశారు. ఆంజనేయ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు వివిధ సేవల రూపేణా రూ.1,26,237 ఆదాయం వచ్చినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

విద్యా సమాచారం

నేటి నుంచి పశువైద్య 'విద్యార్థుల సమ్మె ఉధృతం

తిరుపతి సిటీ: గౌరవ వేతనం పెంచాలంటూ పశువైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మంగళవారం చేతులు, కాళ్లకు స్వతహాగా బేడీలు వేసుకుని న్యాయదేవత ముందు తమగోడును వెళ్లబోసుకున్నారు. తమ ఆకలి కేకలు వర్సిటీ అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బుధవారం నుంచి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

ఎన్ఎస్‌యూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



జాతీయ సంస్కృత వర్సిటీలో శక్తివిశిష్టాద్వైతం అనే అంశంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారంతో పరిపూర్ణమైంది. ముఖ్యఅతిథిగా కాశీపీఠం శ్రీమద్ కాశీ జ్ఞానసింహాసనాధీశులు జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యులు హాజరయ్యారు. శక్తి విశిష్టాద్వైత కేంద్రాన్ని వర్సిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమని, విద్యార్థులకు శాస్త్ర అధ్యయనానికి ఎంతో ఉపకరిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో బెనారస్ హిందూ వర్సిటీ ప్రొఫెసర్ రాజారాం శుక్లా, రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, ప్రొఫెసర్ గణేష్ భట్, శివరామదాయగుడే, మనోజ్‌షిండే పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నెల్లూరు(క్రైమ్): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సోషల్ మీడియాలో గోప్యతకు డిజిటల్ భద్రత అవసరం.. ఆత్మరక్షణ అనేది ఒక ఎంపిక కాదు అవసరం.. మహిళలు సురక్షితంగా పనిచేసే ప్రదేశం – వేధింపులపై మౌనాన్ని వీడండి.. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు సురక్షితం – సవాళ్లు.. మహిళల భద్రతకు భరోసా ఇవ్వడంలో పురుషుల పాత్ర అనే అంశాలపై వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపర్చారు.



సాక్షి ప్లస్
బుధవారం ॥ 5-3-2025

సాగుబడి



- ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన మునగ రైతు
- దేశ విదేశాలకు మునగ నూనె తదితర ఉత్పత్తుల ఎగుమతి
- సోషల్ మీడియా సాయంతో ఖండాంతరాల్లో వ్యాపారం
- పదో తరగతి డ్రాపవుట్.. ఏటా రూ. 12 లక్షల ఆదాయం..



మునగ రాణి

పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే పెద్దగా చదువుకోకపోయినా నమ్ముకున్న రంగంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని చెప్పటానికి తమిళనాడుకు చెందిన మహిళా రైతు పొన్నరాసి విజయగాథే ఒక ఉదాహరణ. ఆమెకు 38 ఏళ్లు. నలుగురు పిల్లల తల్లి. వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగింది. పదో తరగతి మధ్యలో చదువు మానేసింది. పదేళ్లుగా పది ఎకరాల్లో మునగ తోట సాగు చేస్తూ.. తొలుత విత్తనాలు, ఆకులు, మొక్కలు అమ్ముతుండేది. పోటీ ఎక్కువై ఆదాయం తగ్గిపోయింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం నిపుణులను కలిసి సలహా అడిగింది. విత్తనాలు, ఆకులు, మొక్కలు వంటి మునగ ముడి ఉత్పత్తులకు అంత విలువ లేదు. వాటికి విలువను జోడించి.. అంటే, ప్రాసెసింగ్ చేసి రూపం మార్చి.. అమ్మితే మంచి ఆదాయం వస్తుందని చెప్పారు. అదెలా చెయ్యాలో తెలీదు. పెద్దగా చదువు లేదు. అయినా, పట్టుదలతో ముందడుగు వేసి, శిక్షణ పొంది ధైర్యంగా ముందడుగు వేసింది. మునగ సాగు చేస్తూనే మునగ నూనె తదితర ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తూ వ్యాపారవేత్తగా ఎదిగింది. నాణ్యతా ప్రమాణాలు పాటించటంతో దేశంలో వివిధ ప్రాంతాల నుంచే కాదు అమెరికా, సింగపూర్ వంటి అనేక ఇతర దేశాలకూ మునగ ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తోంది. ఏటా రూ. 12 లక్షలకు పైగా నికారదాయం సంపాదిస్తూ తోటి రైతులకు, మహిళలకు శిక్షణ కూడా ఇస్తోంది. అందుకే పొన్నరసికి 'మునగ రాణి' అని పేరొచ్చింది!

తమిళనాడులోని దిండిగల్ ప్రాంతం మునగ సాగుకు పెట్టింది పేరు. అటువంటి రంగంలో నలుగురు బిడ్డల తల్లి అయిన మహిళా రైతు పొన్నరాసి సంచలనమే సృష్టించింది. 'మా కుటుంబానికి ఉన్న పదెకరాల భూమిలో గత దశాబ్ద కాలంలో నేను మునగ తోట సాగు చేస్తున్నాను. మునగ ఆకులు, విత్తనాలు, వేర్లు అమ్మే వాళ్లం. అయితే, ఈ పని చేసే రైతులు చాలా మంది ఉండటం వల్ల మార్కెట్ దారుణంగా పడిపోయింది. మునగ విత్తనాల కిలో ధర రూ. 5–10కి పడిపోయింది..' అని ఎటువంటి సంక్షోభ పరిస్థితుల్లో తాను కొత్తగా ఆలోచించి ప్రాసెసింగ్‌లోకి అడుగు పెట్టిందీ పొన్నరాసి వివరించారు.

అటువంటి దిక్కుతోచని పరిస్థితుల్లో కోయంబత్తూరు వెళ్లి, అక్కడి తమిళనాడు వ్యవసాయ కాలేజీలో డాక్టర్ జాన్ కెనడీ అనే శాస్త్రవేత్తను స్వయంగా కలిసి మాట్లాడటమే ఆమె జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. 'పంటను పండించి, ఎక్కువ దిగుబడి తియ్యటం, పండించిన పంటను ముడి రూపంలో అలాగే ఎంతో కొంతకు అమ్ముకోవటం వల్ల డబ్బులు రావు. ప్రాసెసింగ్ చేసి మునగ నూనె, పొడి, సౌందర్య సాధనాలను అమ్మితే డబ్బులు వస్తాయి అని జాన్ కెనడీ సార్ చెప్పగా విన్నప్పుడు.. వ్యవసాయం గురించి అప్పటి వరకు నాకు ఉన్న అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. ఏం చేస్తే గట్టెక్కుతామో అర్థమైంది..' అన్నారామె.

కిలో మునగ నూనె రూ. 5 వేలు

కెనడీ చెప్పిన విషయాలు పొన్నరాసికి బాగా నచ్చాయి. అయితే వాటిని తయారు చేయటం ఎట్లా? ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కునే క్రమంలో దిండిగల్ జిల్లాలోనే ఉన్న గాంధీ గ్రామ్ యూనివర్సిటీలో వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీకుమారి, శరవణన్‌లను సంప్రదించింది. మునగ గింజల నుంచి నూనెను నుంచి నూనె తియ్యటం అంత తేలికేమీ కాదు. విత్తనం పైన పొరను తొలగించడానికి చాలా మంది కూలీలు అవసరం అవుతారు. యంత్రాల నిర్వహణ అనుభవం కూడా అవసరం.

నూనె తీయటం ప్రారంభించబోయే లోగా తన చుట్టూ ఉన్న వారు ఏవేవో కామెంట్స్ చేసి ఆమె ఉత్సాహం మీద నీళ్లు చల్లేవారు. పదో తరగతి చదువు కూడా లేని దానివి ఏం చేస్తావులే అని ఎత్తిపొడుపు మాటలు అనేవారు. 'వారి మాటల్ని నేను అసలు పట్టించుకునే దాన్ని కాదు. నా ద్విచక్రవాహనంపై నలుగురు పిల్లల్ని ఎక్కించుకొని ఎక్కడికంటే అక్కడకు వెళ్లి పనులు



చక్కబెట్టుకునే దాన్ని. బంధువులు కూడా నా ఆర్థిక పరిస్థితి గురించి ఇంకా వేవేవో సూటిపోటి మాటలు అనేవారు..' అని పొన్నరాసి గుర్తు చేసుకున్నారు. అయినా ఆమె వెనక్కి తగ్గలేదు. పట్టిన పట్టు విడవలేదు. 'అక్క ఇంటా బయటా చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. అయితే, ఆత్మస్థయిర్యంతో అన్నీటినీ ఎదుర్కొంది. ఆమె మీద నమ్మకం ఉంచి మేం పనిచేస్తున్నాం అన్నారు పొన్నరాసి దగ్గర పనిచేసే మహిళ కలైరాసి.

విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయటం ఒక్కటే సరిపోదు. అవి నాణ్యతా ప్రమాణాలకు తగినట్టు ఉండేలా చూసుకోవటం కూడా ఒక సవాలే. తంజావూరులోని ఇండియన్ ఫుడ్ ఎడిబుల్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ (ఐఎఫ్ఇడి) అనే సంస్థ నుంచి తన ఉత్పత్తులకు నాణ్యతా సర్టిఫికెట్ తీసుకోవటంతో పొన్నరాసికి మార్కెట్‌లో మంచి పట్టు దొరికింది. ప్రమాణాలకు తగినట్లు విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తున్న మహిళా రైతు, వ్యాపారవేత్తగా ఆమెకు ప్రభుత్వం నుంచి రూ. 2 లక్షల గ్రాంటు వచ్చింది. ఆ సొమ్ముతో పొలంలోనే ప్యాక్ హౌస్‌ను ఏర్పాటు చేసుకోగలిగింది. దాంతో ఆమె పని సులువైంది. అంతేకాదు, ఆ తర్వాత నుంచి మునగ ఆకులు, కాయలు, గింజలతో మొత్తం 36 రకాల ఉత్పత్తులను తయారు చేయటానికి వీలు దొరికింది. మునగ నూనెతో పాటు సబ్బులు, షాంపూలు, లిప్ బామ్స్ తయారీలో వాడేందుకు పొడిని.. సూప్ పౌడర్లు.. ఇటువంటివే ఎన్నో ఉత్పత్తుల్ని తయారు చేశారు. 'ఆహారోత్పత్తులను స్వయంగా తయారు చేయిస్తాను. సౌందర్య సాధనాలను తయారు చేయించే పనులను మా తమ్ముడు చూసుకుంటున్నాడని ఆమె తెలిపారు.

కస్టమర్ల సంఖ్య పెరిగే కొద్దీ, వారి అవసరాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా కొత్త కొత్త ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ప్రతి ఏటా కనీసం పది రకాల కొత్త ఉత్పత్తులను అదనంగా చేర్చుతున్నారామె. తన సిబ్బంది ఇది తమ పనిగా భావించి నిమగ్నమై పని చేయటం వల్ల పనులు సజావుగా చేయగలుగుతున్నానని చెబుతూ.. మునగ ఇడ్లీ పొడిని తయారు చేస్తే బాగుంటుందని మా దగ్గర పనిచేసే కలైరాసి చెప్పటంతోనే మొదలు పెట్టామని పొన్నరాసి సంతోషంగా చెప్పారు.

ప్రచారాలను పట్టించుకోకూడదు..

'మహిళ బాధ్యతల విషయంలో సమాజం గందరగోళపరిచే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. ఒక మహిళ వ్యాపారం మొదలు పెట్టిందంటే, ఆమె తల్లిగా లేదా భార్యగా విఫలమైపోయిందని ప్రచారం జరుగుతుంటుంది. ఇటువంటి ప్రచారాలను పట్టించుకోకుండా మహిళలు తాము ఉన్న చోట నుంచి ముందడుగు వేయాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఆ తర్వాత తెలుస్తుంది మనం చేసిన పనుల వల్ల ఎంత ప్రయోజనం చేకూరిందో, ఆర్థికంగా ఎంత స్వయం సమృద్ధి సాధించామో. డిగ్రీలే చదివి వుండాలనేమీ లేదు. మన సంకల్పంతో పాటు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవటం, సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవటం ముఖ్యం.'

– పొన్నరాసి,
ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన మునగ రైతు,
దుండిగల్, తమిళనాడు

వెలికి తీసే పద్ధతులు, యంత్రాలకు సంబంధించిన విషయాలన్నిటినీ తెలుసుకుంది. మునగ గింజల నుంచి తీసే నూనె కిలో రూ. 5 వేలు పలుకుతుందని పొన్నరాసికి తెలిసింది అప్పుడే. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సహకారం కూడా తీసుకొని ముందడుగు వేసింది. ఆ విధంగా వ్యవసాయం తప్ప వ్యాపారం తెలియని ఆమె జీవితంలో 2019లో వ్యాపార అధ్యాయం ప్రారంభమైంది.

కరువును తట్టుకునే మూలనుర్ మునగ

మునగ మెట్ట పంట అయినప్పటికీ అన్ని రకాల మునగ విత్తనాలూ కరువును తట్టుకొని మంచి దిగుబడిని ఇవ్వలేవు. అందుకే పొన్నరాసి కరువును తట్టుకునే మూలనూర్ మునగ రకాన్ని సాగు చేస్తున్నారు. అంతే కాదు ఏడాదికి మూడు టన్నుల దిగుబడి ఇస్తుంది. ఈ రకం గింజల్లో నూనె శాతం కూడా ఎక్కువట.

అయితే, మునగ విత్తనాల

ఫేస్‌బుక్, వాట్సప్..

పొన్నరాసి గత ఆరేళ్లుగా అంకితభావంతో పనిచేయటం వల్ల ఏడాదికి రూ. 12 లక్షలకు పైగా నికరాదాయం పొందగలుగుతున్నారు. ఆమె దగ్గర మునగ ఉత్పత్తుల్ని కొనుగోలు చేసే వారి సంఖ్య లక్ష దాటిపోయింది. ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూప్‌ల ద్వారా తెలుసుకొని కాంటాక్ట్ చేసిన వినియోగదారులకు తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

అంతేకాదు, సోషల్ మీడియా ద్వారా పొన్నరాసి కృషి గురించి, మునగ ఉత్పత్తుల గురించి తెలుసుకున్న మలేషియా, సింగపూర్, అమెరికా, ఫ్రాన్స్, మస్కట్ వాసులు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు.

ఎన్ని ఎక్కువ ఉత్పత్తుల్ని ఆమె విక్రయిస్తున్నా అందులో బాగా అమ్ముడు పోయేవి మాత్రం.. మునగ విత్తనాలు, సూప్ పౌడర్లు, నూనె మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగటం, పొన్నరాసి నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తులు తయారు చేస్తుండటంతో మంచి వ్యాపారం జరుగుతోంది. ట్రిచీ కలెక్టర్ పొన్నరాసికి బెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డును ప్రదానం చేసి గౌరవించారు. దీంతో ఆమెకు 'మునగ రాణి' అని పేరొచ్చింది.

ఇప్పుడామె చాలా మంది రైతులకు, స్వయం సహాయక బృందాలకు మునగ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తూ, ఆర్థిక స్వావలంబన సాధించేందుకు తోడ్పడుతోంది. 'ఎంబిఎ కాలేజీ వాళ్లు నన్ను పిలిచి వ్యవసాయాధారిత వ్యాపార పాఠాలు చెప్పమని అడుగుతుంటే చాలా గర్వంగా ఉంది' అని సంబర పడుతున్నారు పొన్నరాసి.

సోషల్ మీడియాలో మెసేజ్‌లు పెట్టటం నాకు తెలిసేది కాదు. మా అమ్మాయి నేర్పించింది. ఫేస్‌బుక్‌లో మా ఉత్పత్తుల వివరాలు చూసి విదేశాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. ఆ విధంగా ఫేస్‌బుక్, వాట్సప్ మా వ్యాపారానికి చాలా బాగా ఉపయగపడ్డాయి అని పొన్నరాసి సంబరంగా చెబుతున్నారు!

• టెక్నాలజీ

అర్క మష్రూమ్ చట్నీ పొడర్లు

బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) రూపొందించిన ముఖ్యమైన సాంకేతికతల్లో ఒకటి 'అర్క మష్రూమ్ చట్నీ పౌడర్' టెక్నాలజీ. పుట్టగొడుగులకు విలువ జోడించటం ద్వారా వాటిలో పోషక విలువలను అనేక విధాలుగా ఉపయోగించుకోవటానికి అవకాశం ఉంటుంది. సంప్రదాయం, పౌష్టికత, రుచిల మేలుకలయికకు మష్రూమ్ చట్నీ పౌడర్ టెక్నాలజీ నిదర్శనంగా నిలుస్తుంది.



తాజా పుట్టగొడుగులు ఎన్నో రోజులు నిల్వ ఉండవు, పైగా మార్కెట్ ధర ఎక్కువ. కాబట్టి అందరికీ అందుబాటులో ఉండవు. అందుకని వీటిత పొడులు తయారు చేసే టెక్నాలజీని ఐఐహెచ్ఆర్ రూపొందించింది. ఎండు పుట్టగొడుగులతో రకరకాలుగా చట్నీ పొడులను తయారు చేసుకోవచ్చు. పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు రోజువారీ భోజనంలో సులభంగా వాడుకునే విధంగా పోషకాలు నష్టపోని రీతిలో పొడులు తయారు చేయవచ్చు.

సంప్రదాయ రుచులకు తగినట్టుగా 7 రకాల పుట్టగొడుగుల చట్నీ పొడులను రూపొందించారు. బ్రహ్మీ, మునగ ఆకులు, అవిశ గింజలు, నువ్వులు, వేరుశనగలు, కొబ్బరి వంటి వాటితో వీటిని వేర్వేరుగా రూపొందించారు. మన వంటకాల్లో కలిపి ఈ పొడులను వాడుకోవచ్చు. స్కూళ్లలో మధ్యాహ్నభోజనం, సైన్యానికి భోజనాల్లో సైతం వాడుకోదగినవని ఐఐహెచ్ఆర్ పేర్కొంది. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఈ పొడులను తయారు చేసి ఎయిర్ టైట్ కంటెయినర్లలో/ పౌచ్‌లలో నింపుకొని (26–28 డిగ్రీల సెల్షియస్) సాధారణ ఉష్ణోగ్రత ఉండే చోట నిల్వ చేసుకుంటే 3 నెలల పాటు వాడుకోవచ్చు. ఈ పొడులను తయారు చేసి విక్రయించడం ద్వారా మహిళా స్వయం సహాయక బృందాలు, సైనిక వితంతువులు, వికలాంగులు.. ఉపాధి పొందవచ్చని ఐఐహెచ్ఆర్ చెబుతోంది.

ఈ టెక్నాలజీ పూర్తి వివరాలకు.. 080–23086100 – ఎక్స్‌టెన్షన్ 348, 349
mushroomiihr@gmail.com

• ఇన్నొవేషన్

మల్టీపర్పస్ రోబో



తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న అగ్రి హబ్, ఇక్రిశాట్, టిహబ్, ఐఎస్‌బి, ట్రిపుల్ ఐటి, ఐఐటి హైదరాబాద్, బిరాక్‌లలో 2017లో ఇంక్యుబేట్ అయిన అగ్రిటెక్ స్టార్టప్ 'ఎక్స్ మెషిన్స్'. ఈ ఇండియన్ రోబోటిక్స్, ఎఐ కంపెనీ వ్యవస్థాపకుడు త్రివిక్రమ్ కుమార్ డోగ్గా. పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో ఎపిపి బిల్డింగ్ కేంద్రంగా ఎక్స్ మెషిన్స్ రీసెర్చ్ లాబ్ పనిచేస్తోంది. ఎక్స్ మెషిన్స్ రూపొందించిన కృత్రిమ మేధ ఆధారిత మల్టీపర్పస్ రోబో వ్యవసాయంలో కూలీలు చేసే కలుపుతీత వంటి అనేక పనులను చక్కబెడుతుంది.



పంటల సాగులో రసాయనాల వాడకాన్ని సాధ్యమైనంత తగ్గించటం, శాస్త్రీయ, సుస్థిర వ్యవసాయ సాంకేతికతలను రైతులకు అందుబాటులోకి తేవటం ఎక్స్ మెషిన్స్ లక్ష్యాలు. ప్రెసిషన్ అగ్రికల్చర్ కోసం మల్టీపర్పస్ ఎఐ బేస్డ్ రోబోలను తయారు చేస్తోంది. వ్యవసాయంతో ప్రారంభించి ఇతర పరిశ్రమలకు అవసరమైన ఎఐ రోబోలను కూడా ఈ సంస్థ రూపొందిస్తోంది.

ఈ రోబోలను ఎవరూ నడపాల్సిన అవసరం లేదు. వాటంతట అవే తమ ప్రయాణాన్ని నిర్దేశించుకొని పనిచేస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు.

మిరప, పత్తి, పొగాకు తదితర సాళ్లుగా విత్తే పంట పొలాల్లో అన్ని మొక్కలకూ పురుగుమందుల పిచికారీలు అవసరం ఉండదు. కనీసం 30% మొక్కలకు అవసరం ఉండదని ఎక్స్ మెషిన్స్ సంస్థ అంచనా. చీడపీడల బారిన పడిన మొక్కల్ని ఎఐ టెక్నాలజీతో గుర్తించి వాటిపై మాత్రమే పిచికారీ చేయటం ఈ రోబో ప్రత్యేకత అని చెబుతున్నారు. వ్యవసాయంతో పాటు గోదాములు, లాజిస్టిక్స్, రక్షణ శాఖ అవసరాలు, ఉత్పత్తి యూనిట్లకు అవసరమైన ఎఐ రోబోలను కూడా ఈ సంస్థ రూపొందిస్తోంది.

సాంకేతికత: ఎక్స్ 111– మల్టీపర్పస్ రోబో

సమస్య: కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లలో ఒకటి. దాని అనుబంధ ఖర్చులు కూడా భారీగానే ఉంటాయి.

పరిష్కారం:

- ఈ సవాల్‌ను అధిగమించడానికి ఎక్స్ మెషిన్స్ రోబోని రూపొందించింది.
- వ్యవసాయ పంటల్లో కలుపు సమస్య, కూలీల కొరత లేకుండా చేస్తుంది.
- ఇది విత్తనం వేయటం, నారు పెంపకం, మైక్రో స్ప్రేలు, ఎరువుల పిచికారీ, ఇతర పనులకు సమర్థవంతంగా ఉపయోగించవచ్చు.
- ఇది 8 గంటల సమయంలో 2.5 ఎకరాల్లోని కలుపు మొక్కల్ని తొలగిస్తుంది.

బిజినెస్ రీల్

సెనోరెస్ చేతికి డాక్టర్ రెడ్డీస్ ఔషధ అనుమతులు



న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ నుంచి 14 'ఔషధ అనుమతుల'ను (ఏఎన్‌డీఏ) కొనుగోలు చేయనున్నట్లు సెనోరెస్ ఫార్మా వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. వీటిలో 13 ఏఎన్‌డీఏలకు ఇప్పటికే అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ అనుమతులు రాగా, ఒకటి పెండింగ్‌లో ఉందని పేర్కొంది. ఈ ఔషధాల మార్కెట్ సుమారు 421 మిలియన్ డాలర్లుగా ఉంటుందని వివరించింది. ఏదైనా బ్రాండ్‌కి జనరిక్ వెర్షన్‌ను అమెరికాలో విక్రయించాలంటే, ఏఎన్‌డీఏని సమర్పించడం ద్వారా ఎఫ్‌డీఏ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది.

రియల్టీ ప్లాట్‌ఫామ్ సిలాలో ధోని పెట్టుబడులు



ముంబై: సుప్రసిద్ధ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని ఫ్యామిలీ ఆఫీసు నుంచి వ్యూహాత్మక పెట్టుబడులు అందుకున్నట్లు రియల్టీ సర్వీసుల ప్లాట్‌ఫామ్ ఎస్ఐఎల్ఏ(సిలా) తాజాగా పేర్కొంది. అయితే పెట్టుబడి వివరాలు వెల్లడించలేదు. 2010లో రుషభ్, సాహిల్ వోరా ఏర్పాటు చేసిన సిలా దేశవ్యాప్తంగా రియల్టీ అడ్వయిజరీ సర్వీసులు అందిస్తోంది. సంస్థలో నార్వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్‌కు సైతం పెట్టుబడులున్నాయి. దేశీయంగా 20 కోట్ల చదరపు అడుగుల రియల్టీ ఆస్తులను నిర్వహిస్తున్న కంపెనీలో 25,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

భారత్‌కి ఏఐ హబ్‌గా ఎదిగే సత్తా..: నాదిర్ గోద్రెజ్

భోపాల్: ప్రపంచానికి కృత్రిమ మేధ (ఏఐ) సొల్యూషన్స్‌ని అందించే కీలక హబ్‌గా ఎదిగే సత్తా భారత్‌కి ఉందని గోద్రెజ్ ఇండస్ట్రీస్ ఎండీ నాదిర్ గోద్రెజ్ తెలిపారు. టెక్నాలజీ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లపరంగా (జీసీసీ) రాణిస్తుండటం ఇందుకు నిదర్శనమన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే పురోగామి సంస్కరణలు, వ్యాపారాలకు అనువైన పరిస్థితులను కల్పించడం, విద్య ద్వారా సాధికారత కల్పించడం, కొత్త తరం టెక్నాలజీలను సత్వరం అందిపుచ్చుకోవడం కీలకంగా ఉంటాయని గోద్రెజ్ వివరించారు. 'ఎకానమీ విస్తరించే కొద్దీ దేశంలో వినియోగదారులు మరింతగా పెరుగుతారు. ఇది వృద్ధికి గణనీయంగా దోహదపడుతుంది. ఐటీలో రాణించినట్లే ప్రపంచానికి ఏఐ సొల్యూషన్స్‌ను అందించడంలోనూ ప్రధాన కేంద్రంగా ఎదిగే సత్తా భారత్‌కి ఉంది. కొత్త టెక్నాలజీలకు సంబంధించి కూడా జీసీసీలు రావచ్చు' అని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-3-2025	
విశాఖ	435-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBIN	716.40	3.03
BPCL	249.60	2.97
BEL	264.60	2.80
SHRIRAMFIN	633.90	2.03
ADANIENT	2,147.60	1.44

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ& AUTO	7,332.95	-4.95
HEROMOTOCO	3,509.60	-3.34
BAJAJFINSV	1,789.90	-2.65
HCLTECH	1,536.50	-2.28
EICHERMOT	4,808.05	-2.01

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,220
ఎన్ఎస్ఈ	87,916
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,25,525
ఎఫ్ఐఐ	- 3,406
డీఐఐ	+ 4,851

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.72 (రాత్రి 11.30కి)	$ 68.37 (క్రితం ముగింపు)
బ్రెంట్	70.58 (రాత్రి 11.30కి)	$ 71.62 (క్రితం ముగింపు)

ఆ దేశాలపై సుంకాలు.. భారత్‌కు అవకాశాలు

- ఎగుమతులను పెంచుకోవచ్చు
- దేశీయ తయారీని బలోపేతం చేసుకోవచ్చు
- నిపుణుల అభిప్రాయాలు



న్యూఢిల్లీ: చైనా, మెక్సికో, కెనడాపై అమెరికా అధిక దిగుమతి సుంకాలు (టారిఫ్‌లు) మోపడం అన్నది, భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో అవకాశాలను విస్తృతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మన దేశం నుంచి వ్యవసాయం, ఇంజనీరింగ్, మెషిన్ టూల్స్, గార్మెంట్స్, టెక్స్‌టైల్స్, రసాయనాలు, లెదర్ పరిశ్రమకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ మొదటి నాలుగేళ్ల పదవీ కాలంలో చైనాపై అధిక సుంకాల బాదుడు నుంచి ఎక్కువగా లాభపడిన దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉండడం గమనార్హం. మెక్సికో, కెనడాలపై 25 శాతం సుంకాలు 4వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ లోగడే ప్రకటించారు. చైనా ఉత్పత్తులపైనా టారిఫ్‌ను 20 శాతానికి పెంచుతున్నట్టు పేర్కొనడం తెలిసిందే. ''అమెరికా విధించిన సుంకాలతో అమెరికా మార్కెట్లో చైనా, మెక్సికో, కెనడా వస్తువుల ధరలను పెంచేస్తాయి. దీంతో వాటి పోటీతత్వం తగ్గిపోతుంది. భారత ఎగుమతిదారులు ఈ అవకాశాలను సొంతం చేసుకోవాలి''అని భారత ఎగుమతిదారుల సమాఖ్య (ఎఫ్ఐఈవో) ప్రెసిడెంట్ ఎస్సీ రాల్హన్ తెలిపారు.

భారత్‌కు ప్రయోజనం: జీటీఆర్ఐ

ప్రైవేటు పరిశోధనా సంస్థ అయిన గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది. వాణిజ్య యుద్ధం భారత్‌కు అనుకూలిస్తుందని, ఎగుమతులను పెంచుకోవడంతోపాటు అమెరికా కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షించడానికి సాయపడుతుందని పేర్కొంది. చైనాపై అధిక సుంకాలు భారత్ తన తయారీరంగాన్ని బలోపేతం చేసుకునేందుకు అవకాశంగా మలుచుకోవాలని సూచించింది. ఒప్పందాలకు కట్టుబడని ట్రంప్ వైఖరి దృష్ట్యా ఆ దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ హెచ్చరించారు. దీనికి బదులు జీరోకి జీరో టారిఫ్ డీల్‌ను కుదుర్చుకోవాలని సూచించారు.

సుంకాలేతర చర్యలు భారత ఎగుమతులకు అడ్డు: డీజీఎఫ్‌టీ

అభివృద్ధి చెందిన దేశాలు విధించిన నాన్ టారిఫ్ (సుంకాలు కాని ఇతర చర్యలు)లు భారత వస్తువులకు మార్కెట్ అవకాశాలను పరిమితం చేయొచ్చని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారీన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ సారంగి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐరోపా సమాఖ్య (ఈయూ) విధించిన కార్బన్ ట్యాక్స్, డీఫారెస్టేషన్ నిబంధనలను ప్రస్తావించారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో భారత్ అనుసంధానమై ఉండకపోవడం, అధిక దిగుమతి సుంకాలు, టెక్నాలజీ పరంగా అననుకూలత, అధిక లాజిస్టిక్స్ వ్యయాలు వంటి ఇతర సవాళ్లు కూడా ఉన్నట్టు చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల దుందుడుకు పారిశ్రామిక విధానాలు సైతం భారత ఎగుమతులకు అవరోధంగా మారొచ్చన్నారు. ''2023-24లో 437 బిలియన్ డాలర్ల వస్తు ఎగుమతులకు గాను 284 బిలియన్ డాలర్ల రుణ సాయం అవసరం. కానీ, అందించిన రుణ సాయం 125 మిలియన్ డాలర్లుగానే ఉంది. 2030 నాటికి ఎగుమతుల రుణ డిమాండ్ 650 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది''అని సారంగి వివరించారు.

వ్యర్థాల నుంచి కీలక ఖనిజాల వెలికితీత

- సంస్కరణలతో సాధ్యమే
- ఫిక్కీ-డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: భారత్‌లో వ్యర్థాల నుంచి కీలకమైన ఖనిజాలను వేరు చేసేందుకు (రికవరీ) విధానపరమైన సంస్కరణల మద్దతుతోపాటు బహుముఖ వ్యూహం అవసరమని ఫిక్కీ-డెలాయిట్ నివేదిక సూచించింది. టెక్నాలజీ అభివృద్ధి, ప్రాసెసింగ్ సామర్థ్యం, సరఫరా వ్యవస్థతో అనుసంధానం అన్నవి వ్యర్థాల నుంచి విలువైన ఖనిజనాల వెలికితీతకు అవసరమని అభిప్రాయపడింది. శుద్ధ ఇంధన టెక్నాలజీలకు (క్లీన్ ఎనర్జీ/పర్యావరణ అనుకూల), ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీ తయారీకి కీలక ఖనిజాలు ఎంతో ముఖ్యమైనవిగా పేర్కొంది. ప్రపంచ దేశాలు క్లీన్ ఎనర్జీ వైపు మళ్లుతుండడంతో ఈ ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్నట్టు వివరించింది. అలాగే, విమానాల తయారీ, క్షిపణులు, కార్వెట్స్ తదితర రక్షణ ఉత్పత్తుల తయారీకి సైతం వీటిని వినియోగిస్తున్నట్టు గుర్తు చేసింది. ఈ కీలక ఖనిజ వనరులను సమకూర్చుకునేందుకు భారత్ ఇటీవల ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో.. తక్కువ స్థాయి నిల్వలు, మైనింగ్ కార్యకలాపాలు దీర్ఘకాలం పాటు చేయాల్సి రావడం, ప్రాసెసింగ్ పరంగా ఉన్న అవరోధాలను ఈ నివేదిక ప్రస్తావించింది. కనుక కీలక ఖనిజ వనరుల కోసం ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని, వ్యర్థాల నుంచి ఖనిజాల వెలికితీత మెరుగైన పరిష్కారంగా పేర్కొంది. బూడిద, ఎర్రమట్టి, ఫ్లై యాష్, గనుల పైపొరలు, లోహ వ్యర్థాలు, మెటల్ స్లాగ్ నుంచి నికెల్, కోబాల్ట్, కాపర్, టైటానియం, గాలియంను రికవరీ చేసుకోవచ్చని తెలిపింది. భారత్ కీలక ఖనిజ వనరుల సుస్థిరతకు, డిమాండ్ అవసరాలను తీర్చుకునేందుకు ఈ వనరులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంది. చాలా దేశాలు ఇప్పుడు వ్యర్థాల నుంచి కీలక ఖనిజాల వెలికితీత ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్నట్టు ప్రస్తావించింది.

జెమినీ ఎడిబుల్స్ చేతికి అన్నపూర్ణ ఫుడ్స్

చెన్నై సంస్థలో 70 % వాటా కొనుగోలు



చెన్నై: వంటనూనెల హైదరాబాద్ కంపెనీ జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ తాజాగా చెన్నై సంస్థ శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేసింది. మసాలాలు, మీల్ మిక్స్‌లతోపాటు ఇతర ఉత్పత్తుల తయారీ, పంపిణీ చేపట్టేందుకు కోయంబత్తూర్ కంపెనీలో 70 శాతం వాటా సొంతం చేసుకున్నట్లు జెమినీ ఎడిబుల్స్ పేర్కొంది. రెండు సంస్థలు చేతులు కలపడం ద్వారా భాగస్వామ్య కంపెనీ(జేవీ) జీఈఎఫ్ ఫుడ్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసినట్లు జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర రెడ్డి వెల్లడించారు. వెజిటబుల్ ఆయిల్ కంపెనీ గోల్డెన్ అగ్రి రిసోర్సెస్‌కు జెమినీ ఎడిబుల్స్ అనుబంధ సంస్థకాగా.. ఫ్రీడమ్ బ్రాండ్‌తో దేశవ్యాప్తంగా వంట నూనెలు విక్రయించే సంగతి తెలిసిందే. స్పెషాలిటీ ఫ్యాట్స్ సైతం రూపొందించే కంపెనీ రోజుకి 2,450 మెట్రిక్ టన్నుల రిఫైనింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు చంద్ర తెలియజేశారు. కాగా.. ఇప్పటికే జేవీలో రూ. 70 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు జెమినీ ఎడిబుల్స్ గ్రూప్ వైస్‌ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి వెల్లడించారు. తయారీ యూనిట్ ఏర్పాటుకు మరో రూ. 50 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేశారు.

50 వసంతాలు

శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్ మసాలాల ప్రాసెసింగ్‌లో నాణ్యతను నిలుపుకుంటూ సుప్రసిద్ధ సంస్థగా 5 దశాబ్దాల చరిత్రను కలిగి ఉన్నట్లు చంద్ర పేర్కొన్నారు.

అదానీ విల్మర్ చేతికి 'టాప్స్'


న్యూఢిల్లీ: టాప్స్ బ్రాండుతో పచ్చళ్లు, సాస్‌లు తయారు చేసి విక్రయిస్తున్న జీడీ ఫుడ్స్‌ను కొనుగోలు చేసినట్లు ఎఫ్ఎంసీజీ దిగ్గజం అదానీ విల్మర్ తాజాగా పేర్కొంది. ఇందుకు జీడీ ఫుడ్స్ మ్యాన్యుఫాక్చరింగ్ (ఇండియా) ప్రయివేట్ లిమిటెడ్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. దీనిలో భాగంగా తొలుత 80 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. తదుపరి మూడేళ్లలో మిగిలిన 20 శాతం వాటాను చేజిక్కించుకోనుంది.

ఐపీఏ గూటికి క్వాలిటీ యానిమల్ ఫీడ్స్

ముంబై: ఇండియన్ పౌల్ట్రీ అలయెన్స్(ఐపీఏ) తాజాగా క్వాలిటీ యానిమల్ ఫీడ్స్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 300 కోట్లు వెచ్చించినట్లు అల్లన గ్రూప్ అనుబంధ సంస్థ ఐపీఏ వెల్లడించింది. తాజా కొనుగోలు ద్వారా దేశీ పౌల్ట్రీ పరిశ్రమలో పటిష్టపడనున్నట్లు ఐపీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. కంపెనీ ఫ్రోజెన్ హలాల్ మీట్, తృణధాన్యాలతోపాటు ఫ్రూట్ పల్ప్‌లు, కాఫీ, పెట్ ఫుడ్ తదితర కన్జూమర్ ప్రొడక్టుల తయారీ, ఎగుమతులను చేపడుతోంది.

ఐపీవోకు బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ రెడీ

- పరమేశు బయోటెక్ సైతం
- సెబీ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రెండు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో బెల్‌రైజ్ ఇండస్ట్రీస్, పరమేశు బయోటెక్ చేరాయి. ఐపీవో చేపట్టేందుకు వీలుగా గతేడాది నవంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. వీటి ప్రకారం బెల్‌రైజ్ రూ. 2,750 కోట్లు, పరమేశు రూ. 600 కోట్లు చొప్పున సమీకరించే ప్రణాళికల్లో ఉన్నాయి. కాగా.. ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ సిస్టెక్ పబ్లిక్ ఇష్యూ ప్రయత్నాలు విరమించుకున్నాయి. మార్కెట్ల క్షీణత నేపథ్యంలో గతేడాది డిసెంబర్, 2025 ఫిబ్రవరిలో సెబీకి దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌లను వెనక్కి తీసుకున్నాయి. కారణాలు వెల్లడించలేదు. వివరాలు చూద్దాం..

ఆటో విడిభాగాల తయారీ

పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఆటో విడిభాగాల తయారీ కంపెనీ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ రూ. 2,150 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. ఈ నిధుల్లో రూ. 1,618 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2024 జూన్‌కల్లా కంపెనీ రూ. 2,463 కోట్ల రుణ భారాన్ని కలిగి ఉంది.

జొన్న ఆధారిత ఉత్పత్తులు

ఐపీవోలో భాగంగా జొన్న ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే పరమేశు బయోటెక్ రూ. 520 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 80 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ యూనిమార్క్ బిజినెస్ సొల్యూషన్స్ విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 600 కోట్లు సమకూర్చుకోనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 330 కోట్లు కొత్త ప్లాంటు ఏర్పాటుకు వెచ్చించనుంది. మధ్యప్రదేశ్‌లో రోజుకి 1,200 టన్నుల సామర్థ్యంతో ప్లాంటుకు తెరతీయనుంది. మరో రూ. 85 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది.

ఐపీవోకి ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ దరఖాస్తు



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ సంస్థ 'ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్' ఐపీవోకు వచ్చేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. రూ.392 కోట్ల విలువ చేసే తాజా ఈక్విటీ షేర్లను ఐపీవోలో భాగంగా కంపెనీ విక్రయించనుంది. అలాగే, ప్రమోటర్‌తో పాటు ఇన్వెస్టర్ షేర్‌హోల్డర్ 28.57 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ రూపంలో విక్రయించనున్నారు. ఐపీవో ద్వారా మొత్తం రూ.78 కోట్లను సమీకరించాలన్నది కంపెనీ ప్రణాళిక. తాజా ఈక్విటీ షేర్ల జారీ రూపంలో సమకూరే రూ.224 కోట్లను ప్రభుత్వ, చట్టపరమైన అనుమతులు, అదనపు ఫ్లోర్ స్పేస్ కొనుగోలుకు తదితర అవసరాలకు వినియోగించనుంది. రూ.74 కోట్లను రుణ చెల్లింపులకు ఉపయోగించనుంది. ఈ సంస్థ ప్రధానంగా ముంబై, పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటుంది.

ఓపెన్ టెలికం ఏఐ ప్లాట్‌ఫాంపై కసరత్తు

ఏఎండీ, సిస్కో, నోకియాతో జియో ప్లాట్‌ఫామ్స్ జట్టు

న్యూఢిల్లీ: నెట్‌వర్క్ సామర్థ్యాలను, భద్రతను పెంచి, సాంకేతిక వ్యయాలను తగ్గించే దిశగా ఓపెన్ టెలికం ఏఐ ప్లాట్‌ఫాంను రూపొందించడంపై జియో ప్లాట్‌ఫామ్స్ దృష్టి పెడుతోంది. ఇందుకోసం టెక్నాలజీ దిగ్గజాలు ఏఎండీ, సిస్కో, నోకియాతో జట్టుకట్టింది. నెట్‌వర్క్ నిర్వహణకు సంబంధించి ప్రతి దశలోను కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్‌ను పొందుపర్చే విధంగా ఈ ప్లాట్‌ఫాం ఉంటుందని రిలయన్స్ జియో గ్రూప్ సీఈవో మాథ్యూ ఊమెన్ తెలిపారు. రియల్ టైమ్‌లో పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మల్చుకోగలిగే ఏఐ ఆధారిత స్వతంత్ర నెట్‌వర్క్ ద్వారా యూజర్లకు మరింత మెరుగైన అనుభూతిని అందించవచ్చని పేర్కొన్నారు. దీనితో డిజిటల్ వ్యవస్థలో ఒక కొత్త సర్వీసు, తద్వారా ఆదాయ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కృత్రిమ మేధతో నెట్‌వర్క్‌లలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు పరిశ్రమ దిగ్గజాల కలయిక తోడ్పడుతుందని సిస్కో సీఈవో చక్ రాబిన్స్ వివరించారు.



గిఫ్ట్ సిటీ ఫండ్స్‌లో ప్రవాసుల పెట్టుబడులు @ 7 బిలియన్ డాలర్లు



ముంబై: గిఫ్ట్ సిటీలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లో ప్రవాస భారతీయులు దాదాపు 7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ చైర్మన్ కె రాజారామన్ తెలిపారు. అలాగే ఇతరత్రా బ్యాంకింగ్ సాధనాల్లో దాదాపు 5,000 మంది ఎన్నారైలు ఒకటిన్నర బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నల్ ఆడిటర్స్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. గిఫ్ట్ సిటీలోని 30 బ్యాంకుల నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) 78 బిలియన్ డాలర్ల స్థాయిని దాటినట్లు వివరించారు. ఇందులో సుమారు 50 బిలియన్ డాలర్ల మొత్తాన్ని దేశీ కార్పొరేట్లు రుణాలుగా తీసుకున్నట్లు, ఇటీవలే ఒక బడా భారతీయ కార్పొరేట్ దిగ్గజం 3 బిలియన్ డాలర్ల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు రాజారామన్ చెప్పారు.

బ్యాంకుల పనితీరు మెరుగు

ఫిచ్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: భారత బ్యాంక్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలంలో (2024 ఏప్రిల్-డిసెంబర్) బలమైన పనితీరు చూపించినట్టు ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. బ్యాంకింగ్ రంగం బలహీన రుణ నిష్పత్తి (చెల్లింపులు ఆగిన రుణాలు) కనిష్ట స్థాయికి చేరుకున్నట్టు వెల్లడించింది. బ్యాంకింగ్ రిస్క్ ధోరణి 2018 నుంచి మరింత క్రమబద్ధంగా ఉందంటూ.. రుణాలను వైవిధ్యం చేసుకోవడం, మెరుగైన కార్పొరేట్ రుణాల పోర్ట్‌ఫోలియో అన్నీ కలసి ఎన్‌పీఏలు తగ్గేందుకు కారణమైనట్టు వివరించింది. దీంతో బ్యాంకుల లాభదాయకత, బలహీన రుణ నిష్పత్తి మెరుగైనట్టు తెలిపింది. బ్యాంకింగ్ రంగం రిటర్న్ ఆన్ అసెట్స్ (ఆర్‌వోఏ) 2024 డిసెంబర్ నాటికి 10 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 1.4 శాతానికి చేరుకున్నట్టు తెలిపింది. బ్యాంకింగ్ రంగం బలహీన రుణ నిష్పత్తి 2024 మార్చి నాటికి 0.40 శాతం తగ్గి 2.4 శాతంగా ఉన్నట్టు వెల్లడించింది. అయితే ఇప్పటికీ బ్యాంకుల్లో రిస్క్ ధోరణి కొనసాగుతోందంటూ అన్‌సెక్యూర్డ్ రుణాల్లో వృద్ధిని ఇందుకు నిదర్శనంగా ప్రస్తావించింది. ఆర్‌బీఐ జోక్యం చేసుకుని బ్యాంకులను నిరుత్సాహపరచడాన్ని గుర్తు చేసింది.

వేతనం కాదు.. పని వాతావరణం ముఖ్యం

- ఉద్యోగంలో సౌకర్యం ఉండాలి
- నేర్చుకునేందుకు అవకాశం ఉండాలి
- ఇవేమీ లేకపోతే జాబ్‌కు గుడ్‌బై
- రాండ్‌స్టాడ్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ఉద్యోగుల మొదటి ప్రాధాన్యం వేతనానికే అనుకుంటాం. కానీ, అలా అనుకోవడం పొరపాటే అవుతుంది. వేతనం కంటే పనిచేసే చోట సానుకూల పరిస్థితులు, నేర్చుకునే, ఎదిగే అవకాశాలకు ఎక్కువ మంది ఉద్యోగులు ప్రాధాన్యం ఇస్తున్నట్టు రాండ్‌స్టాడ్ నిర్వహించిన 'ఇండియా వర్క్ మానిటర్ 2025' సర్వేలో తెలిసింది.

సర్వేలో అభిప్రాయాలు

- పనిలో సౌలభ్యం లేకపోతే ఆ ఉద్యోగానికి గుడ్‌బై చెబుతామని 52 శాతం మంది చెప్పారు. సౌకర్యవంతమైన పనివేళలు లేని ఉద్యోగాన్ని తిరస్కరిస్తామని 60 శాతం మంది తెలిపారు. పనిచేసే ప్రదేశం అనుకూలంగా లేకపోతే ఆ ఉద్యోగాన్ని కాదనకుంటామని 56 శాతం మంది చెప్పారు.
- తమ మేనేజర్‌తో మంచి సంబంధాలు లేకపోతే ఉద్యోగాన్ని వీడుతామని 60 శాతం మంది తెలిపారు.
- తాము చేసే ఉద్యోగంలో నేర్చుకోవడానికి, అభివృద్ధి చెందడానికి అవకాశం లేకపోతే దాన్ని వదులుకుంటామని 67 శాతం మంది చెప్పారు. అంతర్జాతీయంగా ఇదే అభిప్రాయం చెప్పిన వారు 41 శాతమే.
- దేశీయంగా 69 శాతం మంది ఉద్యోగులు తమదనే భావనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అంటే సమిష్టి పని సంస్కృతిని వారు కోరుకుంటున్నారు. అంతర్జాతీయంగా 55 శాతం మందిలో ఇదే భావన నెలకొంది.
- తమ విలువలకు సరిపడని సంస్థలో పనిచేయబోమని 70% మంది తేల్చిచెప్పారు.
- పనిలో ప్రయోజనాలుంటే (పనివేళల్లో, పని ప్రదేశాల్లో వెసులుబాట్లు) యాజమాన్యాలను విశ్వసిస్తామని 73 శాతం మంది సర్వేలో తమ అభిప్రాయాన్ని తెలిపారు.

యాజమాన్యాలు మారాల్సిందే..

పని ప్రదేశాల్లో వస్తున్న మార్పులకు ఈ సర్వే ఫలితాలు అద్దం పడుతున్నట్టు రాండ్‌స్టాడ్ సర్వే నివేదిక తెలిపింది. ''జెన్ జెడ్ అయినా లేదా మిలీనియల్స్ అయినా వ్యక్తిగత కట్టుబాట్లు, కెరీర్ వృద్ధిని సమతుల్యం చేసుకోవాలని అనుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ తమదైన రీతిలో (స్వేచ్ఛగా) పనిచేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పనిలో నేర్చుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారంటే, వారు కేవలం ఉద్యోగాలనే కోరుకోవడం లేదు. కెరీర్ పురోగతిని కోరుకుంటున్నారని అర్థమవుతోంది. యాజమాన్యాలు ఈ మార్పును తప్పకుండా గుర్తించి, నిపుణులైన మానవ వనరుల అంచనాలను అందుకునే వ్యూహాలను రూపొందించుకోవాలి. లేదంటే నిపుణులను కోల్పోవాల్సి వస్తుంది''అని రాండ్‌స్టాడ్ ఇండియా ఎండీ, సీఈవో విశ్వనాథ్ పీఎస్ తెలిపారు.

జియో పేమెంట్స్‌లో వాటా కొనుగోలు

ఎస్‌బీఐ వాటా జియో ఫైనాన్స్ చేతికి



న్యూఢిల్లీ: జియో పేమెంట్స్ బ్యాంక్‌లో పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ వాటాను జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ కొనుగోలు చేయనుంది. పూర్తి వాటాకు రూ. 104.54 కోట్లు వెచ్చించనుంది. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐతో భాగస్వామ్య సంస్థ(జేవీ)గా ఏర్పాటైన జియో పేమెంట్స్ బ్యాంక్‌లో ప్రస్తుతం జియో ఫైనాన్షియల్ 82.17 శాతం వాటా కలిగి ఉంది. కాగా.. జియో పేమెంట్స్‌లో ఎస్‌బీఐకుగల 7.9 కోట్లకు పైగా ఈక్విటీ షేర్లను రూ. 104.54 కోట్లు వెచ్చించి సొంతం చేసుకోనున్నట్లు జియో ఫైనాన్షియల్ తాజాగా వెల్లడించింది. ఇందుకు బోర్డు అనుమతించినట్లు తెలియజేసింది. ఈ లావాదేవీ తదుపరి పూర్తి అనుబంధ సంస్థగా జియో పేమెంట్స్ బ్యాంక్ అవతరించనున్నట్లు పేర్కొంది. వాటా కొనుగోలుకి ఆర్‌బీఐ నుంచి గ్రీన్ సిగ్నల్ పొందవలసి ఉంది. 45 రోజుల్లోగా అనుమతి లభిస్తుందని అంచనా.

జియో ఫైనాన్షియల్ షేరు బీఎస్ఈలో 2.7 శాతం లాభపడి రూ. 206 వద్ద ముగిసింది.

డ్రెస్సింగ్ రూమ్‌లో ఫ్యామిలీకి 'నో ఎంట్రీ'

- ప్లేయర్లంతా టీమ్ బస్సులో ప్రయాణించాల్సిందే
- ఐపీఎల్‌లోనూ బీసీసీఐ కఠిన నిబంధనలు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సందర్భంగా పాటించాల్సిన నిబంధనల అంశంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కఠినంగా వ్యవహరించాలని భావిస్తోంది. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో భారత జట్టు టెస్టు సిరీస్ 'వైట్‌వాష్' కావడంతో పాటు... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించలేకపోవడంతో నిబంధనలను పక్కాగా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించే సమయంలో కూడా భారత ఆటగాళ్లు టీమ్ బస్సుల్లోనే ప్రయాణించాలని వెల్లడించింది.

➡ ఆటగాళ్లు తప్పకుండా జట్టు సభ్యులతో కలిసి 'టీమ్ బస్'లోనే ప్రయాణించేలా చూడాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ మేరకు ఫ్రాంచైజీ యాజమాన్యాలకు సూచించింది.

➡ ఆటగాళ్లు, సహాయక సిబ్బంది కుటుంబ సభ్యులను డ్రెస్సింగ్ రూమ్‌లోకి అనుమతించకూడదని బీసీసీఐ నిర్ణయించింది. ప్రాక్టీస్ రోజుల్లోనూ దీన్ని కొనసాగించాలని సూచించింది. అనుమతించిన సిబ్బంది మినహా డ్రెస్సింగ్ రూమ్‌లోకి మరెవరికీ ప్రవేశం కల్పించకూడదని ప్రకటించింది.

➡ ప్లేయర్ల స్నేహితులు, సన్నిహితులు ఇతర వాహనాల్లో ప్రయాణిస్తూ... హాస్పిటాలిటీ ప్రాంతం నుంచి మ్యాచ్ ప్రాక్టీస్ చూడొచ్చు. నెట్ బౌలర్లు, త్రోడౌన్ స్పెషలిస్టులు కూడా బీసీసీఐ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే.

➡ ఐపీఎల్ సందర్భంగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదని పేర్కొన్న బీసీసీఐ... 'ఆరెంజ్ క్యాప్', 'పర్పుల్ క్యాప్' సాధించిన ఆటగాళ్లు మ్యాచ్ ఆరంభంలో కనీసం రెండు ఓవర్ల పాటైనా వాటిని ధరించాలని సూచించింది. మ్యాచ్ అనంతరం బహుమతి ప్రదానోత్సవంలో ప్లేయర్లు స్లీవ్ లెస్ జెర్సీలను ధరించకూడదని బీసీసీఐ వెల్లడించింది.


కోహ్లి, అనుష్క (ఫైల్)

➡ మార్చి 22 నుంచి కోల్‌కతాలో ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానుండగా... దానికి ముందు ఈ నెల 20న ముంబై వేదికగా కెప్టెన్‌ల సమావేశం జరగనుంది. సాధారణంగా తొలి మ్యాచ్ జరిగే వేదికలోనే ఈ భేటీ జరుగుతుంది. కానీ ఈసారి అందుకు భిన్నంగా ముంబైలో నిర్వహించనున్నారు.

మెయిన్ 'డ్రా'కు శ్రీకాంత్ అర్హత



పారిస్ (ఫ్రాన్స్): ఓర్లీన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆంధ్ర ప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో శ్రీకాంత్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-8, 21-14తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలిచాడు. అనంతరం రెండో రౌండ్‌లో శ్రీకాంత్ 21-11, 14-21, 21-12తో అర్నాడ్ మెర్కెల్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ మూడో గేమ్‌లో ఒకదశలో వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ కూడా మెయిన్ 'డ్రా'కు చేరుకున్నాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో శంకర్ 21-19, 19-21, 21-19తో మాగ్నస్ జోహాన్సెన్ (డెన్మార్క్)పై, రెండో రౌండ్‌లో 21-18, 21-12తో భారత్‌కే చెందిన రిత్విక్ సంజీవ్ సతీశ్ కుమార్‌పై గెలుపొందాడు. హైదరాబాద్‌కే చెందిన తరుణ్ మన్నేపల్లి మెయిన్ 'డ్రా'కు చేరుకోవడంలో విఫలమయ్యాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో తరుణ్ 21-17, 9-21, 16-21తో జువో ఫు లియావో (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు.

ఉన్నతి, ఇషారాణి కూడా

మహిళల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్స్ ఉన్నతి హుడా, ఇషా రాణి బారువా కూడా మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో ఉన్నతి 21-12, 21-16తో సియు టాంగ్ టుంగ్ (చైనీస్ తైపీ)పై, రెండో రౌండ్‌లో 21-13, 21-15తో కిసోనా (మలేసియా)పై గెలిచింది. ఇషారాణి క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 12-21, 21-10, 21-12తో జుయ్‌ఫె కి (ఫ్రాన్స్)పై, రెండో రౌండ్‌లో 25-27, 21-16, 23-21తో అమెలీ షుల్జ్ (డెన్మార్క్)పై విజయం సాధించింది.

భారత్‌లో ఆసియా యోగాసన పోటీలు

ఈనెల 29 నుంచి 31 వరకు న్యూఢిల్లీలో నిర్వహణ



న్యూఢిల్లీ: త్వరలోనే భారత్ ఆసియా యోగాసన చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమివ్వనుంది. ఇక్కడి ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 29 నుంచి 31 వరకు యోగాసన పోటీలు జరుగుతాయి. 'యోగాసన భారత్'తో కలిసి కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించనుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో మన ఘనమైన వారసత్వం, ప్రాచీన సంస్కృతి ప్రాముఖ్యతను చాటేందుకు ఇది చక్కని వేదికగా భారత్ భావిస్తోంది. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడాంశంగా మార్చేందుకు ఆసియా ఒలింపిక్స్ మండలి, ఆసియా యోగాసన, ప్రపంచ యోగాసన సమాఖ్యలు కలిసి పనిచేస్తున్నాయి. యోగా చాంపియన్‌షిప్‌పై కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మాట్లాడుతూ 'యోగాకు పుట్టిల్లు అయిన భారత్‌లో రెండో ఆసియా యోగాసన చాంపియన్‌షిప్ జరుగనుండటం సంతోషంగా ఉంది. ఇవి కేవలం పోటీలు కావు. అంతకుమించిన వేడుకలు. మన ప్రాచీన జ్ఞానం ఆధునిక పోటీ క్రీడగా ఎదగడం గొప్ప విషయం. యోగాకు అంతర్జాతీయ క్రీడాఖ్యాతి తెచ్చేందుకు మేం కట్టుబడి ఉన్నాం. దీనికోసం ఇలాంటి పోటీలతో ముందడుగు వేస్తున్నాం. ఇదొక పోటీగా కాకుండా రోజువారీ దైనందిన జీవన వ్యవహారాల్లో శారీరక, మానసిక బలానికి యోగా చేసే మేలు ఎంతో ఉంది' అని అన్నారు. ఆధునిక అథ్లెటిక్స్‌లో యోగాను ఒక క్రీడాంశంగా మలచడమే తమ లక్ష్యమని ఆసియా యోగాసన అధ్యక్షుడు సంజయ్ మాల్పాని చెప్పారు. యోగాసనాలు అనేవి అభ్యాసాలు మాత్రమే కాదని ఎంతో ఓర్పుతో, మరెంతో నేర్పుగా చేసే కళాత్మక పోటీ క్రీడని ఈ చాంపియన్‌షిప్‌తో నిరూపించాలనుకుంటున్నట్లు తెలిపారు. దేశ రాజధానిలో ఈ యోగాసన పోటీలు నిర్వహించడం ద్వారా ప్రపంచస్థాయి ప్రాచుర్యం తెచ్చేందుకు అడుగులు వేస్తున్నామని ప్రపంచ యోగాసన కార్యదర్శి జైదీప్ ఆర్య తెలిపారు. ఆసియాలోని యోగా క్రీడాకారులు తమ నైపుణ్య ప్రదర్శనకు ఇదొక చక్కని వేదికని యోగాసన భారత్ అధ్యక్షుడు ఉదిత్ సేథ్ చెప్పారు. మన ప్రాచీన సంస్కృతి యొక్క సౌందర్యాన్ని ఆవిష్కరించే యోగాసనాలను ప్రముఖ క్రీడగా వర్ధిల్లే విధంగా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

డ్రాగ్ ఫ్లికర్‌లకు టెకీ టెకెమా సేవలు

- భారత మహిళల హాకీ జట్టుకు శిక్షణ ఇవ్వనున్న నెదర్లాండ్స్ దిగ్గజం
- భారత జట్టు హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: వచ్చే ఒలింపిక్స్‌లో భారత మహిళల హాకీ జట్టు పతకం గెలవడమే లక్ష్యంగా హాకీ ఇండియా (హెచ్ఐ) చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నెదర్లాండ్స్ దిగ్గజం టెకీ టెకెమాతో భారత అమ్మాయిలకు శిక్షణ అందించింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ టోర్నీకి ముందు గత నెల భువనేశ్వర్‌లో వారం రోజుల పాటు మహిళా డ్రాగ్‌ఫ్లికర్లకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. భారత జట్టులోని కీలక డ్రాగ్‌ఫ్లికర్లు దీపిక, మనీషా చౌహాన్, సోనమ్, అన్నులతో పాటు పలువురు జూనియర్ అమ్మాయిలకు టెకెమా కిటుకులు నేర్పాడు. ఇది సానుకూల ఫలితాలను ఇవ్వడంతో తరచూ ఇలాంటి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్‌కల్లా జట్టును సన్నద్ధం చేయవచ్చని హాకీ ఇండియా భావిస్తోంది. భారత మహిళా జట్టు హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ స్వల్పకాలిక శిక్షణపై సంతృప్తి వెలిబుచ్చారు. 'టెకెమా గొప్ప డ్రాగ్‌ఫ్లికర్. అతని కిటుకులు మనమ్మాయిలకు బాగా ఉపయోగపడతాయని హెచ్ఐకి వివరించాను. వాళ్లు కూడా మన డ్రాగ్‌ఫ్లిక్‌ను మరింత పటిష్టం చేయాలని అతని సేవలను అందుబాటులోకి తెచ్చారు' అని హరేంద్ర సింగ్ అన్నారు. 45 ఏళ్ల టెకెమా 11 ఏళ్ల కెరీర్‌లో నెదర్లాండ్స్ తరఫున 94 మ్యాచ్‌లాడి 170 గోల్స్ చేయడం విశేషం.



పాక్ టి20 కెప్టెన్ రిజ్వాన్‌పై వేటు

- బాబర్ ఆజమ్‌కూ ఉద్వాసన
- పాక్ వన్డే జట్టులో ఇద్దరు కొనసాగింపు
- కివీస్ పర్యటనకు జట్ల ఎంపిక

లాహోర్: వేటు పడిందిగా..! సొంతగడ్డపై జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్తాన్‌ను నాకౌట్ దశకు తీసుకెళ్లలేకపోయిన రెగ్యులర్ కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్, సీనియర్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌లకు సెలక్టర్లు ఉద్వాసన పలికారు. ఇద్దరినీ టి20 జట్టు నుంచి తప్పించారు. పొట్టి ఫార్మాట్‌లో వేటు వేసిన సెలక్టర్లు వీరిద్దరిని వన్డేల్లో మాత్రం యథాతథంగా కొనసాగించారు. న్యూజిలాండ్ పర్యటనలో జరిగే ద్వైపాక్షిక టి20, వన్డే సిరీస్‌ల కోసం మంగళవారం పాక్ జట్లను ప్రకటించారు. బ్యాటర్ సల్మాన్ ఆఘాకు టి20 పగ్గాలను అప్పగించారు. ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్‌ను తిరిగి జట్టులోకి తీసుకొని వైస్ కెప్టెన్సీ ఇచ్చారు. వన్డే సారథిగా రిజ్వాన్‌నే కొనసాగించనున్నారు. అయితే చాంపియన్స్ ట్రోఫీలో పేలవ ప్రదర్శన కనబరిచిన సౌద్ షకీల్, కమ్రాన్ గులామ్‌లను జట్టు నుంచి తొలగించారు. పాక్, కివీస్‌ల మధ్య ఐదు టి20లు, మూడు వన్డేల సిరీస్‌లు జరుగనున్నాయి. గాయాల నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో డాషింగ్ ఓపెనర్ సయీమ్ అయూబ్, ఫఖర్ జమాన్‌లు ద్వైపాక్షిక సిరీస్‌లకు అందుబాటులో లేకుండా పోయారు. త్వరలో న్యూజిలాండ్ వెళ్లే పాక్ అక్కడ ముందుగా టి20 సిరీస్ ఆడుతుంది. ఈ నెల 16న తొలి టి20 మ్యాచ్ జరుగుతుంది. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ ముగిశాక 29న జరిగే తొలి వన్డేతో మూడు వన్డేల సిరీస్ మొదలవుతుంది.

కోచ్‌గా ఆకిబ్ జావెద్ కొనసాగింపు

చాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శనతో సంబంధం లేకుండా పాక్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఆకిబ్ జావెద్‌ను కొనసాగించాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయించింది. ఈ ఆగస్టులో కొత్త ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్ మొదలయ్యే నాటికి కొత్త కోచ్‌ను నియమించాలని బోర్డు భావిస్తుంది. అప్పటి వరకు జావెద్‌కే కోచింగ్ బాధ్యతలు అప్పగించింది.


బాబర్, రిజ్వాన్

పాకిస్తాన్ వన్డే జట్టు: రిజ్వాన్ (కెప్టెన్), సల్మాన్ ఆఘా, షఫీక్, అబ్రార్, ఆకిఫ్ జావెద్, బాబర్ ఆజమ్, ఫహీమ్, ఇమాముల్, ఖుష్‌దిల్ షా, మొహమ్మద్ అలీ, వసీమ్, ఇర్ఫాన్ ఖాన్, నసీమ్ షా, సుఫియాన్, తయ్యబ్ తాహిర్.

పాకిస్తాన్ టి20 జట్టు: సల్మాన్ ఆఘా (కెప్టెన్), షాదాబ్, అబ్దుల్ సమద్, అబ్రార్, రవూఫ్, హసన్, జహందాద్ ఖాన్, ఖుష్‌దిల్ షా, అబ్బాస్ అఫ్రిది, ముహమ్మద్ అలీ, హారీస్, ఇర్ఫాన్ ఖాన్, యూసుఫ్, షాహీన్ అఫ్రిది, సుఫియాన్, ఉస్మాన్ ఖాన్.

పోరాడి ఓడిన తెలంగాణ

పంచ్‌కులా: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. మంగళవారం జరిగిన 'బి' డివిజన్ లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 0-1 గోల్ తేడాతో ఉత్తరాఖండ్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఉత్తరాఖండ్ తరఫున వర్తిక రావత్ (45వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి తమ జట్టును గెలిపించింది. ఇతర మ్యాచ్‌ల్లో ఛత్తీస్‌గఢ్ 2-1తో ఢిల్లీపై, చండీగఢ్ 4-1తో హిమాచల్ ప్రదేశ్‌పై విజయం సాధించాయి.

డబ్ల్యూఎన్‌బీఏలో సెరెనా జట్టు



న్యూయార్క్: అమెరికాలో పురుషుల బాస్కెట్‌బాల్ లీగ్‌తో పాటు ప్రఖ్యాతిగాంచిన మహిళల జాతీయ బాస్కెట్ బాల్ సంఘం (డబ్ల్యూఎన్‌బీఏ)లో టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ పెట్టుబడులు పెట్టింది. ఇందులో వచ్చే ఏడాది నుంచి పాల్గొనబోతున్న కొత్త జట్టు, కెనడా తొలి ఫ్రాంచైజీ టొరంటో టెంపోకు అమెరికన్ సూపర్‌స్టార్ సెరెనా సహయజమానిగా వ్యవహరించనుంది. టెంపో జట్టుకు సంబంధించిన కిల్మెర్ స్పోర్ట్స్ వెంచర్‌లో ఆమె వాటాలు కొనుగోలు చేసింది. కిల్మెర్ చైర్మన్ ల్యారీ టనెంబామ్ వ్యాపార భాగస్వామిగా చేరింది. అంటారియో నగరానికి చెందిన టొరంటో టెంపో వచ్చే సీజన్ నుంచి డబ్ల్యూఎన్‌బీఏలో పోటీపడనుంది. ఇప్పటివరకు బరిలో ఉన్న జట్లన్నీ అమెరికా ఫ్రాంచైజీలు కాగా తొలిసారి కెనడా నగరం అంటారియో లీగ్‌లోకి వచ్చింది. అయితే ఈ సీజన్ ఇదివరకే ఖరారు కావడంతో వచ్చే సీజన్ నుంచే టొరంటో టెంపో అరంగేట్రం చేయనుంది. 14 ఏళ్ల టీనేజ్‌లో సెరెనా కెనడా (1995)లో జరిగిన టోర్నీ తోనే ప్రొఫెషనల్ టెన్నిస్‌లోకి అడుగుపెట్టింది. 2022 వరకు తన కెరీర్‌ను కొనసాగించిన ఈ అమెరికన్ స్టార్ 23 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లను గెలిచింది.

క్వార్టర్ ఫైనల్లో రష్మిక జోడీ


రష్మిక

గుర్‌గ్రామ్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 4-6, 7-6 (7/4), 10-3తో 'సూపర్ టైబ్రేక్'లో ప్రిస్కా మెడెలిన్ నుగ్రోహో (ఇండోనేసియా)-ఇకుమి యామజాకి (జపాన్) జంటపై విజయం సాధించింది. 1 గంట 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ ఒక ఏస్ సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ఫస్ట్ సర్వ్‌లో 28 పాయింట్లు, సెకండ్ సర్వ్‌లో 12 పాయింట్లు సంపాదించింది. తమ సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన రష్మిక-వైదేహి ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో అంటోన్లా ష్మిడిట్ (జర్మనీ)-క్లారా వ్లాసీలర్ (బెల్జియం)లతో రష్మిక-వైదేహి తలపడతారు. డబుల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి-జీల్ దేశాయ్ (భారత్) 3-6, 3-6తో రియా భాటియా (భారత్)-ఎకతెరీనా యషీనా (రష్యా) చేతిలో... హుమేరా బహార్మస్-దివా భాటియా (భారత్) 3-6, 5-7తో పొలీనా లాట్‌చెంకో-మరియా కచెవా (రష్యా) చేతిలో... చిలకలపూడి శ్రావ్య శివాని-స్మృతి భాసిన్ (భారత్) 4-6, 2-6తో అంటోన్లా ష్మిడిట్-క్లారా వ్లాసీలర్ చేతిలో... వైష్ణవి-అంకిత రైనా (భారత్) 1-6, 3-6తో ఎకతెరీనా మకరోవా-ఎకతెరీనా రేన్‌గోల్డ్ (రష్యా) చేతిలో ఓడిపోయారు. ఆకాంక్ష-సోహా సాదిక్ (భారత్) 6-2, 3-6, 10-7తో డయానా మర్సిన్‌కెవిచా (లాత్వియా)-ఫ్రాన్సెస్కా పేస్ (ఇటలీ)లపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

హుమేరా, ప్రత్యూషలకు నిరాశ

సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ క్రీడాకారిణులు హుమేరా బహార్మస్, రాచపూడి ప్రత్యూషలు మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు. క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌ల్లో హుమేరా 6-4, 4-6, 5-10తో 'సూపర్ టైబ్రేక్'లో ఎకతెరీనా గురెవ (రష్యా) చేతిలో... ప్రత్యూష 2-6, 3-6తో ఫ్రాన్సెస్కా పేస్ (ఇటలీ) చేతిలో ఓడిపోయారు. మరో మ్యాచ్‌లో భారత ప్లేయర్ యశస్విని పన్వర్ 4-6, 1-6తో ఎకతెరీనా రెన్‌గోల్డ్ (రష్యా) చేతిలో ఓటమి పాలైంది. అయితే శ్రుతి అహ్లావత్, పూజా ఇంగాలె మెయిన్ 'డ్రా'కు చేరుకున్నారు. శ్రుతి 6-3, 4-6, 10-8తో అకీకో ఒమె (జపాన్)పై నెగ్గగా... పూజ తొలి సెట్‌ను 7-5తో సొంతం చేసుకొని, రెండో సెట్‌లో స్కోరు 2-2తో సమంగా ఉన్నపుడు ఆమె ప్రత్యర్థి ఆకాంక్ష గాయం కారణంగా వైదొలిగింది.


హుమేరా

సగం జనాభా లావెక్కింది

2050కల్లా 57 శాతానికి పెరగనుంది

భారత్‌లో 45 కోట్ల మంది ఊబకాయులు

చైనా, భారత్, అమెరికా సరసన ఆఫ్రికా

న్యూఢిల్లీ: ప్రపంచ జనాభాలో సగానికి పైగా వయోజనులు ఊబకాయులుగా మారిపోయారు! 2050 నాటికి ఇది 57 శాతం దాటనుంది. అంతేగాక పిల్లలు, టీనేజర్లు, యువకుల్లో మూడింట ఒకవంతు ఊబకాయులుగా మారొచ్చని లానెసెట్ జర్నల్ అంచనా వేసింది. 200 పైగా దేశాలకు చెందిన గ్లోబల్ డేటాను విశ్లేషించిన మీదట ప్రచురించిన తాజా అధ్యయనంలో ఈ వివరాలను వెల్లడించింది. దశాబ్ద కాలంలో ముఖ్యంగా అల్పాదాయ దేశాల్లో ఊబకాయం వేగంగా పెరుగుతోందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీని కట్టడికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ (ఐహెచ్‌ఎంఈ)కు చెందిన ప్రొఫెసర్ ఇమ్మాన్యుయేల్ నాయకత్వంలో ఈ పరిశోధన జరిగింది. ఊబకాయుల సంఖ్య 1990తో పోలిస్తే నేడు రెట్టింపైంది. 2021 నాటికి ప్రపంచ వయోజనుల్లో సగం మంది ఊబకాయులుగా మారిపోయారు. 25 ఏళ్లు, అంతకు పైబడ్డ వారిలో ఏకంగా 100 కోట్ల పురుషులు, 111 కోట్ల మంది మహిళలు అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ ధోరణులు ఇలాగే కొనసాగితే 2050 ప్రపంచవ్యాప్తంగా వయోజనుల్లో ఊబకాయుల సంఖ్య పురుషుల్లో 57.4 శాతానికి, స్త్రీలలో 60.3 శాతానికి పెరగవచ్చు. ఇక 1990 నుంచి 2021 నాటికి పిల్లలు, టీనేజర్లలో ఊబకాయులు 8.8 శాతం నుంచి 18.1 శాతానికి పెరిగారు. 20–25 మధ్య వయసు యువతలో 9.9 నుంచి 20.3 శాతానికి పెరిగింది.

చైనాలో 62 కోట్లు

ఊబకాయుల సంఖ్య 2050 నాటికి చైనాలో 62.7 కోట్లు, భారత్‌లో 45 కోట్లు, అమెరికాలో 21.4 కోట్లకు చేరనుంది. సబ్ సహారా ఆఫ్రికా దేశాల్లో ఈ సంఖ్య ఏకంగా 250 శాతానికి పైగా పెరిగి 52.2 కోట్లకు చేరుతుదని అంచనా. నైజీరియా 2021లో 3.66 కోట్ల మంది అధిక బరువుతో ఉండగా 2050 కల్లా 14.1 కోట్లకు చేరనుంది.

సామాజిక వైఫల్యం...

వయోజనుల్లో సగం ఊబకాయులే కావడాన్ని సామాజిక వైఫల్యంగా చూడాలని ప్రొఫెసర్ ఇమ్మాన్యుయేల్ అన్నారు. యువతలో ఊబకాయం వేగంగా పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. ''కొత్తగా వచ్చిన బరువు తగ్గించే మందుల ప్రభావాన్ని అధ్యయనం పరిగణనలోకి తీసుకోలేదు. ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకుంటే విపత్తును ఎంతో కొంత నివారించవచ్చు''అని ఆమె వెల్లడించారు.

ఆరోగ్య వ్యవస్థలకు సవాలు

ఊబకాయం పెరగడం ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు సవాలేనంటున్నారు ఆస్ట్రేలియాలోని మర్డోక్ చిల్డ్రన్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ జెస్సికా కెర్. ''పిల్లలు, టీనేజర్ల విషయంలో ఇప్పట్నుంచే శ్రద్ధ పెడితే ఊబకాయాన్ని నివారించడం సాధ్యమే. యూరప్, దక్షిణాసియా దేశాల్లో పిల్లలు, టీనేజర్లు అధిక బరువుతో ఉన్నట్టు అధ్యయనంలో తేలింది. ఉత్తర అమెరికా, ఆస్ట్రలేషియా, ఓషియానియా, ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా దేశాల్లో కూడా ఊబకాయుల సంఖ్య భారీగా పెరుగుతోంది. టీనేజీ బాలికల్లో ఎక్కువగా ఉంది''అని చెప్పారు. భావి తరాలు అనారోగ్యం బారిన పడకుండా చూడటం, ఆర్థిక, సామాజిక నష్టాలను నివారించడం తక్షణ కర్తవ్యమని సూచించారు.



ట్రంప్ ఆరోగ్యం బాగుందా?

- నడక, నిలబడే తీరు, మాట్లాడే ధోరణి అన్నింట్లోనూ అస్పష్టత
- నరాల సంబంధ వ్యాధి ఉన్నట్లు అనుమానాలు
- శస్త్రచికిత్స ద్వారా కుడికాలి వేలు తొలగించి ఉంటారని వెల్లువెత్తిన కథనాలు
- బలం చేకూరుస్తున్న ట్రంప్ తాజా ఫొటోలు, వీడియోలు

అమెరికాను మరింత పటిష్టవంతం చేస్తానని ప్రతిజ్ఞచేసి సంచలన నిర్ణయాలతో దూసుకుపోతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత ఆరోగ్యం విషయంలో వెనుకబడ్డారని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇటీవలికాలంలో ట్రంప్ నడక తీరు, మాట్లాడే విధానం, ఒకేచోట అటూ ఇటూ ఊగకుండా నిటారుగా నిలబడలేక ఇబ్బంది పడటం, కుడికాలును విచిత్రంగా ఊపుతూ నడవడం, కుడికాలి వేళ్లు గట్టిగా నేలకు ఆన్చకుండా నడవడం, నిర్దయగా మాట్లాడటం, ఊరకే కోపం తెచ్చుకోవడం.. ఇలా చెప్పుకుంటూ పోతే ట్రంప్ వ్యవహారశైలిలో ఎన్నో మార్పులు వచ్చాయని మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అందుకు బలం చేకూర్చే పలు సంఘటనల తాలూకు ఫొటోలు, వీడియోలను చూపిస్తున్నాయి. ట్రంప్ తన ఆరోగ్య నివేదికను బహిర్గతం చేయకపోవడం సైతం ఈ అనుమానాలకు బలంచేకూరుస్తోంది.

గతంతో పోలిస్తే ట్రంప్‌లో ఎన్నో మార్పులు

ఫిబ్రవరి 24న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ శ్వేతసౌధంలో ట్రంప్‌తో భేటీ అయినప్పుడు ట్రంప్ కుడి అరచేయి వెనుక చర్మం కమిలిపోయి పసుపు రంగులోకి మారడం మీడియా ఫొటోల్లో స్పష్టంగా కనిపించింది. 78 ఏళ్ల ట్రంప్‌కు ఏమైందని మీడియా ప్రశ్నించగా రోజూ ఎంతో మందితో కరచాలనం కారణంగా అవతలి వ్యక్తి బొటనవేలు గట్టిగా అదుముకుని దెబ్బగా మారిందని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ చెప్పారు. అయితే అది నరాల, చర్మ సంబంధ వ్యాధికి సూచికలా ఉందని కొందరు వైద్యులు చెబుతున్నారు. తైవాన్ సెమీ కండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ(టీఎస్‌ఎంసీ)తో అమెరికా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి డీల్‌ను ప్రకటించే సందర్భంగా ట్రంప్ అరచేతిపై రెండు పెద్ద మచ్చలు కనిపించాయి.

సరళరేఖలా లేని నడక

ట్రంప్ నడక తీరు ఇటీవల మారింది. కూర్చున్న, నిల్చున్న చోటు నుంచి ఒక్కసారిగా కదలాలంటే ఇబ్బంది పడుతున్నారు. గోల్ఫ్ ఆడేందుకు గోల్ఫ్‌కార్ట్ వాహనంలో వచ్చిన ట్రంప్ దిగేందుకు ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. దిగగానే కుడికాలును విచిత్రంగా ఊపుతూ ఆ కాలుపై బ్యాలెన్స్ చేయడానికి ప్రయత్నిస్తున్న వీడియో ఒకటి తాజాగా బయటికొచ్చింది. ఇటీవల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో కలిసి మార్-ఏ-లాగో రిసార్ట్‌లో ప్రత్యేక కార్యక్రమ వేదికపై ట్రంప్ నడిచారు. ఆ వేదికపై ట్రంప్ కుంటుతూ నడవడం స్పష్టంగా కనిపిస్తోంది.

విచిత్రంగా కుడి కాలి షూ

గత శుక్రవారం అమెరికాకు విచ్చేసిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కలిసి ట్రంప్ శ్వేతసౌధంలో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన ''మీడియా ఎదుటే అగ్రనేతల బాహాబాహీ''ఉదంతంగా నిలిచిపోయిన ఈ ఘటనలో మీడియా కెమెరా కంటికి కొత్త విషయం కనిపించింది. ట్రంప్ కుడి కాలి షూ చాలా విచిత్రంగా ఉండటంతో కొందరు ఫొటో, వీడియోగ్రాఫర్లు ఆ కాలుపై దృష్టిపెట్టారు. షూ ముందు వైపు నల్లటి టేప్‌తో గట్టిగా చుట్టి కట్టుకట్టారు. బొటన వేలు లేదంటే ఇతర వేళ్లకు శస్త్రచికిత్స జరగడమో, లేదంటే ఏదైనా వేలును తొలగించడమో జరిగి ఉంటుందని ఆ వీడియో చూసిన వైద్యులు భావిస్తున్నారు. షూ వదులుగా ఉంటే పొరపాటున లోపల పాదం ముందుకు కదిలి నొప్పి రాకుండా ఉండేందుకు అలా కట్టుకట్టి ఉంటారని భావిస్తున్నారు. దీనిపై శ్వేతసౌధం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ''ట్రంప్ పాదానికి ఏమైంది?. ఏదైనా వ్యాధి కారణంగా కుచించుకుపోయిందా?. కావాలనే పెద్ద సైజు షూ వేసుకొచ్చారా?. ఆ కాలును నేలపై సరిగా ఆనించకుండా కూర్చుంటున్నారు. అసలేమైంది?''అని ఒక యూజర్ సంబంధిత ఫొటోలను 'ఎక్స్'లో షేర్‌చేశారు.

పడిపోకుండా నడిచేందుకు ఏర్పాట్లు..

తూలిపడకుండా, పట్టుతప్పి పడిపోకుండా ఉండేందుకు తనను తాను బ్యాలెన్స్ చేసుకునేందుకు ట్రంప్ జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఫొటోలను బట్టి తెలుస్తోంది. కోటు లోపల అదనంగా బాడీ సూట్, నడుముకు పట్టి, చేతుల్లేని బెల్ట్ చొక్కా, ముందుకు ఒరగకుండా వెనకవైపు బరువు ఉండేలా ప్రత్యేక దుస్తులను ధరిస్తున్నారని వార్తలొచ్చాయి. ఇటీవల ఒక కార్య క్రమంలో శ్రద్ధాంజలి ఘటిస్తూ ట్రంప్ ఒక్క సెకన్ కూడా కదలకుండా స్థిమితంగా నిలబడలేకపోయా రు. అటూ ఇటూ ఊగిపోతూ, పడిపోబోయే వేళ పట్టుసాధించినట్లు ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. మొండెం భాగాన్ని గతంతో పోలిస్తే విభిన్న స్థితిలో పెట్టి నిలబడుతున్నారు, నడుస్తున్నారు. చెట్టు కూలినట్లుగా ముందుముఖాన పడిపోకుండా విచిత్రంగా నిలబడుతున్నారు. ఫ్రంటో టెంపోరల్ డిమెన్షియా వ్యాధి లక్షణాలు ట్రంప్‌లో కనిపిస్తున్నాయని కొందరు వాదిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పేద్ద జాబితా వెల్లడించిన ఓ యూజర్

ట్రంప్ మాట్లాడే తీరులో, మానసిక స్థిరత్వంలో అనూహ్య మార్పులు వచ్చాయని షికాగోకు చెందిన టామ్ జోసెఫ్ అనే యూజర్ పెద్ద జాబితాను 'ఎక్స్'ఖాతాలో పెట్టారు. ట్రంప్ ఇటీవల తరచుగా బహిరంగంగా కోప్పడటం, చెప్పిన విషయాన్నే మళ్లీ మళ్లీ చెప్పడం, తోటి ఉన్నత స్థాయి వ్యక్తులకు కనీస గౌరవం ఇవ్వకుండా కించపరిచినట్లు, వెటకారంగా మాట్లాడటం వంటి చాలా లక్షణాలను ఈ యూజర్ ప్రస్తావించారు. ''గతంలో పోలిస్తే వ్యంగ్యం పాళ్లు ఎక్కువవడం, వ్యాకరణ దోషాలు పెరగడం, మాట్లాడేటప్పుడు పదాలను వెతుక్కోవడం, పదాల్లో అక్షరాలను మింగేయడం, అసంకల్పితంగా చేతులు, కాళ్లను అడ్డదిడ్డంగా ఊపడం, కూర్చున్నప్పుడు చేతుల అసహజ కదలికలు ఎదుటివారికి తెలీకుండా ఉండేందుకు చేతులను బల్లపైనే ఉంచడం, నడచేటప్పుడు చేతులను స్వేచ్ఛగా వదిలేయకుండా కిందకు వదిలేసి నడవడం, కొన్ని సార్లు స్నేహితులను గుర్తు పట్టకపోవడం, పేర్లు మర్చిపోవడం, కొన్ని సెకన్ల క్రితం తనేం మాట్లాడాడో తనకే గుర్తులేకపోవడం, రిపోర్టర్లపై అరవడం వంటివి ట్రంప్ చేశారు. వీటిలో కొన్ని లక్షణాలు నరాల సంబంధ వ్యాధికి సంబంధించినవి''అని జోసెఫ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వెల్లువెత్తుతున్న ఆరోపణలకు అడ్డుకట్టపడాలంటే ట్రంప్ స్వయంగా ప్రకటనచేయడం లేదంటే తాజా ఆరోగ్య నివేదికను బహిర్గతం చేయడం తప్ప మరో మార్గంలేదని కొందరు రిపబ్లికన్ నేతలు అంటున్నారు.

అమెరికా ఉద్యోగులకు వీఆర్‌ఎస్

సమూల ప్రక్షాళన దిశగా ట్రంప్ సర్కారు

వాషింగ్టన్: ఫెడరల్ ఉద్యోగులను తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా మరో నిర్ణయం తీసుకుంది. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ (హెచ్‌హెచ్‌ఎస్)ఉద్యోగులకు ముందస్తు పదవీ విరమణ (వీఆర్‌ఎస్) అవకాశం కల్పించింది. 10 రోజుల్లో ఇందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. 20 ఏళ్లు సేవలందించిన 50 ఏళ్ల పైబడినవారు, 25 ఏళ్లపాటు పనిచేసిన అనుభవం ఉన్న ఏ వయసువారైనా పథకానికి అర్హులని పేర్కొంది. మార్చి 14 సాయంత్రం 5 దాకా ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందంటూ ఉద్యోగులకు మెయిల్స్ పంపింది. తొలగింపు, పునర్వ్యవస్థీకరణకు గురయ్యే ఏజెన్సీలకు ఇది వర్తిస్తుంది. ఉద్యోగులను తొలగించి ప్రభుత్వ వ్యయాన్ని ఆదా చేయడమే లక్ష్యంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)అధినేత ఎలాన్ మస్క్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఈ వారం వర్క్ రిపోర్ట్: హెచ్‌హెచ్‌ఎస్ ఉద్యోగులు గత వారంలో చేసిన పనికి సంబంధించిన రిపోర్ట్‌ను ఐదు బులెట్ పాయింట్లలో సమర్పించాలని కూడా డోజ్ మరోసారి కోరింది. గత వారం వచ్చిన ఇలాటి మెయిల్స్‌కు స్పందించాల్సిన అవసరం లేదని చెప్పిన హెచ్‌హెచ్‌ఎస్, తాజా మెయిల్స్‌కు తక్షణం స్పందించాల్సిందిగా సూచించడం విశేషం. సున్నిత సమాచారాన్ని పరిహరించి మిగతా వివరాలు పేర్కొనాలని సూచించింది. హెచ్‌హెచ్‌ఎస్ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేషనల్ ట్రెజరీ ఎంప్లాయీస్ యూనియన్ దీనిపై విమర్శలు గుప్పించింది.

ఆర్టీఐని బలహీనపరుస్తున్న ప్రభుత్వం: ఖర్గే

న్యూఢిల్లీ: సమాచార పరిరక్షణ పేరుతో సమాచార హక్కు చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఆరోపించారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తమ పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఆర్టీఐని కాపాడేందుకు గల్లీ నుంచి పార్లమెంటు దాకా కాంగ్రెస్ గళం విప్పుతుందని చెప్పారు. తప్పుడు సమాచారంలో కొన్నేళ్లుగా భారత్ అగ్రస్థానంలో ఉందని ఖర్గే ఆరోపించారు. ''రేషన్ కార్డుల జాబితా, ఉపాధి హామీ లబ్ధిదారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లు, ఓటరు జాబితా, ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని విదేశాలకు పారిపోయిన మోసగాళ్ల పేర్లు ప్రజలకు అందుబాటులో ఉండటం ముఖ్యం. కానీ మోదీ మార్కు సమాచార పరిరక్షణ చట్టం వల్ల ఆ వివరాలు ఇకపై బయటికి రాబోవు. గోప్యత హక్కు ప్రాథమిక హక్కు. దానికోసం కాంగ్రెస్ పోరాడింది. ప్రజా సంక్షేమానికి సమాచార హక్కు అత్యవసరం. కాంగ్రెస్ తెచ్చిన ఆర్టీఐలో గోప్యతను పరిగణనలోకి తీసుకున్నారు. దాని అర్థం లబ్ధిదారుల, మోసగాళ్ల పేర్లను బయట పెట్టొద్దని కాదు'' అన్నారు.

కర్ణాటక అసెంబ్లీ, రాజ్‌భవన్‌లకు నోటీసులు

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ, సెక్రటేరియట్, రాజ్‌భవన్ సహా 258 ప్రభుత్వ భవనాలకు పేరుకుపోయిన పన్ను బకాయిలు చెల్లించాలంటూ బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ) నోటీసులు పంపింది. కొన్ని ప్రభుత్వ విభాగాలు 17 ఏళ్లకు పైగా పన్నులు చెల్లించడం లేదు. మొత్తం బకాయిలు ఏకంగా రూ.658 కోట్లకు పెరిగిపోయాయి. ఆదాయం పెంపు మార్గాల అన్వేషణలో భాగంగా బకాయిల వసూళ్లపై దృష్టి సారించింది. ఎగవేత దారులు ఎవరైనా సరే వదిలేది లేదని, చెల్లించకుంటే కఠిన చర్యలు తప్పవని బీబీఎంపీ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కశ్మీర్‌కు 4.4 కోట్ల మంది పర్యాటకులు

జమ్మూ: జమ్మూ కశ్మీర్‌ను గత రెండేళ్లలో 4.4 కోట్ల మందికి పైగా పర్యాటకులు సందర్శించినట్టు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంగళవారం అసెంబ్లీలో పేర్కొన్నారు. వారిలో 1.2 లక్షల మంది విదేశీయులన్నారు. ''2023లో 2.1 కోట్లు, 2024లో 2.35 కోట్లకు పైగా పర్యాటకులు జమ్మూ కశ్మీర్‌ను సందర్శించారు. జమ్మూ కశ్మీర్ ప్రజలకు పర్యాటక రంగం విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఈ రంగంలో కార్మికులు గణనీయంగా ఉన్నారు'' అని వివరించారు. వారి కచ్చితమైన సంఖ్యను నిర్ధారించడానికి అధికారిక సర్వే నిర్వహించలేదని అంగీకరించారు.

ఆస్ట్రియా ఛాన్స్‌లర్‌కు మోదీ అభినందనలు

న్యూఢిల్లీ: ఆస్ట్రియా నూతన ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. భారత్-ఆస్ట్రియా భాగస్వామ్యం రాబోయే సంవత్సరాల్లో స్థిరమైన పురోగతిని సాధించడం తథ్యమంటూ మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.ఇరు దేశాల పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేందుకు స్టాకర్‌తో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నానన్నారు. ఆస్ట్రియా కొత్త ప్రభుత్వం సోమవారం బాధ్యతలు చేపట్టింది. మూడు పార్టీల సంకీర్ణానికి అధిపతిగా స్టాకర్ ఛాన్స్‌లర్ బాధ్యతలు స్వీకరించారు.

ప్రధానితో బెల్జియం యువరాణి భేటీ

న్యూఢిల్లీ: బెల్జియం యువరాణి ఆస్ట్రిడ్ మంగళవారం ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. 'వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, వ్యవసాయం, ఆవిష్కరణలు, నైపుణ్య రంగాల్లో నూతన భాగస్వామ్యాల ద్వారా మన ప్రజలకు విస్తృత అవకాశాలను కల్పించడానికి ఎదురుచూస్తున్నాం'అని ప్రధాని మోదీ అనంతరం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ద్వైపాక్షిక వ్యూహాత్మక సంబంధాల పెంపులో భాగంగా భారత్‌తో విస్తృత రక్షణ ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, ఢిల్లీలోని తమ ఎంబసీలో మిలటరీ అటాచ్‌ను త్వరలోనే నియమిస్తామని ఈ సమావేశంలో పాల్గొన్న బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రివోట్, రక్షణ మంత్రి థియో ఫ్రాంకెన్ తెలిపారు.

మూణ్నాలుగేళ్లలో 'లిథియం' స్వయంసమృద్ధి

బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

కోల్‌కతా: మన దేశం వచ్చే మూడు నాలుగేళ్లలో లిథియం వంటి కీలక ఖనిజాల డిమాండ్‌ను తీర్చగలిగే చేరుకుంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)ఏర్పాటై 175 ఏళ్లవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని కోల్‌కతాలో ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. లిథియం వంటి కీలకమైన ఖనిజాల తవ్వకంపై నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ దృష్టి సారించిందని వివరించారు. మిషన్‌కు ప్రభుత్వం రూ.32 వేల కోట్ల కేటాయించిందన్నారు. మొబైల్ బ్యాటరీలు, సోలార్ ప్యానెళ్ల తయారీలో లిథియం అవసరం ఎంతో ఉందని చెప్పారు.

130 పడవలున్న కుటుంబం

30 కోట్లు సంపాదించింది

మహాకుంభ్‌మేళాతో అందరికీ లాభమే: యోగి ఆదిత్యనాథ్

లక్నో: ఇటీవల ముగిసిన మహాకుంభమేళా నిర్వహణపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న వేళ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దీటుగా బదులిచ్చారు. పడవలు నడిపే కుటుంబాలకు పెద్దగా ఒరిగిందేమీ లేదని సమాజ్‌వాదీ పార్టీ చేసిన విమర్శకు రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో సీఎం యోగి సమాధానమిచ్చారు. '' 45 రోజులపాటు కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన సనాతన ఆధ్యాత్మిక వైభవం మహాకుంభ్‌మేళా. ప్రయాగ్‌రాజ్‌లో ఒక కుటుంబం విజయగాథ చెప్తా. ఆ కుటుంబానికి 130 పడవలు ఉన్నాయి. 45 రోజుల కుంభమేళా రోజుల్లో ఈ కుటుంబం ఏకంగా రూ.30 కోట్ల లాభాలను కళ్లజూసింది. అంటే ఒక్కో బోటు రూ.23 లక్షల లాభాల తెచ్చింది. రోజుల లెక్కన చూస్తే ఒక్కో బోటు నుంచి రోజుకు రూ.50,000 నుంచి రూ.52,000 లాభం వచ్చింది'' అని అన్నారు. కుంభమేళా వివరాలను యోగి వెల్లడించారు. '' ఒక్క తొక్కిసలాట ఘటన తప్పితే 45 రోజుల్లో ఏకంగా 66 కోట్ల మంది భక్తులు సంతోషంగా మేళాకు వచ్చి వెళ్లారు. ఒక్క నేరం జరగలేదు. మహిళలపై వేధింపులు, కిడ్నాప్, దోపిడీ, హత్య ఘటన ఒక్కటి కూడా జరగలేదు'' అని అన్నారు.

వేల కోట్లు పెడితే లక్షల కోట్ల వ్యాపారం

'' కుంభమేళాకు ఏర్పాట్లు, రక్షణ, భద్రత తదితరాల కోసం అయిన మొత్తం ఖర్చు రూ.7,500 కోట్లు. 200కుపైగా రోడ్లను వెడల్పు చేశాం. 14 ఫ్లైఓవర్లు కట్టాం. 9 అండర్‌పాస్‌లు నిర్మించాం. 12 కారిడార్లను సిద్ధంచేశాం. దీంతో పలు రంగాల్లో మొత్తంగా ఏకంగా రూ.3 లక్షల కోట్ల వ్యాపారం జరిగింది. హోటల్ రంగంలో రూ.40,000 కోట్ల వ్యాపారం జరిగింది. ఇక ఆహారం, నిత్యావసరాల విభాగంలో రూ.33,000 కోట్లు, రవాణారంగంలో రూ.1.5 లక్షల కోట్ల వ్యాపారం జరిగింది. రూ.660 కోట్ల విరాళాలు వచ్చాయి. జాతీయరహదారుల వెంట టోల్‌ట్యాక్స్ రూపంలో రూ.300 కోట్లు వచ్చాయి. ఇతర రెవిన్యూ మార్గాల్లో రూ.66,000 కోట్ల వ్యాపారం జరిగింది. ఈఏడాది దేశ స్థూలజాతీయోత్పత్తికి కుంభమేళా సైతం తన వంతు వాటాను అందించింది'' అని యోగి చెప్పారు.



సెర్బియా పార్లమెంట్‌లో గందరగోళం

పొగబాంబులతో దాడి..

ముగ్గురు ఎంపీలకు గాయాలు

బెల్‌గ్రేడ్: బాల్కన్ దేశం సెర్బియా పార్లమెంట్ సమావేశం మంగళవారం వీధి పోరాటాన్ని తలపించింది. ప్రతిపక్ష సభ్యులు స్మోక్ బాంబులు విసరడంతో అవి తాకి ముగ్గురు ఎంపీలు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. విశ్వవిద్యాలయాలకు మరిన్ని నిధులు కేటాయించే విషయమై జరగాల్సిన ఓటింగ్‌ను ప్రతిపక్షాలు గట్టిగా వ్యతిరేకించాయి. ఈ సమావేశం అక్రమమని, ప్రధానమంత్రి మిలోస్ వుసెవిక్, ఆయన ప్రభుత్వం రాజీనామాను వెంటనే ధ్రువీకరించాలని డిమాండ్ చేశాయి. సమావేశం మొదలైన అరగంటలోనే ప్రతిపక్ష సభ్యుల ఈలలు, కేకలతో పార్లమెంట్ దద్దరిల్లింది. ఎంపీలు ముష్టిఘాతాలు కురిపించుకుంటున్నారు. ఆ తర్వాత పొగబాంబులు, కోడిగుడ్లు, వాటర్ బాటిళ్లను విసిరేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. ప్రతిపక్షం ఉగ్రవాద ముఠాగా మారిపోయిందని స్పీకర్ అనా బిర్నాబిక్ అభివర్ణించారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల ప్రతిపక్షాల మద్దతుదారులు ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటన దేశంలో రాజకీయ సంక్షోభం తీవ్రతను చెప్పకనే చెబుతున్నాయి. వుసెవిక్ ప్రభుత్వం గద్దెదిగి, ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా యూనివర్సిటీలకు నిధుల పెంపుపై చర్చ సాధ్యమని వామపక్ష నేత రదోమిర్ లజోవిక్ తేల్చి చెప్పారు.

గతేడాది నవంబర్‌లో కాంక్రీట్ నిర్మాణం కూలి 15 మంది చనిపోయారు. దీంతోపాటు మరికొన్ని ఘటనలను ఉదహరిస్తూ అవినీతి పెరిగిపోయిందంటూ విద్యార్థులు భారీ నిరసనలు చేపడుతున్నారు. విద్యారంగానికి ఎక్కువ నిధులు తదితర డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాలతో ప్రధాని వుసెవిక్ జనవరిలో తన పదవికి రాజీనామా చేశారు. అయితే, పార్లమెంట్ ఆమోదిస్తేనే ప్రధాని రాజీనామా అమలవుతుంది. అధ్యక్షుడు అలెక్జాండర్ వుసిక్‌కు చెందిన అధికార సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీకి పార్లమెంట్‌లో మెజారిటీ ఉండటంతో వుసెవిక్ ప్రభుత్వం కొనసాగుతోంది.

మను స్మృతి, బాబర్‌నామాను సిలబస్‌లో చేర్చం: డీయూ

న్యూఢిల్లీ: అండర్ గ్రాడ్యుయేట్ హిస్టరీ ఆనర్స్ సిలబస్‌కు మనుస్మృతి, బాబర్‌నామాను చేర్చాలన్న ప్రతిపాదనను ఢిల్లీ యూనివర్సిటీ ఉపసంహరించుకునేందుకు సిద్ధమైంది. ఈ ప్రతిపాదనను ఫ్యాకల్టీ సభ్యులు వ్యతిరేకించారని వైస్ చాన్స్‌లర్ యోగేశ్ సింగ్ చెప్పారు. సమాజంలో చీలికలకు దారి తీసే పాఠ్యాంశాల్లో చేర్చబోమని, ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తున్నామని వివరించారు. ఆ పాఠ్యాంశాలను సిలబస్‌లో చేర్చాలన్న ప్రతిపాదనను ఏసీ, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ) సమీక్షించి, ఓకే చెప్పాల్సి ఉంది. దీన్ని పలువురు ప్రొఫెసర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. మనుస్మృతి కుల ప్రాతిపదికన సమాజాన్ని విభజిస్తోందని, రాజ్యాంగ విలువలకు ఇది వ్యతిరేకమని వీసీకి రాసిన లేఖలో విమర్శించారు. అదేవిధంగా, దేశంపై దండయాత్ర చేసి తీవ్ర విధ్వంసానికి తెరతీసిన బాబర్ తన చర్యలను గొప్పగా చెప్పుకుంటూ రాసుకున్న బాబర్‌నామాను పాఠ్యాంశంగా చేయడం అస్సలు తగదన్నారు.

మీ నాన్న నా వల్లే ఎదిగారు

తేజస్వీ విమర్శలపై సీఎం నితీశ్ వ్యాఖ్యలు

పట్నా: బిహార్ అసెంబ్లీలో మంగళవారం సీఎం నితీశ్ కుమార్, ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. నితీశ్‌పై తరచూ పొత్తులు మారుస్తూ, పాలనా వైఫల్యాలను గత ప్రభుత్వాలపై రుద్దుతుంటారని తేజస్వీమండిపడ్డారు. 2005కి పూర్వం పరిస్థితులనుద్దేశిస్తూ నితీశ్ విమర్శలు చేయడాన్ని కూడా ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ''నితీశ్‌కు అప్పటికే 55 ఏళ్లు వచ్చాయి. కేంద్రమంత్రిగా పనిచేశారు. అదే అసెంబ్లీ భవనం అప్పటికే ఉంది. నితీశ్ 40 ఏళ్ల పాలించినా 2005కు ముందు జరిగిన వాటిపై విమర్శలు మాత్రం ఆపేలా లేరు'' అని వ్యాఖ్యానించారు. ఇందుకు నితీశ్ స్పందించారు. '2005కి ముందు బిహార్‌లో ఏముంది? మీ నాన్న లాలూ సీఎంగా ఎదగడానికి, కేంద్ర మంత్రి కావడానికి కారణం నేనే. ఆయనకు మాత్రమే ఎందుకలా మద్దతుగా ఉంటున్నారని అప్పట్లో మీ కులం వాళ్లంతా నన్ను అడిగారు. అయినా మీ నాన్నకు సాయం నేను ఆపలేదు'' అని బదులిచ్చారు.

సెబీ మాజీ చీఫ్ బచ్‌పై ఎఫ్ఐఆర్..

నాలుగు వారాల స్టే ఇచ్చిన బాంబే హైకోర్టు

ముంబై: స్టాక్ మార్కెట్ మోసం, నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధబీ పురి బచ్, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆదేశాలపై బాంబే హైకోర్టు నాలుగు వారాలపాటు స్టే విధించింది. జస్టిస్ శివకుమార్ దిగే సారథ్యంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ ఆరోపణల్లో నిందితుల పాత్రను పేర్కొనకుండానే యాంత్రికంగా జారీ చేసిన ఉత్తర్వులంటూ వ్యాఖ్యానించింది. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ సమర్పించాలంటూ పిటిషనర్ సపన్ శ్రీవాస్తవను ఆదేశించింది. సీబీఐ ప్రత్యేక కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ బచ్‌తోపాటు సెబీ డైరెక్టర్లు అశ్వనీ భాటియా, అనంత్ నారాయణ్, కమలేశ్ చంద్ర వర్షిణీ, బాంబే స్టాక్ ఎక్స్చేంజి ఎండీ, సీఈవో రామమూర్తి, మరో మాజీ ఉన్నతాధికారి ప్రమోద్ అగర్వాల్ వేసిన పిటిషన్లపై ఈ మేరకు ధర్మాసనం ఆదేశాలిచ్చింది. 1994లో బాంబే స్టాక్ ఎక్స్చేంజీలో ఓ కంపెనీని లిస్ట్ చేసే విషయంలో వీరంతా అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై మీడియా రిపోర్టర్ సపన్ శ్రీవాస్తవ పిటిషన్ వేశారు. 1994లో జరిగాయంటున్న అవకతవకలకు ప్రస్తుత సెబీ సభ్యులెలా బాధ్యులవుతారని సెబీ అధికారుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. కేవలం అస్పష్టమైన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీబీఐ కోర్టు ఎలా ఆదేశిస్తుందని ప్రశ్నించారు.

అందుకోండి.. ఇంటర్న్‌షిప్!



టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులు క్షేత్ర నైపుణ్యాలు మెరుగుపరచుకొని.. కొలువులు దక్కించుకునేందుకు చక్కటి మార్గం..ఇంటర్న్‌షిప్! ఇంటర్న్‌షిప్ శిక్షణతోపాటు ప్రతి నెల రూ.5 వేల స్టయిఫెండ్ అందుకునే అవకాశం కల్పిస్తోంది.. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్!! గత ఏడాది ప్రారంభమైన ఈ స్కీమ్‌కు.. తాజాగా రెండో దశ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది! ఈ నేపథ్యంలో.. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ విధానం, అర్హతలు, స్టైపెండ్, దరఖాస్తు ప్రక్రియ తదితర వివరాలు..

- పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ రెండో దశ ప్రారంభం
- టాప్-500 సంస్థల్లో ఇంటర్న్ అవకాశాలు
- నెలకు రూ.5 వేల స్టైపెండ్; ఏడాదిపాటు శిక్షణ
- అర్హత: టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ

ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ప్రొఫెషనల్ కోర్సుల్లో కరిక్యులంలో భాగంగానే ఇంటర్న్‌షిప్ విధానాన్ని అమలు చేస్తున్నారు. జాబ్ మార్కెట్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రైమ్ మినిస్టర్ ఇంటర్న్‌షిప్ స్కీమ్‌ను అమల్లోకి తెచ్చింది. పలు కోర్సులు పూర్తి చేసుకుని ఎలాంటి ఉద్యోగం లేని యువత.. వారి అర్హతలకు తగిన విభాగాల్లో ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందేందుకు వీలుగా ఈ స్కీమ్‌ను అమలు చేస్తోంది. తాజాగా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు రెండో దశ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

టాప్-500 సంస్థలు

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ద్వారా దేశంలోని టాప్-500 సంస్థల్లో ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. మొత్తం 24 విభాగాల సంస్థలు ఇందులో పాల్పంచుకుంటున్నాయి. వీటిలో ఐటీ, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఫార్మా, ఇన్సూరెన్స్, ఐటీఈ ఎస్ తదితర రంగాలకు చెందిన సంస్థలు ఉన్నాయి.

ఆ అయిదు కోర్సుల వారికి:

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌లో భాగంగా ప్రధానంగా అయిదు కోర్సుల విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిప్లొమా, ఐటీఐ, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు ఈ స్కీమ్ ద్వారా ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత లభిస్తుంది.

1.19 లక్షల అవకాశాలు

తాజాగా మొదలైన పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ రెండో దశలో 1,87,957 అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఆయా కోర్సుల వారీగా ఉన్న ఇంటర్న్‌షిప్ ఖాళీల సంఖ్యను కూడా పేర్కొన్నారు. డిగ్రీ అభ్యర్థులకు 36,901; పదో తరగతి వారికి 24,696; ఐటీఐ అభ్యర్థులకు 23,629; డిప్లొమా వారికి 18,589; ఇంటర్మీడియెట్ వారికి 15,142 అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

నెలకు రూ.5 వేల స్టైఫండ్

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు ఎంపికైన వారికి నెలకు రూ.5వేలు చొప్పున ఏడాది శిక్షణ కాలానికి రూ.60 వేలు అందిస్తారు. ప్రతి నెల స్టయిఫండ్‌తోపాటు ఏడాది వ్యవధిలో మరో రూ.ఆరు వేలను చెల్లిస్తారు.

అర్హతలివే

- వయసు 21 నుంచి 24 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎలాంటి ఉద్యోగం చేస్తూ ఉండకూడదు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి.
- ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్ వంటి ప్రము ఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదువుతున్న వారు, సీ ఏ, సీఎంఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు ఈ స్కీమ్‌కు అర్హులు కాదని స్పష్టం చేశారు.
- అదే విధంగా నేషనల్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్, నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ద్వారా అప్రెంటీస్ పూర్తి చేసుకున్న వారు అనర్హులు. దీంతోపాటు కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వ స్కీమ్‌ల ద్వారా ఏదైనా శిక్షణ పొందుతున్న వారు కూడా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండదు.

ఏడాదిపాటు శిక్షణ

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన వారికి ఏడాది పాటు ఆన్ జాబ్ ట్రెనింగ్ పేరుతో సంస్థల్లో ఇంట ర్న్ ట్రైనీగా శిక్షణనిస్తారు. ఈ వ్యవధిలో కచ్చితంగా ఆరు నెలలు ఆన్ జాబ్ ట్రెనింగ్ కల్పించాల్సి ఉంటుంది. ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికై.. శిక్షణను పూర్తి చేసుకున్న వారికి ఆయా సంస్థల నుంచి సర్టిఫికెట్ కూడా అందిస్తారు. ఫలితంగా భవిష్యత్తు ఉద్యోగా వకాశాల్లో దీన్ని ఒక అదనపు అర్హతగా చూపించి.. ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది.

ఇంటర్న్‌షిప్‌తో ప్రయోజనాలు

- విద్యార్థులు తాము అకడమిక్‌గా నేర్చుకున్న అంశాలను.. వాస్తవ పరిస్థితుల్లో అన్వయించే విధానంగా ఇంటర్న్‌సిప్‌ను పేర్కొనొచ్చు. అంటే.. విద్యార్థులు ఆయా కోర్సులు చదువుతున్న సమయంలోనే క్షేత్ర నైపుణ్యాలు పొందేందుకు తొలి మార్గం ఇంటర్న్‌షిప్. దీనివల్ల విద్యార్థులకు సదరు ఇండస్ట్రీలోని వాస్తవ పరిస్థితులపై అవగాహన లభించడమే కాకుండా తాజా నైపుణ్యాలు కూడా సొంతమవుతాయి.

పలు స్కిల్స్ సొంతం

ఇంటర్న్ ట్రెనీగా పని చేయడం ద్వారా జాబ్ మార్కెట్‌కు అవసరమైన స్కిల్స్ సొంతమవుతాయి. డొమైన్ స్కిల్స్‌తోపాటు ఇంటర్ పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్ స్కిల్స్, టీం వర్కింగ్ కల్చర్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ వంటివి లభిస్తాయి. అదే విధంగా టీమ్ మెంబర్స్, లీడర్స్‌తో చర్చించగలిగే నైపుణ్యం అలవడుతుంది.

ఇంటర్న్‌షిప్ శిక్షణ

ఇంటర్న్‌షిప్ అవకాశం అందుకున్న అభ్యర్థులు తమకు లభించిన వ్యవధిలో చక్కటి పనితీరు కనబరిచేలా వ్యవహరించాలి. తమకు కేటాయించిన విభాగం, విధులకు సంబంధించి టీమ్ సభ్యులతో కలిసి పనిచేసే చొరవ చూపాలి. అదే విధంగా విధుల విషయంలో ఏదైనా సందేహం తలెత్తితే.. బిడియం లేకుండా టీమ్ లీడ్ లేదా ఇతర సీనియర్లను సంప్రదించి.. సదరు సందేహాన్ని నివృత్తి చేసుకోవాలి. ఒక విధంగా చెప్పాలంటే.. ఇంటర్న్‌షిప్ సమయంలో సదరు సంస్థలో ఉద్యోగి మాదిరిగానే మెసులుకుని విధులు నిర్వర్తిస్తేనే ఇంటర్న్‌షిప్ ఉద్దేశం నెరవేరుతుంది.

శాశ్వత కొలువులకు మార్గం

ఇంటర్న్ ట్రెనీలు.. ఆ అవకాశాన్ని కల్పించిన సంస్థలోనే శాశ్వత కొలువుకు మార్గంగా కూడా మలచుకోవచ్చు. ఇంటర్న్ ట్రెనీగా సంస్థలో చేరిన విద్యార్థులు.. శిక్షణ సమయంలో చూపే ప్రతిభ, పనితీరు సంస్థ యాజమాన్యం మెచ్చే రీతిలో ఉంటే అదే సంస్థలో శాశ్వత ఉద్యోగ ఆఫర్ పొందే అవకాశం కూడా లభిస్తుంది. ఐఐటీలు, ఐఐఎంల నుంచి ఆయా సంస్థల్లో ఇంటర్న్ ట్రెనీగా ఎంపికైన వారిలో 50 శాతం మేరకు.. ఇలా ఇంటర్న్ ట్రెనీ సమయంలో ప్రతిభ చూపి అదే సంస్థలో ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ అందుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

- పీఎం ఇంటర్న్‌షిప్‌నకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా.. https://pminternship.mca.gov.in/ వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి.
- తర్వాత యూత్ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి. తమ అర్హతలు, ఆసక్తి ఉన్న రంగాలు, సంస్థలను తెలియజేయాలి. ఆ తర్వాత వెబ్‌సైట్‌లో వారి రెజ్యూమ్ రూపొందుతుంది.
- వీటిని ఇంటర్న్‌షిప్‌లో పాల్పంచుకుంటున్న సంస్థలు పరిశీలిస్తాయి. ఆ తర్వాత సదరు రెజ్యూమ్‌లను పరిశీలించి ఇంటర్న్‌షిప్ ఖరారుపై నిర్ణయం తీసుకుంటాయి. ఎంపికైన వారికి మెసేజ్, ఈ-మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, మార్చి 12.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://pminternship.mca.gov.in/

జాబ్ పాయింట్

పంజాబ్ నేషనల్ బ్యాంక్, న్యూఢిల్లీలో 350 పోస్టులు

న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 350.
- **పోస్టుల వివరాలు:** క్రెడిట్ ఆఫీసర్-250, ఇండస్ట్రీ ఆఫీసర్-75, మేనేజర్(ఐటీ)-05, సీనియర్ మేనేజర్(ఐటీ)-05, మేనేజర్ (డేటా సైంటిస్ట్)-03, సీనియర్ మేనేజర్(డేటా సైంటిస్ట్)-02, మేనేజర్ సైబర్ సెక్యూరిటీ-05, సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీ-05.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, సీఏ, ఐసీడబ్ల్యూ, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 21 నుంచి 38 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు క్రెడిట్ ఆఫీసర్, ఇండస్ట్రీ ఆఫీసర్‌కు రూ.48,480 నుంచి రూ.85,920, మేనేజర్(ఐటీ), మేనేజర్ డేటా సైంటిస్ట్, మేనేజర్ సైబర్ సెక్యూరిటీకు రూ.64,820 నుంచి రూ.93,960, సీనియర్ మేనేజర్(ఐటీ), సీనియర్ మేనేజర్(డేటా సైంటిస్ట్), సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీకు రూ.85,920 నుంచి రూ.1,05,280.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.03.2025.
- **రాతపరీక్ష తేదీలు:** మార్చి/మే 2025.
- **వెబ్‌సైట్:** https://www.pnbindia.in/

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చెన్నైలో 750 అప్రెంటిస్‌లు

చెన్నైలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ దేశవ్యాప్తంగా ఉన్న ఐవోబీ శాఖల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 750.
- **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-25, తెలంగాణ-31.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 01.03.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- **శిక్షణా వ్యవధి:** ఒక సంవత్సరం.
- **స్టైపెండ్:** నెలకు మెట్రో ప్రాంతానికి రూ.15,000, అర్బన్ ప్రాంతానికి రూ.12,000, సెమీ-అర్బన్/రూరల్ ప్రాంతానికి రూ.10,000.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ ఇంగ్లిష్(25 ప్రశ్నలు-25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు-25 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్(25 ప్రశ్నలు-25 మార్కులు). పరీక్ష సమయం 90 నిమిషాలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.03.2025.
- **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 16.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.iob.in/

బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబైలో 400 అప్రెంటిస్‌లు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 400.
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 01.01.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు రూ.12,000.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్ సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.03.2025.
- **వెబ్‌సైట్:** https://bankofindia.co.in/

బీడీఆర్‌సీఎల్, న్యూఢిల్లీలో 11 మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని భరుచ్ దహేజ్ రైల్వే కంపెనీ లిమిటెడ్(బీడీఆర్‌సీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
- **పోస్టుల వివరాలు:** చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్(సీఎఫ్‌వో)-01, మేనేజర్ (హెచ్‌ఆర్/అడ్మినిస్ట్రేషన్)-01, మేనేజర్/అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్ అకౌంట్)-02, అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్ అకౌంట్)-01, మేనేజర్(సివిల్)01, సీనియర్ ఏఎం /ఏఎం -ట్రాక్-01, సీనియర్ ఏఎం/ఏఎం -వర్క్స్-01, సీనియర్ ఏఎం/ఏఎం -టీఆర్‌డీ-ఎలక్ట్రికల్-01, సీనియర్ ఏఎం /ఏఎం-సిగ్నల్-01, సీనియర్ ఏఎం/ఏఎం -టెలికాం-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, సీఎఫ్ఏ, డిగ్రీ, హెచ్‌ఆర్, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీటెక్(సివిల్), డిప్లొమా(సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 20.02.2025 నాటికి చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌కు 45 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 30 ఏళ్లు, మిగతా పోస్టులకు 40 ఏళ్లు నిండి ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, సీనియర్ అసిస్టెంట్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్‌కు రూ.60,000, అసిస్టెంట్ (ఫైనాన్స్ అకౌంట్)కు అసిస్టెంట్ మేనేజర్(ఎఫ్ అండ్ ఏ)కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ , ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** agmhr@bdrail.in.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.03.2025.
- **వెబ్‌సైట్:** http://www.bdrail.in/

ఏ పరీక్షల్లో విశ్వసనీయత ఎక్కువ?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సైన్స్ మెథడాలజీ

జీవశాస్త్ర మూల్యాంకనం

1. ఉపాధ్యాయుడు తను బోధనా లక్ష్యాలను ఎంతవరకు సాధించగలుగుతున్నాడో తెలుసుకోవడానికి వాడే ప్రక్రియ?
 1) బోధనా పద్ధతి 2) బోధనా ఉద్దేశం
 3) మూల్యాంకనం 4) ఉన్ముఖీకరణ
2. మూల్యాంకనంలో పరస్పరం ఆధారపడిన అంశాల్లో.. అభ్యసనా అనుభవాలు, మూల్యాంకనం సాధనాలతోపాటు ఉండేది?
 1) లక్ష్యాలు
 2) బోధనోపకరణాలు
 3) బోధనా పద్ధతులు 4) పరీక్షలు
3. మూల్యాంకనం అనేది ఒక అవిరళ ప్రక్రియ, మొత్తం విద్యావ్యవస్థలో ఒక సమైక్య భాగమై విద్యకు అన్ని లక్ష్యాల తోనూ దగ్గర సంబంధం ఉంటుంది అని తెలిపినవారు?
 1) కొఠారి కమిషన్
 2) మొదలియార్ కమిషన్
 3) తారాదేవి రిపోర్ట్
 4) రాధాకృష్ణన్ కమిషన్
4. ప్రాచీన పరీక్షా విధానం కేవలం ఏ రంగానికి ప్రాముఖ్యత ఇచ్చింది?
 1) మానసిక చలనాత్మక రంగం
 2) భావావేశ రంగం
 3) క్రీడా రంగం 4) జ్ఞానాత్మక రంగం
5. ఒక విషయాన్ని గురించి లేదా వ్యక్తిని గురించి పరిమాణాత్మకంగా అంచనా కట్టడానికి విద్యాసంబంధమైన వాటిని గురించి మాత్రమే నిర్వహించేది?
 1) మాపనం 2) మూల్యాంకనం
 3) పరీక్ష 4) పైవన్నీ
6. మూల్యాంకనానికి ఒక ఆకారాన్ని ఒక అధికారాన్ని కల్పించి విద్యార్థి వర్తమాన ప్రగతిని అంచనా వేసేది?
 1) పరీక్ష 2) మాపనం
 3) మూల్యాంకనం 4) ఇవేవీకావు
7. నిరంతర ప్రక్రియ విద్యార్థి సమగ్ర మూర్తిమత్వాన్ని తెలియజేస్తూ, భూత, భవిష్యత్, వర్తమాన ప్రగతిని అంచనా వేసేది?
 1) పరీక్ష 2) మాపనం
 3) మూల్యాంకనం 4) స్లిప్‌టెస్ట్
8. బోధనాభ్యసన ప్రక్రియ ప్రారంభించే ముందు విద్యార్థుల సామర్థ్యాలను తెలుసు కోవడానికి ఉపయోగించే మూల్యాంకనం?
 1) సంకలన మూల్యాంకనం
 2) లోపనిర్ధారణ మూల్యాంకనం
 3) నిర్మాణాత్మక, రూపణ మూల్యాంకనం
 4) 1, 2
9. బోధన మధ్యలో విద్యార్థి అభ్యసనాన్ని అంచెలంచెలుగా తెలుసుకొని బోధనా పద్ధ తిలో మార్పులు చేసుకునేందుకు ఉపాధ్యా యుడు ఏ మూల్యాంకనం చేస్తాడు?
 1) సంకలన
 2) రూపణ, నిర్మాణాత్మక
 3) సంకలన, రూపణ
 4) లోపనిర్ధారణ
10. సంకలనాత్మక మూల్యాంకనం ఏ విధంగా జరుగుతుంది?
 1) బోధనకు ముందు 2) బోధన మధ్యలో
 3) బోధన పూర్తైన తర్వాత
 4) బోధనకు ముందు, తర్వాత
11. వార్షిక పరీక్షలను ఏ మూల్యాంకనానికి సాధనాలుగా చెప్పొచ్చు?
 1) నిర్మాణాత్మక 2) సంకలన
 3) లోప నిర్ధారణ 4) పైవన్నీ
12. ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని అర్థం చేసుకున్న లక్ష్మీ అనే బాలిక ప్రవర్తనా సరళిని, అదే పాఠ్య విషయాలను అర్థం చేసుకున్న సీతలో ఆశించిన మార్పులకు చేపట్టాల్సిన అభ్యసనానుభవాలను నిర్ణయించే విధానం?
 1) వైషమ్య విధానం 2) గుర్తింపు విధానం
 3) పరీక్ష విధానం 4) విధానమేకానిది
13. 'కణ విభజనలో క్షయకరణ విభజనకు సంబంధించిన దశలను వివరించండి?' పై ప్రశ్న ఏ రకమైన పరీక్షల్లో వస్తుంది?
 1) పరిపృచ్ఛ 2) మౌఖిక పరీక్ష
 3) లక్ష్యాత్మకపరీక్ష 4) వ్యాసరూప పరీక్ష
14. ఉపాధ్యాయుడి ఆత్మాశ్రయ భావాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉండటం వల్ల విద్యార్థికి ఏ పరీక్షల్లో న్యాయం జరగకపోవచ్చు?
 1) లక్ష్యాత్మక పరీక్ష 2) అభిరుచి శోధిక
 3) వ్యాసరూప పరీక్ష
 4) సహజ సామర్థ్య పరీక్ష
15. 'ఆవరణ వ్యవస్థలో వినియోగదారులు--- పై ఆధారపడే ఉంటాయి?' ఇది ఏ రకమైన పరీక్షల్లో వస్తుంది.
 1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
 3) పరిపృచ్ఛ 4) సహజ సామర్థ్య
16. ఏ పరీక్షల్లో విశ్వసనీయత ఎక్కువ?
 1) ప్రశ్నావళి 2) వ్యాసరూప
 3) పరిపృచ్ఛ 4) లక్ష్యాత్మక
17. లక్ష్యాత్మక పరీక్షల్లో దేనికి అవకాశం లేదు?
 1) మాస్ కాపీయింగ్ 2) జ్ఞానం
 3) ఉపాధ్యాయుడి ఆత్మాశ్రయత
 4) విశ్వసనీయత
18. ముద్రణాయంత్రం కనిపెట్టక ముందు నుంచే ఏ పరీక్షలు ఉన్నాయి?
 1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
 3) ప్రశ్నావళి 4) మౌఖిక
19. డీఎస్సీ పరీక్షలు ఏ రకం పరీక్షలకు ఉదాహరణ?
 1) లక్ష్యాత్మక 2) మౌఖిక
 3) వ్యాసరూప 4) అభిరుచి శోధిక
20. విద్యార్థుల మానసిక ప్రవృత్తి, భావవ్యక్తీక రణ పరీక్షించడానికి తోడ్పడే పరీక్షలు?
 1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
 3) మౌఖిక
 4) ప్రామాణీకరణం చేసిన పరీక్షలు
21. శిక్షణ సామర్థ్యం ఉన్న వ్యక్తులను ఆ సామ ర్థ్యం లేని వ్యక్తుల నుంచి వేరు చేయడానికి ఉపయోగపడేవి?
 1) సమస్యా విధాన పరీక్షలు
 2) సహజ సామర్థ్య పరీక్షలు
 3) ప్రామాణీకరణ పరీక్షలు
 4) లక్ష్యాత్మక పరీక్షలు
22. విద్యార్థికి జీవశాస్త్ర, ప్రయోగశాల్లో అమీబా నమూనాను చూపి గుర్తించమనడం ఏ పరీక్షకు ఉదాహరణ?
 1) లక్ష్యాత్మక 2) సహజ సామర్థ్య
 3) నిష్పాదన 4) ప్రామాణీకరణ
23. పరిస్థితిని బట్టి సందర్భానుసారంగా ప్రశ్నలను ప్రత్యక్షంగా అడగటం?
 1) అనియత పరిపృచ్ఛ
 2) నియత పరిపృచ్ఛ
 3) సామూహిక పరిపృచ్ఛ
 4) ప్రశ్నావళి
24. ఉపాఖ్యాన రికార్డు అని దేన్ని పిలుస్తారు?
 1) అభిరుచి శోధిక 2) నియత పరిపృచ్ఛ
 3) జీవిత సంఘటన పత్రావళి
 4) ప్రశ్నావళి
25. ఒక విద్యార్థికి చెందిన నాయకత్వ లక్షణాలను అంచనా వేయడానికి ఉపకరించే సాధనం?
 1) అభిరుచి శోధిక 2) చెక్‌లిస్ట్
 3) జీవిత సంఘటన పత్రావళి
 4) అంచనా మాపని
26. ఈ రకం పరీక్షల్లో ప్రశ్నకు ఎదురుగా అవును, కాదు అనేవి మాత్రమే ఉంటాయి. ఇది మూర్తిమత్వ పరీక్ష?
 1) లక్ష్యాత్మక 2) వ్యాసరూప
 3) చెక్‌లిస్ట్ 4) అభిరుచి శోధిక
27. విద్యార్థి గురించిన పూర్తి చిత్రం సంవత్సరం వారీగా అతని వికాసం తెలుసుకునేది?
 1) జీవిత సంఘటన పత్రావళి
 2) అభిరుచి శోధిక 3) చెక్‌లిస్ట్
 4) క్రమాభివృద్ధి, సంచిత పత్రావళి
28. తారాదేవి రిపోర్ట్ పరీక్షల సంస్కరణల్లో సూచించిన ప్రకారం, ప్రశ్నపత్రంలో లక్ష్యా త్మక ప్రశ్నలకు ఇవ్వాల్సిన సమయం?
 1) 1 గంట 2) 2 ½ గంటలు
 3) ½ గంట 4) 3 గంటలు
29. ఎవరైతే బోధిస్తారో వారే పరీక్షించడం ఆవశ్యకం అని వివరించిన వారు?
 1) తారాదేవి రిపోర్ట్
 2) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్
 3) కొఠారి కమిషన్
 4) మొదలియార్ కమిషన్
30. విద్యార్థుల ఫలితాలను చూపే యోగ్యతా పత్రాలు వేర్వేరు సబ్జెక్టుల్లో విద్యార్థుల నిష్పాదనాన్ని తెలిపేవిగా ఉండాలి - కానీ మొత్తం పరీక్షలో పాస్, ఫెయిల్ అని నిర్ణ యించేవిగా ఉండొద్దు అని సూచించింది?
 1) కొఠారి కమిషన్ 2) తారాదేవి రిపోర్ట్
 3) యూజీసీ 4) మొదలియార్ కమిషన్
31. ఉత్తమ నికషకు ఉండాల్సిన లక్షణం కానిది?
 1) సప్రమాణత 2) లక్ష్యాత్మకత
 3) ఆచరణాత్మకత 4) ఆత్మాశ్రయత
32. లక్ష్యాత్మక అంటే ఒక పరీక్ష పత్రాన్ని వేర్వేరు ఉపాధ్యాయులు దిద్దినప్పుడు?
 1) వేర్వేరు మార్కులు రావాలి
 2) ఒకే మార్కులు రావాలి
 3) మొదటి ఉపాధ్యాయుడి మార్కులు పరిగణించాలి.
 4)చివర దిద్దిన ఉపాధ్యాయుడి మార్కులు పరిగణించాలి
33. కింది వాటిలో ఏ పరీక్షలకు విశ్వసనీయత తక్కువగా ఉంటుంది?
 1) నిష్పాదన పరీక్షలు
 2) లక్ష్యాత్మక పరీక్షలు
 3) వ్యాసరూప పరీక్షలు 4) పైవన్నీ
34. అన్ని పాఠ్యాంశాల్లోని అన్ని విషయాలను పరీక్షించేటట్లు పరీక్షా పత్రం ఇస్తే దానికి ఏ లక్షణం ఉందని అంటారు?
 1) ఆచరణాత్మకత 2) విశ్వసనీయత
 3) లక్ష్యాత్మకత 4) సమగ్రత
35. పాఠ్య విభాగాన్ని బోధించిన తర్వాత రూపొందించుకున్న బోధనా లక్ష్యాలు నెరవేరింది?
 1) వార్షిక పరీక్ష 2) త్రైమాసిక పరీక్ష
 3) యూనిట్ పరీక్ష
 4) అర్ధసంవత్సర పరీక్ష
36. యూనిట్ పరీక్షలో నైపుణ్యానికి ఇచ్చే మార్కుల శాతం?
 1) 24 2) 32
 3) 12 4) 18
37. యూనిట్ పరీక్షలో కఠిన స్థాయి ప్రశ్నలకు ఇచ్చే మార్కుల శాతం?
 1) 24 2) 53
 3) 14 4) 100
38. యూనిట్ పరీక్షలో ప్రశ్నపత్రం రూపకల్పనలో కింది వాటిలో దేనికి ఎక్కువ మార్కులు కేటాయించాలి?
 1) కఠిన స్థాయి
 2) సాధారణ స్థాయి
 3) తేలిక స్థాయి
 4) అన్నింటికీ సమానంగా
39. ఉపాధ్యాయ నిర్మిత పరీక్షల్లో ప్రశ్నపత్రం సప్రమాణత రూపొందించడానికి తోడ్పడేది?
 1) అమోనియా ప్రింట్ 2) న్యూస్ ప్రింట్
 3) జిరాక్స్ ప్రింట్ 4) బ్లూ ప్రింట్
40. బ్లూ ప్రింట్ తయారీలో దేనికి ప్రాముఖ్యత ఉండదు?
 1) లక్ష్యాలు 2) ఉపప్రమాణం
 3) ఉపాధ్యాయుల అభిరుచి
 4) పరీక్షాంశ రకం

సమాధానాలు

1) 3; 2) 1; 3) 1; 4) 4; 5) 3;
6) 2; 7) 3; 8) 2; 9) 2; 10) 3;
11) 2; 12) 1; 13) 4; 14) 3; 15) 2;
16) 4; 17) 3; 18) 4; 19) 1; 20) 3;
21) 2; 22) 3; 23) 1; 24) 3; 25) 4;
26) 3; 27) 4; 28) 3; 29) 2; 30) 1;
31) 4; 32) 2; 33) 3; 34) 4; 35) 3;
36) 3; 37) 1; 38) 2; 39) 4; 40) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

‘రేడియో అన్నయ్య’ అని ఎవరిని పిలిచేవారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



మాదిరి ప్రశ్నలు

1. ‘తూర్పు దేశాల్లో విప్లవ ప్రతీక’ అని ఎం.ఎన్. రాయ్‌ని ప్రశంసించిందెవరు?
   1) స్టాలిన్ 2) లెనిన్
   3) మావో‌ట్సేటుంగ్ 4) చౌ-ఎన్-లై
2. రాజకీయాల్లో జోక్యం కల్పించుకున్న తొలి సిక్కు మత గురువు ఎవరు?
   1) గురు తేజ్‌బహదూర్
   2) గురు అంగద్ 3) గురు అర్జున్‌సింగ్
   4) గురు గోవింద్‌సింగ్
3. కింది వాటిలో సరైన జత ఏది?
   1) సర్ విలియం స్లీమన్ - థగ్గులను అణిచి వేశాడు
   2) కాంప్‌బెల్ - పాలెగాళ్లను అణిచి వేశాడు
   3) సర్ థామస్ హిస్లాప్ - పిండారులను అణిచి వేశాడు
   4) పైవన్నీ సరైనవే
4. కలకత్తాలో ‘టెలిఫోన్ ఎక్స్ఛేంజ్’ను వైస్రాయ్ రిప్పన్ కాలంలో ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1881 2) 1882
   3) 1883 4) 1884
5. ‘ఆర్కాట్’ను రాబర్ట్ క్లైవ్ ఏ సంవత్సరంలో ఆక్రమించాడు?
   1) 1752 2) 1754
   3) 1756 4) 1757
6. ‘గ్రంథాలయ గాంధీ’ అని ఎవరిని పిలిచేవారు?
   1) బసవరాజు అప్పారావు
   2) వెలగా వెంకటప్పయ్య
   3) రావిచెట్టు రంగారావు
   4) చెన్నాప్రగడ భానుమూర్తి
7. 1901లో వ్యవసాయదారులకు రుణాలు ఇవ్వడానికి వ్యవసాయ బ్యాంక్ స్థాపించాలని సూచించిన కమిటీ ఏది?
   1) సర్ జేమ్స్ లయల్ కమిటీ
   2) సర్ రిచర్డ్ స్ట్రాచీ కమిటీ
   3) సర్ ఆంథోనీ మాక్ డోనాల్డ్ కమిటీ
   4) సర్ జాన్ ఉడ్ కమిటీ
8. ‘రేడియో అన్నయ్య’ అని ఎవరిని పిలిచేవారు?
   1) మాదాల వీరభద్రరావు
   2) చిలుకూరి వీరభద్రరావు
   3) న్యాయపతి రాఘవరావు
   4) వెన్నెలకంటి రాఘవయ్య
9. భారత జాతీయ సైన్స్ కాంగ్రెస్‌ను కలకత్తాలో ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1908 2) 1910
   3) 1912 4) 1914
10. స్వదేశీ సంస్థానాల రాజులకు వ్యక్తులను దత్తత తీసుకునే హక్కును బ్రిటిషర్లు ఏ సంవత్సరంలో కల్పించారు?
    1) 1858 2) 1859
    3) 1860 4) 1861
11. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం తొలి సమావేశం (1943) తాపీ ధర్మారావు అధ్యక్షతన ఎక్కడ నిర్వహించారు?
    1) తెనాలి 2) నూజివీడు
    3) ప్రొద్దుటూరు 4) నంద్యాల
12. 1929లో ‘నవజీవన్ ట్రస్ట్’ను గాంధీజీ ఏ ప్రాంతంలో ఏర్పాటు చేశారు?
    1) అహ్మదాబాద్ 2) చంపారన్
    3) ఎరవాడ 4) పోరుబందరు
13. ‘రజనీగంధ’ కవితా సంకలనం రాసిన వారెవరు?
    1) కాత్యాయనీ విద్మహే
    2) వోల్గా 3) రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి
    4) పాపినేని శివశంకర్
14. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా ‘భిల్లులు’ ఎవరి నాయకత్వంలో తిరుగుబాటు చేశారు?
    1) సామ్ బిసాయ్ 2) సేవారాం
    3) చిత్తుర్‌సింగ్ 4) కన్హు
15. 1935లో ‘భారత చరిత్ర కాంగ్రెస్’ తొలి సమావేశం ఎక్కడ నిర్వహించారు?
    1) పుణె 2) నాగ్‌పూర్
    3) కటక్ 4) వారణాసి
16. 1921 ఫిబ్రవరి 8న సంస్థానాధీశుల మండలిని ఢిల్లీలో ప్రారంభించిందెవరు?
    1) ఐదో జార్జి 2) ఆరో జార్జి
    3) డ్యూక్ ఆఫ్ కానాట్
    4) ప్రిన్స్ ఆఫ్ వేల్స్
17. ఖైదీల సౌకర్యాల కోసం 64 రోజులు దీక్ష చేసిన జతిన్ దాస్ ఏ తేదీన మరణించారు?
    1) 1928 మార్చి 23
    2) 1928 ఏప్రిల్ 16
    3) 1929 సెప్టెంబర్ 13
    4) 1929 డిసెంబర్ 13
18. ‘సర్వోదయ ఉద్యమం’ నాయకుడెవరు?
    1) మినూమసానీ
    2) జయప్రకాశ్ నారాయణ్
    3) అచ్యుత్ పట్వర్ధన్
    4) ఎం.ఎన్. రాయ్
19. 1932లో ఆంధ్రలో బి.ఎ. ఉత్తీర్ణులైన తొలి మహిళ ఎవరు?
    1) పొణకా కనకమ్మ
    2) ఆచంట రుక్మిణీ లక్ష్మీపతి
    3) డొక్క సీతమ్మ
    4) న్యాయపతి కామేశ్వరి
20. కింది వాటిలో సరైన జత ఏది?
    1) రాజేంద్ర సింహ్‌జీ - ఆపరేషన్ పోలో
    2) బట్లర్ కమిటీ - 1927
    3) సూర్యసేన్ - మాస్టర్‌దా
    4) పైవన్నీ సరైనవే
21. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయ నిర్మాణం ఏ సంవత్సరంలో పూర్తయింది?
    1) 1601 2) 1602
    3) 1604 4) 1606
22. నిజాం రాజ్యం (హైదరాబాద్)లోకి ఆయుధాలను చేరవేసిన సిడ్నీకాటన్ ఏ దేశస్థుడు?
    1) జర్మనీ 2) ఆస్ట్రేలియా
    3) ఇటలీ 4) పోర్చుగల్
23. ‘రంగేళీరాజా’ అని ఏ మొగల్ రాజును పిలిచేవారు?
    1) రెండో అక్బర్ 2) షాఆలం
    3) మహమ్మద్‌షా
    4) రెండో బహదూర్‌షా
24. కార్మిక సంఘాలతో వామపక్షాన్ని రూపొందించడానికి భారత్ వచ్చిన బ్రిటిషర్ ఎవరు?
    1) జార్జి రస్సెల్ 2) జార్జి ఎలిజన్
    3) సర్ స్ట్రాఫర్డ్ క్రిప్స్
    4) ఎ.వి. అలెగ్జాండర్
25. ప్లాసీ యుద్ధ (1757) సమయంలో బెంగాల్ గవర్నర్ ఎవరు?
    1) రాబర్ట్ క్లైవ్ 2) కార్టియర్
    3) డ్రేక్ 4) వారన్ హేస్టింగ్స్
26. గాంధీజీ.. సబర్మతి ఆశ్రమం నుంచి ఎన్ని రోజులు యాత్ర నిర్వహించి, దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించారు?
    1) 21 2) 23 3) 24 4) 26
27. ఏఐసీసీకు ఎన్నికైన తొలి తెలుగు మహిళ ఎవరు?
    1) పొణకా కనకమ్మ
    2) భారతీదేవి రంగా
    3) దువ్వూరి సుబ్బమ్మ
    4) దుర్గాబాయి దేశ్‌ముఖ్
28. కింది వాటిలో సరైన జత ఏది?
    1) లాండ్ హోల్డర్స్ సొసైటీ - కలకత్తా
    2) రామకృష్ణ మిషన్ - బేలూరు
    3) గేట్‌వే ఆఫ్ ఇండియా - బొంబాయి
    4) పైవన్నీ సరైనవే
29. లీడర్ పత్రిక స్థాపకుడెవరు?
    1) డబ్ల్యు.సి. బెనర్జి
    2) మదన్ మోహన్ మాలవ్య
    3) విఠల్‌భాయ్ పటేల్
    4) మహమ్మద్ ఇక్బాల్
30. ‘నిషాన్-ఎ-పాకిస్తాన్’ బిరుదు పొందిన ఏకైక భారతీయుడెవరు?
    1) మహాత్మాగాంధీ 2) జె.బి. కృపలానీ
    3) చరణ్‌సింగ్ 4) మొరార్జీ దేశాయ్
31. రెగ్యులేటింగ్ చట్టం - 1773 ప్రకారం భారత్‌లో ఈస్టిండియా కంపెనీ వ్యాపారం ఎన్ని ఏళ్లకు పరిమితం చేశారు?
    1) 15 2) 20 3) 25 4) 30
32. కింది వాటిలో చివరగా జరిగిన చారిత్రక సంఘటన ఏది?
    1) మీర్ ఉస్మాన్ అలీఖాన్ లొంగుబాటు
    2) గోవా విముక్తికి ‘ఆపరేషన్ విజయ్’ నిర్వహణ
    3) అల్లూరి సీతారామరాజు మరణం
    4) క్రిప్స్ రాయబారం
33. ‘సర్వెంట్స్ ఆఫ్ ద పీపుల్ సొసైటీ’ స్థాపకుడెవరు?
    1) లాలా లజపతిరాయ్
    2) సురేంద్రనాథ్ బెనర్జీ
    3) జార్జియూల్ 4) గోపాలకృష్ణ గోఖలే
34. రవీంద్రనాథ్ ఠాగూర్ ‘గీతాంజలి’ గ్రంథాన్ని బెంగాలీ భాషలో ఏ సంవత్సరంలో ముద్రించారు?
    1) 1910 2) 1911
    3) 1912 4) 1913
35. మహాత్మాగాంధీ తన ఐదో కుమారుడిగా ఎవరిని ప్రకటించారు?
    1) ఖాన్‌అబ్దుల్ గఫార్‌ఖాన్
    2) జి.డి. బిర్లా
    3) పొట్టి శ్రీరాములు
    4) జమ్నాలాల్ బజాజ్
36. హిందూ, ముస్లిం వాస్తు శైలిలో నిర్మించిన నిర్మాణం ఏది?
    1) విఠలాలయం 2) పద్మమహల్
    3) ముత్యాలశాల 4) బులందర్వాజా
37. 1914లో కలకత్తాలో నిర్వహించిన తొలి ‘భారతీయ సైన్స్ కాంగ్రెస్’ సమావేశానికి అధ్యక్షుడెవరు?
    1) శాంతిస్వరూప్ భట్నాగర్
    2) జమ్నాలాల్ బజాజ్
    3) ప్రఫుల్ల చంద్రరాయ్
    4) అశుతోష్ ముఖర్జీ
38. షాజహాన్ పాలనా కాలంలో భారత్‌ను సందర్శించిన ఇటలీ యాత్రికుడెవరు?
    1) నికోలాయ్ మనుక్కీ
    2) ట్రావెర్నియర్
    3) బెర్నియర్ 4) నికోలాకోంటి
39. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ జయంతిని అక్టోబర్ 11ను ఏ పేరుతో నిర్వహిస్తారు?
    1) కుష్టువ్యాధి నిర్మూలనా దినోత్సవం
    2) జాతీయ సమైక్యతా దినోత్సవం
    3) ప్రజాస్వామ్య పరిరక్షణ దినం
    4) కిసాన్ దినోత్సవం
40. బిపిన్ చంద్రపాల్ రాజకీయ గురువు ఎవరు?
    1) బాలగంగాధర తిలక్
    2) మహాదేవ గోవింద రనడే
    3) డబ్ల్యు.సి. బెనర్జీ
    4) సురేంద్రనాథ్ బెనర్జీ
41. ‘భరత ఖండంబు చక్కని పాడియావు..’ అనే దేశభక్తి గేయాన్ని రాసిందెవరు?
    1) కాశీనాథుని నాగేశ్వరారావు
    2) చిలకమర్తి లక్ష్మీనరసింహం
    3) రాయప్రోలు సుబ్బారావు
    4) గురజాడ అప్పారావు
42. భారతదేశంలో మొదటి మహిళా న్యాయవాది ఎవరు?
    1) లీలా శాంసన్ 2) టి. మీనాకుమారి
    3) దుర్గాబాయి దేశ్‌ముఖ్
    4) కార్నేలియా సోరాబ్జీ
43. నేతాజీ బోస్.. విమాన దుర్ఘటనలో తైపీ ప్రాంతంలో ఏ తేదీన అదృశ్యమయ్యారు?
    1) 1946 ఆగస్టు 18
    2) 1945 అక్టోబర్ 18
    3) 1945 ఆగస్టు 18
    4) 1946 నవంబర్ 16
44. తొలి తెలుగు పత్రిక ‘సత్యదూత’ ఎక్కడ ప్రచురించారు?
    1) మద్రాస్ 2) బెంగళూరు
    3) బళ్లారి 4) కోయంబత్తూరు
45. హైదరాబాద్ రాజ్యంలో ‘కామ్రేడ్స్ అసోసియేషన్’ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
    1) 1939 2) 1941
    3) 1943 4) 1944
46. దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ జయంతిని డిసెంబర్ 3న ఏ దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించారు?
    1) యోగా దినోత్సవం
    2) అమరవీరుల సంస్మరణ దినోత్సవం
    3) కార్మిక దినోత్సవం
    4) వ్యవసాయవిద్యా దినోత్సవం
47. ‘సైనికత్వం, సామ్రాజ్యవాదం.. పెట్టుబడిదారీ వ్యవస్థకు జన్మించిన కవల పిల్లలు’ అని అన్నదెవరు?
    1) బిపిన్ చంద్రపాల్
    2) బాలగంగాధర తిలక్
    3) లాలా లజపతిరాయ్
    4) అరవింద ఘోష్
48. ‘హైదరాబాద్ కంటింజంట్’ సైన్యాన్ని ఏర్పాటు చేసిన వారెవరు?
    1) విలియం పామర్
    2) హెన్రీ రస్సెల్
    3) హెచ్.సి. బ్రిగ్స్
    4) కల్నల్ డేవిడ్‌సన్
49. త్యాగశీలి దొడ్డి కొమరయ్య ఏ తేదీన మరణించారు?
    1) 1946 జూలై 4 2) 1946 ఆగస్టు 14
    3) 1946 సెప్టెంబర్ 16
    4) 1946 అక్టోబర్ 4
50. బ్రిటిషర్ల కాలంలో మద్రాస్ నగరంలో ‘కరణం’ను ఏమని పిలిచేవారు?
    1) బనియా 2) తలవరి
    3) దుబాసీ 4) కనకపిళ్లై
51. ‘తెలంగాణ సాయుధ పోరాటం - దాని పాఠాలు’ రాసిందెవరు?
    1) రావి నారాయణరెడ్డి
    2) చండ్ర రాజేశ్వరరావు
    3) పుచ్చలపల్లి సుందరయ్య
    4) తరిమెల నాగిరెడ్డి
52. ‘జనగణమన’ జాతీయ గీతాన్ని ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు?
    1) 1911 - కలకతా
    2) 1916 - లక్నో 3) 1917 - కలకత్తా
    4) 1920 - నాగ్‌పూర్
53. ‘తెలంగాణ కాలాపానీ’ అని పిలిచే జైలు ఏది?
    1) వరంగల్ జైలు 2) మామనూర్ జైలు
    3) నిజామాబాద్ జైలు
    4) చంచల్‌గూడ జైలు
54. హైదరాబాద్‌లో విక్టోరియా మెమోరియల్ అనాథాశ్రమాన్ని ఎవరు స్థాపించారు?
    1) మీర్ మహబూబ్ అలీఖాన్
    2) సికిందర్‌జా
    3) మీర్ ఉస్మాన్ అలీఖాన్
    4) అఫ్జల్ ఉద్దౌలా
55. ప్రాచీన కట్టడాల సంరక్షణ చట్టాన్ని కర్జన్ కాలంలో ఏ సంవత్సరంలో చేశారు?
    1) 1901 2) 1902
    3) 1903 4) 1904

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 2	5) 1
6) 2	7) 3	8) 3	9) 4	10) 3
11) 1	12) 1	13) 4	14) 2	15) 1
16) 3	17) 3	18) 2	19) 4	20) 4
21) 3	22) 2	23) 3	24) 2	25) 3
26) 4	27) 1	28) 4	29) 2	30) 4
31) 2	32) 2	33) 1	34) 1	35) 4
36) 2	37) 4	38) 1	39) 3	40) 4
41) 2	42) 4	43) 3	44) 1	45) 1
46) 4	47) 3	48) 2	49) 1	50) 4
51) 3	52) 1	53) 2	54) 1	55) 4

The antonym of ameliorate is:

BANK EXAMS

GENERAL ENGLISH



MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. India expresses concern (1)/ regarding the ongoing violence (2)/ in Myanmar's Rakhine province that has triggered (3)/ an exodus of the Rohingya into Bangladesh. (4)/ No error (5)
2. Despite growing pressure (1)/ from family and visible signs of threats, (2)/ the rationalist say he knows (3)/ no other way but to fight till the end. (4)/ No error (5)
3. According to Deloitte India is poised to emerge (1)/ an economic superpower, (2)/ driven in part by its young population, (3)/ while China and the Asian Tigers age rapidly. (4)/ No error (5)
4. The Centre told the Supreme Court (1)/ that the Rohingya Muslims are illegal immigrants in the country (2)/ and there continuous stay posed (3)/ serious national security ramifications. (4)/ No error (5)
5. To improve its efficiency (1)/ all income tax officers (2)/ will be provided (3)/ with laptops by next year. (4) / No error (5)

Directions (Q.No.6-10): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Winds dropped to a quite potent 185 kph by the time Irma made landfall on Marco Island, on the Florida Peninsula, still a major and dangerous hurricane yet not near its 297 kph former self when it set a record on Tuesday for the most powerful storm in the open Atlantic.

B) Irma hit the Sunshine State as a big wide beast, though not quite the monster it once was shaping up to be.

C) And on top of that, Irma avoided what could have been its most destructive paths along the Florida Peninsula over Miami and the heavily developed Atlantic seaboard.

D) Irma's assault so soon after Harvey's deluge of Houston marked the first time the U.S. was hit by two Category 4 storms in the same year.

E) Before crashing into Florida, Hurricane Irma set all sorts of records for brute strength as it flattened Caribbean islands and swamped the Florida Keys.

F) Earlier, it was the most powerful recorded storm in the open Atlantic.

6. What is the FIRST sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) E
7. What is the SECOND sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F
8. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F
9. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F
10. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No.11-15): Each question below has a blank/two blanks, each blank indicating that something has been omitted. Choose the word/set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. Prime Minister Narendra Modi on Monday ____ for innovation and ____ skills among the youth and asked them to work for a modern India.
    1) batted, promoting
    2) tapped, proposing
    3) bet, developing
    4) proposed, primary
    5) enlightened, technical
12. The Centre has ____ funds for the purchase of bullet-proof vehicles for Jammu and Kashmir Police ____.
    1) allotted, person
    2) located, people
    3) allocated, personnel
    4) altered, populace
    5) owed, body
13. ____ promises by politicians year after year, VIP culture continues to ____ in India
    1) Despite, thrive
    2) Inspite, strive
    3) Further, diminish
    4) Although, perish
    5) However, flourish
14. Mass education system ____ lot of ____ on teaching and very little on learning.
    1) claims, regards
    2) teaches, elements
    3) absorbs, works 4) lays, stress
    5) finds, shortcomings
15. Hardly ____ he reached the jetty ____ the boat sank.
    1) did, than 2) as, when
    3) had, when 4) when, than
    5) does, than

Directions (Q.No. 16-20) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Despite the latest move by the Army to induct 800 women into its ranks, cold facts show that the Indian military is the last bastion of male dominance in the government. Many women in uniform are hoping that the country's first full-time women Defence Minister will take bold decisions against what they allege are systemic discrimination against women. Though Indian military has only a minuscule number of women in service, a noticeably large number of them are fighting court cases or complaints against discrimination in various forums. Over the past three years, with the government's focus on women's empowerment, the three services have taken some steps for expanding avenues for women, but several issues still remain. However, recruitment numbers of the past few years are almost at the same level with a decline in women joining the Army. While the issue of women in combat roles gets traction often, another aspect mostly neglected is the issue of permanent commission. The Navy is now taking women as pilots and observers on fixed-wing aircraft. This is the Short Service Commission (SSC) because they cannot be promoted as they cannot do sea service. The biggest catch is that women officers are taken under the SSC which is up to 14 years. Due to this, those leaving are left without any pension as pensionable service is 20 years. Commander Edayilliam stated that the ATC officers' course that they had undergone at the Air Force Academy in Dindigul was not recognized at par with the civil course at the Civil Aviation Training College, Allahabad. "So it is extremely difficult to get a second career based on it," she told.

"Navy is a wonderful service. We want more and more qualified people to join it," she added, longing for the uniform she once **donned**.

This is where there would be great expectations from Ms. Sitharaman to understand the intricacies and open the services. A group of Military Nursing Service members have been fighting the government for over a decade, demanding that they be treated as full officers. The Supreme Court has taken a firm stand, asking the military to **ameliorate** their condition. They are also hoping that the new defence minister will appreciate their plight. Former Defence Minister Manohar Parrikar had stated that the three services would induct women in combat roles in a phased manner as infrastructure had to be created.

The Indian Air Force has long had women pilots in transport and helicopters streams and last year commissioned three women fighter pilots on an experimental basis. Similarly, the Army gives permanent commission for women only in education, law and medical streams. But given the operational conditions and spread, the Army has been the most reluctant to take women in combat roles.

16. All the sentences are true except one from the following:
    1) The bitter fact is Indian Military is predominantly male dominated
    2) Women are optimistic about bold decisions against discrimination
    3) A large number of women are averse to court cases
    4) Inspite of some steps taken by the three services, several issues still trouble
    5) Recruitment numbers of the past few years see no change
17. Identify the correct statements from the following:
    a) The army has been keen to take women in combat roles
    b) The state-of-the-art facilities are available for women in the three services
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Neither a nor b
    5) Either a or b
18. The synonym of **bastion** is:
    1) Citadel 2) Epitaph
    3) Cenotaph 4) Monument
    5) Antique
19. **Donned** means:
    1) Take off 2) Put on
    3) Pull out 4) Get in
    5) Throw off
20. The antonym of **ameliorate** is:
    1) Modernize 2) Mitigate
    3) Promote 4) Aggravate
    5) Progress

Directions: (Q.No.21-23) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct. If there is no error mark (5) No correction required as your answer.

21. The book has withstood the advent of the cinema, television, and personal computer and are likely to be there in centuries to come
    1) The book has withstood the advent of the cinema, television, personal computer and are likely
    2) The book has withstood the advent of the cinema, television, and personal computer and are liable
    3) Books have withstood the advent of the cinema, television, and personal computer and are likely
    4) The book withstood the advent of the cinema, television, personal computer and is likely
    5) No correction required
22. We are eliminating languages, traditional diets, and eroding cultural practices at an alarming rate.
    1) We are eliminating languages, changing traditional diets, and cultural practices at an alarming rate.
    2) We are eliminating languages, changing traditional diets, and eroding cultural practices at an alarming rate.
    3) Languages, traditional diets, and cultural practices are being eroded at an alarming rate.
    4) Languages, traditional diets, and cultural practices are being eliminated alarmingly fast.
    5) No correction required

KEY

1) 1	2) 3	3) 2	4) 3	5) 1
6) 5	7) 4	8) 5	9) 1	10) 3
11) 1	12) 3	13) 1	14) 4	15) 3
16) 3	17) 4	18) 1	19) 2	20) 4
21) 3	22) 3			